ఈనాడు

కరీంనగర్ 6-3-2018 మంగళవారం సిటీ సంపుటి 44 సంచిక 205

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 5-00. పేజీలు 16+16 www.eenadu.net

Karimnagar, Visakhapatnam, Hyderabad, Vijayawada, Tirupati, Ananthapuramu, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi



మూడో అడుగు

కూటమి కసరత్తు ముమ్మరం

- అజెండా తయారీపై కేసీఆర్ దృష్టి
- ఏప్రిల్ నుంచి దేశవ్యాప్త పర్యటనలు
- మహానగరాల్లో సమావేశాలు
- కాంగ్రెస్, భాజపాయేతర నేతలతో భేటీ
- విశ్రాంత ఐఏఎస్‌లు, ఆర్థికవేత్తలు, సైన్యాధికారులతో చర్చలకు సన్నాహాలు



కేంద్రం తెలంగాణను నిర్లక్ష్యం చేస్తోంది
గవర్నర్‌కు కేసీఆర్ ఫిర్యాదు

2లో

ఈనాడు - హైదరాబాద్


దేశరాజకీయాల్లో గుణాత్మక మార్పు తీసుకొచ్చే క్రమంలో జాతీయ స్థాయిలో కొత్తకూటమి ఏర్పాటు చేస్తామని ప్రకటించిన తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ దీనికి అనుగుణంగా కార్యాచరణ ప్రారంభించారు. కాంగ్రెస్సేతర, భాజపాయేతర పార్టీలు, సంఘాలు, సంస్థలు, ప్రముఖులు, వివిధ వర్గాల వారితో సమగ్రంగా చర్చించి దేశానికి అవసరమైన ఎజెండాను రూపొందించాలని నిర్ణయించారు. దీని కోసం ఆయన ఏప్రిల్ నుంచి దేశవ్యాప్తంగా పర్యటించనున్నారు.

బడ్జెట్ సమావేశాల తర్వాత

ఈనెలలో తెలంగాణ బడ్జెట్ సమావేశాలున్నాయి. నెలాఖరుకు అవి ముగిసిన తర్వాత ఆయన కూటమి కార్యకలాపాలపై పూర్తిస్థాయిలో దృష్టి సారించనున్నారు. ఇందులో భాగంగా దిల్లీతోపాటు. .కోల్‌కతా, ముంబయి, చెన్నై, బెంగళూరు లాంటి నగరాల్లో ఆయన సమావేశాలు జరుపుతారు. అక్కడి ప్రాంతీయ పార్టీల నేతలను కలుస్తారు. ఆయా సమావేశాల్లో స్పష్టమైన ఎజెండాను ప్రకటించడం ద్వారా కూటమిపై అందరికీ అవగాహన ఏర్పడుతుందని సీఎం భావిస్తున్నారు.

మేధావులతోనూ చర్చలు

మొదట ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్, ఐఆర్ఎస్ లాంటి అఖిలభారత సర్వీసు విశ్రాంత అధికారులతో సమావేశం కానున్నారు. తర్వాత కేంద్రంలో, వివిధ రాష్ట్ర ప్రభుత్వాల్లో పనిచేసిన ఆర్థిక శాఖ మాజీ కార్యదర్శులు, (మిగతా 2లో)





ఆస్కార్ అవార్డులు అందుకున్న ఉత్తమ సహాయ నటుడు శామ్ రాక్‌వెల్, ఉత్తమ నటి ఫ్రాన్సిస్ మెక్ డొర్మండ్, ఉత్తమ సహాయ నటి అలిసన్ జాన్నీ, ఉత్తమ నటుడు గ్యారీ ఓల్డ్‌మ్యాన్

ఆస్కార్ ఆనందం

- ఉత్తమ నటుడు గ్యారీ ఓల్డ్‌మ్యాన్, ఉత్తమ నటి ఫ్రాన్సిస్ మెక్ డొర్మండ్
- ఉత్తమ చిత్రం, ఉత్తమ దర్శకుడితో పాటు మరో రెండు ఆస్కార్‌లు గెలుచుకున్న 'షేప్ ఆఫ్ వాటర్'
- అట్టహాసంగా 90వ ఆస్కార్ పురస్కార వేడుకలు
- వేదికపై శశికపూర్‌కు, శ్రీదేవికి నివాళులు

... వివరాలు సినిమా పేజీలో

కోటా పెంచాల్సిందే

రిజర్వేషన్ల పెంపునకు రాజ్యాంగాన్ని సవరించండి

- పార్లమెంట్‌లో తెరాస ఎంపీల డిమాండ్
- ఏపీకి ప్రత్యేక హోదా కోసం తెదేపా ఎంపీల ఆందోళన
- 'పీఎన్‌బీ'పై కాంగ్రెస్, తృణమూల్, వామపక్షాల నిరసన
- స్తంభించిన ఉభయ సభలు

ఈనాడు, దిల్లీ: తెలుగు రాష్ట్రాల ఎంపీలు తమ డిమాండ్లతో పార్లమెంట్ ఉభయసభలను సోమవారం స్తంభింపచేశారు. తెరాస ఎంపీలు తెలంగాణలో రిజర్వేషన్ కోటా పెంపునకు అవకాశం ఇవ్వాలంటూ ఆందోళన చేపట్టారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాల్సిందేనంటూ తెదేపా ఎంపీలు వెల్‌లోకి దూసుకొచ్చి నిరసన చేపట్టారు. వీరితో పాటు వివిధ పార్టీల సభ్యులు తమ డిమాండ్లతో కార్యకలాపాలు స్తంభింపచేయడంతో బడ్జెట్ మలివిడత సమావేశాల ప్రారంభం రోజున ఒక్క కార్యక్రమం కూడా చేపట్టకుండానే ఉభయసభలు మంగళవారానికి వాయిదా పడ్డాయి. తెరాస సభ్యులు జితేందర్‌రెడ్డి, కవిత, వినోద్‌కుమార్, బూర నర్సయ్యగౌడ్, బాల్కసుమన్, విశ్వేశ్వరరెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డి, నగేష్‌లు తెలంగాణలో రిజర్వేషన్ కోటా పెంపునకు అవకాశం ఇవ్వాలన్న ప్లకార్డులతో ఆందోళన చేపట్టారు. రిజర్వేషన్లను 50 శాతానికి మించి పెంచుకొనేందుకు రాష్ట్రాలకు వీలుకల్పిస్తూ రాజ్యాంగంలోని ఆర్టికల్ 16(4)ని సవరించాలని డిమాండ్ చేశారు. తెదేపా సభ్యులు తోట నరసింహం, గల్లా జయదేవ్, ఎన్.శివప్రసాద్, రామ్మోహన్‌నాయుడు, అవంతి శ్రీనివాస్. పి. రవీంద్రబాబు, కొనకళ్ల నారాయణ,(మిగతా 2లో)



సోమవారం లోక్‌సభ వెల్‌లో వివిధ పార్టీల ఎంపీల నిరసన

12 నుంచి శాసనసభ సమావేశాలు

- తొలిరోజు ఉభయ సభలనుద్దేశించి గవర్నర్ ప్రసంగం
- 15వ తేదీన తెలంగాణ బడ్జెట్

ఈనాడు - హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర శాసనసభ, మండలి సమావేశాలపై సోమవారం రాష్ట్ర గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ నోటిఫికేషన్ జారీ చేశారు. ఈనెల 12వ తేదీ నుంచి సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఉదయం 10 గంటలకు శాసనసభలో గవర్నర్ ఉభయసభలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. ఈనెల 15న బడ్జెట్ ప్రవేశపెట్టాలని ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించింది. ఈనెల 29 వరకు సమావేశాలు సాగే అవకాశముంది. శాసనసభ ఎన్నిరోజులు సాగేది, బడ్జెట్ ఎప్పుడు ప్రవేశపెట్టేది ప్రభుత్వం సభాకార్యకలాపాల కమిటీ(బీఏసీ) సమావేశంలో అధికారికంగా వెల్లడించనుంది. సమావేశాల నిర్వహణపై సోమవారం ముఖ్యమంత్రి కేసీఆర్, శాసనసభ వ్యవహారాల మంత్రి హరీశ్‌రావు తదితరులతో సోమవారం ప్రగతిభవన్‌లో సమావేశం నిర్వహించారు. బీఏసీ ఎప్పుడు నిర్ణయించేది ఒకట్రెండు రోజుల్లో నిర్ణయిస్తారు.

సభలోనే ఉన్నామా?

- వెంకయ్యనాయుడి అసహనం

ఈనాడు, దిల్లీ: రాజ్యసభలో కొన్ని పార్టీల సభ్యులు వెల్‌లో ఆందోళన చేయడంపై సభాపతి వెంకయ్యనాయుడు సోమవారం అసహనం వ్యక్తం చేశారు. "మనం సభలో ఉన్నామా? ఇంకెక్కడైనా ఉన్నామా? అన్నది నాకు అర్థం కావడంలేదు. ఎవ్వరూ వినిపించుకోనప్పుడు.. నేనేమీ చేయాల్సిన అవసరం లేదు." అన్నారు. సభాధ్యక్షుడు లేచి నిల్చున్నప్పుడు సభ్యులు కూర్చోవడం సంప్రదాయమని సూచించారు. తాను చెప్పే అంశం సంతృప్తి కలిగించనప్పుడు మీరు చేయాలనుకున్నది చేసుకోవచ్చని ఆందోళనకు దిగిన సభ్యులకు తెలిపారు. అన్నాడీఎంకే సభ్యుడు నవనీతకృష్ణన్ జోక్యం (మిగతా 2లో)

నాలుగు ప్రాజెక్టులకు కార్పొరేషన్

- తద్వారా రుణం తీసుకోవాలని నీటిపారుదలశాఖ నిర్ణయం
- వీటిని పూర్తి చేసేందుకు 20 వేల కోట్లు అవసరం!
- కార్యాచరణకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలోని నాలుగు సాగునీటి ప్రాజెక్టులకు బ్యాంకుల నుంచి రుణం తీసుకొనేందుకు ఒక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని నీటిపారుదలశాఖ నిర్ణయించింది. సీతారామ ఎత్తిపోతల, దేవాదుల, శ్రీరామసాగర్ వరద కాలువ, తుపాకులగూడెం పథకాలకు కలిపి కార్పొరేషన్‌గా ఏర్పాటుచేసింది. కాళేశ్వరం ఎత్తిపోతలకు అప్పు తీసుకున్నట్లుగానే మరో నాలుగు పథకాలకు బ్యాంకుల నుంచి రుణం తీసుకోవాలని సూత్రప్రాయంగా నిర్ణయించిన రాష్ట్రప్రభుత్వం తదుపరి కార్యాచరణకు శ్రీకారం చుట్టింది.

కాళేశ్వరానికి బ్యాంకుల నుంచి భారీగా రుణం తీసుకున్నట్లే ఇతర ప్రాజెక్టులకూ రుణం తీసుకొనే ప్రయత్నాల్లో ఉన్న ప్రభుత్వం ప్రతి ప్రాజెక్టుకూ ఒక ప్రత్యేక కార్పొరేషనా లేక అన్నింటికీ ఒకటే ఏర్పాటు చేయాలా అన్నదానిపై అధ్యయనం చేయాలని నిర్ణయించింది. ఈమేరకు ప్రతిపాదనలు పంపాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.కె.జోషి నీటిపారుదలశాఖ (మిగతా 2లో)

15 నుంచి ఒంటిపూట బడులు

ఈనాడు, హైదరాబాద్: ప్రభుత్వ పాఠశాలలు ఈనెల 15 నుంచి ఒంటి పూట మాత్రమే పనిచేయనున్నాయి. దీనికి సంబంధించిన ప్రతిపాదనల దస్త్రాన్ని పాఠశాల విద్యాశాఖ కమిషనర్.. ప్రభుత్వ ఆమోదానికి పంపించనున్నారు. ఈనెల 15 నుంచి ఏప్రిల్ 12వ తేదీ వరకు పాఠశాలలు ఉదయం పూట మాత్రమే పనిచేస్తాయి. జూన్ 1న బడులు పునఃప్రారంభంకానున్నాయి.

8, 9, 10 విద్యార్థులకు సైకిళ్లు

వచ్చే విద్యా సంవత్సరంలో ఉన్నత పాఠశాలల్లోని 8, 9, 10 తరగతుల వారికి సైకిళ్లు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వానికి విద్యాశాఖ ప్రతిపాదించనుంది. సర్వ శిక్ష అభియాన్ (ఎస్ఎస్ఏ), రాష్ట్రీయ మాధ్యమిక శిక్షా అభియాన (ఆర్ఎంఎస్ఏ)లను ఒకే పథకంగా కేంద్రం విలీనం చేయనుంది. ఈ పథకం కింద ఎన్ని నిధులు మంజూరవుతాయన్నది ఏప్రిల్‌లో జరగనున్న ప్రాజెక్టు అప్రూవల్ బోర్డు (పీఏబీ)లో కేంద్రం నిర్ణయిస్తుంది. దీనికిగాను ఈసారి సైకిళ్లు ఇస్తామని.. నిధులు మంజూరు చేయాలని ప్రతిపాదిస్తున్నామని విద్యాశాఖ కమిషనర్ కిషన్ తెలిపారు.

అశ్లీల దృశ్యాలు చూస్తున్నాడని కొడుకు చేయి నరికేశాడు

పహాడీషరీఫ్, న్యూస్‌టుడే: మొబైల్ ఫోన్‌లో అశ్లీల దృశ్యాలు చూస్తున్న కుమారుడి చేయి నరికేశాడో తండ్రి. హైదరాబాద్ పాతబస్తీలోని పహాడీషరీఫ్ జల్‌పల్లి ప్రాంతంలో ఉండే ఖయ్యూం ఖురేషి మాంసం వ్యాపారి. పెద్దకుమారుడు మహ్మద్ ఖాలెద్ ఖురేషీ (18)ని స్థానిక కేబుల్ టీవీ కార్యాలయంలో పనికి కుదిర్చాడు. పనికి వెళ్లకపోగా.. అస్తమానూ ఫోన్లో అశ్లీల దృశ్యాలు చూస్తుండటాన్ని గుర్తించిన తండ్రి ఇటీవల కొడుకును మందలించాడు. ఫోన్ లాక్కోడానికి యత్నించగా.. తండ్రి చేయి కొరికి ఖాలెద్ పారిపోయాడు. ఆరోజు నుంచి ఇంట్లో గొడవ జరుగుతూనే ఉంది. సోమవారం ఇంట్లోనే ఉన్న ఖాలెద్ మళ్లీ అదే పని చేస్తుండడంతో ఖయ్యూంఆగ్రహంతో ఊగిపోయాడు. మాంసం నరికే కత్తితో కుమారుడి కుడిచేతిని నరికేశాడు. ఖాలెద్ కేకలతో పరుగెత్తుకొచ్చిన తల్లి లబోదిబోమంటూ స్థానికుల సాయంతో ఆసుపత్రిలో చేర్పించింది. ఖయ్యూం పోలీసుల వద్ద లొంగిపోయాడు.

వైద్య బీమాకు రెండేళ్ల గండం

- ఈఎస్ఐలో వింత నిబంధన
- తీవ్ర వ్యాధులకు సూపర్ స్పెషాలిటీ వైద్యం కరవు
- ఆందోళనలో కార్మికులు, ప్రైవేటు ఉద్యోగులు

ఈనాడు - హైదరాబాద్


■ హైదరాబాద్‌కు చెందిన ప్రసాద్ ఓ ప్రైవేటు సంస్థలో పనిచేస్తున్నారు. అతని తండ్రికి గతంలో ఓ సారి పక్షవాతం వచ్చింది. ఇటీవల మరోసారి జబ్బుపడగా ఈఎస్ఐ కార్డును తీసుకెళ్లి నాచారంలో వైద్యపరీక్షలు చేయించారు. పరిస్థితి తీవ్రంగా ఉండటంతో సూపర్ స్పెషాలిటీకి సిఫార్సు చేయాలని కుటుంబ సభ్యులు కోరారు. ఈఎస్ఐలో చందాదారుడిగా రెండేళ్ల సర్వీసు లేకపోవడంతో ఆ అర్హత లేదంటూ నిరాకరించారు.

కార్మిక రాజ్య బీమా సంస్థ (ఈఎస్ఐసీ)లో సభ్యులైన కార్మికులు, ఉద్యోగులకు అత్యవసర జబ్బులకు సూపర్‌స్పెషాలిటీ వైద్యసేవలకు కచ్చితంగా రెండేళ్ల సర్వీసు ఉండాలన్న నిబంధనలు అడ్డువస్తున్నాయి. సంస్థలో ఉద్యోగిగా చేరి, రెండేళ్ల సర్వీసులోగా కార్మికుడికి, అతని కుటుంబ సభ్యుల్లో ఎవరికైనా తీవ్రమైన గుండె, బ్రెయిన్ స్ట్రోక్, కాలేయం, కిడ్నీలు, ఊపిరితిత్తులకు సంబంధించిన జబ్బులు చేస్తే పరిస్థితులు (మిగతా 2లో)



హైదరాబాద్ ఎర్రగడ్డలో కొత్తగా నిర్మించిన ఈఎస్ఐ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి

ఇదీ సంగతి!



కలెక్టర్లకే అసైన్డ్ అధికారం

- నియోజకవర్గ, జిల్లాస్థాయి కమిటీలకు మంగళం
- గత డిసెంబర్ 31 వరకు ఆక్రమణలో ఉన్నవారికీ భూములపై హక్కు
- కేటాయింపుల్లో నిరుపేదలకు ప్రాధాన్యం

ఈనాడు, హైదరాబాద్: అసైన్డ్ భూముల పునఃకేటాయింపుపై ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇన్నాళ్లూ అసైన్డ్ భూముల కేటాయింపులన్నీ నియోజకవర్గ ఎమ్మెల్యే అధ్యక్షతన ఉండే కమిటీ నిర్ణయిస్తుండగా తాజాగా ఆ అధికారం కలెక్టర్లకు అప్పగించింది. ఈ మేరకు సోమవారం రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ తివారీ మెమో జారీచేశారు. అసైన్డ్ భూములు కొనుగోలు చేసి సాగుచేసుకుంటున్న పేదలకు వాటిపై హక్కు లభించనుంది. దీంతోపాటు గతేడాది డిసెంబర్ 31 లోపు ఆయా భూములను సాగుచేసుకుంటున్న వారికీ అవకాశం కల్పించారు. భూ దస్త్రాల ప్రక్షాళన అనంతరం సేకరించిన సమాచారం మేరకు ఇప్పటికే అసైన్డ్ భూములు ఆక్రమించి సాగుచేసుకుంటున్న వారిని గుర్తించారు.

కలెక్టర్లకు నిర్ణయాధికారులు: అసైన్డ్ భూముల పంపిణీ చట్టం ప్రకారం నియోజకవర్గ స్థాయిలో ఎమ్మెల్యే అధ్యక్షతన కమిటీ, జిల్లా స్థాయిలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అధ్యక్షతన కమిటీ పంపిణీపై నిర్ణయం తీసుకునేది. జిల్లా కలెక్టర్, ఆర్డీవో కమిటీ కన్వీనర్లుగా వ్యవహరించేవారు. ప్రస్తుతం అసైన్డ్ భూములను తిరిగి కేటాయించచేయబోతున్న నేపథ్యంలో ఈ రెండు కమిటీలు రద్దయినట్లే. ప్రభుత్వం ఆ నిర్ణయాధికారాన్ని కలెక్టర్లకు అప్పగించింది. జిల్లా కలెక్టర్లు అసైన్డ్ భూమి కొనుగోలు చేసిన వారిలో పేదలు ఎవరనేది తేల్చనున్నారు. అనంతరమే వారికి పునఃపంపిణీ చేస్తారు.

చేతులుమారిన 2.41 లక్షల ఎకరాలు

రాష్ట్రంలో ముప్పై జిల్లాల్లో 20.01 లక్షల ఎకరాల అసైన్డ్ భూములు (మిగతా 2లో)

తెలంగాణపై కేంద్రం నిర్లక్ష్యం

- రాష్ట్రానికి ఎలాంటి ప్రోత్సాహంలేదు
- ఇదేనా సమాఖ్య స్ఫూర్తి
- కేంద్ర ప్రభుత్వ విధానాల మార్పు కోసమే నా తపన
- దిల్లీ పెద్దలు ఉదారత చూపాలి
- దేశం అన్ని రంగాల్లో పురోగమించాలి
- దిల్లీ వేదికగా దేశమంతటికీ గళం వినిపిస్తాను
- గవర్నర్‌తో ముఖ్యమంత్రి కేసీఆర్ రెండు గంటల పాటు భేటీ
- బడ్జెట్ సమావేశాలపై చర్చ

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణపై కేంద్రం ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి ఏమాత్రం సరిగా లేదని ముఖ్యమంత్రి కేసీఆర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. దిల్లీ నుంచి రాష్ట్రానికి ఎలాంటి ప్రోత్సాహం లేదని, విభజన హామీలు సైతం అమలు జరగడం లేదని ఆరోపించారు. రాష్ట్రాల పట్ల కేంద్రం విధానం మారాలన్నదే జరగాలన్నదే తమ అభిమతమని, ఇందుకోసమే తాను జాతీయ రాజకీయాల ప్రక్షాళనపై దృష్టి సారించానని వెల్లడించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ సోమవారం రాత్రి రాజ్‌భవన్‌లో గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్‌తో భేటీ అయ్యారు. దాదాపు రెండు గంటల పాటు వారి సమావేశం కొనసాగింది. ఈ సందర్భంగా తాజా రాజకీయ పరిణామాలు సహా పలు అంశాలు వారి మధ్య చర్చకు వచ్చాయని తెలిసింది. ప్రధానంగా దేశ రాజకీయాల్లో గుణాత్మక మార్పు రావాలన్న తన అభిలాషను కేసీఆర్ వివరించినట్లు తెలిసింది.

"దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లయినా పాలనపరంగా, ప్రగతి పరంగా కొన్ని అంశాల్లో దేశం ఇంకా పునాది దశలోనే ఉండటం బాధాకరం. పాలనలో సమగ్ర మార్పులు రావాలి. దేశంలోని అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రుల్లోనూ ఇదే అభిప్రాయం ఉంది. కొత్తగా ఏర్పడిన తెలంగాణ స్వయంసమృద్ధిని సాధిస్తున్నా కేంద్రం నుంచి సాయం అందాలని కోరుకుంది. కానీ, ఏమీ జరగడం లేదు. విభజన హామీలపై తెలంగాణ వాదన అరణ్య రోదనే అవుతోంది. ప్రాజెక్టుల పరంగా, పరిశ్రమల పరంగానూ కేంద్రం సానుకూలంగా లేదు. పన్నుల వాటా మినహాయిస్తే మాకు ఏమీ ఇవ్వలేదు. ముస్లిం, గిరిజన రిజర్వేషన్ల బిల్లును ఆమోదించలేదు. నీతి ఆయోగ్ సిఫార్సులను అమలు చేయలేదు. మాపై ఎందుకీ చిన్నచూపు! ఆదాయపరంగా రాష్ట్రం ఉన్నతస్థానంలో ఉన్నందున వనరులను సమకూర్చుకున్నాం. పేద రాష్ట్రమయితే మా పరిస్థితి ఏమిటి? ఇలాంటివి మారాలి" అని కేసీఆర్ తెలిపారు.

సమాఖ్య స్ఫూర్తి పరిఢవిల్లాలి

కేంద్రం, రాష్ట్రాల మధ్య సన్నిహిత సంబంధాలుండాలని కేసీఆర్ అభిప్రాయపడ్డారు. దిల్లీలోని పెద్దలు రాష్ట్రాల పట్ల ఉదారంగా వ్యవహరించాలని సూచించారు. "పరిస్థితులకు అనుగుణంగా చర్యలుండాలి. సమాఖ్య స్ఫూర్తి రావాలి. ప్రస్తుతం అలా జరగడం లేదు. మా గోడును కేంద్రానికి ఎన్నో రోజులుగా చెబుతున్నాం. పార్లమెంటులోనూ గళమెత్తుతున్నాం. తెలంగాణ ప్రగతిని ప్రధాని, కేంద్రమంత్రులు గొప్పగా పొడిగారు. కానీ, రాష్ట్రానికి సాయం చేయడానికి చేతులు రావడం లేదు. అనుభవజ్ఞులుగా మీరు పరిస్థితులను చూస్తున్నారు. గవర్నర్‌గా రెండు తెలుగు రాష్ట్రాల్లోని పరిస్థితులను కేంద్రం దృష్టికి తీసుకెళ్తున్నారు. వాస్తవాల ఆధారంగా రాష్ట్రాల అవసరాలను గుర్తించి కేంద్రం అండగా నిలిచి, ఆదుకోవాలి" అని గవర్నర్‌తో కేసీఆర్ అన్నట్లు సమాచారం.

ఆవేశం కాదిది ఆవేదన..

దేశ పరిస్థితులు, రైతుల దుస్థితిపై కేసీఆర్ తన ఆవేదనను, ఆందోళనను గవర్నర్‌కు వివరించారు. "దేశంలోని పరిస్థితులు ఆవేదన కలిగించాయి. రైతుల గురించి పట్టించుకునే నాథులే కరవయ్యారు. అన్నదాత పట్ల కేంద్రం ఉదారంగా వ్యవహరించాలి. మద్దతు ధరలతో పాటు అన్ని విధాలుగా చేయూతనిస్తేనే రైత ఆత్మహత్యలకు అడ్డుకట్ట పడుతుంది. రైతు సంక్షేమమే దేశ సంక్షేమం. అభివృద్ధిపరంగా చైనా, అమెరికా, జపాన్ స్థాయికి దేశం ఎదగాలన్నదే నా ఆకాంక్ష. నాది తొందరపాటుతో, ఆవేశంతో తీసుకున్న నిర్ణయం కాదు. తెలంగాణ ప్రజల తరపున నేను గళం విప్పాను. నా రాష్ట్రం, ప్రజలు బాగుండాలన్నదే నా తపన. ఇందుకోసం దిల్లీ వేదికగా నా వాణి వినిపిస్తాను. ఇది అన్ని రాష్ట్రాలకు మేలు చేస్తుందని భావిస్తున్నాను. నాది ధిక్కారస్వరం కాదు. కొత్త దిశ కోసం జరిగే ప్రయత్నం" అని వాఖ్యానించినట్లు సమాచారం. 'గవర్నర్ల వ్యవస్థలో మార్పుల కోసం మీరు సిఫార్సులను అందజేశారు. అదే విధంగా పాలనకు సంబంధించి పలు అంశాల్లోనూ మార్పులు రావాలి' అని సీఎం తన మనసులో మాటను చెప్పారు. ఈ నెల 12 నుంచి జరిగే శాసనసభా బడ్జెట్ సమావేశాల గురించి సీఎం వివరించారు. ప్రజల ఆశలకు తగినట్లుగా బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్నామని, ఆదాయ వనరులను పేదల ప్రగతి, సంక్షేమానికి వెచ్చించడానికి ప్రణాళిక సిద్ధం చేశామని చెప్పారు. 12న ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగించేందుకు కావాలని గవర్నర్‌ను కేసీఆర్ ఆహ్వానించారు.

ప్రకృతి వైద్యవిధానంతో ఉత్తమ ఫలితాలు

- సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీరమణ

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: ప్రకృతి వైద్య విధానం వల్ల ఉత్తమ ఫలితాలుంటాయని, మెరుగైన ఆరోగ్యం సిద్ధిస్తుందని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ అభిప్రాయపడ్డారు. ఆయన సోమవారం హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో హీలింగ్ హస్త నేచురోపతి క్లినిక్‌ను ప్రారంభించి మాట్లాడారు. ఆధునిక శాస్త్రసాంకేతిక పరిజ్ఞానం వల్ల జీవనవిధానంలో మార్పులు చోటుచేసుకుని పలు వ్యాధులు ఇబ్బందులు పెడుతున్నాయన్నారు. కంప్యూటర్, అంతర్జాల వినియోగం, ఉద్యోగ ఒత్తిడి వల్ల శారీరక, మానసిక సమస్యలు ఎక్కువవుతున్నాయని పేర్కొన్నారు. ఇలాంటి వ్యాధులకు ప్రకృతి వైద్యవిధానంలో పూర్తిస్థాయి చికిత్స ఉంటుందన్నారు. పలువురి ఆరోగ్య సమస్యలకు ప్రకృతి వైద్య నిపుణులు డాక్టర్ మస్తాన్ యాదవ్ చికిత్స పరిష్కారం చూపాలని రమణ ఆకాంక్షించారు. నడుం, మెడ, వెన్ను, మోకాళ్ల నొప్పులకు, డిస్క్, సయాటికా సమస్యలకు ఫిజియోథెరపీ, ఆక్యుపంక్చర్, కౌన్సిలింగ్, పోషకాహారం, హెర్బల్ మెడిసిన్ వంటి చికిత్స విధానాలుంటాయని మస్తాన్ యాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈనాడు మేనేజింగ్ డైరెక్టర్ సీహెచ్ కిరణ్, సినీ దర్శకుడు మారుతి తదితరులు పాల్గొన్నారు.



క్లినిక్‌ను ప్రారంభిస్తున్న సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ. చిత్రంలో ఈనాడు మేనేజింగ్ డైరెక్టర్ సీహెచ్ కిరణ్ తదితరులు

వ్యవసాయానికి ప్రత్యేక బడ్జెట్ లేదు

- రాజ్యాంగం ప్రకారం ఇది సాధ్యం కాదు
- ముఖ్యమంత్రి కేసీఆర్ వెల్లడి

ఈనాడు, హైదరాబాద్: వ్యవసాయానికి ప్రత్యేక బడ్జెట్ ప్రవేశపెట్టాలనే ఆలోచనను తెలంగాణ ప్రభుత్వం విరమించుకుంది. రాజ్యాంగ నిబంధనలు, శాసనసభ నియమావళి ప్రకారం శాఖల వారీగా ప్రత్యేక బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం సాధ్యం కాదని ముఖ్యమంత్రి కేసీఆర్ వెల్లడించారు. ఈ అంశంపై సోమవారం ప్రగతి భవన్‌లో మంత్రులు, అధికారులతో ఆయన సమీక్ష జరిపారు. మంత్రులు పోచారం శ్రీనివాసరెడ్డి, ఈటల రాజేందర్, తుమ్మల నాగేశ్వరరావు, మహేందర్ రెడ్డి, చీఫ్ విప్‌లు కొప్పుల ఈశ్వర్, సుధాకర్‌రెడ్డి, పలు శాఖల ఉన్నతాధికారులు ఇందులో పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తొలి నుంచీ వ్యవసాయానికి అధిక ప్రాధాన్యమిస్తోందని.. ఈసారి బడ్జెట్‌లో రైతుల కోసం మరిన్ని కార్యక్రమాలు, పథకాల కోసం నిధులు కేటాయిస్తుందని సీఎం చెప్పారు. సేద్యానికి ఎక్కువ ప్రాధాన్యమిస్తున్నందున ప్రత్యేక బడ్జెట్ తేవాలని తొలుత నిర్ణయించామని.. సాధ్యాసాధ్యాలపై చర్చిస్తే సాధ్యం కాదని తేలిందన్నారు. ప్రభుత్వం మొత్తానికి ఒకే బడ్జెట్ ఉండాలని.. శాఖలవారీగా తీసుకురావడం సాధ్యం కాదనే నిబంధనలు ఉన్నాయన్నారు. శాసనసభ నియమావళిలోని 150వ నిబంధన ప్రకారం ఆదాయ, వ్యయాలే బడ్జెట్ కిందకు వస్తాయని.. ఇతరత్రా ప్రణాళికలు, వివరణలన్నీ పద్దుల కిందకే వస్తాయని కేసీఆర్ తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సైతం ఒకసారి వ్యవసాయానికి ప్రత్యేక బడ్జెట్ ప్రవేశపెట్టడం వివాదాస్పదంగా మారింది. కేంద్రం కూడా రైల్వేబడ్జెట్‌ను ప్రధాన బడ్జెట్‌లో కలిపి తెస్తున్న విషయాన్ని సీఎంకు అధికారులు వివరించారు. దీంతో ఇక్కడా వ్యవసాయానికి ప్రత్యేక బడ్జెట్ తీసుకువచ్చే ఆలోచనను విరమించుకున్నట్లు తెలిపారు. రాష్ట్ర బడ్జెట్‌లోనే వ్యవసాయ రంగానికి ఇస్తున్న ప్రాధాన్యాన్ని పథకాలను వివరిస్తామని ప్రకటించారు.

వైద్య బీమాకు రెండేళ్ల గండం

(మొదటి పేజీ తరువాయి)

చేయిదాటేలా ఉన్నాయి. ఈపీఎఫ్ లాంటి సామాజిక భద్రత పథకాల్లో చందాదారుడిగా చేరినప్పటినుంచి సదుపాయాలు అందిస్తుంటే.. అదే కార్మికశాఖ ఆధ్వర్యంలోని ఈఎస్ఐసీ సంస్థ మాత్రం సవాలక్ష ఆంక్షలు పెడుతోంది. ప్రైవేటు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవల కోసం అప్పులు చేస్తూ ఆర్థిక ఇబ్బందుల ఊబిలో కూరుకుపోయే పరిస్థితులు తలెత్తుతున్నాయి.

ఆ నిబంధనలతో సమస్య..

ఈఎస్ఐ నిబంధనల ప్రకారం గతంలో మూడు నెలల ఈఎస్ఐ చందా సర్వీసు పూర్తయితే ఆ ఉద్యోగికి.. ఆరునెలల సర్వీసు పూర్తయితే కార్మికుడికి అతనిపై ఆధారపడిన కుటుంబ సభ్యులకు బీమా వైద్య సేవలు వర్తించేవి. అత్యవసర పరిస్థితుల్లో ఈఎస్ఐ ఆసుపత్రులు ప్రైవేటు సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రులకు సిఫార్సు చేసేవారు. ఇప్పుడు ఆ పరిస్థితులన్నీ మారిపోయాయి. వైద్యసేవలకు సంబంధించి బిల్లులు సకాలంలో అందడం లేదంటూ కొన్ని ఆసుపత్రులు ఈఎస్ఐ వైద్యసేవలు అందించడం లేదు. తాజాగా సూపర్ స్పెషాలిటీ వైద్య సేవల కోసం ఈఎస్ఐ ఏడాది క్రితం తీసుకువచ్చిన రెండేళ్ల సర్వీసు నిబంధనలతో మరిన్ని సమస్యలు వస్తున్నాయి. ఉద్యోగికి ఏదైనా ప్రమాదం జరిగినపుడు మినహా మిగతా అన్ని సందర్భాల్లో సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు అందించేందుకు ఈ సర్వీసును పరిగణనలోకి తీసుకుని వైద్యసేవలు అందిస్తున్నారు.

ప్రీమియం తక్కువేం కాదు..

ఉద్యోగికి చెల్లిస్తున్న వేతనం రూ.21 వేల లోపు ఉంటే కచ్చితంగా ఈఎస్ఐ పరిధిలోకి రావాల్సిందే. ఈ మేరకు యాజమాన్యాలు ఈఎస్ఐ పరిధిలోకి తీసుకువచ్చి వైద్యసేవలు కల్పించాల్సి ఉంటుంది. ఈ మేరకు ఉద్యోగికి చెల్లించిన వేతనం నుంచి 1.75 శాతం ఉద్యోగి చందాగా వేతనం నుంచి మినహాయిస్తారు. యాజమాన్యం తమ వాటా కింద 4.75 శాతం చెల్లిస్తుంది. ఈ మొత్తాన్ని ఈఎస్ఐకి ప్రతినెలా 15లోగా జమచేస్తారు. ఇలా జమచేసిన బీమా మొత్తం నుంచి కార్మికులకు వైద్యసేవలు అందుతాయి. ఉద్యోగి, యాజమాన్య చందాను కలిపి ప్రతినెలా చెల్లించే ప్రీమియం మొత్తం భారీగా ఉంటోంది. ఈపీఎఫ్ మాదిరి.. ఈఎస్ఐలోనూ ఉద్యోగంలో చేరిన తరువాత తొలిచందా కట్టినప్పటి నుంచి బీమా వైద్య సేవలు అందించాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. అత్యవసర వైద్యానికి సంబంధించి సూపర్ స్పెషాలిటీ సేవలకు రెండేళ్ల నిబంధన ఎత్తివేయాలని కోరుతున్నారు.

సభలోనే ఉన్నామా?

(మొదటి పేజీ తరువాయి)

చేసుకుంటూ "తమిళనాడు కూడా లేచి నిల్చొంది.." అన్నారు. దీనికి వెంకయ్య స్పందిస్తూ కొంత ఓపికపట్టాలని.. కావేరి నది నీళ్లు రావడానిక్కూడా కొంత సమయం పడుతుందని పేర్కొన్నారు. కాగా ఎంపీలు వారి స్థానాల్లోనే కూర్చొని ఆందోళన చేయడంతో ఒక దశలో వెంకయ్యనాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. "దేశం మనల్ని చూస్తోంది. అనవసర హంగామా చేస్తూ సభా గౌరవాన్ని తగ్గించొద్దు. ఇలా ఆందోళన చేయడం పద్ధతి కాదు.. సభలో పోస్టర్లు ప్రదర్శించరాదు. అలాచేస్తే చర్య తీసుకోవాల్సి ఉంటుంది." అని పేర్కొన్నారు. అప్పటికీ సభ్యులు నినాదాలు కొనసాగించడంతో - "సభను స్తంభింపజేయాలని సభ్యులు ముందుగానే అనుకొని వచ్చారు. అందుకే మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా వేస్తున్నా.." అని ప్రకటించారు.

కలెక్టర్లకే అసైన్డ్ అధికారం

(మొదటి పేజీ తరువాయి)

అసలైన లబ్ధిదారుల చేతుల్లో ఉన్నాయి. మరో 2,41,127.06 ఎకరాలు చేతులు మారాయి. వీటిలో అధిక భాగం ఆక్రమణకు గురైనవి. కొన్ని జిల్లాల్లో అసైన్డ్ భూముల సరిహద్దుల్లో పొలాలు కలిగిన రైతులు వాటిని కొనుగోలు చేయటం లేదా ఆక్రమణలకు పాల్పడ్డారు. దాదాపు 84 వేల మంది ఆక్రమణలకు పాల్పడిన వారు ఉన్నట్లు సమాచారం.

ఇలా చేయనున్నారు..

- తెలంగాణ అసైన్డ్ భూములు(బదిలీ నిషేదిత-పీఓటీ) చట్టం-1977 (సవరణ చట్టం 8/2007, 21/2008) ప్రకారం 2008కు ముందు మాత్రమే ఆయా భూముల్లో ఆక్రమణలో ఉన్నవారికి ప్రయోజనం ఉండేది. ప్రస్తుతం 31.12.2017 వరకు అసైన్డ్ భూములు కొనుగోలు చేసిన పేదలకూ హక్కు పొందే అర్హత కల్పించారు.
- భూమిని సాగు లేదా నివాస స్థలంగా ఉపయోగించుకున్నా అర్హులుగా పరిగణిస్తారు.
- భూమిలేనివారికి ప్రాధాన్యం ఇచ్చే అవకాశాలు ఉన్నాయి. ఐదెకరాల లోపు భూమి ఉన్న నిరుపేదలకుకూడా అనుమతించనున్నారు.

తేదీతో గందరగోళం

విడుదల చేసిన పత్రంలో సూచన(రిఫరెన్స్)లోని రెండో అంశంలో పేర్కొన్న తేదీ(09.12.2018) గందరగోళానికి దారితీసింది. సీసీఎల్ఏ నుంచి రిఫరెన్స్ నెం.అసైన్డ్.1(1)/33/2016 అని రాసి ఆ పక్కనే ఈ ఏడాది డిసెంబర్ తేదీని వేయడం అయోమయానికి కారణమయింది.

తెలంగాణలో రాజ్యసభ ఎన్నికల ప్రక్రియ ప్రారంభం

12 వరకు నామినేషన్ల స్వీకరణ.. 13న పరిశీలన

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో మూడు రాజ్యసభ స్థానాలకు ఎన్నికల ప్రక్రియ మొదలైంది. సోమవారం నుంచి ఈ నెల 12 వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. 13న పరిశీలన, 15న ఉపసంహరణకు తుది గడువు. మూడుకు మించి నామినేషన్లు దాఖలై ఏకగ్రీవం కాని పక్షంలో ఎన్నికలు 23న ఉదయం 9 నుంచి సాయంత్రం నాలుగు వరకు జరుగుతాయి. అదే రోజు ఫలితాలను వెల్లడిస్తారు. తొలిరోజు నామినేషన్లు ఏమీ దాఖలు కాలేదని ఎన్నికల రాష్ట్ర రిటర్నింగ్ అధికారి, శాసనసభ కార్యదర్శి నరసింహాచార్యులు తెలిపారు.

పాసు పుస్తకాల ముద్రణకు 8 బిడ్లు దాఖలు

ఈనాడు, హైదరాబాద్: పట్టాదారు పాసుపుస్తకాల ముద్రణకు తెలంగాణ రాష్ట్ర సాంకేతిక సేవల శాఖ(టీఎస్‌టీఎస్) నిర్వహించిన టెండర్లలో ఎనిమిది బిడ్లు దాఖలయ్యాయి. 71 లక్షల పాసు పుస్తకాలను భద్రతా ప్రమాణాలతో ముద్రించాల్సి ఉన్న నేపథ్యంలో ప్రభుత్వం టెండర్లకు అత్యంత ప్రాధాన్యం ఇస్తోంది. గత నెలలో పిలిచిన టెండర్లు రద్దుకాగా.. కొత్తగా మరోసారి నిర్వహించారు.

మండుతున్న సూర్యుడు

నిజామాబాద్‌లో 39 డిగ్రీలు

ఈనాడు, హైదరాబాద్ : వేసవి ఆరంభంలోనే భానుడు నిప్పుల వాన కురిపిస్తున్నాడు. రాష్ట్రంలో ఎండల తీవ్రత బాగా పెరిగింది. మరో మూడ్రోజుల వరకూ ఇలాగే పెరుగుతుందని.. 40 డిగ్రీల వరకూ పగటి ఉష్ణోగ్రత నమోదయ్యే అవకాశాలున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం సంచాలకుడు వై.కె.రెడ్డి చెప్పారు. నిజామాబాద్‌లో అత్యధికంగా 39, హైదరాబాద్‌లో 37.3 డిగ్రీల పగటి ఉష్ణోగ్రత నమోదైంది. రాత్రిపూట కూడా సాధారణంకన్నా 4 డిగ్రీలు అదనంగా పెరిగి 25 డిగ్రీలకు చేరుతోంది. శీతాకాలం తరవాత ఇంతటి స్థాయిలో రాత్రిపూట ఉష్ణోగ్రత నమోదు కావడం ఇదే తొలిసారి.

నాలుగు ప్రాజెక్టులకు కార్పొరేషన్

(మొదటి పేజీ తరువాయి)

ఇంజినీర్ ఇన్ చీఫ్‌కు సూచించారు. కాళేశ్వరం ఎత్తిపోతలకు మూడు విడతలుగా సుమారు రూ.22వేల కోట్లు బ్యాంకుల రుణాలకు ఒప్పందం జరిగింది. దీంతో నిధుల సమస్యల్లేక పనులు వేగంగా జరుగుతున్నాయి.

నిధులలేమితో పనుల్లో జాప్యం

- దేవాదుల ఎత్తిపోతల పథకంలో ప్రధాన పనులు పూర్తయినా నిధుల సమస్యతో జాప్యమవుతోంది. ఈ ప్రాజెక్టుకు సత్వర సాగునీటి ప్రయోజన పథకం కింద కేంద్రం నుంచి ఆర్థిక సాయం అందింది. రూ.1484 కోట్లు కేటాయించినా చెల్లించింది రూ.455 కోట్లే. ఇది పూర్తవ్వడానికి మరో రూ.4500 కోట్లు అవసరం.
- తుపాకులగూడెం బ్యారేజి నిర్మాణానికి ఏడాదికి కనీసం రూ.వెయ్యికోట్లు చొప్పున రెండేళ్లు ఖర్చు చేయాలి. దీనికి రూ.400 కోట్లు బడ్జెట్‌లో కేటాయించినా కేవలం రూ.65 కోట్లే చెల్లించారు.
- ఖమ్మం జిల్లాలోని సీతారామ ఎత్తిపోతలకు గుత్తేదారులతో ఒప్పందం చేసుకోవడంతో పాటు, ఈపథకాన్ని రెండేళ్లలో పూర్తి చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యం. ఈఏడాది రూ.912 కోట్లు కేటాయిస్తే రూ.200 కోట్లు కూడా చెల్లించలేదు. రూ.10వేల కోట్లయితే కానీ పనులు పూర్తికావు. రూ.7926 కోట్లతో పాలనా అనుమతి ఇచ్చిన ప్రాజెక్టు నిర్మాణ అంచనా తాజాగా రూ.13వేల కోట్లకు దాటింది.
- శ్రీరామసాగర్ వరదకాలువ పూర్తికి రూ.4వేల కోట్లు అవసరం. మొత్తమ్మీద ఈ పథకాల పూర్తికి రూ.20 వేల కోట్ల వరకు అవసరమని అంచనా.

ఇతర ప్రాజెక్టులకు నామమాత్రంగా ఖర్చు

బ్యాంకుల నుంచి రుణం తీసుకోకుండా రాష్ట్ర బడ్జెట్ నుంచి కేటాయించే నిధులతో పూర్తి చేయాలంటే ఎక్కువ సమయం పట్టే అవకాశముంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు సాగునీటి రంగానికి ప్రభుత్వం రూ.17,200 కోట్లు చెల్లించింది. ఇందులో బ్యాంకు రుణంతో సహా కాళేశ్వరం ప్రాజెక్టులోనే రూ.11వేల కోట్లకు పైగా చెల్లించింది. మిగిలిన ప్రాజెక్టుల్లో నామమాత్రంగానే వ్యయం చేయగలుగుతోంది. రాష్ట్రంలోని 8 జిల్లాల్లో 6.21 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీటిని సరఫరా చేసే దేవాదుల ఎత్తిపోతల పథకానికి, గోదావరిపై నిర్మించిన తుపాకులగూడెం బ్యారేజికి కలిపి ఒక కార్పొరేషన్ ఏర్పాటు చేసి రుణం తీసుకోవడానికి అనుమతించాలని సంబంధిత చీఫ్ ఇంజినీర్, ఇంజినీర్ ఇన్ చీఫ్‌కు లేఖ రాయగా, ఈయన నీటిపారుదలశాఖ అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జోషికి పంపారు. సీతారామ ఎత్తిపోతల పథకానికీ ఇదే తరహా ప్రతిపాదనలు పంపించారు.

ఆర్థికశాఖతో చర్చించాక కాళేశ్వరం ప్రాజెక్టులాగానే ఇతర ప్రాజెక్టులైన దేవాదులకు, సీతారామ ఎత్తిపోతలకు వేర్వేరుగా కార్పొరేషన్లు ఏర్పాటు చేసి రుణాలు తీసుకోవాలనే అభిప్రాయం వ్యక్తమైందని, ఈ నేపథ్యంలో ప్రతి ప్రాజెక్టుకూ కార్పొరేషనా.. లేక అన్నింటికీ ఒకటే ఏర్పాటు చేయడమా అన్నదానిపై అధ్యయనం చేసి ప్రతిపాదనలు పంపాలని ఇంజినీర్ ఇన్ చీఫ్‌కు ప్రధాన కార్యదర్శి సూచించారు. నాలుగు ప్రాజెక్టులకు కలిపి తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల మౌలిక సదుపాయాల కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని నీటిపారుదలశాఖ ప్రతిపాదించింది.

మూడో అడుగు

(మొదటి పేజీ తరువాయి)

అధికారులతోనూ సమావేశమవుతారు. జాతీయ స్థాయిలో, వివిధ రాష్ట్రాల ప్రభుత్వాల్లో ఏళ్ల తరబడి పనిచేసిన, అనేక రాజకీయ పరిణామాలను చూసిన అఖిల భారత సర్వీసు అధికారుల అనుభవాలు, అభిప్రాయాలు ఎజెండా రూపకల్పనకు దోహదపడతాయని సీఎం భావిస్తున్నారు. తర్వాత విశ్రాంత రక్షణ శాఖ, సైనిక, నౌకాదళ, వైమానిక అధికారులు, దేశవ్యాప్తంగా ఉన్న న్యాయనిపుణులు, ప్రముఖ న్యాయవాదులు, అఖిల భారత రైతు సంఘాలు, వివిధ రాష్ట్రాల్లో పనిచేస్తున్న రైతు సంఘాల ప్రతినిధులతోనూ చర్చలు జరుపుతారు. ఆయా వర్గాలను సంప్రదించడానికి, సమన్వయం చేయడానికి ప్రత్యేకంగా సమన్వయకర్తలను ముఖ్యమంత్రి నియమిస్తారు.

దిల్లీ సమావేశం కీలకం

అన్నింటికన్నా ముఖ్యంగా దిల్లీలో నిర్వహించే సమావేశం కీలకం కానుంది. దేశవ్యాప్తంగా ఉన్న ప్రాంతీయ, ఇతర పార్టీల నేతలు, వామపక్షాల నేతలతో కేసీఆర్ ఈ సందర్భంగా సమావేశమయ్యే వీలుంది. ఈ సందర్భంగా తెలంగాణ విధానాలు, అభివృద్ధి నమూనాపై దృశ్యరూపక ప్రదర్శన ఇస్తారు. తెలంగాణలో చేపట్టిన తాగునీటి ప్రాజెక్టులు, ఇంటింటికీ తాగునీరందించే మిషన్ భగీరథ, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్, మిషన్ కాకతీయ, రైతులకు రూ. 8,000 పెట్టుబడి సాయం, రుణమాఫీ, భూరికార్డుల ప్రక్షాళన వంటి వాటిని వివరిస్తారు. కేంద్ర ప్రభుత్వ విధానాలు, రాష్ట్రాలకు జరుగుతున్న అన్యాయాలనూ వెల్లడిస్తారు.

అజిత్‌జోగి మద్దతు

సీఎం కేసీఆర్ ప్రతిపాదించిన కొత్త కూటమికి ఛత్తీస్‌గఢ్ మొదటి ముఖ్యమంత్రి అజిత్ జోగి సంపూర్ణ మద్దతు తెలిపారు. సోమవారం ఆయన కేసీఆర్‌కు ఫోన్ చేసి అభినందించారు. కొత్త కూటమిలో తాము భాగస్వాములమవుతామన్నారు. భావ సారూప్యత గల జాతీయ స్థాయి నేతలతో సంప్రదింపులు జరపడం ద్వారా కూటమి ఏర్పాటులో తన వంతు పాత్ర పోషిస్తానని హామీ ఇచ్చారు. తెలంగాణ ఉద్యమాన్ని విజయవంతంగా నడిపిన కేసీఆర్ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని జోగి ఆకాంక్షించారు.

కోటా పెంచాల్సిందే

(మొదటి పేజీ తరువాయి)

కేశినేని నాని, శ్రీరాం మాల్యాద్రి, మాగంటి బాబు, జె.సి.దివాకర్‌రెడ్డిలు ఏపీకి ప్రత్యేకహోదా ఇవ్వాలంటూ లోక్‌సభలో ప్లకార్డులు చేతబట్టుకొని వెల్‌లోకి వచ్చారు. విభజన చట్టంలోని 19 అంశాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ప్రధాని ఉండగానే నిరసన

లోక్‌సభ ప్రారంభమైన వెంటనే దివంగత సభ్యులకు నివాళులర్పించేంత వరకూ నిశ్శబ్దంగా కూర్చున్న వివిధ పక్షాల ఎంపీలు అనంతరం స్పీకర్ పోడియం వద్దకు దూసుకొచ్చి నినాదాలు చేశారు. అప్పటికి సభలో ఉన్న ప్రధాని నరేంద్రమోదీ ముందే వారంతా నిరసన కొనసాగించారు. దీంతో స్పీకర్ సుమిత్రా మహాజన్ సభను 12 గంటలకు వాయిదా వేశారు. తిరిగి ప్రారంభమైన తర్వాతా సభ్యుల ఆందోళన కొనసాగడంతో సభ వాయిదా పడింది. అనంతరం తెరాస, తెలుగుదేశం, తృణమూల్ కాంగ్రెస్ సభాపక్ష నేతలు పరస్పరం మాట్లాడుకున్నారు. కాగా అన్నాడీఎంకే సభ్యులు కావేరి నదీ యాజమాన్య మండలిని ఏర్పాటు చేయాలని నినాదాలు చేశారు. పీఎన్‌బీని మోసగించి పారిపోయిన నీరవ్ మోదీని భారత్‌కు రప్పించాలని తృణమూల్ కాంగ్రెస్, వామపక్షాలు, కాంగ్రెస్ పార్టీలు డిమాండ్ చేశాయి. దీనిపై ప్రధాని సమాధానం చెప్పాలని కాంగ్రెస్ సభ్యులు పట్టుబట్టారు.

రాజ్యసభలోనూ అదే వరుస..

రాజ్యసభలోనూ తొలిరోజు ఎలాంటి కార్యకలాపాలు సాగలేదు. ఉదయం 11 గంటలకు సభ ప్రారంభమైన వెంటనే సభాధ్యక్షుడు ఎం.వెంకయ్యనాయుడు సిక్కిం నుంచి కొత్త సభ్యుడు హిషీలాచుంగ్‌పాతో ప్రమాణం చేయించారు. దివంగత సభ్యులకు నివాళులర్పించే కార్యక్రమాన్ని పూర్తిచేశారు. వెంటనే తెదేపా సభ్యులు సి.ఎం.రమేష్, టి.జి.వెంకటేష్, గరికపాటి మోహన్‌రావు, తోట సీతారామలక్ష్మి.. కాంగ్రెస్ సభ్యులు కె.వి.పి.రామచంద్రరావు, సుబ్బరామిరెడ్డిలతో పాటు అన్నాడీఎంకే, తృణమూల్ కాంగ్రెస్ సభ్యులు వెల్‌లోకి వచ్చి తమ డిమాండ్లతో ఆందోళన చేపట్టారు. దీంతో సభను 20 నిమిషాలు వాయిదా వేయగా.. తిరిగి ప్రారంభమైన వెంటనే సభ్యులు ఆందోళనకు దిగారు. తనకు కొన్ని నోటీసులు అందాయని.. వాటి గురించి చెప్పాల్సి ఉన్నందున సభ్యులంతా తమ స్థానాల్లో కూర్చోవాలని వెంకయ్యనాయుడు లేచి నిలబడి సూచించడంతో తృణమూల్, అన్నాడీఎంకే సభ్యులు వెళ్లిపోయారు. ఏపీ తెదేపా, కాంగ్రెస్ సభ్యులు అక్కడే నిలబడ్డారు. పేర్లు పిలిచి వారికి చెప్పడంతో కొద్దిసేపు ఆందోళన విరమించారు. అనంతరం వెంకయ్యనాయుడు మాట్లాడుతూ సభ్యులంతా సభను, సభాపతిని గౌరవించాలని సూచించారు. తనకు వివిధ అంశాలపై అందిన నోటీసులు.. వాటిని ఏ నిబంధన కింద ఇవ్వాలో సవివరంగా సూచనలు చేశారు. పీఎన్‌బీ, బ్యాంకింగ్ వ్యవస్థలో పరిణామాలు, ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం అమలు, మాజీ మంత్రుల బంధువుల అవినీతి కార్యకలాపాలు తదితర అంశాలకు సంబంధించి వివిధ పార్టీలు ఇచ్చిన నోటీసులకు వివరణ ఇచ్చారు. సభను మధ్యాహ్నానికి వాయిదా వేయగా.. తిరిగి ప్రారంభమైన తర్వాత సభాధ్యక్ష స్థానంలోకి ఉప సభాపతి పి.జె.కురియన్ వచ్చారు. సభ్యుల ఆందోళనతో సభ ముందుకు సాగలేదు.



సోమవారం పార్లమెంటు ప్రాంగణంలో శ్రీకృష్ణుడి వేషధారణలో తెదేపా ఎంపీ శివప్రసాద్ నిరసన

కృష్ణుడి వేషంలో ఎంపీ శివప్రసాద్ ఆందోళన

ఈనాడు, దిల్లీ: లోక్‌సభలో చిత్తూరు తెదేపా ఎంపీ ఎన్.శివప్రసాద్ శ్రీకృష్ణుడి వేషంలో వేణుగానం వినిపిస్తూ సోమవారం ఆందోళన కొనసాగించారు. ఆయన వస్తుండగానే.. హోం మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ఆ వేషధారణ గురించి పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి అనంతకుమార్‌కు చెప్పారు. వెంటనే ఆయన స్పీకర్‌కు ఫిర్యాదు చేయడానికి లేచినప్పటికీ.. వివిధ పక్షాల సభ్యుల నినాదాల మధ్య మంత్రి మాటలు స్పీకర్ వరకూ చేరలేదు. శివప్రసాద్ తలకు కిరీటం, నెమలి పింఛం, చేతిలో వేణువు, మెడలో బ్లూటూత్ స్పీకర్ వేసుకొని వచ్చారు. ఆయన వేణుగానం చేస్తున్నట్లు బ్లూటూత్ స్పీకర్ నుంచి శబ్దం రావడం అందరినీ ఆకట్టుకొంది. మంత్రి ప్రకాశ్ జావడేకర్ తన ముందుగా వెళ్తున్నప్పుడు శివప్రసాద్ ఆయన ముందు వేణుగాన ప్రదర్శన చేశారు. మరోవైపు ఏలూరు ఎంపీ మాగంటి బాబు భగవద్గీత, బైబిల్, ఖురాన్, వేంకటేశ్వర స్వామి విగ్రహం చేతబట్టి నిరసన కొనసాగించారు. తిరుపతి వేంకటేశ్వర స్వామి సాక్షిగా ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన హామీలను ప్రధాని అమలు చేయాలన్న డిమాండ్‌తో ఆయన ఇలా నిరసన చేపట్టారు. అన్నిపక్షాల సభ్యులు ఆందోళన కొనసాగిస్తుండగానే శివప్రసాద్ స్పీకర్ కుర్చీ వద్దకు వెళ్లి ఆమె పక్కన నిల్చొని వేణువు ఊదే ప్రయత్నం చేయడంతో ఆమె వెంటనే లోక్‌సభను మంగళవారానికి వాయిదా వేశారు. తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ దినేష్ త్రివేది శివప్రసాద్ దగ్గరకు వచ్చి చేతిలో వేణువు కాకుండా సుదర్శన చక్రం పట్టుకొని ఉంటే బాగుండేదని సూచించారు.

గ్రహం అనుగ్రహం

6-3-2018 మంగళవారం

శ్రీ హేవళంబి నామ సం॥రం॥ ఉత్తరాయణం
శిశిర రుతువు; ఫాల్గుణ మాసం; బహుళ పక్షం
పంచమి: తె. 3-21 తదుపరి షష్ఠి
స్వాతి నక్షత్రం: రా. 11-27 తదుపరి విశాఖ
అమృత ఘడియలు: మ. 2-20 నుంచి 4-00 వరకు
వర్జ్యం: తె. 5-21 నుంచి
దుర్ముహూర్తం: ఉ. 8-39 నుంచి 9-26 వరకు
తిరిగి రా. 10-58 నుంచి 11-47 వరకు
రాహుకాలం: మ. 3-00 నుంచి 4-30 వరకు
సూర్యోదయం: ఉ.6-20; సూర్యాస్తమయం: సా.6-04

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
కర్నూలు	38.7	22.0
హన్మకొండ	38.5	19.5
మహబూబ్‌నగర్	38.4	20.5
రామగుండం	38.1	18.6
మెదక్	38.0	17.2
ఆదిలాబాద్	37.5	20.4
హైదరాబాద్	37.3	19.1
సూర్యాపేట	37.0	25.0
నిజామాబాద్	36.0	22.0
కరీంనగర్	36.0	12.0
ఖమ్మం	30.0	18.0

కనీస విద్యార్హత నిబంధన లేనట్టే!

- ఆశావహ సర్పంచ్ అభ్యర్థులకు ఊరట
- తర్జనభర్జనల తర్వాత నిర్ణయాన్ని వాయిదా వేసుకున్న ఉపసంఘం

ఈనాడు – హైదరాబాద్


తెలంగాణ పంచాయతీ ఎన్నికల్లో మునుపటి మాదిరిగానే.. చదువుకోని వారూ సర్పంచ్ అభ్యర్థులుగా పోటీ చేయవచ్చు. కనీస విద్యార్హత నిబంధనను ప్రవేశపెట్టాలనే దిశగా మంత్రివర్గ ఉపసంఘం చర్చించినప్పటికీ.. దీని వల్ల సమస్యలు ఉంటాయనే భావనతో తమ ప్రతిపాదనను విరమించుకున్నట్లు సమాచారం.

గతంలో, ప్రస్తుతం సర్పంచ్ పదవుల్లో ఉన్న వారిలో నిరక్షరాస్యులు, ప్రాథమిక విద్యతో చదువులు ముగించిన వారే ఎక్కువగా ఉన్నారు.

రాష్ట్రంలోని ప్రతి పంచాయతీకి జనాభా ఆధారంగా ఏటా రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు ఇవ్వనున్నట్లు ముఖ్యమంత్రి కేసీఆర్ ఇప్పటికే ప్రకటించారు. మరోవైపు 14వ ఆర్థిక సంఘం సిఫార్సుల కారణంగా ఇకపై జిల్లా, మండల పరిషత్‌లకు వాటాలంటూ లేకుండా కేంద్ర నిధులు నేరుగా పంచాయతీలకే విడుదలవుతాయి. వీటన్నింటినీ పర్యవేక్షించే క్షేత్రస్థాయి సిబ్బందిని అజమాయిషీ చేసే సర్పంచి విద్యావంతుడైన పక్షంలో.. ఆయా మార్గదర్శకాలను చదివి వాటికి అనుగుణంగా చర్యలు చేపట్టేందుకు వీలువుతుందనే వాదన ఉంది. పంచాయతీరాజ్ నూతన చట్టం తయారీ కోసం ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం ఈ దిశగా గతంలో చర్చించింది. కనీస విద్యార్హత నిబంధన అమల్లో ఉన్న రాజస్థాన్, మహారాష్ట్ర, హరియాణా, పంజాబ్ వంటి కొన్ని రాష్ట్రాల్లోని పరిస్థితులనూ ఉపసంఘం పరిశీలించనుందన్న ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలో కనీస విద్యార్హత నిబంధన ఇక్కడా అమలు చేస్తారన్న చర్చ రాష్ట్రంలో మొదలైంది.

సమస్యలివీ

రాష్ట్రంలో ఇప్పుడు పెద్ద సంఖ్యలో చిన్న పంచాయతీలు ఏర్పాటు కాబోతున్నాయి. ఇప్పటికిప్పుడు 'విద్యార్హత' ఆంక్షలు అమల్లోకి తెస్తే పంచాయతీలుగా మారిన తండాలు, గోండుల గూడెంలలో అభ్యర్థుల కొరత ఏర్పడవచ్చు. చట్టాలను తయారు చేసే ఎమ్మెల్యేలకు లేని ఇటువంటి ఆంక్షలు సర్పంచిలకు ఎందుకన్న ప్రశ్న తలెత్తవచ్చు. అన్నింటినీ మించి.. చదువు లేకుండానే ప్రజలకు మంచి సేవ చేస్తున్న సర్పంచులు ఎన్నికల బరిలో దిగే అవకాశం కోల్పోయే వీలుంది. ఆయా పరిణామాలను చర్చించిన మీదట కనీస విద్యార్హత ప్రతిపాదనను మంత్రి వర్గ ఉపసంఘం విరమించుకున్నట్లు పంచాయతీరాజ్ శాఖ వర్గాలు వెల్లడించాయి.



పీజీ సీట్లకు అనుమతి నిరాకరణ

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో పలు పీజీ సీట్లకు 2018-19 సంవత్సరానికి భారతీయ వైద్య మండలి(ఎంసీఐ) అనుమతి నిరాకరించింది. నిబంధనల ప్రకారం మానవ వనరులు, సౌకర్యాలు లేకపోవడంతో కొత్తగా పీజీ కోర్సును ప్రారంభించడానికి అనుమతించలేదు. నిజామాబాద్ వైద్యకళాశాలకు ఎండీ ఫోరెన్సిక్ మెడిసిన్, ఫిజియాలజీ, బయోకెమిస్ట్రీ, అనాటమీ, మైక్రోబయాలజీ, పాథాలజీ, కమ్యూనిటీ మెడిసిన్ కోర్సుల ప్రారంభానికి అనుమతి నిరాకరించగా.. కాకతీయ వైద్యకళాశాల, నిమ్స్, ఉస్మానియా, గాంధీ వైద్యకళాశాలల్లో ఎండీ ఇమ్యూనో హెమటాలజీ అండ్ బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూజన్ కోర్సుకూ అనుమతించలేదు.



సమాధానాలను వెబ్‌సైట్‌లో పెట్టండి

- అధికారులకు సీఎస్ ఎస్.కె.జోషి ఆదేశం

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: గత శాసనసభ సమావేశాల్లో సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలను లెజిస్లేచర్ సెక్రటేరియట్ వెబ్‌సైట్‌లో పెట్టాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్) ఎస్.కె..జోషి ఆదేశించారు. సచివాలయంలో సోమవారం వివిధ శాఖల ఉన్నతాధికారులతో శాసన సభ, మండలిలో పెండింగ్ ప్రశ్నలు, కేంద్ర ప్రాయోజిత పథకాలు, ప్రభుత్వ వెబ్‌సైట్ల నిర్వహణ తదితర అంశాలపై ఆయన సమీక్షించారు. గత సమావేశాల్లో పెండింగ్‌లో ఉన్న రూల్ 74, 344, జీరోఅవర్ ప్రస్తావన, ప్రత్యేక ప్రస్తావనలకు సంబంధించిన సమాధానాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఈ నెలలో మొదలయ్యే సమావేశాలకు సంబంధించిన బిల్లులు, సవరణలు, మంత్రివర్గ ఆదేశాల అమలుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు అజయ్‌మిశ్రా, చిత్రా రామచంద్రన్, సోమేష్ కుమార్, అయా శాఖల ముఖ్య కార్యదర్శులు పాల్గొన్నారు.

రూ.4 వేల పెట్టుబడి పథకానికి చెక్కుల ముద్రణ

- బ్యాంకులకు మండలాల కేటాయింపు
- ఖరీఫ్‌కు రూ.6,484 కోట్లు ఇవ్వాలని వ్యవసాయశాఖ నివేదిక

ఈనాడు, హైదరాబాద్: పెట్టుబడి పథకం కింద ఎకరానికి రూ.4 వేల పంపిణీకి ఆరు బ్యాంకులతో చెక్కులు ముద్రించడానికి రాష్ట్రప్రభుత్వం అనుమతించింది. ఒక్కో బ్యాంకుకు కొన్ని మండలాల చొప్పున కేటాయించింది. స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఆంధ్రాబ్యాంకులకు అధికశాతం మండలాల కేటాయింపు జరిగింది. కెనరా, సిండికేట్, కార్పొరేషన్ బ్యాంకులతో పాటు మరో బ్యాంకును కూడా ఎంపిక చేశారు. బ్యాంకు ఉన్నతాధికారులతో సోమవారం ఆర్థిక, వ్యవసాయశాఖల ఉన్నతాధికారులు చర్చించి చెక్కుల పంపిణీకి మార్గదర్శకాలను ఖరారు చేశారు. మొత్తం 72.12 లక్షల మంది రైతులకున్న 1.62 కోట్ల ఎకరాలకు రూ.6484 కోట్లు ఖరీఫ్ సీజన్‌లో పంపిణీ చేయాలని వ్యవసాయశాఖ తెలిపింది. ఈ నిధులను రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయించాలని కోరింది. వెంటనే చెక్కుల ముద్రణ ప్రారంభించాలని వచ్చే నెల 19 నుంచి పంపిణీకి జిల్లాలకు పంపాలని బ్యాంకర్లకు సూచించారు. చెక్‌పై రైతుల పేర్లను ముద్రించి ఇవ్వాలని, ఆ జాబితాలను రెవెన్యూశాఖ నుంచి తీసుకోవాలని నిర్ణయించారు. రైతుకిచ్చిన చెక్కును ఏ బ్యాంకులోనైనా మార్చుకునే సౌలభ్యం కల్పించాలని, నగదు నేరుగా తీసుకునేలా వెసులుబాటివ్వాలని యోచిస్తున్నారు. రైతుకు బ్యాంకులో ఖాతా లేకున్నా నగదు ఇవ్వాలని తెలిపారు. చెక్కుల పంపిణీ చేసిన తరువాత నగదు కొరత రాకుండా చూడాలని బ్యాంకర్లు ప్రభుత్వాన్ని కోరారు. ఇప్పటికే కేంద్రానికి విన్నవించినందున నగదు కొరత రాకుండా రిజర్వు బ్యాంకును సంప్రదించాలని యోచిస్తున్నారు. వ్యవసాయశాఖ యంత్రాంగమంతా చెక్కుల పంపిణీకి చేయాల్సిన ఏర్పాట్లపైనే నిమగ్నమైంది.

అమ్మానాన్నలకు గుడి కట్టించా


అమ్మానాన్నలకు కట్టించిన గుడి

- వృద్ధాశ్రమం ఏర్పాటు చేయాలనేది లక్ష్యం
- శాసనసభాపతి మధుసూదనాచారి

హుస్నాబాద్, న్యూస్‌టుడే: జీవితంలో వృద్ధుల కోసం ఆశ్రమం ఏర్పాటు చేయాలనేది తన లక్ష్యమని శాసనసభాపతి మధుసూదనాచారి అన్నారు. సోమవారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలో ప్రైవేటు కార్యక్రమానికి వచ్చిన ఆయన తన చిన్ననాటి మిత్రుడు విశ్రాంత పంచాయతీ కార్యదర్శి రాజగోపాల్‌రావు ఇంట్లో మిత్రులతో కలసి కొంతసేపు గడిపారు. ఈసందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ తన తల్లిదండ్రులు వెంకటలక్ష్మి, వెంకటనర్సయ్య పేరిట స్వగ్రామమైన పరకాల మండలం నర్సక్కపల్లిలో గుడి కట్టినట్లు వివరించారు. వారిపై మమకారంతోనే ఈ ఆరాధనాలయాన్ని నిర్మించానని, 15 రోజుల్లో దీనిని ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన అమ్మానాన్నలపై రాసిన కవితను చదివి వినిపించారు. 1970వ సంవత్సరంలో హుస్నాబాద్‌లో తాను చదువుకున్న జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తాను ఈస్థాయికి ఎదగడానికి విద్యాబుద్ధులు నేర్పిన గురువు, తల్లిదండ్రులే కారణమన్నారు. హుస్నాబాద్‌లో చదువు నేర్పిన గురువు విశ్రాంత ఉపన్యాసకుడు దాశరథి వెంకట్రామనర్సయ్య (డీవీఆర్)కు పాదాభివందనం చేశారు.



ప్రగతి భవన్ ముట్టడి ఉద్రిక్తం

- భాజపా ముఖ్య నేతల గృహనిర్బంధం..రాస్తారోకో
- పలువురు నాయకులు, కార్యకర్తల అరెస్టు

ఈనాడు, హైదరాబాద్: న్యూస్‌టుడే బృందం: ప్రధాని మోదీపై సీఎం కేసీఆర్ అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా సోమవారం రాష్ట్ర భాజపా చేపట్టిన ప్రగతి భవన్ ముట్టడి ఉద్రిక్తంగా మారింది. సీఎం క్యాంపు కార్యాలయాన్ని ముట్టడించేందుకు భాజపా నాయకులు, కార్యకర్తలు వస్తారన్న అంచనాతో పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. భాజపా నేతలు డాక్టర్ లక్ష్మణ్, కిషన్‌రెడ్డిలను బయటకు రాకుండా వారి ఇళ్లలోనే గృహ నిర్బంధం చేశారు. పోలీసులు ముందస్తు అరెస్టులు చేస్తుండటంతో ఆపార్టీ ఎమ్మెల్యేలు, కార్యకర్తలు రాస్తారోకోలు నిర్వహిస్తూనే ప్రగతి భవన్‌కు ఆటోలు, ఆర్టీసీ బస్సుల్లో విడివిడిగా చేసుకున్నారు. వచ్చిన వారిని వచ్చినట్లే అరెస్టుచేసి గోషామహల్‌కు తరలించారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఆటోలో ప్రగతి భవన్‌కు వెళ్లేందుకు ప్రయత్నించగా సోమాజిగూడ సర్కిల్‌లో అడ్డుకుని అరెస్ట్ చేశారు. మధ్యాహ్నం పన్నెండు గంటల ప్రాంతంలో పలు మార్గాల నుంచి కొందరు పార్టీ నాయకులు ప్రగతిభవన్‌కు చేరుకుని ఆందోళనకు దిగారు.


ప్రధాని మోదీపై ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యాఖ్యలను నిరసిస్తూ సోమవారం ప్రగతి భవన్ ముట్టడి సందర్భంగా రహదారిపై బైఠాయించిన భాజపా నేతలు. చిత్రంలో బద్దం బాల్‌రెడ్డి తదితరులు

మానవహక్కుల ఉల్లంఘన ఇక్కడే..

దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలోనే మానవ హక్కుల ఉల్లంఘన జరుగుతోందని భాజపా శాసనసభాపక్ష నేత కిషన్ రెడ్డి అన్నారు. తనను పోలీసులు గృహ నిర్బంధం చేయడం మానవ హక్కులను కాలరాయడమేనని తెలిపారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ కిషన్‌రెడ్డి ఇంటికి వచ్చి మద్దతు ప్రకటించారు. ప్రధాని మోదీని పరుష పదజాలంతో సంబోధించిన సీఎం కేసీఆర్ క్షమాపణ చెప్పాలని ఎమ్మెల్సీ రామచంద్రరావు డిమాండ్ చేశారు. ప్రగతిభవన్ వద్దకు వెళ్లేందుకు ప్రయత్నించిన ఆయనతో పాటు ఇతర నాయకులను ఓయూ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అక్కడి నుంచి బొల్లారం పోలీస్ ఠాణాకు తరలించారు.

కేసీఆర్‌వి పొంతన లేని మాటలు...

భాజపా రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్‌ను చిక్కడపల్లిలోని ఆయన కార్యాలయంలో పోలీసులు నిర్బంధించారు. దీనిని నిరసిస్తూ ఆయన సీఎం కేసీఆర్ వ్యవహార శైలిని విమర్శించారు. కేసీఆర్.. ప్రధాని మోదీని దూషించిన తీరును ప్రజలు గమనించారని తెలిపారు. సీఎం కుమార్తె కవిత, కుమారుడు కేటీఆర్ తమతండ్రి నోరుజారారని అంగీకరించిన విషయాన్ని గుర్తు చేశారు. కేసీఆర్ మాత్రం అలా అనలేదని ఒకసారి, అంటే తప్పేంటని మరోసారి, మోదీ తనకు మంచి మిత్రుడని ఇంకోసారి.. ఇలా తప్పును కప్పిపుచ్చుకునేందుకు నానాపాట్లు పడుతున్నారని ధ్వజమెత్తారు. తాజాగా మూడో ఫ్రంట్‌కు నాయకత్వం వహిస్తానని చేస్తున్న ప్రకటనలు హాస్యాస్పదంగా ఉన్నాయన్నారు.



వినూత్నతకు..'సై'కిల్

నీళ్లు..బ్యాటరీతో నడిచే సైకిల్‌ను రూపొందించిన కోరుట్ల యువకుడు

సైకిల్‌పై ఉన్న ఈ యువకుడి పేరు సాయితేజ. ఊరు జగిత్యాల జిల్లా కోరుట్ల. పాలిటెక్నిక్ డిప్లొమా మధ్యలోనే ఆపేశాడు. అయితేనేం. వినూత్న ఆలోచనలతో.. రకరకాల వనరులతో నడిచే సైకిల్‌ను రూపొందించి ఔరా అనిపించాడు. ఒక విధానంలో సైకిల్‌కు ముందు వెనుక రెండు సౌర పలకలను అమర్చాడు. వాటి నుంచి విడుదలయ్యే విద్యుత్తును సైకిల్ మధ్యలో ఉన్న ఉప్పు నీళ్ల సీసాలోకి ప్రసరింపజేశాడు. ఆ శక్తితో డైనమో తిరుగుతూ..దానికి అనుసంధానించిన చైన్ తిరగడం ద్వారా సైకిల్ ముందుకు వెళ్తుంది. రెండో విధానంలో సౌర ఫలకాల ద్వారా విడుదలయ్యే విద్యుత్తును బ్యాటరీలోకి పంపి..ఆ శక్తితో సైకిల్ ముందుకు కదిలేలా చేశాడు. ఇక మూడో విధానంలో 12 ఓల్టుల బ్యాటరీ సాయంతో సైకిల్‌ను ముందుకు పరుగులెత్తించాడు. 'బ్యాటరీ ఒకసారి రీఛార్జ్ చేస్తే సైకిల్ 30 కిలోమీటర్లు నడుస్తుందని, దీన్ని తయారు చేయడానికి రూ.25 వేలు వెచ్చించానని' సోమవారం స్థానిక సాయిబాబా మందిరంలో దాన్ని ఆవిష్కరించిన సందర్భంగా సాయితేజ వెల్లడించాడు. – న్యూస్‌టుడే, కోరుట్ల

తగ్గనున్న యాసంగి ధాన్యం దిగుబడి!

- 30 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోలు అంచనా
- 3,300 సేకరణ కేంద్రాల ఏర్పాటుకు యోచన
- ఏప్రిల్ రెండు నుంచి ప్రారంభం

ఈనాడు, హైదరాబాద్ : ప్రస్తుత యాసంగిలో ధాన్యం దిగుబడి తగ్గుతుందని తెలంగాణ ప్రభుత్వం అంచనా వేస్తోంది. 30 లక్షల మెట్రిక్ టన్నుల నుంచి 36 లక్షల మెట్రిక్ టన్నుల వరకు దిగుబడి వస్తుందని భావిస్తోంది. యాసంగిలో 6.15 లక్షల హెక్టార్లల్లో వరి సాగు కావాల్సి ఉండగా 7.41 లక్షల హెక్టార్లల్లో సాగు చేసినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. విస్తీర్ణం పెరిగినప్పటికీ దిగుబడి మాత్రం తగ్గే అవకాశాలు ఉన్నాయి. నాగార్జునసాగర్ ప్రాజెక్టు పరిధిలోనే నీరు ఉండటం, మిగిలిన ప్రాంతాల్లో నీటి నిల్వలు తగ్గటంతో ధాన్యం దిగుబడిపై ప్రభావం చూపినట్లు అంచనా. వచ్చే దిగుబడిలో కనీసం 30 లక్షల మెట్రిక్ టన్నుల వరకు కొనుగోలు చేసేందుకు పౌరసరఫరాల శాఖ ప్రణాళిక రూపొందిస్తోంది.

ఏప్రిల్ రెండో తేదీ నుంచి... ధాన్యం కొనుగోళ్లను వచ్చే నెల రెండో తేదీ నుంచి దశల వారీగా ప్రారంభించాలని పౌరసరఫరాల శాఖ నిర్ణయించింది. నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో ముందుగా పంట రానున్న దృష్ట్యా ఆయా జిల్లాల్లో కొనుగోలు కేంద్రాలను తెరవనుంది. ఆ తర్వాత మిగిలిన జిల్లాల్లో ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. గడిచిన ఏడాది 3,300 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రస్తుత యాసంగిలో కూడా అదే సంఖ్యలో కొనసాగించాలని నిర్ణయించారు. జిల్లాల నుంచి సేకరించిన సమాచారం ప్రకారం 36.40 లక్షల మెట్రిక్ టన్నుల వరకు దిగుబడి వస్తుందన్న అంచనాకు అధికారులు వచ్చారు. గత యాసంగిలో 37 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని పౌరసరఫరాల శాఖ కొనుగోలు చేసింది. వ్యాపారులు పది లక్షల మెట్రిక్ టన్నుల వరకు ధాన్యం కొనుగోలు చేసినట్లు అంచనా. పౌరసరఫరాల శాఖ కమిషనర్ సీవీ ఆనంద్ మాట్లాడుతూ.. యాసంగిలో ధాన్యం కొనుగోళ్లు చేపట్టేందుకు అన్ని ఏర్పాట్లూ చేస్తున్నట్లు చెప్పారు. మార్కెట్టుకు ఎంత మొత్తంలో ధాన్యం వచ్చినా కొనుగోలు చేస్తామన్నారు. రైతులకు ఆన్‌లైన్‌లో చెల్లింపులు చేస్తామని తెలిపారు.



ఈనాడు

సైద్ధాంతిక పునాది పై ప్రత్యామ్నాయం

ఈశాన్యంలో కమలనాథుల విజయశంఖారావం చెవిన పడిన రోజునే దక్షిణాన 'కోటి రతనాల వీణ' జాతీయ ప్రత్యామ్నాయ స్వరాన్ని శ్రుతి చేసింది. కొత్తగా గెలుచుకొన్న మూడింటితో కలిపి భాజపా, దాని భాగస్వామ్య పాలిత రాష్ట్రాల సంఖ్య 22కు చేరడం, తరుగుట తరుగుట కొరకన్నట్లుగా కాంగ్రెస్ కొడిగట్టిపోతున్న నేపథ్యంలో- మార్పునకు నాయకత్వం వహించడానికి సిద్ధమేనంటూ ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన విస్పష్ట ప్రకటన సంచలనం సృష్టిస్తోంది. 'భాజపా, కాంగ్రెస్... ఎవరు అధికారంలోకి వచ్చినా పరిస్థితి మాత్రం ఒకేలా ఉంటోంది' అంటూ వాటికి ప్రత్యామ్నాయంగా బలమైన కూటమికోసం తాను పని చేస్తానని కేసీఆర్ అంటున్నారు. ప్రత్యేక రాష్ట్ర సాధనకోసం పద్నాలుగేళ్ల అవిరళ పోరాటంలో రాజకీయ చాణక్యాన్ని రంగరించి దశాబ్దాల కల సాకారం చేసిన కేసీఆర్- ఉద్యమ స్ఫూర్తి పాలన దక్షత కలనేతగా వాసికెక్కడం తెలిసిందే. దేశానికి నిజమైన సమాఖ్య వ్యవస్థ రావాలి... కేంద్రం చెంత పరిమిత అధికారాలు ఉంటేనే దేశం బాగుపడుతుందంటూ కాంగ్రెస్, భాజపాయేతర దీటైన ప్రత్యామ్నాయాన్ని కేసీఆర్ ప్రస్తావించడం- భాజపా ముష్టి ఘాతాలకు మూర్ఛిల్లిన విపక్ష శిబిరంలో కొత్త ఉత్సాహాన్ని నింపేదే! డెబ్భయ్యేళ్ల స్వతంత్ర భారతంలో జనతా సహా నేషనల్, యునైటెడ్ ఫ్రంటుల ఆరేళ్ల ఏలుబడి పోను తక్కిన 64ఏళ్ల పాలనలో ఏం సాధించామన్న ప్రశ్నకు కాంగ్రెస్, భాజపాలే జవాబుదారీ అంటున్న కేసీఆర్- వచ్చే ఏడాది సార్వత్రిక సమరానికి ముందస్తు కదన కాహళి మోగిస్తున్నారు. స్వయంకృతాపరాధాలతో కాంగ్రెస్ నేడు ప్రధానంగా కర్ణాటక, పంజాబులకే పరిమితమైపోయిన తరుణంలో- పటిష్ఠ సైద్ధాంతిక బంధంతో కేసీఆర్ కొత్త కూటమిని రూపొందించగలిగితే రేపు భాజపాకు అదే కీలక ప్రత్యర్థిగా మారినా ఆశ్చర్యం లేదు! 'టెంటు' వేసి తీసినంత సేపుగా గతకాలపు 'ఫ్రంటు'ల తీరుతెన్నూ- భావికూటమి నిర్మాణానికి విలువైన గుణపాఠాలు. అవసరమైతే చంద్రబాబునూ కలుపుకొని పోతామంటున్న కేసీఆర్కు- దేశ దీర్ఘకాల రుగ్మతలకు దీటైన పరిష్కారాలతో జాతీయ అజెండా రూపొందించి, రాజకీయ లుకలుకలకు తావులేని కూటమి నిర్మాణమే అసలైన సవాలు!

స్వాతంత్ర్యం వచ్చాక ఇరవై ఏళ్లకు తొమ్మిది రాష్ట్రాల్లో సంయుక్త విధాయక్దళ్ ప్రభుత్వాల ఏర్పాటుతో కాంగ్రెస్ సర్వంసహాధిపత్యానికి తొలి ఎదురుదెబ్బ తగలగా, దరిమిలా పదేళ్లకు కేంద్రంలో మొట్టమొదటి కాంగ్రెసేతర ప్రభుత్వం కొలువుదీరింది. జనతా ప్రయోగ వైఫల్యం దరిమిలా, అధికారంకోసం రాజకీయాలను ఆదర్శాలకోసం రాజకీయాలుగా, అవకాశవాద రాజకీయాలను సైద్ధాంతిక కట్టుబాటు రాజకీయాలుగా మారుస్తామంటూ పుట్టుకొచ్చిన భాజపా- భారత రాజకీయాల్లో కాంగ్రెస్ కోల్పోతున్న స్థానాన్ని భర్తీ చెయ్యడమే లక్ష్యమని ఘనంగా చాటుకొంది. 1989నుంచి మొదలైన సంకీర్ణ రాజకీయాల శకంలో పాతికేళ్లపాటు భాజపా, కాంగ్రెస్లకు ప్రాంతీయ పక్షాలే ప్రాణవాయువులయ్యాయి. ఆ కాలంలోనే పురుడు పోసుకొన్న నేషనల్ ఫ్రంట్, యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వాలు అవకాశవాదం అధికార దాహాలకు పుట్టిన బిడ్డలుగా జాతి ప్రయోజనాలకెంతో చెరుపు చేసి స్వల్ప కాలంలోనే గతించాయి. 2014లో మోదీ నేతృత్వంలో భాజపా సొంతంగా 282 స్థానాలు సాధించి, మూడు దశాబ్దాల తరవాత ఏకపార్టీ మెజారిటీ నమోదు చేసినా, నేడు కేంద్రంలో ఉన్నది ఎన్డీఏ సంకీర్ణమే. ఆ మాటకొస్తే- భాజపా, కాంగ్రెస్లతో పోటీపడుతూ ప్రాంతీయ పార్టీలు, స్వతంత్రులు సాధిస్తున్న ఓట్లశాతం 50శాతానికి అటు ఇటుగా ఉంటుండటం గమనార్హ విశేషమే! 2009 సార్వత్రిక ఎన్నికల్లో భాజపా కాంగ్రెస్ల ఉమ్మడి ఓట్లు 47.4శాతం, అదే ప్రాంతీయ పార్టీలు, స్వతంత్రులవి 52.6శాతం; 2014లో వరసగా 50.8శాతం, 49.2శాతం! 2014లో గుజరాత్, 'హిందీ బెల్ట్' రాష్ట్రాల్లో దిగ్విజయ దుందుభి మోగించి 31.3శాతం ఓట్లతో 282 సీట్లు సాధించిన మోదీ ప్రభ 2019నాటికి మసకబారుతుందన్న అంచనాతో, ప్రాంతీయ శక్తుల పునరేకీకరణ ద్వారా జాతీయ స్థాయిలో నెగ్గుకు రాగలమన్న కేసీఆర్ ఆకాంక్షకు ఇలాంటి రాజకీయ గణాంకాలే ఆధారం!

పచ్చగా ఉన్నచోట తిని వెచ్చగా ఉన్న చోట పడుకొనే శీలహీన రాజకీయ సంస్కృతి- ఇంతకాలం తృతీయ కూటముల్ని సూత్రరహిత గాలిపటాలుగా మార్చేసింది. వాజ్పేయీ సారథ్యంలోని కూటమిలో భాగస్వామిగా ఉన్న డీఎంకే ఆ వెంటనే కాంగ్రెస్ నేతృత్వంలోని సర్కారులోనూ చేరడం వంటివి కప్పల తక్కెడ రాజకీయాలకు రుజువులా ప్రజావిశ్వాసాన్ని ఖర్చు రాసేశాయి. భాజపా, కాంగ్రెస్లకు వ్యతిరేకత ఒక్కటే ఏ కూటమి ఉనికికైనా మనికికైనా ఆధారశిల కాలేదు. ఆ రెండు పార్టీల పాలనా పద్ధతి ఒకటేనని గట్టిగా సూత్రీకరిస్తున్నప్పుడు- తాము ప్రతిపాదించే విధానపర భిన్నత్వం ఏమిటో స్పష్టీకరించక తప్పదు. విద్య వైద్యం వ్యవసాయం- ఈ మూడూ జాతి ప్రగతికి జీవగర్రలు. రెండు దశాబ్దాల్లో మూడు లక్షలమందికిపైగా అన్నదాతలు బలవన్మరణాల బలిపీఠం ఎక్కిన ఘోరం, ప్రమాణాలపరంగా అధ్వాన చదువులు జాతి ప్రగతినే దిగలాగుతున్న నేరం, ప్రాథమిక వైద్యానికీ నోచక కోట్లాది జనం రుజాగ్రస్తమవుతున్న దైన్యం- వీటికి పరిష్కారం ఏమిటి? జాతి మూలగనే నలుచుకు తింటున్న అవినీతికి కొత్త కూటమి ఎలాంటి గరళ వైద్యం ప్రతిపాదిస్తుంది? వస్తుసేవల పన్ను నిర్ధారణలో ప్రతిఫలిస్తున్న సమాఖ్య స్ఫూర్తిని, అధికారాల సమగ్ర పునర్విభజన ద్వారా కేసీఆర్ కూటమి ఎలా వికేంద్రీకరిస్తుంది? వీటికి సమాధానాలిచ్చేలా పాలన పద్ధతుల్లో గుణాత్మక మార్పునకు చోటుపెట్టే అజెండాయే కొత్త కూటమి విశ్వసనీయతకు గీటురాయి. సైద్ధాంతిక సయోధ్యగల పక్షాల వేదికగా దాన్ని తీర్చిదిద్దినప్పుడే అది పటిష్ఠ కూటమిగా నిలుస్తుంది; జనాదరణ చూరగొంటే గెలుస్తుంది!



రెట్టింపు ఆదాయానికి సర్కారు గొడుగు

రైతన్నకు కావాలి కొండంత అండ

స్వతంత్ర భారతావనిలో వ్యవసాయపరంగా ఎన్ని పథకాలు అమలు చేస్తున్నా, కోట్ల రూపాయలు ఖర్చవుతున్నా రైతుకు ఆర్థిక ప్రయోజనం దక్కడం లేదు. ప్రగతి చోదకశక్తిగా వ్యవసాయరంగం నిలదొక్కుకుంది. సగటు రైతు పరిస్థితి 'శస్త్రచికిత్స విజయవంతమైనా, రోగి మరణించాడు' చందంగా ఉంది. ఉత్పత్తి లక్ష్యాల ఆలోచనలే తప్ప ఉత్పత్తిదారు కష్టాలు పట్టని నేపథ్యంలో, రైతుల ఆత్మహత్యలు కొనసాగుతున్నాయి. సమస్యకు పరిష్కారంగా, 2022 నాటికి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయాలన్న లక్ష్యంతో కేంద్రప్రభుత్వం సాగుతోంది. ఆధునిక సేద్యం దిశగా అడుగులు పడుతున్న ఈ తరుణంలో, స్పష్టమైన కార్యాచరణతో ముందడుగు వేయాల్సిన అవసరముంది. రైతు ఆదాయం రెట్టింపు అయ్యేలా కృషి చేస్తామని కేంద్రం పేర్కొంది. నిపుణులతో సదస్సును ఏర్పాటు చేసింది. సాగు ఖర్చుల్ని తగ్గించడం, ఉత్పత్తికి సముచిత ధర కల్పించడం ప్రాథమ్య అంశాలుగా ప్రకటించింది. వృథాను నివారించడం, ఆదాయానికి ప్రత్యామ్నాయ వనరుల్ని సృష్టించడంపై దృష్టి పెట్టడం ద్వారా లక్ష్యం సాధించగలమంది. 'సగటు ఉత్పాదకత పెంపు' అంశానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇవ్వకపోవడమే ఆశ్చర్యకరం.

యాజమాన్య పద్ధతులపై దృష్టి

సగటు రైతులకు ఎదురవుతున్న సమస్యలు అనేకం. వారి ఆదాయం పెరగాలంటే, ప్రస్తుత ఖర్చును తగ్గించాలి. అందుకు అనువుగా వారికి ప్రభుత్వమే దిశానిర్దేశం చేయాలి. సాగుదార్ల భవితతో ముడివడిన ఇతర అంశాలపైనా దృష్టిపెట్టాలి. రైతుకు ఆదాయం కావాలంటే మంచి దిగుబడి రావాలి. మార్కెట్లో లాభసాటి ధర దక్కాలి. ఈ రెండూ సాధ్యపడని పరిస్థితుల్లోనే, అన్నదాతలు నష్టాలపాలవుతున్నారు. అత్తెసరు ఆదాయాలతో అప్పుల్లో మునుగుతున్నారు. వారి ఆదాయం పెంపొందించి, ఇప్పటి స్థితి కంటే రెట్టింపు చేయగలిగితేనే సేద్యంలో నిలదొక్కుకుంటారు. మంచి దిగుబడులు సాధించాలంటే, వంగడం నాణ్యంగా ఉండాలి. దాన్ని అదనులో సాగు చేయగలగాలి. చక్కటి యాజమాన్య పద్ధతుల్ని పాటించాలి. భూ భౌతిక పరిస్థితుల్నిబట్టి- నేలకు ఏం కావాలో, ఎంత అవసరమో అంతే ఎరువును, పురుగుమందుల్ని వాడాలి. వీటికితోడు వాతావరణ పరిస్థితులు సహకరించాలి. పంట కీలక దశల్లో అకాల వర్షాలు రాకుండా ఉండాలి. తీరా పంట కోసి నూర్చే సమయంలో ఉపద్రవాలు తలెత్తకూడదు. పరిస్థితులన్నీ అనుకూలిస్తేనే, మంచి దిగుబడులు సాధ్యపడతాయి.

నాణ్యమైన వంగడాలు వాడకుంటే, పంట దిగుబడి 20 శాతం నుంచి 40 శాతం వరకు పడిపోతుందని ఒక అంచనా. విత్తును బట్టి పంట కాబట్టి, వాడే విత్తనం నాణ్యత కలిగి ఉంటేనే దిగుబడులు బాగుంటాయి. విత్తన సరఫరా వ్యవస్థ లోపాలతో నిండి ఉండటం వల్ల, పంటకాలం ముంగిట రైతుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ముందస్తు ప్రణాళిక లేకుండా, అవసరాల్ని అంచనా వేయకుండా హడావుడిగా నాట్లకు ముందు విత్తనాలు సేకరిస్తున్నారు. వాటినే రైతులకు ఇస్తున్నారు. విత్తనాలకు టెండర్ల సమయంలో రాజకీయ నాయకుల అనుచరులే నాసిరకాల్ని సరఫరా చేస్తున్నారు. ఇవన్నీ పంట దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. అధిక దిగుబడినిచ్చే వంగడాలు పరిశోధనా సంస్థల నుంచి ఏళ్ల తరబడి వెలుగు చూడటం లేదు. స్థానిక పరిస్థితులకు తగిన విధంగా పరిశోధనలు సాగకపోవడమూ వైఫల్యమే! పత్తిలో సూటి రకాలు లేదా ఒక్క హైబ్రిడ్ వంగడాన్ని కూడా దేశంలో ప్రభుత్వరంగ పరిశోధనాసంస్థలు రూపొందించలేకపోయాయి. ప్రైవేట్ బీటీ తప్ప మరో దిక్కులేకపోయింది. కంది తప్ప మిరప, పసుపు వంటి పంటల్లో పరిశోధనలు పడకేశాయి. మొక్కజొన్నలో హైబ్రిడ్లు రూపొందించినప్పటికీ, విత్తనోత్పత్తి సాగడం లేదు. మొత్తంగా ప్రభుత్వరంగంలో పరిశోధనలపై ఆడిటింగ్ లేక నిధులు దుర్వినియోగమవుతున్నాయి. రైతుస్థాయిలో విత్తనోత్పత్తిని ప్రోత్సహించే దిశగానూ చర్యలు లేవు. ఇక్కడా ప్రైవేట్ కంపెనీలదే హవా. ఇంత జరుగుతుంటే ప్రభుత్వరంగంలో పరిశోధన సంస్థలు ఏం చేస్తున్నట్లు? గడచిన 20 ఏళ్లుగా దేశంలో పప్పుధాన్యాల హెక్టారు సగటు దిగుబడి హీనపక్షంగా ఉండటానికి... స్థానిక పరిస్థితులకు అనువైన పరిశోధనలు జరగకపోవడమే కారణం. చీడపీడల్ని తట్టుకునేలా, రెట్టింపు దిగుబడులు ఇచ్చేలా విత్తనాల్ని రూపొందించగలిగితేనే రైతుల నుంచి ఆదరణ లభిస్తుంది. నిద్రాణమై ఉన్న పరిశోధనావ్యవస్థను తట్టి లేపి, ప్రైవేటుకు దీటుగా అధిక దిగుబడినిచ్చే కొత్త వంగడాల్ని రూపొందించాల్సి ఉంది.

ఏటా వేసవిలో భూసార పరీక్షలు నిర్వహిస్తున్నా, వాటి ఫలితాల ఆధారంగా రైతులు ఎరువులు వాడటం అతి తక్కువ. ఎరువుల డీలర్లు ఏం చెబితే అది చల్లే పరిస్థితితో పాటు, డీలర్లు ఇచ్చే కమీషన్లకు కక్కుర్తిపడి కొందరు వ్యవసాయ అధికారులు సైతం ఇష్టానుసారం పురుగుమందుల్ని, జీవ ఎరువుల్ని సిఫార్సు చేస్తున్నారు. వీటికితోడు రైతులు పంట సాగుకోసం ఈ డీలర్ల దగ్గరే అప్పు చేయాల్సిరావడం వల్ల, వారు చెప్పిన మందుల్ని వారి దగ్గరే కొనాల్సి వస్తోంది. అవసరం ఉన్నా లేకున్నా మందులు చల్లించడం వల్ల, రైతు జేబులు ఖాళీ అవుతున్నాయి. ఉత్పత్తిని పెంచాలనే అంశం విస్తరణ సేవలతో ముడివడి ఉంది. పంట కాలంలో క్షేత్రస్థాయి పర్యవేక్షణ లోపించడం, దీటైన విస్తరణ సేవలు అందకపోవడం వల్ల- సాగు యాజమాన్య నిర్వహణ రైతు చేతిలో లేకుండా పోతోంది. ఇవన్నీ అన్నదాతకు పెట్టుబడుల్ని పెంచేస్తున్నాయి.

సమగ్ర ప్రక్షాళనతోనే సేద్యం సాధ్యం

సంస్థాగత పంట రుణాలు నేటికీ రైతులందరికీ అందటం లేదు. ఏటా మొత్తం బ్యాంకులిచ్చే రుణాల్లో 12 శాతం దాటడం లేదు. ఇది కనీసం 18 శాతం ఉండాలన్న రిజర్వు బ్యాంకు నిబంధనల్ని ఏ బ్యాంకూ పాటించడం లేదు. దేశంలో భారీమొత్తాల్లో రుణాలు తీసుకుని కొందరు ఎగ్గొడుతున్నా పట్టని బ్యాంకులు- నిజాయతీగా రుణం చెల్లిస్తున్నా అప్పులివ్వకుండా రైతుల్ని సతాయిస్తున్నాయి. పుస్తక సర్దుబాట్లతో రైతులకు రుణాలిస్తున్నట్లు చెబుతూ తప్పుడు లెక్కలు చూపుతున్నాయి. సంస్థాగత రుణాలు అందుకుంటున్న రైతులు దేశంలో 29 శాతమైనా లేరని ప్రభుత్వ గణాంకాలే చెబుతున్నాయి. ఈ పరిణామాల వల్ల, అధిక వడ్డీలతో రైతులకు సేద్యంలో ఖర్చులు పెరుగుతున్నాయి. వీటిని కనీస స్థాయికి తగ్గించగలిగితే కొంతమేర ఆదాయం పెరుగుతుంది. సకాలంలో వర్షాలు కురవకపోవడం, నాట్లు వేసినా వానలు లేక మళ్లీ విత్తుకోవాల్సి రావడం, నెలల తరబడి వానల్లేక వేసిన పంటలు ఎండిపోవడం వంటి సమస్యలున్నాయి. కోతల సమయాల్లో వర్షాలు విరుచుకుపడటం, కూలీలకు రెట్టింపు చెల్లించాల్సి రావడం వంటి సమస్యలూ రైతుకు ఎకరా ఖర్చుల్ని విపరీతంగా పెంచేస్తున్నాయి. పంట నూర్పిడి, రవాణా, గోనెసంచుల కొరత, మార్కెట్లో సమస్యలు... ఇలా ఎన్నెన్నో. పరిస్థితిలో మార్పు తెచ్చేందుకు కేంద్రప్రభుత్వం చేస్తున్న కృషి అభినందనీయమే. కార్యాచరణను సమర్థంగా అమలుచేయడానికి పెద్ద కసరత్తే సాగించాలి.

ఉత్పత్తి పెరగాలంటే, విత్తు నుంచి మార్కెట్ దాకా అన్ని దశల్లోనూ లోపాల్ని సరిదిద్దాలి. అతి తక్కువ విస్తీర్ణంలో పంటలు పండిస్తూ, మనకంటే అత్యధిక దిగుబడుల్ని అందుకుంటున్న దేశాల నుంచి పాఠాలు నేర్చుకోవాలి. పంటతో పాటు పాడినీ విశేషంగా ప్రోత్సహించాలి. వ్యవసాయం, అనుబంధ రంగాల్లో రాజకీయ జోక్యాన్ని నివారించాలి. పండించేవారికి చేయూతనివ్వడం ఎంత ముఖ్యమో, సాగు ప్రతిదశలోనూ వారికి అవగాహన పెంచేలా విస్తరణ సేవలు అందించడమూ అంతే ప్రధానం. సాగు ఖర్చుల్ని తగ్గించుకోవడం, పంటల యాజమాన్యాన్ని సమర్థంగా చేపట్టడానికి ఈ సేవలు ఉపకరిస్తాయి. నేలల స్థితిగతుల్ని గుర్తించి పోషకాలు అందించే స్థితికి రైతులు చేరుకోవడం ఎంతో అవసరం. ఉత్పత్తిని పెంచుకోవాలంటే, నాణ్యమైన ఉత్పాదకాలతో పాటు సమర్థ పోషక యాజమాన్యానిదీ కీలక పాత్ర అని గుర్తించాలి. పంటలు చేతికందగానే, యంత్రాంగం కొనుగోళ్లను సకాలంలో చేపట్టకపోవడం వల్ల రైతులు నానా అగచాట్లు పడుతున్నారు. ఏ పంటను ఎంత విస్తీర్ణంలో పండించాలి, విపణిలో ఏయే పంటలకు గిరాకీ ఉంది, మంచి ధరలు వేటికి అందుతాయనే సూచనలు ఇవ్వాలి. అప్పుడే సేద్యం పట్ల రైతుల్లో భరోసా పెరుగుతుంది. ఉత్పాదకత పెంపు, లాభసాటి ధరలు, ఆహారశుద్ధిపై ప్రభుత్వం శ్రద్ధ పెడితే- అన్నదాతల ఆదాయం రెట్టింపు అవుతుంది.


- అమిర్నేని హరికృష్ణ

వివిధ దేశాల్లో పంటల ఉత్పాదకత (హెక్టారుకు టన్నులు) 2015-16

పంట	ప్రపంచ సగటు	అమెరికా	చైనా	భారత్	బ్రెజిల్	ఈజిప్టు
వరి	4.42	8.38	6.89	3.60	5.28	8.92
గోధుమ	3.29	2.93	5.39	2.75	2.26	6.43
ముతక ధాన్యాలు	3.90	9.71	5.76	1.58	4.06	7.05
మొక్కజొన్న	5.38	10.57	5.89	2.56	4.19	8.00
నూనెగింజలు	–	3.02	2.39	0.82	2.87	–
వేరుసెనగ	1.63	4.31	3.56	0.98	3.38	3.20
పత్తి (హెక్టారుకు కిలోలు)	683	859	1570	458	1345	697

ఆధారం: యూఎన్డీపీ నివేదిక

పరిశోధనే ప్రధానం



కొన్ని అభివృద్ధి చెందుతున్న దేశాలతో పోల్చినప్పుడు భారత్లో పంటల సగటు ఉత్పాదకత అత్యల్పంగా ఉండటాన్ని గమనించవచ్చు. ముఖ్యంగా ఈజిప్టులో పంటల ఉత్పాదకత మనకంటే రెండు మూడు రెట్లు అధికంగా ఉండటాన్ని చూస్తే- హెక్టారు సగటు ఉత్పాదకత పెంచుకోవడానికి పరిశోధనలు ముమ్మరం కావాల్సిన అవసరం ఉందని స్పష్టమవుతోంది. దిగుబడిలో ప్రపంచ సగటు కంటే కూడా చాలా వెనకబడి ఉన్నాం. దాదాపు అన్ని పంటల్లో ఇదే పరిస్థితి ఉండటాన్ని చూస్తే, ఉత్పాదకత పెంపు దిశగా మన కృషి ఆశించినంతగా లేదని స్పష్టమవుతోంది. పప్పు ధాన్యాలు, నూనెగింజల పంటలు పండించేందుకు అన్ని వనరులూ పుష్కలంగా ఉన్నాయి. లోటుపాట్లను సరిదిద్దుకోకుండా రైతు ఆదాయం రెట్టింపు చేయడం ఎలా సాధ్యపడుతుందన్నదే ప్రశ్న.

దోచే వారెవరురా...

'నీరవ్ మోదీ అన్ని వేల కోట్లు కొట్టేశాడు, ఇన్ని వేల కోట్లు కొట్టేశాడు' అని ఏమిటా మాటలు, ఎవరివా మాటలు? పైగా విచారణ కోసం అతణ్ని విదేశాల నుంచి రప్పించాలా...హవ్వ! ఎలా కుదురుతుందసలు. శ్రీకృష్ణుడి వెన్న దొంగతనం కేసే యుగాలు మారినా ఇంకా తెమలలేదే- ఈ కేసుకు ఎందుకింత తొందర?

విదేశాల్లో 'వ్యాపారాల్లో' తెగ తలమునకలై ఉన్నాను, ఎలా రాగలను- అని నీరవ్ అంటే జాలి చూపించరేం, అనుమానిస్తారేం, మోసం చేయడం అంత ఆషామాషీ వ్యవహారమా, అందుకు ఎన్ని తెలివితేటలుండాలి, ఆ 'సృజనాత్మకత'ను గుర్తించరేం?

అన్ని వ్యాపారాలూ కళ్లకు కనిపించాలన్న రూలు లేదు. ఆధ్యాత్మిక తత్వం 'సంత'రించుకుంటేగానీ, ఈ వ్యాపారాల్ని గుర్తించలేరు. ఎలా సంపాదించారనేది ఎవరికి కావాలి? ఎంత సంపాదించారన్నది ముఖ్యం. ఏ జైలును పావనం చేశాడన్నది ముఖ్యం కాదు, ఎంత తొందరగా బెయిలు దొరికిందన్నదే ముఖ్యం. అయినా జైలుకు తీసుకువెళ్లడం, బెయిల్ ఇవ్వడం వంటి శ్రమ దేశానికి ఇవ్వకుండా ఎంత 'ఉదార హృదయం'తో నీరవ్ సేవ చేస్తున్నాడు! ఏవో నోట్ల కట్టలు మింగేసిన కట్టల పాముగా అతణ్ని దుయ్యబడతారేం, వజ్రాల వ్యాపారి అయిన నీరవుడి 'వజ్ర' సంకల్పాన్ని కించపరుస్తారేం?

'మనుషుల ముంచితే
ఏమి ఉందిరా
బ్యాంకుల ముంచితే
ఫలితముందిరా'

అనుకుంటూ నీరవ్ లాంటి వాళ్లు జాతీయ బ్యాంకుల్ని సైతం సొంతానికి 'జాతీయం' చేశారు. ఏ మూటకు ఆ మూట చెప్పాలంటే, బ్యాంకు దొంగలు బందిపోటు దొంగలకు 'మంచిపేరు' తెస్తున్నారు. ఎన్ని ఇళ్లలో ఎంత దోచుకుంటే మాత్రం ఏం లాభం, ఏం 'పట్టు'బాటు అవుతుంది? టోకున జరిగితే సమయం కూడా కలిసివస్తుంది. 'నోట్'లో వేలు పెడితే కొరకలేరు అనిపించుకునేవారు అమాయకులు! 'నోట్'లో వేలు, లక్షలు, కోట్లు పెట్టుకున్నా కొరకగలరనే 'నోటుగాళ్లు' తయారయ్యారు. అయినా ఒళ్లు వంచి పనిచేసి పైసాపైసా కూడబెడితే ఏం సంతృప్తి ఉంటుంది, కోట్లు కొట్టేయకపోతే అదేం 'వ్యాపారం'! ఊరిని దోచుకుంటే ఊరా, పేరా? ఎంతోమంది డబ్బు దాచుకున్న బ్యాంకులను దోచుకుంటేనే మజా. జాయ్ రాజా జాయ్. బ్రోచేవారెవరురా అంటే- దోచేవారే!

'గల్లా' తెరిచి గమనిస్తే 'ధన సంస్కృతి' కొత్త'గుంతలు' తొక్కుతోంది. దొంగ ఎక్కడున్నాడో తెలుసు. అయితేనేం అతణ్ని పట్టుకురావడం అంత తేలిక కాదు. వసుధైక కుటుంబం... కాదు వసుధైక దేశం అనే దృక్పథం వచ్చి ప్రపంచంలో ఎక్కడ దోపిడీ చేసినా, ఎక్కడైనా పట్టుకోవచ్చు అంటే ఎన్ని చిక్కులు!

కుంభకోణాల్లో అందరి తెలివితేటలు వేరు. ధనాపారి నీరవ్ తీరు వేరు. పంజాబ్ నేషనల్ బ్యాంకు నుంచి 11 వేలకోట్లు ఆంఫట్ అనిపించి దేశం నుంచి చల్లగా జారుకున్నాడు. 'స్కామ'కీర్తన పాడి పట్టుబడితే బ్రహ్మ రామకీర్తన పాడుతుందని తెలిసి నీరవ్ సరిహద్దులు దాటాడు. 'ఎంత ముందు చూపు'. 'ఖండాంతరాలు దాటిన మేధస్సు' ఇది. తాను ఒక్కడే కాదు సకుటుంబ సపరివార స'మేత'ంగా స్విట్జర్లాండ్కి ఉడాయించేశాడు. తాను ఒంటరివాణ్ని కాదని నిరూపించుకున్నాడు. నీరవ్ కుటుంబ వ్యవస్థకు చేసిన బీమాగా దీన్ని గుర్తించాలి. బ్యాంకు దోపిడీ ఆలోచన ఉన్నతస్థాయి వ్యక్తుల ప్రమేయం లేకుండా జరగదని రాహుల్గాంధీ రాగాలు తీస్తు



న్నారు. ఎలా.. ఎలా.. అంటే 'మా బోఫోర్స్ కుంభకోణం లాంటివి ఉన్నతస్థాయి వ్యక్తుల ప్రమేయంతోనే జరిగాయి కదా' అని సోదాహరణంగా చెప్పి నాలుక కరుచుకున్నా ఆశ్చర్యం లేదు.

తాజా పరిస్థితుల్ని బట్టి ఇప్పుడు బందిపోటు దొంగలకు ఏకరూప దుస్తులు (యూనిఫాం) మారిపోయాయి. గళ్లచొక్కా అవసరం లేదు. లుంగీ అంత కన్నా అవసరం లేదు. సూటూబూటూ వేసుకొని రావచ్చు. తుపాకులో, కత్తులో పట్టుకోవలసిన అవసరం లేదు. హాయిగా కలంతో 'కలకలం సృష్టించవచ్చు'. అర్ధరాత్రి పూటనో, తెల్లవారుజామునో నక్కినక్కి చౌర్య క్షేత్రానికి భయపడుతూ రానవసరం లేదు. పట్టపగలు దర్జాగా 'మని' చేసుకుపోవచ్చు.

'ఎవడు వాడు ఎచటివాడు ఇటువచ్చిన దొంగవాడు' అని ఎవ్వరూ అంత తేలిగ్గా గుర్తుపట్టలేరు. దొరికేంతవరకూ దొరగా ఉండవచ్చు. దొరికినా పెద్ద సమస్యే లేదు. మన దేశంలో ఉంటేనే గదా సమస్య? ఎన్ని చెక్కులు కొట్టేసినా ఎంచక్కా, ఏ దేశానికైనా చెక్కేయవచ్చు. 'ఇంటిదొంగలు తోడు ఉండగా, వెరపు అన్నది దండగ' అని గుండెమీద చేయివేసుకోవచ్చు. బతిమలాడంగ, బతిమలాడంగ అత్తగారింటికి రావడానికి కొత్త అల్లుడయినా దయతలుస్తాడుగానీ విదేశాల్లో తిష్ఠ వేసిన చోరశిఖామణులు మాత్రం మనదేశం వైపు కన్నెత్తి చూడడానికి ఇష్టపడరు. ఫోనెత్తి పలకరించరు. కేసులు, జైళ్ల'ఊచలు' గుసగుసలాడుతున్న వేళ నీరవ్ మనదేశానికి రావడానికి ససేమిరా ఇష్టపడటం లేదు. ఇందులో కొత్త స్ఫూర్తి ఉంది.

ఒకప్పుడు స్వాతంత్ర్య సమరంలో మనదేశాన్ని దోచుకున్న తెల్లదొరలను క్విట్ఇండియా అంటూ తరిమేశాం. స్వతంత్రం వచ్చాక మరి ఇప్పుడో... 'గాలం' మారిపోయింది. దేశ సంపదను పీల్చి పిప్పిచేసిన 'నల్ల మోసాములు' మనదేశాన్ని వదిలేసి విదేశాలకు వెళ్లి స్థిరపడిపోతున్నారు. స్వచ్ఛందంగా క్విట్ ఇండియా అనుకుంటున్నారు. వెనకటికో 'చిన్నమనిషి' తల్లిదండ్రులను చంపి, కోర్టుకు వెళ్లి 'తల్లిదండ్రీ లేని అనాథను బాబోయ్, నన్ను రక్షించండి" అని దీనంగా వేడుకొన్నాట్ట. అతడి అడుగుజాడన నడుస్తున్నాడు నీరవ్. అనవసరంగా నా మీద ఎందుకు కేసు పెట్టారు, ఇప్పుడు నా చేతిలో డబ్బేమీ లేకుండాపోయింది. ఎలా తీర్చేది- అని నీరవ్ నంగనాచి తుంగబుర్రలాగా బీదఅరుపులు అరుస్తుంటే 'ఔను నిజం... ఔను నిజం... నీవన్నది నిజం నిజం' అనే తోడుదొంగలు ఎక్కడబడితే అక్కడ కనిపిస్తున్నారు, వినిపిస్తున్నారు. 'ఇల్లు కట్టి చూడు, పెళ్లి చేసి చూడు' అన్నవాటికి తోడు- బ్యాంకును కొల్లగొట్టి చూడు అన్నది తాజాగా చేరింది. ధనానుభావుల కష్టాలు ధనానుభావులవి. వాళ్ల పనులు వాళ్లకు ఉంటాయి. బేడీలు చూపించి విదేశాల్లో ఉన్న కేడీలను రమ్మంటే ఎలా వస్తారు? ఆశ..దోశ అప్పడం! ఆత్మరక్షణకు- విదేశమును ప్రేమించుమన్నా అంటుంటారు. ఇక్కడికి రమ్మంటే తిర'కాసు' పెడతారు.

సొంత దేశానికి తిరిగి రమ్మనడానికి ఎంత ధైర్యం; వస్తే మళ్లీ ఏం దోచుకుంటారోనన్న భయం ఉండొద్దా? పైగా ఎప్పుడంటే అప్పుడు తిరిగి రమ్మంటే ఎలా? అయినా 'మాటవరస'కు విదేశాల్లో వ్యాపారాలు ఉంటే ఉన్నాయని నీరవ్ అన్నాడనుకొన్నా- ఆ వ్యాపారములు ఎట్టివి, అక్కడ కూడా ఎవరిని ముంచారు అనే ప్రశ్నలు రాకపోవు. తిరిగే కాలు అయినా అలా ఉండిపోతుందిగానీ 'కొట్టేసే చెయ్యి' ఎలా ఊరుకుంటుంది? ఆ భస్మాసుర హస్తం తన పని తాను చేసుకొనిపోతుంది. ఇటువంటి 'చేతి'వాటాలు కొత్తగా పుట్టుకొచ్చినవి కాదు. అదో 'హస్త' సాముద్రికం కదా! చెప్పింది విను..చరిత్ర అడక్కు అంటే కుదరదు. 'స్కామ'దాన భేద దండోపాయాల మూలాలు తెలుసుకుంటే ఎవ్వరి'చే' జనించు పద్యాన్ని కొత్త 'అర్థం'లో పాడుకోవచ్చు. నీరవ్ కుంభకోణానికి ఏడేళ్ల చరిత్ర ఉంది. స్కామాతురాణం నభయం నలజ్జ!

- శంకరనారాయణ

ఉపనిషత్తులు

వేదం చివరి భాగంగా ఉండేవి 'ఉపనిషత్తులు'. అందువల్ల వాటికి 'వేదాంతం' అనే పేరు వచ్చిందని చెబుతారు. రుగ్వేదం జ్ఞాన కాండ, యజుర్వేదం కర్మానికి సంబంధించిన కాండ అంటారు. సామవేదాన్ని ఉపాసన కాండగా, అధర్వ వేదాన్ని ఆత్మజ్ఞాన భాండాగారమైన 'బ్రహ్మవేదం'గా పరిగణిస్తారు. అందులో ఎంతో కొంత కర్మ, ధర్మ, ఉపాసన విధానాలు ఉన్నాయి. ముఖ్యంగా ఆత్మజ్ఞానం, మోక్షం, సాధనా మార్గం వంటి ఆధ్యాత్మిక అంశాలకు ఉపనిషత్తులే కేంద్రాలు.

ప్రతి శాస్త్రానికీ ఒక ప్రత్యేకమైన భాష ఉంటుంది. అందులోనివే పారిభాషిక పదాలు. వాటిని యథాతథంగా చెబితే సామాన్యులకు అంత సులభంగా అర్థం కాదు. తపోనిష్ఠతో రుషులు దర్శించిన సత్యాన్ని వారికి వివరంగా తెలియజెప్పాలి. దానికి అనువుగా, పోలికలు (ఉపమానాలు) కలిసేలా చెప్పాల్సి ఉంది.

అపరోక్ష జ్ఞానం అంటే, తపస్సు ద్వారా సమాధి స్థితికి చేరి పొందిన జ్ఞానం. అలాంటి అపరోక్ష జ్ఞానదీపాలే ఉపనిషత్తులు. వాటిని దర్శించి, అనుభూతి చెంది, తమ అనుభవాల్ని విపులీకరించేందుకు రుషులు ప్రయత్నించారు. దానికి పరీక్షలు, పరిశోధనలు, వాద ప్రతివాదాలు, రుజువులు, హేతువులు అవసరం లేదు. వాటికి అవే ప్రామాణికాలు.

అరణ్యవాసులైన వారు సత్యస్వరూపాన్ని తమదైన రీతిలో వర్ణించారు. వ్యక్తి అవగాహనా శక్తిని బట్టి ఉపనిషత్తుల్ని అర్థం చేసుకోవచ్చు. బ్రహ్మను 'సర్వాత్మ' అంటుంది ఉపనిషత్తు. బ్రహ్మ అంటే బృహత్. అంతకు మించినది లేదు అని దాని అర్థం. ఆ పదాన్ని విస్తారంగా పరిశీలిస్తే- అది 'సత్యం, జ్ఞానం, అనంతం'గా స్ఫురిస్తుంది. సామాన్యుల స్థాయికి తగినట్లు, పరమాత్మ సత్యస్వరూపుడు, జ్ఞాన స్వరూపుడు, అనంతుడు- అని నిర్గుణిని గురిగా చేసి ఒక రూపకల్పన చేయాలి. రుషుల దివ్యానుభూతులే శ్రుతులు. రుషి పరంపర వాటిని స్మృతుల రూపంలో సామాన్య ప్రజానీకానికి అందుబాటులో ఉంచింది.

విద్య అంటే ఆధ్యాత్మిక విద్య. అది ఆత్మపరమైనది. ఆత్మవిచారం ఎవరికీ అంత సులభంగా కలగదు. అందుకు తగిన వాతావరణం కావాలి. గురుశిష్యులు ముఖాముఖి ఆత్మసంవాదంలో తేల్చుకోవాల్సిన విశిష్ట జ్ఞానం అది. శిష్యులు నేర్చుకోదగింది. ఆ వాతావరణం నెలకొనేందుకు మూడుసార్లు శాంతి మంత్రాన్ని వర్ణించాలి. ఒక ఆచారంగా అది కనిపించవచ్చు. ముమ్మారు ఓంకార నాదం వల్ల కావాల్సిన వాతావరణం ఏర్పడుతుంది. అప్పుడు సాధన సుగమం అవుతుంది. ఆత్మావలోకనం సుసాధ్యంగా మారుతుంది. ఆత్మస్వరూపాన్ని తెలుసుకొనేందుకు ధ్యానమే రాజమార్గం అంటారు విజ్ఞులు. అదే రాజయోగ మార్గం!



అంతర్యామి

శరీరం లోపల ఉంటూ, చైతన్యవంతం చేయగల శక్తినే 'ఆత్మ'గా భావిస్తారు. బయట విశ్వవ్యాప్తంగా ఉన్న చైతన్యాన్ని 'బ్రహ్మ'గా చెబుతారు. ఆత్మను సామాన్య దృష్టికి అనువదించాలంటే, ఉపమాన అలంకారాన్ని ఆశ్రయించాలి.

కఠోపనిషత్తు ప్రకారం- శరీరం రథం, జీవుడు రథికుడు, ఆత్మ సారథి. జీవన రథ సారథ్యం చేసే ఆత్మ సూక్ష్మమైనది. కొన్ని పదాలకు అర్థాలు వేరుగా ఉంటాయి. ఉదాహరణకు- ఉపాధి అంటే జీవనోపాధి, వృత్తి. వేదాంతుల పరిభాషలో దాని అర్థం- శరీరం. శరీరాన్ని ఆత్మకు ఉపాధిగా భావిస్తుంటారు.

జీవి లోపల ఉంటూ కట్టడి చేస్తాడు అంతర్యామి. ఆ పదానికి అర్థాన్ని 'బృహదారణ్యక ఉపనిషత్తు' విస్తృతం చేసి చెబుతుంది. లోపలే ఉంటూ, విశ్వాన్ని కట్టడి చేసేవాడు అంతర్యామి. అన్ని జీవుల్లో, పదార్థాల్లో ఉంటూ శాసించగల శక్తి ఒక్క ఆ పరమాత్మకే చెల్లుతుంది. అందుకే 'అమృతం', 'అంతర్యామి' అంటారు. ఈ విశ్వాన్ని సృష్టించి, లోపల బయట ఉండే దివ్యశక్తి అంతర్యామి. ఆ శక్తిని వ్యక్తీకరించడం కన్నా, తత్వంగా ఆస్వాదించడం మిన్న. తత్వం ఒకటే అనే రహస్యం తెలిసినప్పటికీ, త్రిమతాచార్యులు ఒకే సత్యాన్ని సొంత శైలిలో విశ్లేషించారు. అంతర్యామిని 'సర్వాత్మ'గా స్వీకరించారు.

సత్యం ఒకటే. వ్యాఖ్యలు వేరు. బ్రహ్మ, సత్య రూపాలే జగత్తు, జీవులు. విశ్వాన్ని సృష్టించిన బ్రహ్మ అందులో చైతన్యశక్తిగా ఉంటాడు. బయట, లోపల అంతర్యామిగా వెలుగొందుతాడు. అన్నింటినీ నియంత్రించే ఆంతరంగిక తత్వంగా, రూపంగా 'అంతర్యామి' అనే పదం ఉపనిషత్తుల్లో కనిపిస్తుంది!.

- ఉప్పు రాఘవేంద్రరావు

బీటీ పత్తి విత్తన ధర తగ్గింపు

- ప్యాకెట్ ధర రూ.800 నుంచి రూ. 740కి
- మోన్‌శాంటో రాయల్టీ రూ.49 నుంచి రూ. 39
- కేంద్ర ప్రభుత్వ కమిటీ నిర్ణయం

ఈనాడు - హైదరాబాద్



బీటీ పత్తి విత్తన ప్యాకెట్ ధర రూ.60 తగ్గించాలని కేంద్ర ప్రభుత్వం నుంచి నియమించిన జాతీయ కమిటీ నిర్ణయించింది. కమిటీ సమావేశం సోమవారం దిల్లీలో కేంద్ర వ్యవసాయశాఖ అదనపు కార్యదర్శి శ్రీవాత్సవ ఆధ్వర్యంలో జరిగింది. సంయుక్త కార్యదర్శి అశ్వనీ కుమార్, తెలంగాణ రాష్ట్ర విత్తన ధృవీకరణ సంస్థ సంచాలకుడు డాక్టర్ కేశవులు, భారతీయ జనత కిసాన్‌మోర్చా జాతీయ ప్రధాన కార్యదర్శి సుగుణాకర్‌రావు, గుజరాత్, మహారాష్ట్ర ఉన్నతాధికారులు కమిటీ సభ్యులుగా హాజరయ్యారు. ప్రస్తుతం బీటీ-2 పత్తి విత్తన 450 గ్రాముల ప్యాకెట్ గరిష్ఠ చిల్లర ధర(ఎమ్మార్పీ) రూ.800 ఉండగా 740కి తగ్గించి అమ్మాలని కమిటీ నిర్ణయించింది. బీటీ-1 ప్యాకెట్‌ను ప్రస్తుతం రూ.635కి అమ్ముతున్నారు. కానీ రైతులు దీనిని వాడటం లేదని దీని ధర గురించి చర్చించలేదు. వచ్చే జూన్ నుంచి ప్రారంభమయ్యే కొత్త పంట సీజన్‌లో విక్రయాల నుంచి ఈ ధర అమల్లోకి వస్తుంది. సాధారణంగా ఏప్రిల్ నుంచే విత్తన విక్రయాలు మొదలవుతాయి. కొత్త ధరను ప్యాకెట్‌పై తప్పనిసరిగా ముద్రించి రైతులకు విక్రయించాలి. కొత్త ధరను అధికారికంగా కేంద్రం త్వరలో ప్రకటించనుంది. తెలంగాణ ప్రభుత్వం తరఫున కేశవులు మాట్లాడుతూ.. ప్యాకెట్ ధర రూ.725 మించకుండా చూడాలని కోరినా కమిటీ రూ.740 నిర్ణయించిందన్నారు.

విత్తన రైతుకు రూ.330 ఇవ్వాల్సిందే..

అమెరికాకు చెందిన మోన్‌శాంటో కంపెనీకి బీటీ పత్తి విత్తనాలపై మేధోపరమైన హక్కు ఉన్నందున ప్రతీ ప్యాకెట్ ధర రూ.800లో రూ.49ని రాయల్టీగా చెల్లిస్తున్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి ఈ రాయల్టీని రూ.39కి తగ్గించాలని కమిటీ నిర్ణయించింది. ఈ రాయల్టీని రద్దు చేయాలని జాతీయ విత్తన కంపెనీల యాజమాన్యాల సంఘం కేంద్రానికి సిఫార్సు చేసినా కమిటీ రూ.10లే తగ్గించాలని నిర్ణయించింది. బీటీ-3 పత్తి విత్తనాలను అక్రమంగా అమ్ముతుంటే అడ్డుకోవాల్సిన బాధ్యత రాష్ట్రాలపైనే ఉందని కేంద్ర కమిటీ అభిప్రాయపడింది. తెలంగాణలో గత వానాకాలం 47 లక్షల ఎకరాల్లో పత్తి సాగుచేశారు. వచ్చే ఏడాది 50 లక్షల ఎకరాల్లో సాగుచేస్తారని అంచనా. ఎకరానికి రెండు ప్యాకెట్లు రైతులు వాడతారు. రెండింటికి రూ. 120 దాకా ధర తగ్గినందున మొత్తం 50 లక్షల ఎకరాలపై రూ.60 కోట్లు ఆదా అవుతుందని అంచనా. బీటీ పత్తి విత్తన పంటను రైతులతో కంపెనీలు సాగు చేయిస్తున్నాయి. పంట పండించిన తరవాత ఒక్కో ప్యాకెట్ ధర రూ.800లో రూ.330ని రైతుకు కంపెనీ చెల్లిస్తోంది. ఇకనుంచి ధరను రూ.740కి తగ్గించినా రైతుకిచ్చే రూ.330ని మాత్రం తగ్గించకుండా యధాతథంగా అంతా అతని ఖాతాలో కంపెనీలు జమచేసేలా రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కమిటీ సూచించింది.

కూటమికి నేతృత్వం వహించే శక్తి కేసీఆర్‌కు ఉంది

చంద్రబాబు, వామపక్షాలు కలిసి రావాలి: కడియం

కాజీపేట(వరంగల్), న్యూస్‌టుడే: జాతీయ రాజకీయాల్లోకి అడుగుపెడుతున్న తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు తృతీయ కూటమికి నాయకత్వం వహించే శక్తి సామర్థ్యాలు ఉన్నాయని ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి అన్నారు. ఇందుకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, వామపక్షాలు కలిసిరావాలని ఆకాంక్షించారు. సోమవారం హన్మకొండలో పర్యాటక శాఖ మంత్రి చందూలాల్‌తో కలిసి కడియం విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్, భాజపా పాలనలో దేశం అథోగతిపాలైందని, అందుకే ప్రత్యామ్నాయ రాజకీయాలకు అవకాశముందన్నారు. కేసీఆర్ జాతీయ రాజకీయాలపై దృష్టిసారించడాన్ని తామంతా స్వాగతిస్తున్నామని చెప్పారు. తెలుగు రాష్ట్రాలపై కేంద్రం వివక్ష చూపుతోందని ఆరోపించారు. తెరాసలో నంబర్ 1, టు అంటూ ఎవరూ లేరు.. 2014లో ముఖ్యమంత్రి కేసీఆర్ అనే మేం ఎన్నికలకు వెళ్లాం. 2019లో సీఎం ఎవరనేది ప్రజల అభీష్టం మేరకే పార్టీ నిర్ణయం తీసుకుంటుందన్నారు. వరంగల్ ఎంపీ దయాకర్, మహబూబాబాద్ ఎమ్మెల్యే శంకర్ నాయక్, నగర మేయర్ నన్నపనేని నరేందర్, ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి, వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్లు కడియం శ్రీహరికి మద్దతుగా మాట్లాడారు.

ఆ పార్టీలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయి

ట్విట్టర్‌లో ఎంపీ కవిత ధ్వజం

ఈనాడు, హైదరాబాద్: కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతాపార్టీ, విపక్షమైన కాంగ్రెస్ దేశాన్ని, ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత సోమవారం ట్విట్టర్‌లో పేర్కొన్నారు. దేశంలోని ప్రధాన సమస్యలపై ప్రధాని వెంటనే స్పందించాలని ఆమె డిమాండ్ చేశారు. సోమవారం పార్లమెంటులో తెరాస సభ్యులంతా రిజర్వేషన్ల బిల్లుకు ఆమోదం కోరుతూ నిరసన తెలిపినట్లు, విభజన హామీల అమలు కోసం తెదేపా, కావేరీ జలాల సమస్యపై తమిళనాడు ఆందోళన చేసినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర సమస్యలన్నింటినీ కేంద్రం పరిష్కరించేంత వరకు పోరాటం సాగుతుందని వెల్లడించారు.

కేసీఆర్‌కు టీజీవోల సంపూర్ణ మద్దతు

సీఎం కేసీఆర్ జాతీయ రాజకీయాల మార్పుకోసం చొరవ తీసుకోవడాన్ని స్వాగతిస్తున్నామని, ఆయన నిర్ణయానికి సంపూర్ణంగా మద్దతు ఇస్తున్నామని తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మమత, సత్యనారాయణ తెలిపారు. సంఘం నేతలు రవీందర్‌రావు, రాజ్‌కుమార్ గుప్తా తదితరులతో కలిసి సోమవారం వారు విలేకరులతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఉద్యోగ వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని, 9, 10వ సంస్థల విభజన పూర్తి కాలేదని, ఉద్యోగుల కేటాయింపులోనూ తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలనే డిమాండ్‌ను కూడా కేంద్రం పట్టించుకోవడం లేదని అన్నారు. కేసీఆర్ లాంటి నేత వస్తేనే తెలంగాణకు, దేశంలోని ఉద్యోగులకు సంపూర్ణ న్యాయం జరుగుతుందని చెప్పారు.

కార్పొరేటర్ల బాహాబాహీ?

గోదావరిఖని, న్యూస్‌టుడే: గోదావరిఖనిలో సోమవారం రాత్రి తెరాస పార్టీ నిర్వహించిన సమావేశంలో ఇద్దరు కార్పొరేటర్లు బాహాబాహీకి దిగినట్లు సమాచారం. కార్యాలయంలో పట్టణ కమిటీ సమావేశం జరుగుతుండగా, ఇద్దరు కార్పొరేటర్ల మధ్య ఓ అంశంపై వివాదం తలెత్తింది. దీంతో వారి మధ్య ఘర్షణ నెలకొంది. మాటామాటా పెరగటంతో ఓ దశలో ఇద్దరు బాహాబాహీకి దిగగా, అక్కడున్న పార్టీ నాయకులు, కార్యకర్తలు వెంటనే వారిని సముదాయించే ప్రయత్నం చేసినట్లు సమాచారం.

దిల్లీలో కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

ఈనాడు, దిల్లీ: 'జై కేసీఆర్, జై భారత్' అంటూ నినాదాలు చేస్తూ తెలంగాణ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ చిత్రపటానికి తెరాస కార్యకర్తలు సోమవారమిక్కడ తెలంగాణ భవన్‌లో పాలాభిషేకం చేశారు. పెద్దపల్లి జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ రఘువీర్ సింగ్ నేతృత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు. అనంతరం సింగ్ మాట్లాడుతూ..రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలు ప్రారంభించిన సీఎం కేసీఆర్.. దేశానికి దిక్సూచి కావాలని ఆకాంక్షించారు.

రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారిగా నేడు రజత్‌కుమార్ బాధ్యతల స్వీకరణ

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారిగా రజత్‌కుమార్ మంగళవారం బాధ్యతలు చేపట్టనున్నారు. అటవీ శాఖ ముఖ్యకార్యదర్శిగా ఉన్న ఆయనను సీఈవోగా కేంద్ర ఎన్నికల సంఘం నియమించిన విషయం తెలిసిందే. ఆయన స్థానంలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ మిశ్రకు అటవీ శాఖ పూర్తి అదనపు బాధ్యతలను అప్పగిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.

పల్స్ పోలియో రోజే నర్సు పోస్టులకు పరీక్ష

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా ఈనెల 11న ప్రజారోగ్య సంచాలకులు, వైద్య విధాన పరిషత్ విభాగాల్లో నర్సుల పోస్టుల భర్తీకి పరీక్షను నిర్వహించనున్నారు. ఇప్పటికే దీనికి సంబంధించిన ఏర్పాట్లు పూర్తయ్యాయి. అయితే అదే రోజు రాష్ట్రంలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించడానికి వైద్యఆరోగ్యశాఖ ఏర్పాట్లు చేస్తోంది. ఈ కార్యక్రమంలో వైద్యఆరోగ్యశాఖలో పనిచేస్తున్న ఒప్పంద, పొరుగు సేవల నర్సులు కూడా పాల్గొనాల్సి ఉంటుంది. తప్పనిసరిగా ఆ రోజు విధులకు హాజరు కావాల్సిందిగా ఉన్నతాధికారుల నుంచి వారికి ఆదేశాలు అందడంతో నర్సుల పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఆందోళనలో పడ్డారు. ఒప్పంద, పొరుగు సేవల్లో పనిచేస్తున్న నర్సుల సేవలు లేకుండా 11న పల్స్ పోలియోను నిర్వహించలేమా? అనే విషయంపై ఉన్నతాధికారులు దృష్టిసారించారు. సుమారు 2వేల మంది ఒప్పంద, పొరుగు సేవల నర్సులు పనిచేస్తున్నట్లు అంచనా వేస్తున్నారు. వీరందరూ ఆరోజు విధులకు హాజరు కాలేకపోయినా.. పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించవచ్చని వైద్యఆరోగ్యశాఖ ఉన్నతాధికారి ఒకరు అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం కూడా నర్సుల పోస్టుల పరీక్షను వాయిదా వేయడంపై సుముఖంగా లేకపోవడంతో.. ఒప్పంద, పొరుగు సేవల్లో ప్రభుత్వ వైద్యంలో పనిచేస్తున్న నర్సులకు పరీక్ష రాయడానికి అవకాశమివ్వాలనే అభిప్రాయానికే వచ్చినట్లు తెలుస్తోంది.

'రెరా'పై అధ్యయనానికి నిపుణుల కమిటీ

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో స్థిరాస్తి నియంత్రణ, అభివృద్ధి అథారిటీ (రెరా) చట్టం అమలుకు వీలుగా చేపట్టాల్సిన చర్యలపై అధ్యయనం చేయడానికి నిపుణుల కమిటీని నియమిస్తూ తెలంగాణ రాష్ట్ర పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి అర్వింద్‌కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. జీహెచ్‌ఎంసీ నగర చీఫ్ ప్లానర్ ఎస్.దేవేందర్‌రెడ్డి, పురపాలకశాఖ డైరెక్టర్ (ప్రణాళిక) ఎస్.బాలకృష్ణ, డీటీసీపీ కె.విద్యాధర్‌తో కూడిన నిపుణుల కమిటీ కర్ణాటక, మహారాష్ట్రలో రెరా అమలు జరుగుతున్న తీరు, రెరాకు సంబంధించిన పరిపాలన అంశాలు, అమలుకు సంబంధించి విధానపరమైన అంశాలను అధ్యయనం చేస్తుంది. రాష్ట్రంలో రెరా అమలుకు సంబంధించి ముఖ్య కార్యదర్శి సోమవారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర రెరా నిబంధనలు-2017ను గత ఏడాది ఆగస్టు 4న రాష్ట్ర ప్రభుత్వం ఖరారు చేసింది. ఇటీవల రెరా అథారిటీ ఛైర్మన్‌గా రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ తివారీని నియమించారు. తాజాగా అధ్యయనానికి కమిటీని నియమించారు. రెండు వారాల్లో నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం కమిటీని ఆదేశించింది.

కాంగ్రెస్, తెరాసలకు సమదూరం పాటిస్తాం: రమణ

ఈనాడు, హైదరాబాద్: కాంగ్రెస్, తెరాసలకు సమదూరం పాటిస్తామని తెలుగుదేశం రాష్ట్ర అధ్యక్షుడు రమణ ప్రకటించారు. తెలంగాణలో పొత్తు ఉండదని భాజపానే ప్రకటించిందని, ఏపీలో పొత్తు కొనసాగుతోందని ఆయన తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ భవన్‌లో ఆయన అధ్యక్షతన రాష్ట్ర ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, అధికార ప్రతినిధులు, అనుబంధ సంఘాల అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల సమయంలోనే పొత్తులపై నిర్ణయం తీసుకోవాలని పార్టీ నిర్ణయించిందన్నారు. తెరాస అధికారంలోకి వస్తే ఒక్క రైతు కూడా ఆత్మహత్య చేసుకోడని ఎన్నికల ముందు కేసీఆర్ చెప్పారని, కానీ ఇప్పుడు రైతుల ఆత్మహత్యలను ఆపలేక కేంద్రంపై నెపం నెట్టాలని చూస్తున్నారని అన్నారు. పని ఒత్తిడి వల్ల ఇంతకాలం తెలంగాణలో పార్టీకి సమయం కేటాయించలేకపోయినట్లు చంద్రబాబు చెప్పారని, ఇకనుంచి తప్పకుండా సమయం కేటాయిస్తానన్నారని తెలిపారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రూ.4.75 లక్షల కోట్లతో తెరాస ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లతో ఒరిగిందేమీ లేదన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రశ్నిస్తామన్నారు. త్వరలో రాష్ట్ర కార్యనిర్వాహక సమావేశం ఏర్పాటుచేస్తామని చెప్పారు. పార్టీ నేతలు అరవిందకుమార్‌గౌడ్, రావులపాటి సీతారామారావు, సామ భూపాల్‌రెడ్డి, బండ్రు శోభారాణి, నన్నూరి నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎంకు మరో తూటా రక్షణ కవచ బస్సు

- ఎన్నికల పర్యటనలు, భద్రత దృష్ట్యా నిర్ణయం

ఈనాడు, హైదరాబాద్: ముఖ్యమంత్రి భద్రతకు మరో తూటా రక్షణ కవచ(బుల్లెట్ ప్రూఫ్) బస్సు కొనుగోలుకు రాష్ట్రప్రభుత్వం నిర్ణయించింది. భద్రతాపరమైన చర్యల్లో భాగంగా కొత్తగా ఈనిర్ణయాన్ని తీసుకుంది. ఎన్నికలు సమీపిస్తుండటం, ఇప్పటికే సీఎం జిల్లాల పర్యటనలు ప్రారంభించడంతో పూర్తిస్థాయి భద్రతా చర్యల్లో భాగంగా కొత్తబస్సు అవసరమన్న నిర్ణయానికి వచ్చారు. కొత్తగా కొనుగోలు చేయాలనుకున్న బస్సులో ఏయే ప్రమాణాలుండాలన్న దానిపై కసరత్తు చేస్తోంది. ప్రస్తుతం ఉన్న బస్సు ఆర్టీసీ ద్వారా 2014లో రూ.4 కోట్లతో కొనుగోలు చేశారు. దీనిలో 14 నుంచి 16 మంది మాత్రమే కూర్చునే పరిస్థితి ఉంది. తాజాగా కొనుగోలు చేయాలనుకున్న దానిలో మరింత ఎక్కువమంది కూర్చునేలా వెసులుబాటు ఉండాలని నిర్ణయించారు. భవిష్యత్తు అవసరాల దృష్ట్యా మరింత భద్రతపరమైన ప్రమాణాలకు అనుగుణంగా ఉండటంతో పాటు పూర్తి సౌకర్యవంతంగా ఉన్నదానిని ఎంచుకోవాలని భావిస్తున్నారు. ఇటీవలి ఎన్‌కౌంటర్లు, రానున్న ఎన్నికలు, విస్తృత పర్యటనలను పరిగణనలోకి తీసుకుంటున్నారు. తూటాలతో పాటు శక్తిమంతమైన ల్యాండ్‌మైన్లను కూడా తట్టుకునేలా రక్షణపరంగా మరింత ఉత్తమంగా ఉన్నదాన్ని ఎంచుకోవాలని భావిస్తున్నారు. అధికారులు త్వరలోనే తుది నిర్ణయం తీసుకుని అధునాతనమైన బస్సును కొనుగోలు చేయాలని అంచనాలు రూపొందిస్తున్నారు.

ఇక నుంచి యూరియా బస్తా 45 కిలోలే

దిల్లీ: ఇన్నాళ్లూ ఏభై కిలోలున్న యూరియా బస్తా.. ఇకపై 45 కిలోలే ఉండనుంది. ఎరువుల సముచిత వాడకాన్ని ప్రోత్సహించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం తెలిపింది. ఒక్కో బస్తాను రూ. 242కు అందిస్తామనీ, దీనికి పన్నులు అదనమని ఓ ప్రకటనలో పేర్కొంది. ఈనెల 1 నుంచి ఇది అమల్లోకి వస్తుందని వెల్లడించింది. 25 కిలోలకు మించకుండా కొద్ది మొత్తాల్లో యూరియాను చిల్లరగా విక్రయించుకోవచ్చని డీలర్లకు ప్రభుత్వం సూచించింది. మరోవైపు- ఎరువుల కర్మాగారాలు ఇప్పటికే తమ వద్దనున్న 50 కిలోల బస్తాలను రెండు నెలల్లో అమ్ముకోవడానికి ప్రభుత్వం వెసులుబాటు ఉన్నతాధికారి ఒకరు వెల్లడించారు. ప్రస్తుతం దేశ వ్యాప్తంగా 24 మిలియన్ టన్నుల యూరియా ఉత్పత్తవుతోంది.



పైకి ఎగసిపడుతున్న నీరు

ఎల్లంపల్లి పైప్‌లైను వాల్వ్ తొలగింపు

- భారీఎత్తున ఎగసిన నీరు

పాలకుర్తి, న్యూస్‌టుడే: తాగు, సాగునీటి కోసం రైతులు పైపులైన్ వాల్వు తొలగించడం కలకలం సృష్టించింది. పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం మారేడుపల్లిలో ఆ గ్రామానికి చెందిన రైతులు నీటి కోసం ఎల్లంపల్లి పైపులైన్ గేట్‌వాల్వ్‌ను ఆదివారం అర్ధరాత్రి తెరిచారు. దీంతో ఉవ్వెత్తున నీటిధార ఎగసింది. సూరారం బస్వారాలి చెరువు నిండి అక్కడి నుంచి గొడిసేలపేట, మారేడుపల్లి, ఉండేడ, ముంజంపల్లి, గ్రామాల్లోని వాగుల్లోకి నీరు చేరింది. పంపుహౌస్ నిర్వహణ సంస్థ నిర్లక్ష్యమే ఈ ఘటనకు కారణమని తెలుస్తోంది. పైపులైన్ గేట్‌వాల్వ్ వద్ద కనీస భద్రత ఏర్పాటు చేయకపోవడంతో రాత్రివేళ రైతులు వాల్వును తెరిచారు. సోమవారం ఉదయం కొండల నడుమ పైపులైన్ ద్వారా భారీఎత్తున నీరు ఎగసిపడుతుండటంతో పలువురు అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో నీటిపారుదలశాఖ ఎస్‌ఈ శివకుమార్, డీఈ సత్యనారాయణ సంఘటన స్థలానికి చేరుకున్నారు. రైతులకు మద్దతుగా భాజపా నాయకుడు అంజయ్య, కాంగ్రెస్ నాయకులు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, కొమ్ము రాంబాబు, దేవేందర్ రెడ్డి అక్కడికి వెళ్లారు. ఎల్లంపల్లి నుంచి మేడారం వరకు రెండు పైపులైన్లు ఉన్నాయని ఇందులో నుంచి ఒక పైపులైన్ ద్వారా నీళ్లు ఇక్కడి రైతులకు ఇవ్వాలని నాయకులు కోరారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు సమీపంలోని చెరువులకు నీరు ఇవ్వకపోవడం మూలంగా ఇక్కడి పొలాలు ఎండుతున్నాయని విన్నవించారు. ఎస్‌ఈ శివకుమార్ మాట్లాడుతూ.. ప్రసుత్తం ఎల్లంపల్లి ప్రాజెక్టు వేంనూర్ పంపుహౌస్ నుంచి ట్రయల్‌రన్ నడుస్తోందని, రాబోయే రోజుల్లో ప్రణాళికాబద్ధంగా అన్ని గ్రామాలకు సాగునీరు సరఫరా చేస్తామని పేర్కొన్నారు.

ఫెడరల్ ఫ్రంట్ ఓ నాటకం

- వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే కేసీఆర్ ప్రకటన
- ప్రజాచైతన్య బస్సు యాత్రలో పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



ఆర్మూర్‌లో ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి గొర్రె పిల్లను బహూకరిస్తున్న కాంగ్రెసు నాయకులు

ఈనాడు, నిజామాబాద్: ముఖ్యమంత్రి కేసీఆర్ చూపు అకస్మాత్తుగా జాతీయ రాజకీయాల వైపునకు మళ్లి, ఇతర రాష్ట్రాలు కలిసొస్తే దిల్లీ పాలనకు వ్యతిరేకంగా నాయకత్వం నడిపేందుకు సిద్ధమని ప్రకటించడం వెనుక రసవత్తర అంశాలున్నాయని పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ నేత రత్నాకర్ నివాసంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ముఖ్యమంత్రిని లక్ష్యంగా చేసుకుని విమర్శలు గుప్పించారు. కేసీఆర్ నాలుగేళ్లుగా చేసింది కేసులు పెట్టడం, జైలుకు పంపడమేనని తెలిపారు. రైతులకు సంకెళ్లు వేసి జైలుకు పంపిన కేసీఆర్, ఇవన్నీ తప్పించుకునేందుకు ఫెడరల్ ఫ్రంట్ నాటకం ఆడుతున్నారని విమర్శించారు. ఈయన ఫెడరల్ ఫ్రంట్ పెడితే తెలంగాణ రాకను వ్యతిరేకించిన ఓవైసీ, తెలంగాణ ఓటు లేని జనసేన పవన్ కల్యాణ్‌లు మద్దతు తెలుపుతారట అని విమర్శించారు.

కేసీఆర్‌కు పత్రికల ప్రాధాన్యం: పత్రికలు కేసీఆర్ చెప్పే బూటకపు మాటలకు ప్రాధాన్యం ఇస్తున్నాయని, ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ నాలుగేళ్ల కేసీఆర్ పాలనను ఎండగడుతూ ప్రజాక్షేత్రంలోకి వెళితే ప్రాధాన్యం ఇవ్వడం లేదని ఉత్తమ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. మధ్నాహ్నం ఒకటిన్నర నుంచి నిజామాబాద్ నుంచి ప్రారంభించి నందిపేట, ఆర్మూరు, వేల్పూరు మీదుగా భీమ్‌గల్ వరకూ బస్సు యాత్ర నిర్వహించారు. నందిపేట, భీమ్‌గల్‌లలో నిర్వహించిన సభల్లో కూడా ఉత్తమ్ పత్రికలపై ఆక్రోశాన్ని వెళ్లగక్కారు. ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించి, పార్టీ కార్యకర్తలను రప్పించి జాతీయ రాజకీయాల్లో వెళ్లే అంశంపై హడావుడి చేస్తే పత్రికలు పతాక శీర్షికల్లో ప్రచురిస్తాయని విమర్శించారు. వేదికపై నుంచి పత్రికను చూపుతూ ఆక్రోశం చెందారు. కేసీఆర్ చేస్తున్న ప్రజా వ్యతిరేక పనులు ఎత్తి చూపుతూ రాసే ధైర్యం మీడియాకు లేదన్నారు. త్వరలో కాంగ్రెస్ పార్టీ పత్రిక, టీవీ ఛానల్ పెట్టనున్నట్లు ఉత్తమ్ స్పష్టం చేశారు.

డిసెంబరులో ఎన్నికలు ఖాయం: డిసెంబరులో ఎన్నికలు జరగడం ఖాయమని, తాము అధికారంలోకి రావడం తథ్యమని ఉత్తమ్ ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెకు 100, తెరాసకు 10 స్థానాలు వస్తాయని జోస్యం చెప్పారు. తాము అధికారంలోకి రాగానే పంటలకు మద్దతు ధర కల్పిస్తామని తెలిపారు. ఒక్కో స్వయం సహాయక సంఘానికి రూ.లక్ష రివాల్వింగ్ నిధి, రూ.10 లక్షల రుణం ఇస్తామని చెప్పారు. తెరాస నాలుగేళ్ల పాలనలో కేవలం 4వేల ఇళ్లు మాత్రమే కట్టారని ఆగ్రహం చెందారు.

తాగుబోతు తెలంగాణ చేశారు: వీహెచ్

బంగారు తెలంగాణ చేస్తానన్న ముఖ్యమంత్రి కేసీఆర్ తాగుబోతు తెలంగాణ మాత్రం చేశారని సీనియర్‌నేత వి.హన్మంతరావు విమర్శించారు. మూడో ఫ్రంటు ఏర్పాటుచేసి హస్తినకు వెళ్లి ఈయన ఏం చేస్తారంటూ తీవ్ర పదజాలాన్ని ఉపయోగించారు. శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మకు రాజ్యసభ సీటు ఇవ్వాలని వీహెచ్ కోరారు. మండలి విపక్ష నేత షబ్బీర్ అలీ మాట్లాడుతూ కేటీఆర్ కాంగ్రెస్ నేతలను చులకన చేసి మాట్లాడుతున్నారన్నారు. సచివాలయానికి వాస్తు లేదని ఇండోనేషియా వాడు చెబితే మరోచోటకు మార్చాలనుకుంటున్న కేసీఆర్‌కు చైనా వాడు వచ్చి తమకు ముక్కులు చిన్నగా ఉంటాయని, ఇలా ఉంటే మంచిదని చెబితే ముక్కు కోసుకుంటారా అని షబ్బీర్ ప్రశ్నించారు.

ఆరెస్సెస్ చేతిలో కేసీఆర్ కీలుబొమ్మ

- ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి విమర్శ
- భాజపాతో రహస్య అజెండాలో భాగంగానే తెరపైకి మూడో ఫ్రంట్
- జాతీయ రాజకీయాల్లో రాణించే సత్తా చంద్రబాబుకు మాత్రమే ఉందని వ్యాఖ్య

హైదరాబాద్, న్యూస్‌టుడే: భాజపాతో రహస్య అజెండాలో భాగంగానే ముఖ్యమంత్రి కేసీఆర్ జాతీయ రాజకీయాలను తెరపైకి తెచ్చి హడావుడి చేస్తున్నారని కాంగ్రెస్ నేత, ఎమ్మెల్యే ఎ.రేవంత్‌రెడ్డి ఆరోపించారు. నాగ్‌పూర్ కేంద్రంగా ఆరెస్సెస్ పెద్దల చేతిలో కేసీఆర్ కీలుబొమ్మగా మారారన్నారు. మూడో ఫ్రంట్ ఏర్పాటు చేసే శక్తి, దిల్లీ స్థాయిలో చక్రం తిప్పే అనుభవం ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు మాత్రమే ఉందన్నారు. రేవంత్‌రెడ్డి సోమవారం గాంధీభవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఏపీకి ప్రత్యేక హోదా విషయంలో చోటుచేసుకుంటున్న పరిణామాల నేపథ్యంలో..ప్రధాని మోదీకి వ్యతిరేకంగా చంద్రబాబు ప్రత్యామ్నాయ మార్గాలు వెతుకుతున్నట్లు సమాచారం తెలియడంతో దిల్లీ పెద్దలు కేసీఆర్‌ను రంగంలోకి దించారన్నారు. కేసీఆర్ తన దిల్లీ పర్యటనలో కేంద్రం పెద్దలతో రహస్య మంతనాలు జరిపినట్లు సమాచారం ఉందన్నారు. సహారా ఇండియా కంపెనీ కుంభకోణం, ఈఎస్ఐ ఆసుపత్రుల కుంభకోణంలో సీబీఐ, ఈడీ కేసులు కొనసాగుతున్నందున వాటి నుంచి బయటపడేందుకు ఆయన.. భాజపా చెప్పినట్లు డ్రామాలాడుతున్నారన్నారు. దేశ వ్యాప్తంగా కాంగ్రెస్‌ను దెబ్బతీసేందుకు మూడో ప్రత్యామ్నాయం అంటూ ప్రజలను మోసం చేసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. దక్షిణాది రాష్ట్రాల్లో కాంగ్రెస్‌ను బలహీనపర్చేందుకు, మోదీ ప్రభుత్వ వ్యతిరేక ఓటును చీల్చేందుకే కేసీఆర్ చేత మూడో ఫ్రంట్‌ను భాజపా తెరపైకి తెప్పించిందన్నారు.

రాజకీయ లబ్ధి కోసమే: రాజకీయ లబ్ధికోసం, కేసుల నుంచి బయటపడేందుకే కేసీఆర్ మూడో ఫ్రంట్ అంటూ కొత్త నాటకానికి తెర లేపారని మాజీమంత్రి మర్రి శశిధర్ రెడ్డి విమర్శించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ... సహారా కుంభకోణం, ఈఎస్ఐ ఆసుపత్రులకు సంబంధించి కేసీఆర్‌పై కొనసాగుతున్న సీబీఐ విచారణల గురించి వివరణ ఇవ్వాల్సిన బాధ్యత ఆయనపై ఉందన్నారు.

నవ భారతంలో తృతీయ ఫ్రంట్ ఓ భ్రాంతి!

భాజపాపై ప్రభావం చూపదు: కేంద్ర మంత్రి

దిల్లీ: కొత్త తృతీయ ఫ్రంట్ భావన ఓ 'భ్రాంతి' అని.. నవ భారతంలో అలాంటి రాజకీయాలు నిలవవని భాజపా పేర్కొంది. తమపై ఎలాంటి ప్రభావం ఉండబోదని అభిప్రాయపడింది. ఈమేరకు కేంద్ర మంత్రి రవిశంకర్ ప్రసాద్ సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెరాస అధినేత కేసీఆర్, తృణమూల్ అధినాయకురాలు మమతా బెనర్జీ తదితరులు తృతీయ ఫ్రంట్ దిశగా ప్రయత్నాలు చేస్తున్న అంశాన్ని ప్రస్తావించగా.. ఆయన స్పందించారు. ప్రజాస్వామ్య దేశంలో ఎవరికైనా అలాంటి ప్రయత్నాలు చేసుకునే హక్కు ఉంటుందంటూ.. అవి ఎంతమేర సఫలమవుతాయో దేశ ప్రజలే నిర్ణయిస్తారన్నారు. అలాగే భాజపాకు అనేక చిన్నపార్టీలు మద్దతిస్తున్నాయని.. మరిన్ని తమతో కలవాలని కోరుకుంటున్నాయని వివరించారు. తెదేపా, శివసేన వంటి పార్టీలతో జాతీయ స్థాయిలో సంబంధాలపై ఆయన స్పందిస్తూ - తాము మిత్రపక్షాలతోనే నేరుగా మాట్లాడగలమని, దీనికి విలేకరుల సమావేశాన్ని వేదికగా చేసుకోదలచ లేదని జవాబిచ్చారు.

పత్తాలేని కేంద్రీయ టెట్

ఈనాడు, హైదరాబాద్: కేంద్ర మానవ వనరుల శాఖ తరఫున సీబీఎస్‌ఈ నిర్వహించే కేంద్రీయ ఉపాధ్యాయ అర్హత పరీక్ష(సీసెట్) దాదాపు రెండేళ్ల నుంచి జరపకపోవడంతో అభ్యర్థులు ఎదురుచూస్తున్నారు. కేంద్ర విద్యా సంస్థల్లో 1-8వ తరగతికి బోధించాలంటే సీసెట్‌లో ఉత్తీర్ణులు కావడం తప్పనిసరి. కేంద్రీయ విద్యాలయాలు, జవహర్ నవోదయ విద్యాలయాలు తదితర వాటిల్లో ఉపాధ్యాయ ఉద్యోగాలు పొందాలంటే సీసెట్ అవసరం. దీన్ని 2015 వరకు ఏటా 2సార్లు నిర్వహించేవారు. దేశవ్యాప్తంగా ప్రతి పరీక్షకు దాదాపు 6.50 లక్షల మంది హాజరయ్యేవారు. 2016 జులైలో చివరిసారిగా సీబీఎస్‌ఈ ఈ పరీక్ష నిర్వహించింది. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇక నుంచి ఏడాదికి ఒకసారే పరీక్ష జరుపుతామని సీబీఎస్‌ఈ ప్రకటించింది. 2017లో పరీక్ష జరగలేదు. దాంతో 2018లోనైనా అసలు పరీక్ష ఉంటుందా? ఉండదా? అని అభ్యర్థులు ఎదురుచూస్తున్నారు. సీసెట్లో ఉత్తీర్ణులైతే టీఎస్‌పీఎస్‌సీ నిర్వహించే టీఆర్‌టీకు అర్హులే. అయితే, 2018 కి ఈనెల లేదా వచ్చే నెలలో ప్రకటన రావొచ్చని వార్తలొస్తున్నాయి.



ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న బాలకృష్ణ

29న 'ఎన్టీఆర్' సినిమా ఆరంభం: బాలకృష్ణ

పామర్రు గ్రామీణం, న్యూస్‌టుడే, ఈనాడు అమరావతి: దివంగత నందమూరి తారక రామారావు పేరు ప్రతిష్ఠలు భావితరాలకు గుర్తుండిపోయేలా ఆయన జీవిత చరిత్రను 'ఎన్టీఆర్' పేరుతో తెరకెక్కిస్తున్నామని హిందూపురం ఎమ్మెల్యే, సినీ నటుడు నందమూరి బాలకృష్ణ పేర్కొన్నారు. సోమవారం ఆయన కృష్ణా జిల్లా పామర్రు మండలంలోని కొమరవోలులో విలేకరుల సమావేశంలోను, శాసనసభ లాబీల్లో మీడియా ప్రతినిధులతోనూ ముచ్చటించారు. చిత్ర నిర్మాణాన్ని ఈ నెల 29న హైదరాబాద్‌లోని రామకృష్ణ స్టూడియోస్‌లో ప్రారంభిస్తున్నామని వెల్లడించారు. ఈ సినిమాకి 'ఎన్టీఆర్'కి మించిన పేరు లేదని భావించి, దాన్నే ఖరారు చేశామని తెలిపారు. ఇది ఎన్నికల సందర్భంగా తీసే సినిమా కాదని బాలకృష్ణ స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో సినిమా ప్రారంభానికి కొమరవోలు, నిమ్మకూరు గ్రామాల్లోని తమ బంధుమిత్రులను, గ్రామస్థులను ఆహ్వానించేందుకు ఇక్కడకు వచ్చానన్నారు. సినిమాలో ఎన్టీఆర్ జీవిత చరిత్రతో పాటు తెదేపా ఆవిర్భావం, ఆయన ప్రవేశపెట్టిన విప్లవాత్మక పథకాలు, తదితరాలను యావజ్జాతి గుర్తుంచుకునేలా చిత్రీకరిస్తామన్నారు. తొలుత కొమరవోలు ముఖద్వారం వద్ద ఉన్న ఎన్టీఆర్ బసవతారకం విగ్రహాలకు బాలకృష్ణ పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మూడో స్థానంపై తెదేపా కన్ను?

- రాజ్యసభ ఎన్నికల నేపథ్యంలో రాజకీయ వేడి
- శిబిరం నిర్వహణ యోచనలో వైకాపా!

ఈనాడు అమరావతి: రాజ్యసభ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలో మరోసారి రాజకీయ వేడి మొదలైంది. ఈ ఎన్నికల్లో రాష్ట్రం నుంచి ముగ్గురికి అవకాశం ఉంది. శాసనసభ్యుల సంఖ్యాబలం ఆధారంగా తెదేపాకు రెండు, వైకాపాకు ఒక స్థానం దక్కే అవకాశం ఉంది. ఈ మేరకు వైకాపా తన అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పేరును ప్రకటించేసింది. ప్రభాకర్‌రెడ్డి ఇప్పటికే వైకాపా ఎమ్మెల్యేలతో రాజ్యసభ ఎన్నికలపై మంతనాలు ప్రారంభించారన్న ప్రచారం సాగుతోంది. మరోవైపు తెదేపాకు దక్కే రెండు స్థానాలతోపాటు మూడో అభ్యర్థిని బరిలోకి దించే అవకాశం ఉందన్న చర్చ కొనసాగుతోంది. దీనిపై తెదేపా తుది నిర్ణయం తీసుకోనప్పటికీ.. ఒకవేళ తెదేపా మూడో అభ్యర్థిని పోటీకి పెడితే వైకాపా తన ఎమ్మెల్యేలతో ప్రత్యేక శిబిరాన్ని నిర్వహించేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఎన్నికల నేపథ్యంలో ఎమ్మెల్యేలు జారిపోకుండా చూసుకునేందుకే శిబిరం ఆలోచనలో వైకాపా ఉన్నట్లు చెబుతున్నారు.

తెదేపాలోకి వైకాపా నేత?

గత ఎన్నికల్లో కాకినాడ లోక్‌సభ స్థానంలో వైకాపా నుంచి పోటీ చేసిన చలమశెట్టి సునీల్ ఒకటి రెండ్రోజుల్లో తెదేపాలో చేరే అవకాశం ఉన్నట్లు తెదేపా వర్గాలు చెబుతున్నాయి. దీన్ని వైకాపా వర్గాలు ఖరారు చేయడం లేదు. మరోవైపు చేరికే తరువాయని తెదేపా వర్గాలంటున్నాయి.

అమరావతిలో ఉండలేం..

సచివాలయం ముందు తెలంగాణ నాలుగో తరగతి ఉద్యోగుల ధర్నా

ఈనాడు, హైదరాబాద్: ఏపీకి కేటాయించిన తమను వెంటనే స్వరాష్ట్రానికి రప్పించాలని తెలంగాణకు చెందిన నాలుగో తరగతి ఉద్యోగులు సోమవారం హైదరాబాద్‌లోని ఏపీ సచివాలయం ముందు ధర్నా నిర్వహించారు. తమకు ఇష్టం లేకపోయినా అన్యాయంగా తమను ఏపీకి పంపించారని, నాలుగేళ్లవుతున్నా తమ గోడు ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోయారు. భార్యాపిల్లలు, తల్లిదండ్రులు తెలంగాణలో ఉండగా, తాము ఏపీలో పనిచేయడం సాధ్యం కావడం లేదన్నారు. సీఎం కేసీఆర్ జోక్యం చేసుకొని తమను తెలంగాణకు పంపించేందుకు కృషి చేయాలని కోరారు.

రూ.1.78 లక్షల కోట్ల బడ్జెట్‌కు తుదిరూపు

- 19 శాతం వృద్ధిరేటుతో రాబడి అంచనాలు
- వ్యవసాయరంగం వాటా రూ.10 వేల కోట్లకు పైగా..

ఈనాడు – హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర 2018-19 బడ్జెట్ తుది రూపు సంతరించుకుంది. మరో వారం రోజుల్లో శాసనసభ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో రాష్ట్ర ఆర్థిక శాఖ బడ్జెట్‌కు తుది మెరుగులు దిద్దుతోంది. తెలంగాణ రాష్ట్రానికి కీలక రాబడులైన అమ్మకం పన్ను సహా ఇతర రాబడుల అంచనాలపై పూర్తి స్పష్టత రావడంతో బడ్జెట్ ప్రక్రియ కొలిక్కి వచ్చింది. గత బడ్జెట్ కంటే 19 శాతం వృద్ధిరేటుతో 2018-19 పద్దు సిద్ధమైంది. ప్రభుత్వం సుమారు రూ. 1.78 లక్షల కోట్లతో బడ్జెట్ ప్రవేశపెట్టనుందని విశ్వసనీయ సమాచారం. 2017-18 ఆర్థిక సంవత్సరంలో రూ. 1,49,646 కోట్లతో బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ప్రస్తుతం రాష్ట్ర రాబడిలో 15.7 శాతం వృద్ధిరేటు నమోదు కాగా వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఇది 19 శాతంగా ఉంటుందని అంచనా వేసిన ప్రభుత్వం ఈ మేరకు బడ్జెట్ ప్రతిపాదనలను సిద్ధం చేస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వస్తు సేవల పన్ను (జీఎస్టీ) అమలు రాష్ట్ర రాబడులపై ప్రభావం చూపింది. జులై ఒకటో తేదీ నుంచి జీఎస్టీ అమల్లోకి రాగా అమ్మకం పన్ను రాబడి 19 శాతం నుంచి 15.7 శాతానికి పరిమితమైంది. జీఎస్టీలో జనవరి నాటికి 15.7 శాతం వృద్ధిరేటు నమోదైంది. పెట్రోలియం ఉత్పత్తులు, మద్యంపై పన్ను రాబడుల్లో వృద్ధి రేటు బాగా ఉండటంతో బడ్జెట్ అంచనాలను పెంచింది. స్టాంపులు రిజిస్ట్రేషన్ల రాబడి అంచనాలకంటే గణనీయంగా పెరిగింది. కేంద్రం నుంచి ఆశించిన నిధులు మినహా రాష్ట్ర రాబడుల్లో ప్రభుత్వ అంచనాలను అందుకోవడంతో బాటు రాబడి వృద్ధిరేటు కొనసాగుతోంది. వాణిజ్య పన్నులశాఖ రాబడులు వచ్చే ఆర్థిక సంవత్సరంలో రూ. 43 వేల కోట్లు, ఎక్సైజ్ ద్వారా రాబడి రూ. 11 వేల కోట్ల మేర ఉంటుందని ప్రాథమికంగా అంచనా వేశారు.

వ్యవసాయానికి పెద్ద బడ్జెట్

రాబడుల అంచనాల మేరకు ప్రాథమికంగా ప్రాధాన్య రంగాలకు నిధుల కేటాయింపులపై స్పష్టత వచ్చిందని అధికారులు స్పష్టం చేశారు. సాగునీరు, వ్యవసాయం, సంక్షేమానికి నిధుల కేటాయింపులు 15 నుంచి 20 శాతం మేర పెరగనున్నాయి. వ్యవసాయ రంగానికి ఈ బడ్జెట్‌లో రూ.10 వేల కోట్లకు పైగా కేటాయింపులు ఉంటాయని సమాచారం. రైతులకు ఇచ్చే పెట్టుబడి రాయితీతో పాటు వ్యవసాయానికి ఊతమిచ్చేలా నిధుల పెంపుపై కసరత్తు జరిగింది. రైతులకు పెట్టుబడి రాయితీగా ఎకరాకు రూ.4,000 ఇవ్వాలని నిర్ణయించిన ప్రభుత్వం ఈ మేరకు అవసరమైన పూర్తి నిధులను బడ్జెట్‌లో పొందుపరచనుంది. ఖరీఫ్ సీజన్‌కే రూ.6,484 కోట్లు అవసరమవుతాయని అంచనా వేశారు. మౌలిక సదుపాయాలకు పెద్ద మొత్తంలో నిధులు సమకూర్చుకోవాలని నిర్ణయించిన ప్రభుత్వ మిషన్ భగీరథ తరహాలో వివిధ కార్పొరేషన్ల ద్వారా నిధులను సమకూర్చుకోవాలని భావిస్తోంది.



తగలబడుతున్న బస్సు

టీఎస్ ఆర్టీసీ బస్సు దహనం

- ప్రయాణికుల్లో ఒకరి కాల్చివేత
- ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల దుశ్చర్య

చింతూరు, న్యూస్‌టుడే: తెలంగాణ ఆర్టీసీకి చెందిన ఓ బస్సును ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులు సోమవారం రాత్రి దహనం చేశారు. జగదల్‌పూర్ నుంచి హైదరాబాద్ వెళుతున్న బస్సును సుకుమా జిల్లా డోర్నపాల్ పరిధిలోని కుత్తి గ్రామం వద్ద మావోయిస్టులు అటకాయించి నిలిపివేశారు. ప్రయాణికులను కిందకు దించి ఒకరిని కాల్చి చంపారు. అనంతరం బస్సుకు నిప్పంటించారు. మరో ప్రైవేటు బస్సును, ఒక ట్రాక్టర్‌ను దహనం చేశారు. మరణించిన వ్యక్తి కానిస్టేబుల్ కావొచ్చునని, ఇటీవల తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో జరిగిన ఎన్‌కౌంటర్‌కు నిరసనగా మావోయిస్టులు ఈ చర్యకు పాల్పడినట్లు పోలీసులు భావిస్తున్నారు.

కేసీఆర్ వ్యాఖ్యలపై దేశవ్యాప్త చర్చ: తలసాని

ఈనాడు, హైదరాబాద్: జాతీయ రాజకీయాలపై ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన వ్యాఖ్యలు, చెప్పిన అంశాలపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతోందని పశుసంవర్థక శాఖ మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్ అన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కేంద్రం వద్దనే అధికారాలన్నీ ఉంచుకోవడం వల్ల రాష్ట్ర ప్రభుత్వం పేదలకు న్యాయం చేయలేకపోతోందన్నారు. బడుగు, బలహీనవర్గాలకు రిజర్వేషన్లు ఎంత శాతం కల్పించాలనే అధికారం రాష్ట్రాలకే ఉండాల్సిన అవసరముందన్నారు. దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల నుంచి ప్రముఖులు కేసీఆర్‌ను అభినందిస్తున్నారని ఆయన తెలిపారు. కులవృత్తులు చేసుకుంటున్న 109 కులాల ప్రజల అభివృద్ధికి పలు ప్రోత్సాహకాలు వచ్చే రాష్ట్ర బడ్జెట్‌లో ఇవ్వాలని ఇటీవల చర్చించినట్లు ఆయన తెలిపారు. మత్స్య రంగం అభివృద్ధికి మానవ వనరులు, ఆధునాతన పరిజ్ఞానం అందుబాటులోకి తెచ్చేందుకు ఈ నెల 15 నుంచి 17 వరకూ ఆక్వా ఎక్స్ ఇండియా-2018 పేరుతో అంతర్జాతీయ సదస్సును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దక్షిణాసియాలోనే ఇంత భారీ సదస్సు ఏర్పాటు చేయడం ఇదే తొలిసారి అని తలసాని చెప్పారు.

పాఠ్యప్రణాళిక తగ్గింపుపై సూచనలకు ఆహ్వానం

ఈనాడు, హైదరాబాద్: సీబీఎస్ఈ అనుసరిస్తున్న జాతీయ విద్యా పరిశోధన, శిక్షణ మండలి(ఎన్‌సీఈఆర్‌టీ) రూపొందించిన పాఠ్య ప్రణాళికను క్రమబద్ధీకరించేందుకు కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ ప్రజల నుంచి సూచనలను ఆహ్వానిస్తోంది. ఒకటి నుంచి 12వ తరగతి వరకు ఉన్న సిలబస్‌పై ఏప్రిల్ 6వ తేదీ లోపు సూచనలు పంపాలని కేంద్రం కోరింది. అన్ని తరగతుల సిలబస్‌ను కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ వెబ్‌సైట్లో పొందుపరిచింది. ఆ వెబ్‌సైట్ నుంచే సూచనలను పంపవచ్చు.

ప్రతిపక్షాల నోరు మూయించింది కేసీఆరే

- మంత్రి కేటీఆర్

పరకాల, హసన్‌పర్తి న్యూస్‌టుడే: సాగుకునిరంతర విద్యుత్తు సరఫరాతో ప్రతిపక్షాల నోటిని మూయించిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌దేనని ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. సోమవారం వరంగల్ రూరల్ జిల్లా పరకాలలో ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అధ్యక్షతనజరిగిన బహిరంగ సభలో ఆయనమాట్లాడారు. పరిపాలించడం రాదని, తెలంగాణ రాష్ట్రం వస్తే కరెంటే ఉండదని ఎద్దేవాచేసిన ప్రతిపక్ష నాయకులకు ఇప్పుడు ఏమి మాట్లాడాలో తెలియడంలేదన్నారు. కాంగ్రెస్ హయాంలో 9 గంటల విద్యుత్తును విడతల వారీగా ఇవ్వడంవల్ల అర్ధరాత్రి కరెంట్ షాకుతో రైతులు చనిపోయారన్నారు. సమయానికి విత్తనాలు, ఎరువులు ఇవ్వలేకపోయారని, వాటి కోసం దుకాణాల ముందు బారులుదీరే పరిస్థితి నేడు లేదన్నారు. సీఎం కేసీఆర్ విప్లవాత్మక కార్యక్రమాలతో ముందుకు వెళ్తున్నారని, రూ.17 వేల కోట్ల రుణమాఫీతో చరిత్రలో ఎక్కడా లేని విధంగా 35లక్షల మంది రైతు కుటుంబాలకు న్యాయం చేశారన్నారు. అన్నదాతల పక్షాన నిలిచి పెట్టుబడుల కోసం ఎకరానికి రూ. 4 వేల చొప్పున ఇస్తామని ప్రకటించారన్నారు. ఏటా రూ. 8వేల కోట్ల నుంచి రూ. 10 వేల కోట్ల పెట్టుబడి అయినా రాజీపడ వద్దంటూ దేశంలో ఏ ముఖ్యమంత్రీ తీసుకోని విప్లవాత్మక నిర్ణయం తీసుకున్నారన్నారు. ఇటీవల కరీంనగర్‌లో జరిగిన రైతు సమన్వయసమితి సమావేశంలో కుటుంబంలోని పెద్దదిక్కు అన్నదాత చనిపోతే ఆ కుటుంబానికి రూ.5లక్షల బీమా పథకాన్ని ప్రకటించారని కేటీఆర్ వివరించారు. తెలంగాణలో కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువ అవుతున్నాయని, వాటిని దేశప్రజలకు సైతం అందించాలనే అభ్యుదయఆలోచనతో ప్రత్యామ్నాయ కూటమికి పునాది వేసేందుకు సిద్ధమవుతున్నారని ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి పేర్కొన్నారు.



సభలో మాట్లాడుతున్న కేటీఆర్. చిత్రంలో ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి తదితరులు

ఐటీ హబ్‌గా వరంగల్: కేటీఆర్ : హైదరాబాద్ తర్వాత వరంగల్ ఐటీ హబ్‌గా మారనుందని, రానున్న రోజుల్లో పలు కంపెనీలు నగరంలో ఏర్పాటు కానున్నాయని రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కె. తారక రామారావు తెలిపారు. వరంగల్ అర్బన్ జిల్లా హసన్‌పర్తి మండలం అనంతసాగర్ గ్రామ పరిధిలోని ఎస్సార్ ఇంజినీరింగ్ కళాశాలలో ఎస్సార్ ఇన్నోవేషన్ ఎక్స్ఛేంజ్ (టెక్నాలజీ బిజినెస్ ఇంక్యుబేటర్)ను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. వరంగల్‌లోని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, యువత ఇంక్యుబేటర్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమాజానికి ఉపయోగపడే ఆలోచనలతో వస్తే వారికి తప్పకుండా ప్రభుత్వం నుంచి సహకారం ఉంటుందన్నారు. ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి, ఎస్సార్ విద్యా సంస్థల ఛైర్మన్ వరదారెడ్డి, డీఎస్టీ నేషనల్ సైన్సు అండ్ టెక్నాలజీ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ బోర్డు సలహాదారు హర్‌కేష్ కుమార్ మిత్తల్, సిడ్బీ వెంచర్ కేపిటల్ లిమిటెడ్ ఎండీ రవి త్యాగి తదితరులు మాట్లాడారు. వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్, మేయర్ నన్నపునేని నరేందర్, ఉమ్మడి జిల్లా పరిషత్తు ఛైర్‌పర్సన్ గద్దల పద్మ, ఎమ్మెల్యేలు అరూరి రమేశ్, డాక్టర్ రాజయ్య, శంకర్ నాయక్, ఔత్సాహితక పారిశ్రామికవేత్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

భర్తకు విషమిచ్చి కడతేర్చిన భార్య

మృతుడు తెలంగాణ వాసి

ఈనాడు, దిల్లీ: మద్యానికి బానిసయ్యాడంటూ భర్తను ఓ మహిళ విషమిచ్చి కడతేర్చింది. వరంగల్‌కు చెందిన డీఎస్ మూర్తి, ఆయన భార్య రమ ఇక్కడి రాజాబజార్‌లో నివాసముంటున్నారు. రమ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగిణి. మూర్తి ఓ స్థిరాస్తి సంస్థలో పనిచేస్తున్నారు. గత నెల 26న రోడ్డుపక్కన అనుమానాస్పదంగా పడి ఉన్నారంటూ మూర్తిని ఓ మహిళ ఆసుపత్రిలో చేర్చింది. 2 రోజులతర్వాత మూర్తి చికిత్స పొందుతూ మరణించారు. పోలీసులు విచారణ మొదలుపెట్టారు. ఆయన్ను ఆసుపత్రిలో చేర్చింది రమేనని గుర్తించారు. మూర్తి మద్యానికి బానిసై, రూ.12 లక్షల వరకు అప్పులు చేశారని పోలీసులకు రమ తెలిపింది. అతణ్ని వదిలించుకునేందుకు దక్షిణపురిలోని తాంత్రికుడు శ్యాంసింగ్ ఆశ్రయించానని వివరించింది. శ్యాంసింగ్ ఇచ్చిన పదార్థాన్ని తినిపించిన వెంటనే మూర్తి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయారని వెల్లడించింది.

నేటి నుంచి స్టాఫ్‌నర్సు పోస్టులకు హాల్‌టికెట్లు జారీ

ఈనాడు, హైదరాబాద్: వైద్యశాఖలో స్టాఫ్ నర్సు పోస్టులకు సంబంధించి హాల్‌టికెట్లు వెబ్‌సైట్లో పొందుపరిచినట్లు టీఎస్‌పీఎస్సీ ఒక ప్రకటనలో పేర్కొంది. ఈనెల6 మధ్యాహ్నం నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలిపింది.

సుంజ్వాన్ దాడి సూత్రధారి హతం

శ్రీనగర్: పాకిస్థాన్ కేంద్రంగా పనిచేస్తున్న జైషే మహ్మద్ ఉగ్ర సంస్థకు పెద్ద ఎదురుదెబ్బ. ఆ సంస్థకు చెందిన కీలక ఉగ్రవాది, సుంజ్వాన్ సైనిక శిబిరంపై దాడికి కీలక సూత్రధారి అయిన ముఫ్తీ వకాస్ అలియాస్ అబూ అర్సలాన్‌ను భద్రతాదళాలు కశ్మీర్‌లో సోమవారం మట్టుబెట్టాయి. సుంజ్వాన్ సైనిక శిబిరంపై గత నెల 10న జరిగిన ఉగ్రదాడిలో ఆరుగురు మృతిచెందిన సంగతి తెలిసిందే. నాటి దాడికి కీలక సూత్రధారి అయిన వకాస్‌పై నిఘా పెట్టిన పోలీసులు.. అవంతిపూర్‌లోని హత్వార్ ప్రాంతంలో ఓ ఇంట్లో అతడు దాగి ఉన్నట్లు గుర్తించారు. పోలీసులు, సైనికులతో కూడిన సంయుక్త బృందం వెంటనే అక్కడికి చేరుకొని వకాస్‌ను హతమార్చింది. పలు దస్త్రాలు, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకుంది. సుంజ్వాన్ శిబిరంపై దాడి సమయంలో పాకిస్థాన్‌లోని ఉగ్రవాదులతో వకాస్ నిరంతరం మాట్లాడుతూ ఉన్నాడని పోలీసులు తెలిపారు. వకాస్ పాక్ జాతీయుడేనని వెల్లడించారు. గతేడాది డిసెంబరు 30 అర్ధరాత్రి తర్వాత దక్షిణ కశ్మీర్‌లోని లెథ్‌పొరాలో సీఆర్‌పీఎఫ్ శిబిరంపై జరిగిన ఆత్మాహుతి దాడికి కూడా వకాస్ సూత్రధారి అని పేర్కొన్నారు.

ఆరో తరగతికి 55,281 దరఖాస్తులు


ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 194 ఆదర్శ పాఠశాలల్లో ఆరో తరగతిలో ప్రవేశానికి 55,281 దరఖాస్తులు అందాయి. ఆరో తరగతిలో 19,400 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఇక ఏడో తరగతిలో ఖాళీ సీట్లకు 21,331, 8వ తరగతికి 18,112, 9వ తరగతికి 13,220, పదో తరగతికి 4,183 దరఖాస్తులు వచ్చాయి. అభ్యర్థులకు ఏప్రిల్ 15న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు.

టీజీటీ ధ్రువీకరణ పత్రాల పరిశీలన

ఈనాడు, హైదరాబాద్: గురుకులాల్లో పీజీటీ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులు... తాము టీజీటీ అభ్యర్థుల నుంచి తప్పుకున్నట్లు ప్రకటించిన నేపథ్యంలో తదుపరి మెరిట్ అభ్యర్థులకు మంగళవారం నుంచి 9 వరకు ధ్రువీకరణ పత్రాలు పరిశీలించనున్నట్లు టీఎస్‌పీఎస్సీ తెలిపింది. ఉదయం 10 గంటల నుంచి టీఎస్‌పీఎస్సీ కార్యాలయంలో ధ్రువీకరణ పత్రాలపరిశీలన నిర్వహించనుంది.



మధుమేహం, గుండెజబ్బులు. రెండూ జంట శత్రువులు. ఒకదాంతో మరోటి చెట్టపట్టాలు వేసుకుంటూ ప్రపంచాన్ని పట్టి పీడిస్తున్నాయి. ముఖ్యంగా మనకు మరింత ప్రమాదకరంగానూ పరిణమిస్తున్నాయి. పైగా ఇవి మన మీద చిన్న వయసులోనే దాడి చేస్తున్నాయి కూడా. ఇలా ఎందుకు జరుగుతోంది? దీనికి ప్రత్యేక కారణాలేమైనా ఉన్నాయా? వీటిపై నిశితంగా అధ్యయనం చేశారు **ప్రొఫెసర్ వసీం హనీఫ్**. 'యునైటెడ్ కింగ్‌డమ్ ఏషియన్ డయాబెటిక్ స్టడీ'లో భాగంగా మొదట్నుంచీ దక్షిణాసియాపై.. ముఖ్యంగా భారత్‌పై ప్రత్యేకంగా దృష్టి సారించారు. మన హైదరాబాద్‌కు చెందిన ఆయన గాంధీ మెడికల్ కళాశాలలో, నిమ్స్‌లోనూ వైద్యవిద్య అభ్యసించి బ్రిటన్‌కు వెళ్లారు. ప్రస్తుతం బర్మింగ్‌హామ్ యూనివర్సిటీ ఆసుపత్రిలో మధుమేహ సేవల విభాగం అధిపతిగా, కన్సలెంట్ ఫిజిషియన్‌గా.. అలాగే డయాబెటీస్ అండ్ ఎండోక్రినాలజీ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. ఇటీవల హైదరాబాద్‌కు వచ్చినపుడు ఆయన సుఖీభవతో ప్రత్యేకంగా ముచ్చటించారు. భారతీయుల్లో మధుమేహం, గుండెజబ్బుల విషయంలో ప్రత్యేకంగా కనబడుతున్న అంశాలతో పాటు పలు విషయాలను వివరించారు.



మెంతులతో గ్లూకోజు తగ్గుతుందనటం నిజమేనా?

రక్తంలో గ్లూకోజు మోతాదులు తగ్గటానికే కాదు.. మధుమేహం రాకుండా చూడటంలోనూ మెంతులు బాగా పనిచేస్తున్నట్టు అధ్యయనాలు స్పష్టంగా పేర్కొంటున్నాయి. మెంతుల్లోని రసాయనాలు మెట్‌ఫార్మిన్ రకం మధుమేహ మందుల మాదిరిగానే పనిచేస్తూ.. రక్తంలో గ్లూకోజు స్థాయులను నియంత్రణకు తోడ్పడే అవకాశముంది. కాబట్టి మధుమేహం గలవారు మెంతులను తీసుకోవటం మంచిదే.

తక్కువ తిని.. ఎక్కువ పని!


ఇదే మధుమేహ నివారణోపాయం



భారతీయుల్లో మధుమేహం మీద ప్రత్యేకంగా అధ్యయనం చేయాలనే ఆలోచన ఎలా వచ్చింది?

దీనికి ప్రత్యేక కారణమే ఉంది. ఆంగ్లేయుల కన్నా బ్రిటన్‌లో నివసిస్తున్న భారతీయుల్లో మధుమేహం 6 రెట్లు ఎక్కువగా కనబడుతోంది. గుండెజబ్బులు కూడా 2-3 రెట్లు అధికంగా ఉంటున్నాయి. ఇవి వీరిలో చిన్న వయసులోనే దాడి చేస్తుండటం మరో విచిత్రం. దీనికి కారణాలేంటని అన్వేషించే ప్రయత్నంలోనే 1995-96లో 'యునైటెడ్ కింగ్‌డమ్ ఏషియన్ డయాబెటిక్ స్టడీ'ని ఆరంభించాం. ఇదింకా కొనసాగుతూనే ఉంది. మొదట్లో జన్యుపరమైన అంశాలు దోహదం చేయొచ్చనే భావనతో పెద్దఎత్తున జీనోమ్ వైడ్ అసోసియేషన్ స్టడీస్ (జీవాస్) కూడా నిర్వహించాం. అయితే ఆంగ్లేయులకు, భారతీయులకు మధ్య మధుమేహం విషయంలో జన్యుపరంగా పెద్ద తేడాలేవీ బయటపడలేదు. కొలెస్ట్రాల్, అధిక రక్తపోటు, పొగ అలవాటు వంటి సంప్రదాయ ముప్పు కారకాలనూ పరిశీలించాం. చాలామంది భారతీయుల్లో కొలెస్ట్రాల్, రక్తపోటు, పొగ అలవాటు తక్కువగానే ఉంటున్నట్టు గమనించాం. కాకపోతే కొందరిలో హెచ్‌డీఎల్ కొలెస్ట్రాల్ (మంచి కొలెస్ట్రాల్) తక్కువని తేలింది. అలాగే భారతీయులు అంతగా వ్యాయామం, శారీరక శ్రమ చేయటం లేదు. ఇలా సంప్రదాయ ముప్పు కారకాల విషయంలో పెద్ద తేడాలేవీ కనిపించకపోవటంతో ఇతర అంశాలపై దృష్టి సారించాం.

మీ అధ్యయనంలో ఎలాంటి తేడాలను గమనించారు?



పాశ్చాత్యదేశాల వారితో పోలిస్తే భారతీయులు సన్నగానే ఉంటున్నా.. బరువు, బీఎంఐ కూడా తక్కువగానే ఉంటున్నా చాలామందిలో బొజ్జ కనబడుతుండటం గమనార్హం. వీరిలో అవయవాల చుట్టూరా, కాలేయం చుట్టూరా కొవ్వు ఎక్కువగా పోగుపడుతున్నట్టు గుర్తించాం. బరువు తగ్గినా ఇలాంటి కొవ్వు అంత తేలికగా కరిగేది కాదు. ఇదే ఇన్సులిన్ నిరోధకతకు దారితీస్తోంది. గ్లూకోజు స్థాయులను నియంత్రించటంలో, కొవ్వు ఆమ్లాలను విడగొట్టటంలో పాలు పంచుకునే అడిపో నెక్టిన్ ప్రోటీన్ భారతీయుల్లో తక్కువగా కనబడుతుండటం మరో కారణం. ముఖ్యంగా హై మాలిక్యులార్ వెయిట్ అడిపోనెక్టిన్ స్థాయులు తక్కువగా గలవారికి గుండెజబ్బుల ముప్పు ఎక్కువ. ఈ రకం అడిపోనెక్టిన్ భారతీయుల్లో చాలా తక్కువగా ఉంటోంది కూడా. అలాగే రక్తనాళాల్లో పూడికలు ఏర్పడే ప్రక్రియ భారతీయుల్లో ఇంకాస్త త్వరగానే జరుగుతోంది. ఇలాంటివన్నీ మధుమేహం, గుండెజబ్బుల ముప్పు పెరగటానికి దోహదం చేస్తున్నాయి. ఇందుకు చాలా అంశాలు కారణమవుతున్నాయి. వీటిల్లో ఒకటి- పిండి పదార్థాలు, నూనెలు ఎక్కువెక్కువ తీసుకోవటం. మనం తీసుకునే పిండి పదార్థాలు ఎక్కువగా అన్నం లేదా చపాతీల ద్వారానే అందుతాయి. బియ్యం, గోధుమలతో ట్రైగ్లిజరైడ్లు, చెడ్డ కొవ్వు (ఎల్‌డీఎల్) పెరిగే అవకాశముంది. ఇవి గుండె ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయి. ఇతరత్రా ముప్పు కారకాలేవీ లేకపోయినా కూడా మధుమేహం, గుండెజబ్బుల ముప్పు పెరగటానికి ఇలాంటి ఆహారమే దోహదం చేస్తున్నట్టు స్పష్టంగా తెలుస్తోంది. రెండోది- శారీరకశ్రమ, వ్యాయామం అంతగా చేయకపోవటం. దీనికి తోడు చేసే వ్యాయామమూ సరిపడకపోవటం. పాశ్చాత్యదేశాల వారు వారానికి 150 నిమిషాల సేపు వ్యాయామం చేస్తే సరిపోతుంది. కానీ అదే మనమైతే 250 నిమిషాలు చేయాల్సి ఉంటుంది. ఎందుకంటే అవయవాల చుట్టూరా, నడుం చుట్టూరా పోగుపడిన కొవ్వు అంత త్వరగా కరగదు. కాబట్టి మనం ఇంకా ఎక్కువసేపు వ్యాయామం చేయాల్సిన అవసరముంది.



భారతీయుల్లో కనబడుతున్న ప్రత్యేక కారణాలేంటి?

భారతీయుల ఒంట్లో కొవ్వులు స్థిరపడటం, అడిపోనెక్టిన్ ప్రోటీన్ తీరుతెన్నులను మరింత బాగా అర్థం చేసుకోవటానికి నవజాత శిశువులపైనా అధ్యయనాలు (పెరినేటల్ స్టడీస్) చేశాం. పుట్టిన సమయంలో బ్రిటన్ పిల్లలు, భారతీయ పిల్లల బరువు వివరాలను పరిశీలించాం. యూరప్ పిల్లలతో పోలిస్తే భారతీయ పిల్లలు తక్కువ బరువుతో పుడుతున్నారు. అంతేకాదు.. పుట్టినపుడే వీరి కడుపు భాగంలో, కాలేయంలో కొవ్వు మోతాదు ఎక్కువగానూ.. అడిపోనెక్టిన్ ప్రోటీన్ స్థాయులు తక్కువగానూ ఉంటున్నాయి. ఇన్సులిన్ నిరోధకత కూడా బయటపడింది. ఇదే 'ఇండియన్ థిన్ ఫ్యాట్ బేబీ' భావనకు పురుడుపోసింది. అంటే మనవాళ్లు పైకి చూడటానికి సన్నగానే ఉన్నా ఒంట్లోని కొవ్వు పరంగా చూస్తే ఊబకాయంతోనే ఉంటున్నారని అర్థం. తల్లి కడుపులో ఉన్నప్పుడు తగినంత పోషణ లభించకపోవటం దీనికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది. పిండానికి అందే పోషకాలను బట్టే శరీర నిర్మాణం జరుగుతుందన్నది తెలిసిందే. అవసరమైన దానికన్నా ఎక్కువ ఆహారం తీసుకుంటే పిల్లలు మరీ ఎక్కువ బరువుతో పుట్టొచ్చు. అదే పోషణ లోపిస్తే తక్కువ బరువుతో, సన్నగానూ పుట్టొచ్చు. ఇది ముందు ఇన్సులిన్ నిరోధకతకు దారితీసి మధుమేహం ముప్పు పెరగటానికి దోహదం చేస్తుంది. పుట్టినపుడు పిల్లల బరువు నిర్ణీత స్థాయి కన్నా తగ్గుతున్నకొద్దీ పెద్దయ్యాక మధుమేహం, గుండెజబ్బులు వచ్చే ముప్పూ పెరుగుతుంది. ఉదాహరణకు- పుట్టినపుడు నిర్ణీతం కన్నా పిల్లల బరువు కిలో తగ్గిందనుకోండి. మధుమేహం, గుండెజబ్బులు వచ్చే అవకాశం 25% ఎక్కువవుతుంది. పుట్టినపుడు సన్నగా ఉన్నవారు జీవితాంతం అలాగే ఉంటూ వస్తుంటే ఎలాంటి ఇబ్బంది ఉండేది కాదేమో. కానీ యుక్తవయసులో బరువు పెరుగుతుంటారు. ఇది ముందు జబ్బుల ముప్పు పెరగటానికి దారితీస్తుంది ఒకరకంగా చెప్పాలంటే- మనకు మధుమేహం, గుండెజబ్బులు రావటమనేది తల్లికడుపులో ఉండగానే నిర్ణయమైపోతుందని అనుకోవచ్చు. గర్భిణులు తగినంత పోషకాహారం తీసుకుంటే భవిష్యత్తులో చాలావరకు జబ్బులను నివారించుకోవచ్చనీ చెప్పుకోవచ్చు.

విటమిన్ డి విషయంలోనూ ఏవైనా తేడాలు కనబడుతున్నాయా?

విటమిన్ డి చాలా ఆసక్తికరమైన అంశం. ఇందులో రెండు అంశాలున్నాయి. వీటిని అర్థం చేసుకోవటం చాలా ముఖ్యం. ఒకటి- భారతీయుల్లో విటమిన్ డి మోతాదులు తక్కువగా ఉంటున్నా అదనంగా తీసుకోవటం వల్ల ఎలాంటి ప్రయోజనం కనబడకపోవటం. మొదట్లో విటమిన్ డి మీద చాలా అధ్యయనాలే జరిగాయి. విటమిన్ డి తక్కువగా ఉండటానికీ మధుమేహం, గుండెజబ్బుల ముప్పు పెరగటానికీ



సంబంధం ఉంటున్నట్టు స్పష్టంగా గుర్తించాయి. సహజంగానే మనలో విటమిన్ డి స్థాయులు తక్కువ. దీనికి కారణం మన చర్మమే. సాధారణంగా ఎండ తగిలినపుడు మన చర్మం ఒకరకం విటమిన్ డిని (1,25-డై హైడ్రాక్సీకోలీకాల్సిఫెరాల్) తయారుచేసుకుంటుంది. అయితే ముదురురంగు చర్మం సూర్యరశ్మిని సరిగా గ్రహించలేదు. అందువల్ల మన ఒంటికి ఎండ తగిలినా విటమిన్ డి అంతగా తయారుకాదు. కాబట్టి మనదేశంలో ఏడాదంతా ఎండలు బాగానే కాస్తున్నా కూడా విటమిన్ డి లోపం.. ఫలితంగా మధుమేహం, గుండెజబ్బుల ముప్పూ ఎక్కువగానే ఉంటోంది. ఆందోళనకరమైన సంగతేంటంటే- మాత్రల రూపంలో అదనంగా విటమిన్ డి తీసుకున్నా ఎలాంటి ప్రయోజనం కనబడటం లేదని అధ్యయనాలు తేల్చటం. పైగా భారతీయుల్లో విటమిన్ డి నార్మల్ స్థాయులేంటన్నదీ కచ్చితంగా నిర్వచించలేదు. వీటిని చాలావరకు యూరోపియన్ల ఆధారంగానే నిర్వచించారు. అందువల్ల దీన్ని కొలమానంగా తీసుకోవాలా? వద్దా? అనేది ప్రశ్నార్థకంగానూ నిలుస్తోంది. మనలోనూ యూరోపియన్లతో సమానంగా విటమిన్ డి స్థాయులు ఉన్నప్పటికీ అది మన శరీరానికి సరిపడకపోవచ్చు. ఒకవేళ తక్కువగా ఉంటే అదనంగా విటమిన్ డి తీసుకోవటం అవసరమా? అన్నదీ కచ్చితంగా తెలియదు. ఇక రెండోది- మనం తీసుకునే ఆహారం. మనదేశంలో చపాతీల వాడకం ఎక్కువ. గోధుమలు, జొన్నలు, మొక్కజొన్నల వంటి వాటిల్లోని ఫైటేట్స్ (ఫైటిక్ ఆమ్లం) శరీరం విటమిన్ డిని గ్రహించుకునే సామర్థ్యాన్ని తగ్గిస్తాయి. అందువల్ల ఒంటికి కాసింత ఎక్కువగా.. అదీ ఉదయం పూట ఎండ తగిలేలా చూసుకోవటం మంచిది. మధ్యాహ్నం ఎండ కాసేపటికే చుర్రుమంటుంది. అదే ఉదయం పూట అయితే ఇంకాస్త ఎక్కువసేపు సూర్యరశ్మి తగిలేలా చూసుకోవచ్చు. ఒంటి నిండా దుస్తులు ధరించకుండా వీలైనంతవరకు చర్మం బయటకు కనబడేలా చూసుకోవాలి. అంటే విటమిన్ డి విషయంలో సూర్యరశ్మి, ఆహారం రెండూ కీలకమేననే విషయాన్ని అంతా గుర్తించాలి.

నిద్రకూ మధుమేహానికీ సంబంధముందా?



నిద్రకు సంబంధించి రెండు ముఖ్యమైన విషయాలు చెప్పుకోవాలి. 1. కంటినిండా తగినంత నిద్ర. 2. నిద్ర సమస్యలు. నిద్ర తక్కువైనా, ఎక్కువైనా మధుమేహం ముప్పు పెరుగుతుంది. అందువల్ల రాత్రిపూట తగినంత.. అంటే 6-7 గంటల సేపు కంటినిండా నిద్రపోవటం ఎంతైనా అవసరం. ఒక క్రమ పద్ధతిలో సాగే మన నిద్ర, మెలకువలను జీవగడియారం (సర్కేడియన్ రిథమ్) నియంత్రిస్తుంటుంది. ఏ కారణంతోనైనా నిద్ర తీరుతెన్నులు దెబ్బతింటే జీవగడియారం కూడా అస్తవ్యస్తమవుతుంది. ఫలితంగా ఒంట్లో హార్మోన్లు, గ్లూకోజు స్థాయులూ ప్రభావితమవుతాయి. నిద్రలో కూడా కనుగుడ్డు వేగంగా కదిలే దశ (ఆర్ఈఎం స్లీప్) చాలా కీలకం. ఇది అస్తవ్యస్తమైన వ్యవస్థలు తిరిగి గాడినపడేలా చేస్తుంది. కాబట్టి రాత్రిపూట తగినంత నిద్ర పోవటం ముఖ్యం. అలాగే నిద్రలేమి, నిద్రలో శ్వాసకు అడ్డంకి తలెత్తటం (స్లీప్ అప్నియా) వంటి సమస్యలనూ తేలికగా తీసుకోవటానికి లేదు. ఇవీ మధుమేహం, గుండెజబ్బుల ముప్పును పెంచుతాయి. నిద్రలేమితో జీవగడియారం అస్తవ్యస్తం కావటం మూలంగా ఒంట్లో కొన్నిరకాల హార్మోన్ల స్థాయులు పెరుగుతాయి. ఇన్సులిన్ మోతాదులు తగ్గుతాయి. అందువల్ల మధుమేహుల్లో రక్తంలో గ్లూకోజు స్థాయుల నియంత్రణ ఒక్క మందుల మీదే కాదు. జీవనశైలి మీద కూడా ఆధారపడి ఉంది. ఎప్పుడు నిద్రలేస్తున్నాం, ఎప్పుడు వ్యాయామం చేస్తున్నాం, ఎప్పుడు తింటున్నాం, ఎప్పుడు పని చేస్తున్నాం, ఎప్పుడు నిద్రపోతున్నాం.. ఇలాంటివన్నీ ప్రభావం చూపుతాయి.

మధుమేహుల సంఖ్య పెరగటంలో ఆహార అలవాట్లు ప్రభావం చూపుతున్నాయా?



భారత్‌లో 1971లో పట్టణాల్లోనూ, గ్రామీణ ప్రాంతాల్లోనూ 1.2% మంది మధుమేహులు ఉండేవారు. 1990ల దగ్గరికి వచ్చేసరికి పట్టణ ప్రాంతాల్లో మధుమేహం గణనీయంగా పెరిగింది. ఇది ఏకంగా 17-18 శాతానికి ఎగబాకింది. గ్రామాల్లో మాత్రం కాస్త పెరిగి 2% అయ్యింది. అదే ఇటీవలి కాలంలో.. ముఖ్యంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహించిన అధ్యయనంలో గ్రామీణ ప్రాంతాల్లో కూడా పట్టణ ప్రాంతాలతో సమానంగా 18% మంది మధుమేహంతో (ముందస్తు మధుమేహంతో కలిపి) బాధపడుతున్నట్టు తేలింది. ఒక్క మనదేశంలోనే కాదు. దక్షిణాసియా, మధ్యప్రాచ్య, గల్ఫ్ దేశాల్లోనూ ఇలాంటి ధోరణే కనబడుతోంది. కేవలం 47 ఏళ్లలోనే పరిస్థితి ఇంతలా ఎలా మారిపోయింది? జన్యుపరపరమైన కారణాలు, పర్యావరణ అంశాలు ప్రభావితం చేశాయా? అసలేం జరిగిందని ఆరా తీయగా.. అన్నీ కూడా ఆహార మార్పుల వైపే వేలెత్తి చూపుతుండటం గమనార్హం. ఒకప్పటితో పోలిస్తే ప్రజల ఆర్థిక స్థితిగతులు బాగా మెరుగుపడ్డాయి. ఇది మంచి పరిణామమే. కానీ దీంతో పాటు జీవనశైలి, ఆహార అలవాట్లు కూడా పెద్దఎత్తున మారిపోయాయి. శారీరక శ్రమ బాగా తగ్గింది. నడక కూడా తగ్గిపోయింది. చిన్న చిన్న దూరాలకూ వాహనాల వాడకం పెరిగింది. అదే సమయంలో ఆహారం ద్వారా తీసుకునే కేలరీల మోతాదులూ పెరిగిపోయాయి. అంతేకాకుండా పాశ్చాత్య తిండి.. ముఖ్యంగా కొవ్వుల వాడకం పెరిగింది. అలాగే చక్కెర, పిండి పదార్థాల వాడకమూ గణనీయంగా పెరిగింది. ఈ పరిణామాలన్నింటినీ చూస్తే మధుమేహుల సంఖ్య పెరగటంలో తిండి ముఖ్యమైన పాత్ర పోషిస్తోందనే సంగతి స్పష్టంగా బయటపడుతోంది. ఇలాంటి ఆహారం ఇన్సులిన్ నిరోధకత పెరగటానికి.. ఫలితంగా మధుమేహం ముప్పు ఎక్కువ కావటానికి దోహదం చేస్తుంది. బ్రిటన్‌లో మేం చేసిన అధ్యయనంలోనూ ఈ విషయం బయటపడింది. అప్పుడప్పుడే మధుమేహం, ఊబకాయంలోకి అడుగిడుతున్నవారిని ఎంచుకొని.. ఏడాది పాటు చాలా తక్కువ కేలరీల ఆహారం (600 కిలో కేలరీలు) ఇవ్వగా.. వీరందరిలోనూ మధుమేహం వెనక్కి మళ్లటం గమనార్హం.

మధుమేహాన్ని నివారించుకోవచ్చా?



మధుమేహాన్ని నివారించుకునే పద్ధతుల గురించి మనకిప్పుడు బాగానే తెలుసు. ఇదంత కష్టమైన పనేమీ కాదనీ చెప్పుకోవచ్చు. మధుమేహ నివారణ ప్రోగ్రామ్‌లో భాగంగా ప్రపంచవ్యాప్తంగా దీనిపై ఎన్నో అధ్యయనాలు జరిగాయి. ఇవన్నీ ఆహార, వ్యాయామాలతో మధుమేహాన్ని నివారించుకోవచ్చనే చెబుతున్నాయి. మధుమేహం వచ్చే అవకాశం ఎక్కువగా ఉన్నవారు.. అంటే అధిక బరువు, 40 ఏళ్లు పైబడటం (భారతీయులు), తల్లిదండ్రుల్లో లేదా తోబుట్టువుల్లో ఎవరికైనా మధుమేహం ఉండటం వంటి ముప్పు కారకాలు గలవారు కేలరీలు తక్కువగా తీసుకోవటం, వారానికి కనీసం 5 రోజుల పాటు వేగంగా నడవటం వంటి వాటి ద్వారా బరువును 5% మేరకు తగ్గించుకున్నా మధుమేహం ముప్పు 60% తగ్గుతున్నట్టు తేలటం గమనార్హం. ఇది చిన్న విషయమేమీ కాదు. బ్రిటన్‌లో ఎన్‌హెచ్ఎస్ మధుమేహ నివారణ ప్రోగ్రామ్‌లో భాగంగా 40 ఏళ్లు పైబడినవారందరికీ ఇలాంటి జాగ్రత్తలను సూచిస్తున్నారు కూడా. 'తక్కువ తినండి, ఎక్కువ కష్టపడండి' అన్నదే దీని కీలక సూత్రం. ఇది మంచి ఫలితాలనూ ఇస్తోంది. మధుమేహం విషయంలో జబ్బు ఏ వయసులో బయటపడిందన్నదీ కీలకమే. భారతీయుల్లో ఇదింకా ముఖ్యం. చిన్నవయసులోనే బయటపడితే (40 ఏళ్ల లోపు) జీవనకాలం 10-15 సంవత్సరాల వరకు తగ్గే అవకాశముంది. అదే 60-65 ఏళ్లలో బయటపడితే కేవలం 1-2 సంవత్సరాల ఆయుష్షే తగ్గుతుంది. 70 ఏళ్ల వయసులో బయటపడితే అంత తేడా ఏమీ ఉండదు. అందువల్ల మధుమేహం ముప్పు అధికంగా గలవారు తగు జాగ్రత్తలు తీసుకుంటూ దాన్ని వాయిదా వేసుకోగలిగితే జీవనకాలాన్ని గణనీయంగా పెంచుకోవచ్చు.

కాన్పయ్యాక జుట్టూడటమా?



బిడ్డ ఆలనలో పాలనలో తల్లి గడిపే ప్రతి క్షణమూ మధురానుభూతే. బిడ్డ కేరింతలు కొడుతుంటే ఇల్లంతా సంతోష సాగరంలో తేలియాడుతుంది. ఒకపక్క ఇలాంటి ఆనందానుభూతులు మనసును ఉక్కిరిబిక్కిరి చేసే మాట నిజమే అయినా మరోపక్క తల్లికి కాసింత విచారాన్ని కలిగించే అంశాలు ఎదురయ్యే అవకాశమూ లేకపోలేదు. ముఖ్యంగా పట్టుకుచ్చులాంటి జుట్టు రోజురోజుకీ ఊడిపోతుంటే కలుక్కుమనిపించదూ? నిజమే.. ప్రసవం తర్వాత కొన్ని నెలల పాటు తల్లికి జుట్టు ఊడిపోవటమనేది సహజమే. దీనికి కారణం గర్భధారణ సమయంలో ఒంట్లో పెరిగిన ఈస్ట్రోజెన్, ప్రొజెస్టిరాన్ వంటి హార్మోన్ల స్థాయులతో పాటు రక్తం పరిమాణం కూడా తగ్గిపోవటమే. సాధారణంగా వెంట్రుకల్లో 85-95% వేగంగా ఎదిగే దశలో ఉంటాయి. మిగతావి విశ్రాంతి దశలో ఉండిపోతుంటాయి. విశ్రాంతి దశ తర్వాత ఈ వెంట్రుకలు ఊడిపోతుంటాయి. ఇదంతా ఒక క్రమ పద్ధతిలో జరుగుతూ వస్తుంటుంది. గర్భధారణ సమయంలో హార్మోన్ల ప్రభావం వల్ల వెంట్రుకలు చాలాకాలం ఎదిగేదశలోనే కొనసాగుతాయి. పైగా రక్తప్రసరణ ఎక్కువగా జరగటం వల్ల జుట్టుకు పోషకాలు కూడా దండిగానే లభిస్తాయి. అందువల్ల వెంట్రుకలు ఊడిపోవటమనేది తక్కువ. అయితే కాన్పు తర్వాత హార్మోన్ల స్థాయులు తగ్గటం వల్ల జుట్టు ఎక్కువగా ఊడిపోవటం మొదలవుతుంది. దీనికి పెద్దగా గాబరా పడిపోవాల్సిన పనేమీ లేదు. ఐదారు నెలల తర్వాత జుట్టు తిరిగి సాధారణ స్థాయికి వచ్చేస్తుంటుంది. కానీ కొందరిలో కొందరికి కుచ్చులుకుచ్చులుగానూ ఊడివస్తుంటుంది. పైగా ఎక్కువకాలమూ కొనసాగుతుంటుంది. కాబట్టి కొన్ని జాగ్రత్తలు తీసుకోవటం మంచిది.

- జుట్టును నెమ్మదిగా, మృదువుగా దువ్వుకోవటానికి ప్రయత్నించాలి. చిక్కులు పడినప్పుడు గట్టిగా దువ్వితే మరింత ఎక్కువగా రాలిపోవటానికి అవకాశముంది. రోజుకు ఒకటి కన్నా ఎక్కువసార్లు దువ్వకుండా చూసుకోవట మేలు. అలాగే జుట్టు ఆరబెట్టుకోవటానికి, వంకర్లు తిప్పటానికి డ్రయర్లు లేదా కర్లింగ్ ఐరన్ వంటివి వాడటం మానెయ్యాలి.
- ఆకుకూరలు, క్యారట్లు, చిలగడదుంప, గుడ్లు, చేపల వంటివి ఎక్కువగా తీసుకోవాలి. వీటిల్లోని విటమిన్లు, ఒమేగా కొవ్వు ఆమ్లాలు జుట్టుకు ఎంతో మేలు చేస్తాయి.
- జుట్టు ఆరోగ్యానికి తోడ్పడే ఆయుర్వేద ఔషధాలతో కూడిన తైలాలు కూడా బాగా ఉపయోగపడతాయి. ఇవి జుట్టు నిగనిగలాడుతూ కనిపించేలా కూడా చేస్తాయి.



ఆస్కార్ సంబరం



గ్యారీ ఓల్డ్ మ్యాన్

మిరిమిట్లు గొలిపే ఆస్కార్ ప్రతిమను ఈ ఏడాది అందుకొనే అదృష్టవంతులు ఎవరో..! అని సినీ ప్రపంచమంతా ఆత్రుతగా ఎదురు చూసింది. సినీ ప్రేమికుల హృదయాలు ఆనందంతో నిండేలా 90వ ఆస్కార్ పురస్కారాల వేడుక సోమవారం ఉదయం (భారత కాలమానం ప్రకారం) లాస్ ఏంజెలెస్‌లోని డాల్బీ థియేటర్‌లో కనుల పండువగా జరిగింది. విన్‌స్టన్ చర్చిల్‌గా 'డార్కెస్ట్ అవర్'లో పాత్రకు ప్రాణం పోసిన గ్యారీ ఓల్డ్‌మ్యాన్ ఈ ఏటి ఆస్కార్ ఉత్తమ నటుడిగా సత్తాచాటారు. కన్నకూతురిపై జరిగిన అత్యాచారంపై న్యాయపోరాటానికి దిగిన ఓ తల్లిగా 'త్రీ బిల్‌బోర్డ్స్ ఔట్‌సైడ్ ఎబ్బింగ్, మిస్సోరీ'లో ఫ్రాన్సిస్ మెక్ డొర్మండ్ నటనకు ఆస్కార్ జ్యూరీ మనసు చలించిపోయింది. అందుకే ఫ్రాన్సిస్‌కు ఆస్కార్ ఉత్తమ నటి కిరీటం అందించారు. వింత జంతువు, మూగ అమ్మాయి ప్రేమను మనసుకు హత్తుకొనేలా ఆవిష్కరించిన 'షేప్ ఆఫ్ వాటర్' ఆస్కార్ ఉత్తమ చిత్రంగా పురస్కారం గెలుచుకొంది. ఈ చిత్రాన్ని వెండితెరపై గొప్పగా తీర్చి దిద్దిన దర్శకుడు గుల్లెర్మో డెల్ టోరోకు ఉత్తమ దర్శకుడిగా తొలి ఆస్కార్ వరించింది. ఇలా సినిమాకు సంబంధించిన వివిధ విభాగాల్లో సత్తా చాటిన వాళ్లు ఆస్కార్ పురస్కారాలు అందుకొన్నారు. ప్రముఖ టెలివిజన్ హోస్ట్ జిమ్మీ కిమ్మెల్ వ్యాఖ్యాతగా వ్యవహరించిన ఆస్కార్ వేడుక పురస్కార విజేతలు సంతోషం...సినీ అభిమానుల కోలాహలం మధ్య సందడిగా సాగిపోయింది.



గుల్లెర్మో డెల్ టోరో



ఫ్రాన్సిస్ మెక్ డొర్మండ్

వేదిక ఏదైనా... సత్తా చాటేస్తుంది

కన్న కూతురు అత్యాచారం, హత్యకు గురైతే.. దోషులను శిక్షించి న్యాయం చేయమని పోలీసులు, న్యాయ స్థానాల చుట్టూ తిరిగినా ఫలితం కనిపించకపోతే.. గుండెలు పిండేసే ఆ బాధ దిగమింగుకుని న్యాయం కోసం రోడ్డుకెక్కిన ఓ తల్లి పాత్రలో కంటతడి పెట్టించింది ఫ్రాన్సిస్ మెక్ డొర్మండ్. 'త్రీ బిల్‌బోర్డ్స్ ఔట్‌సైడ్ ఎబ్బింగ్, మిస్సోరీ'లోని తన పాత్రతో ఇప్పటికే విమర్శకుల ప్రశంసలతో పాటు ఉత్తమ నటిగా గోల్డెన్ గ్లోబ్, బాఫ్టా పురస్కారాలు గెలుచుకుంది. ఇప్పుడు ప్రతిష్ఠాత్మక ఆస్కార్ పురస్కారాన్నీ చేజిక్కించుకుంది. 60 ఏళ్ల డొర్మండ్‌కు ఇది రెండో ఆస్కార్. 1997లో వచ్చిన 'ఫార్గో'తో ఉత్తమ నటిగా తొలి ఆస్కార్ అందుకుంది. మరో మూడు చిత్రాలకు ఉత్తమ సహాయ నటిగా ఆస్కార్ నామినేషన్లు అందుకుంది. నాటకాలు, టీవీ సిరీస్‌లు, వెండితెర చిత్రాలు.. ఇలా మూడు వేదికలపైనా నటించిన డొర్మండ్.. ఆయా వేదికల్లో ఉత్తమ ప్రదర్శనకు అందించే ట్రిపుల్ క్రౌన్ ఆఫ్ యాక్టింగ్(టోనీ, ఎమ్మీ, ఆస్కార్) అవార్డులు అందుకున్న అతికొద్ది మంది నటీమణుల్లో ఒకరిగా నిలిచింది. వేదిక ఏదైనా అత్యుత్తమ నటనతో సత్తా చాటింది. బ్లడ్ సింపుల్ చిత్రంతో వెండితెరకొచ్చిన ఆమె మిస్సిస్సిప్పి బర్నింగ్, ఆల్మోస్ట్ ఫేమస్, నార్త్ కంట్రీ తదితర చిత్రాలతో గుర్తింపు తెచ్చుకుంది.

తొలిసారే గెలిచేశాడు

'షేప్ ఆఫ్ వాటర్'తో దర్శకుడిగా తొలి ఆస్కార్ నామినేషన్ అందుకున్నాడు గుల్లెర్మో డెల్ టోరో. తొలి ప్రయత్నంలోనే విజేతగా నిలిచి పురస్కారం సాధించడం విశేషం. ఈ మెక్సికన్ దర్శకుడు 53 ఏళ్ల వయసులో ఈ ఘనత సాధించాడు. ఎనిమిదేళ్ల వయసు నుంచే ఈయనకు ఫిలిం మేకింగ్‌పై ఆసక్తి ఏర్పడింది. తన తండ్రి కెమెరాతో లఘు చిత్రాలు తీయడం మొదలెట్టాడు. సుమారు పది లఘు చిత్రాలు తీసిన తర్వాత వెండితెరకొచ్చాడు. హర్రర్ చిత్రాలు 'ది డెవిల్స్ బ్యాక్ బోన్', 'పాన్స్ లెబిరిన్త్', సూపర్‌హీరో చిత్రాలు 'బ్లేడ్ 2', 'హెల్‌బాయ్', 'హెల్‌బాయ్ 2', సైన్స్ ఫిక్షన్ చిత్రం 'పసిఫిక్ రిమ్' తదితర చిత్రాలు ఆయనకు గుర్తింపు తెచ్చాయి. 'షేప్ ఆఫ్ వాటర్'తో ఉత్తమ దర్శకుడిగా గోల్డెన్ గ్లోబ్, బాఫ్టా పురస్కారాలు పొందిన గుల్లెర్మో ఇప్పుడు ఆస్కార్‌నూ సొంతం చేసుకున్నాడు.

మూగ ప్రేమకు జ్యూరీ ఫిదా

నీళ్లలో నివసించే ఓ వింత జీవి... సంజ్ఞల భాషలో మాత్రమే మాట్లాడే ఓ మూగ అమ్మాయి. వారిద్దరి మధ్య ప్రేమ చిగురిస్తే ఎలా ఉంటుంది!. ఇలాంటి విచిత్రమైన కథతో తెరకెక్కిన ఫాంటసీ చిత్రం 'షేప్ ఆఫ్ వాటర్' చూసి ఆస్కార్ జ్యూరీ సభ్యులు ఫిదా అయిపోయారు. ఈ ఏడాది ఉత్తమ చిత్రంగా ఆస్కార్ పురస్కారం కట్టబెట్టారు. నామినేషన్ పొందిన తొమ్మిది చిత్రాల మధ్య గట్టి పోటీని దాటుకుని ఈ చిత్రం విజేతగా నిలవడం గమనార్హం. గతేడాది విడుదలైన ఈ చిత్రాన్ని 2017లో వచ్చిన పది అత్యుత్తమ చిత్రాల్లో ఒకటిగా అమెరికన్ ఫిలిం ఇన్‌స్టిట్యూట్ ఎంపిక చేసింది. వెనిస్ చిత్రోత్సవంలో ఉత్తమ చిత్రంగా గోల్డెన్ లయన్ పురస్కారం అందుకుంది. దీంతో పాటు పలు అంతర్జాతీయ చిత్రోత్సవాల్లో ప్రశంసలందుకుంది. ఇప్పుడు ప్రతిష్ఠాత్మక ఆస్కార్ పురస్కారాన్ని కైవసం చేసుకోవడం విశేషం. ఈ ఏడాది అత్యధికంగా 13 నామినేషన్లు పొందిన ఈ చిత్రం పురస్కార విషయంలోనూ అగ్రభాగాన నిలిచింది. ఉత్తమ చిత్రం, దర్శకుడు, ప్రొడక్షన్ డిజైన్, ఒరిజినల్ స్కోర్ విభాగాల్లో ఈ చిత్రం విజేతగా నిలిచింది.



'షేప్ ఆఫ్ వాటర్'

అచ్చం చర్చిల్... పట్టేశాడు ఆస్కార్

'ప్రతి రాత్రి విన్‌స్టన్ చర్చిల్ మా ఇంటికి వస్తాడు. పొద్దున లేచేసరికి గ్యారీ ఓల్డ్ మ్యాన్‌గా మారిపోయుంటాడు' - 'డార్కెస్ట్ అవర్'లో బ్రిటన్ మాజీ ప్రధాని విన్‌స్టన్ చర్చిల్ పాత్రలో నటించిన ప్రముఖ బ్రిటిష్ నటుడు గ్యారీ ఓల్డ్‌మ్యాన్ గురించి ఆయన సతీమణి చెప్పిన మాటలివి. గ్యారీ ఆ పాత్రలో ఎంతగా లీనమయ్యాడన్న దానికి ఆ వ్యాఖ్యలే నిదర్శనం. ఏళ్ల తరబడి చర్చిల్ గురించి అధ్యయనం చేసి మరీ తన పాత్రకు సిద్ధమైన గ్యారీ, చిత్రీకరణ జరిగిన న్నాళ్లూ చర్చిల్‌లాగే ప్రవర్తించేవారట. నటనపై ఆయనకున్న నిబద్ధతే ఇప్పుడు తనకు 60 ఏళ్ల వయసులో ఉత్తమ నటుడిగా ఆస్కార్ పురస్కారం తెచ్చిపెట్టింది. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో క్లిష్ట పరిస్థితుల్లో బ్రిటన్ ప్రధాని పీఠమెక్కి కీలక భూమిక పోషించిన విన్‌స్టన్ చర్చిల్ జీవితం ఆధారంగా తెరకెక్కిన చిత్రం 'డార్కెస్ట్ అవర్'. ఆ చిత్రం విడుదలయ్యాక చర్చిల్‌గా గ్యారీ నటనకు ప్రేక్షకులు, విమర్శకుల నుంచి అద్భుత ప్రశంసలొచ్చాయి. దీంతో పాటు ఉత్తమ నటుడిగా గోల్డెన్ గ్లోబ్, బాఫ్టా, స్క్రీన్ యాక్టర్స్ గిల్డ్ పురస్కారాలు వరించాయి. ఇప్పుడు ఆస్కార్ పురస్కారాన్నీ కైవసం చేసుకున్నాడు. ఇదే ఆయనకు తొలి ఆస్కార్ విజయం. గతంలో 'టింకర్ టైలర్ సోల్జర్ స్పై'తో నామినేషన్ అందుకున్నప్పటికీ పురస్కారం రాలేదు. రంగస్థల నటుడిగా కెరీర్ ప్రారంభించిన గ్యారీ, షేక్స్‌పియర్ నాటకాల్లో పలు పాత్రలతో మెప్పించాడు. ఆ తర్వాత టీవీ సిరీస్‌లు చేసి వెండితెర అవకాశాలు సొంతం చేసుకున్నాడు. 'ట్రూ రొమాన్స్', 'ది ఫిఫ్త్ ఎలిమెంట్', 'ఎయిర్‌ఫోర్స్ వన్' లాంటి చిత్రాల్లో ప్రతినాయకుడిగా ఆకట్టుకున్నాడు. హ్యారీ పోటర్ సిరీస్, బ్యాట్‌మ్యాన్: డార్క్ నైట్ ట్రైలాజీ, డాన్ ఆఫ్ ది ప్లానెట్ ఆఫ్ ది ఏప్స్ తదితర చిత్రాల్లో ఆయన గుర్తుండిపోయే పాత్రలు పోషించారు.

శశి... శ్రీదేవికి ఘన నివాళి



శశికపూర్

కన్నుల పండువగా సాగిన ఆస్కార్ వేడుకల్లో మన భారతీయ నటులు శశికపూర్, శ్రీదేవికి నివాళులు అర్పించారు. 'ఇన్ మెమోరియన్' సెగ్మెంట్‌లో భాగంగా 'చిత్ర ప్రపంచంలోని గొప్ప నటులు, మంచి వ్యక్తులు వెళ్లిపోయారు' అంటూ శశికపూర్, శ్రీదేవిలను గుర్తుచేసుకొన్నారు. ఇందులో భాగంగానే 'భారతీయుల ప్రేయసి, స్నేహితురాలు, తల్లి...బాలీవుడ్ తార శ్రీదేవి' అంటూ శ్రీదేవిని అభివర్ణించారు. ఇదే వేదికపై ప్రముఖ హాలీవుడ్ నటులు రోజర్ మూర్, జోనాథన్ డెమ్మే, హారర్ లెజెండ్ జార్జ్ రొమెరోలకూ నివాళులు అర్పించారు.



శ్రీదేవి

విజేతలు వీళ్లే

విదేశీ భాషా చిత్రం	ఎ ఫెంటాస్టిక్ ఉమన్ (స్పానిష్)
సహాయ నటుడు	శామ్ రాక్‌వెల్ (త్రీ బిల్‌బోర్డ్స్..)
సహాయ నటి	అలిసన్ జాన్నీ (ఐ, టోన్యా)
ఒరిజినల్ స్క్రీన్‌ప్లే	జోర్డాన్ పీలె (గెటవుట్)
అడాప్టెడ్ స్క్రీన్‌ప్లే	జేమ్స్ ఐవరీ (కాల్ మీ బై యువర్ నేమ్)
ఛాయాగ్రహణం	రోజర్ ఎ.డెకిన్స్ (బ్లేడ్ రన్నర్ 2049)
ఫిలిం ఎడిటింగ్	లీ స్మిత్ (డంకర్క్)
యానిమేషన్ చిత్రం	కోకో
డాక్యుమెంటరీ చిత్రం	ఇకారస్

వేడుక విశేషాలు

- ఉత్తమ నటి పురస్కారాన్ని స్వీకరించే సమయంలో డొర్మండ్ నామినేషన్లు సాధించిన సాటి మహిళలందరినీ స్త్రీ సాధికారతకు సంఘీభావంగా లేచి నిలబడి మద్దతు తెలపమని కోరింది. తన ఆస్కార్ పురస్కార ప్రతిమను వేదికపై పెట్టి ఉత్సాహంగా ప్రసంగించింది.
- హాలీవుడ్‌లో లైంగిక వేధింపులు, దాని పర్యవసానంగా మొదలైన మీ టూ హ్యాష్‌ట్యాగ్ ఉద్యమానికి సంబంధించి ఆస్కార్ వేదికపై ప్రత్యేక స్థానం దక్కింది. నిర్మాత హార్వీ విన్‌స్టీన్ తమను లైంగికంగా వేధించాడని ప్రకటించి సంచలనం సృష్టించిన నటీమణులు ఆష్లే జుడ్, సల్మా హయక్, అన్నాబెల్లా సియొరాలకు వేదికపై ఓ విభాగంలో నామినేషన్లు సాధించినవారి గురించి పరిచయం చేసే అవకాశం కల్పించారు.
- వ్యాఖ్యాతగా వ్యవహరించిన జిమ్మీ కిమ్మెల్ కూడా లైంగిక వేధింపుల గురించి స్పందించాడు. 'హార్వీ విన్‌స్టీన్‌కు జరిగింది, ఇప్పుడు అన్నిచోట్లా జరుగుతున్నదీ ఎప్పుడో జరిగుండాల్సింది. చెడును మనం దాచిపెట్టలేం. ప్రపంచం మనల్ని గమనిస్తోంద'ని వ్యాఖ్యానించాడు.

అధర చుంబన్.. అదిరెన్







ఆస్కార్ వేడుకలో అందాల భామలు సొగసులే కాదు... ఘాటైన అధర చుంబన దృశ్యాలూ కనువిందు చేశాయి. ఆస్కార్ అందుకున్న ఆనందంలో కొందరు... ఫొటోగ్రాఫర్ల ప్రేమతో అధరాల్ని జతచేసి పరవశించారు. ఇలాంటి రొమాంటిక్ దృశ్యాలు కనబడితే కెమెరా కన్ను ఊరుకోవు కదా...క్లిక్ క్లిక్ మంటూ లిప్‌లాక్‌లను బంధించేశాయి. మైమరచిపోతూ ముద్దుపెట్టుకొంటున్న ఈ అధరచుంబనాలను ఆస్వాదించండి..





ఈనాడు సినిమా



బాలకృష్ణ

మరోసారి సంక్రాంతి బరిలో...

సంక్రాంతి నందమూరి బాలకృష్ణకు బాగా అచ్చొచ్చిన సీజన్. 'డిక్టేటర్', 'గౌతమిపుత్ర శాతకర్ణి', 'జై సింహా' ఇలా వరుసగా మూడుసార్లు సంక్రాంతి పండగనాడు సందడి చేశారు. నాలుగోసారీ.. ఆయన ముగ్గుల పండగ బరిలో దిగబోతున్నారు. 'ఎన్టీఆర్' జీవిత కథని ఆయన చలన చిత్రంగా మలుస్తున్న సంగతి తెలిసిందే. ఎన్టీఆర్ పాత్రలో బాలకృష్ణ కనిపించనున్నారు. తేజ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తారు. మార్చి 29న ఈ చిత్రానికి శ్రీకారం చుడతారు. 2019 సంక్రాంతికి 'ఎన్టీఆర్' విడుదల అవుతుందని బాలకృష్ణ ప్రకటించారు. "పార్టీలకు అతీతంగా అందరూ నాన్నగారిని అభిమానించారు. ఆయన జీవిత కథతో సినిమా తీస్తున్నామని తెలిసి చాలామంది పేర్లు కూడా సూచించార"న్నారు బాలకృష్ణ. ఈ చిత్రంలో బాలయ్య 63 గెటప్పులలో కనిపించబోతున్నారు. ఇందుకు సంబంధించిన స్కెచ్చులు కూడా సిద్ధమయ్యాయి.

ఎన్టీఆర్ సిద్ధం.. ఇక మొదలెట్టేస్తారు!



ఎన్టీఆర్

'జై లవకుశ' తరవాత మరో సినిమా చేయలేదు ఎన్టీఆర్. అయితే త్రివిక్రమ్ కథకు ఓకే చెప్పి.. ఆ చిత్రానికి తగ్గట్టుగా తన దేహాకృతిని మార్చుకోవడానికి ఆయన కొంత సమయం తీసుకున్నారు. ఇప్పుడు అన్ని విధాలా సిద్ధమైపోయారు. షూటింగ్ మొదలెట్టడమే తరువాయి. ముహూర్తం కూడా కుదిరింది. ఏప్రిల్‌లో ఈ చిత్రానికి శ్రీకారం చుట్టనున్నట్టు చిత్ర బృందం ప్రకటించింది. కథానాయికగా పూజా హెగ్డేని ఎంచుకున్నారు. ఈ ఏడాది చివర్లో ఈ చిత్రాన్ని విడుదల చేస్తారు. చిత్ర నిర్మాత సూర్యదేవర రాధాకృష్ణ మాట్లాడుతూ "ఈ కాంబినేషన్ గురించి అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. స్క్రిప్టు పూర్తి స్థాయిలో సిద్ధమైంద"న్నారు. తమన్ సంగీతం అందిస్తున్నారు.



సన్నీకి కవల పిల్లలు

బాలీవుడ్ నటి సన్నీలియోని, డేనియల్ వెబర్ దంపతులకు కవల పిల్లలు జన్మించారు. గత ఏడాది అనాథ శరణాలయం నుంచి నిషా అనే చిన్నారిని దత్తత తీసుకొన్నారు సన్నీ దంపతులు. ఇప్పుడు సరోగసీ (అద్దె గర్భం) పద్ధతి ద్వారా కవల మగ పిల్లలకు జన్మనిచ్చారు. ఈ విషయాన్ని ట్విట్టర్ ద్వారా పంచుకొంది సన్నీ. 'ఇదంతా దేవుడి ప్రణాళిక. 2017 జూన్ 21నే తక్కువ వయసులోనే డేనియల్, నేను ముగ్గురు పిల్లలకు తల్లిదండ్రులవుదాం అనుకున్నాం. ఇప్పుడు మా జీవితంలోకి నిషా కౌర్ వెబర్‌తో పాటు కొత్తగా ఆషేర్ సింగ్ వెబర్, నోవా సింగ్ వెబర్ వచ్చారు. కొన్ని వారాల క్రితమే ఈ ఇద్దరూ పుట్టారు. భగవంతుడు మాకు ప్రత్యేకంగా ఏదైనా చేయాలనుకున్నాడు. అందుకే ఇలా ముగ్గురు పిల్లలను ఇచ్చాడు"అని ట్విట్టర్‌లో తన ఆనందాన్ని పంచుకొంది సన్నీ.



మెహరీన్ , విజయ్ దేవరకొండ

విజయ్ దేవరకొండ కొత్త చిత్రం

విజయ్ దేవరకొండ కథానాయకుడిగా కె.ఇ.జ్ఞానవేల్ రాజా తెలుగు, తమిళ భాషల్లో ఓ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఆనంద్‌శంకర్ దర్శకుడు. మెహరీన్ కథానాయిక. సోమవారం హైదరాబాద్‌లో లాంఛనంగా చిత్రీకరణ మొదలైంది. ముహూర్తపు దృశ్యానికి అల్లు అరవింద్ క్లాప్‌నిచ్చారు. దర్శకుడు సందీప్‌రెడ్డి కెమెరా స్విచ్చాన్ చేశారు. దర్శకుడు మాట్లాడుతూ "కథానాయకుడు విక్రమ్‌లాగా అన్ని భాషల్లోనూ నటించగల లక్షణాలు విజయ్‌లో ఉన్నాయనిపిస్తుంది. ఈ సినిమాని కొత్తతరహాలో ప్రేక్షకులు కోరే అంశాలతో తెరకెక్కిస్తామ"న్నారు. విజయ్ దేవరకొండ మాట్లాడుతూ "తొలిసారిగా తెలుగు, తమిళ భాషల్లో నటిస్తున్నందుకు సంతోషంగా ఉన్నప్పటికీ పరీక్షలకెళ్లే విద్యార్థిలా ఏదో తెలియని ఒత్తిడి ఉన్నట్టు అనిపిస్తోంద"న్నారు. నిర్మాత మాట్లాడుతూ "విజయ్‌దేవరకొండకు 'అర్జున్‌రెడ్డి'లాగే ఈ చిత్రమూ ఓ సంచలన సినిమా అవుతుందనే నమ్మకం ఉంద"న్నారు.

యువత బాధ్యత ఎంత?

అనిల్ నెమలి, మేఘన జంటగా అనురాగ్ (ఎం.ఎస్.బాబు) స్వీయదర్శకత్వంలో ఓ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సోమవారం హైదరాబాద్‌లో సినిమా చిత్రీకరణ లాంఛనంగా మొదలైంది. ముహూర్తపు సన్నివేశానికి శ్రీరామ్ క్లాప్‌నిచ్చారు. భూపతిరాజా కెమెరా స్విచ్చాన్ చేశారు. దాసరి కిరణ్ కుమార్ గౌరవ దర్శకత్వం వహించారు. అనంతరం ఏర్పాటైన విలేకర్ల సమావేశంలో దర్శకనిర్మాత మాట్లాడుతూ "ప్రస్తుతం సమాజంలో నెలకొని వున్న రాజకీయ, అనైతిక పరిస్థితుల్ని చక్కదిద్దడంలో యువత బాధ్యత ఏమేరకు ఉందనే అంశాన్ని తెలియజెబుతూ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం. ఈ నెల 25 నుంచి రెగ్యులర్ షూటింగ్ మొదలుపెడతామ"న్నారు. బ్రహ్మానందం, అలీ, పోసాని కృష్ణమురళి తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి మాటలు, సంగీతం: ఎం.ఎస్.బాబు, కెమెరా: రామకృష్ణ





శాశ్వత వ్యవసాయం...
నారీశక్తి పురస్కారం!

నేలను బట్టి యవసం... సీజన్‌ని బట్టి పంట... నలుగురి బాటలో సాగుబడి... ఈ సంప్రదాయాల్ని ఆమె దున్నేసింది. పంట వేస్తే.. మూడు పూలూ ఆరు కాయలు కాదు... 365 రోజులూ పూలూ, కాయలు దిగుబడి రావాలని సంకల్పించింది. అనుభవమే పెట్టుబడిగా ముందడుగు వేసింది. రకరకాల పంటలు వేసి ప్రయోగాలు చేసింది. విజయం సాధించింది. తాను నడిచి ఆ బాటలో మరిందరిని ఆహ్వానించింది. అందుకే కేంద్ర ప్రభుత్వం నుంచి నారీశక్తి పురస్కారం ఆమె సంస్థకు వచ్చింది. ఆ రైతు పేరు కొప్పుల పద్మ. ఆమె కథ...

చదువుకుంటున్న రోజుల్లోనే మహిళలకు ఏదైనా చెయ్యాలన్న ఆలోచన ఉండేదావిడకు. అందుకే చదువు పూర్తయ్యాక డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీలో దాదాపు పన్నెండు సంవత్సరాల పాటు వలంటీరుగా పనిచేసింది. ఆ అనుభవంతో స్వతంత్రంగా అరణ్య అగ్రికల్చరల్ ఆల్టర్‌నేటివ్స్ అనే స్వచ్ఛంద సంస్థను 1999లో ప్రారంభించింది. దీనర్థం శాశ్వత వ్యవసాయ పద్ధతులు. 'మన దగ్గర ఎక్కువగా చిన్న, సన్నకారు రైతులే ఉంటారు. వారికుండే అయిదెకరాల పొలంలో పత్తి లాంటి వాణిజ్య పంటలు మాత్రమే పండించి నష్టాలు రావడంతో ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఇదంతా వ్యవసాయం మీద సరైన అవగాహన లేకపోవడం వల్లే. అందుకే ఒక పంట పైనే ఆధారపడకుండా మిశ్రమ పంటల సాగుకు మొగ్గు చూపాలి. విత్తనాలూ, ఎరువుల విషయంలో, పండించే విధానంలో, నీటిని ఆదా చేయడంలో, చెత్తను ఉపయోగించడంలో కొన్ని మెళకువలు తెలిసుండాలి. వాటన్నింటికీ పర్మాకల్చర్ విధానం పరిష్కారం చూపుతుందని తెలుసుకున్నా. ఈ విధానంలో భూమికీ, మనకు ఇద్దరికీ లాభం చేకూరుతుంది. ఈ విధానంలో ప్రకృతికి మేలు చేసే పద్ధతులే అనుసరిస్తాం. అంటే ప్రకృతితో కలిసి పనిచేసి దానికీ, మనకూ లాభం చేకూర్చడం. అనుకున్నదే తడవుగా రైతులకు ఈ విధానాలపై అవగాహన కల్పించడం మొదలుపెట్టా. దీంతో వచ్చే లాభాలను వివరించేదాన్ని. కానీ అప్పటివరకు మన దగ్గర ఆ పద్ధతిలో వ్యవసాయం చేస్తున్న వారి సంఖ్య చాలా తక్కువ. దాంతో దిగుబడి ఎలా వస్తుందంటూ రైతులంతా ప్రశ్నించేవారు. అది సాధ్యమేనని నిరూపించడానికి జరాసంఘం మండలం బిడకన్నె గ్రామ సమీపంలో 11.5 ఎకరాల భూమిని కొన్నాను. అందులో పర్మాకల్చర్ విధానంలో పంట పండించడం మొదలెట్టాం.

భారతదేశంలో పర్మాకల్చర్ విధానాన్ని మొదలుపెట్టింది బిల్‌మాలిసన్ అనే వ్యక్తి. ఆయన దగ్గరే నేనూ, మావారూ పర్మాకల్చర్ డిజైనింగ్ కోర్సు పూర్తిచేశాం. ఆ తరువాత అంతర్జాతీయంగా పర్మాకల్చర్ గురించి ఎక్కడ, ఎలాంటి కార్యక్రమం జరిగినా హాజరయ్యేవాళ్లం. అలా క్రమంగా దానిమీద పూర్తి అవగాహన తెచ్చుకున్నాం.



పర్మాకల్చర్ కోర్సులూ ఇస్తున్నారు...!

ఇప్పుడా భూమి ఒక లైబ్రరీలా మారింది. విదేశాల నుంచి వచ్చిన చాలా మంది ఇక్కడ పర్మాకల్చర్ కోర్సు నేర్చుకుంటున్నారు. ఈ పద్ధతుల ద్వారా అక్కడికెళ్లి వ్యవసాయం చేస్తున్నారు. సంవత్సరమంతా పొలానికి ఏ రోజు వెళ్లినా అక్కడ ఏదో ఒకటి తెంపొచ్చు. ఏ రోజూ అక్కడికి వెళ్లి ఖాళీ చేతులతో రాలేదు నేను' అంటారు పద్మ.

అరణ్య పాత్ర ఉంటుంది... ఇవే సూత్రాలను గిరిజనులకూ, మహిళలకు చెప్పే ఉద్దేశంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో మొత్తం తొమ్మిది జిల్లాల్లో అరణ్య పనిచేస్తోంది. దాదాపు ముప్పైకి పైగా గ్రామాల్లో సహజసిద్ధ పద్ధతుల్లో పంట పండించే విధానం గురించి అవగాహన కల్పించారు. ఇప్పటివరకు లక్షన్నర పైగా రైతులతో కలిసి పనిచేస్తున్నారు. ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజన ప్రాంతాల్లో ఉన్న బీడు భూములను కూడా వ్యవసాయానికి అనుకూలంగా మార్చారు. చెట్ల మధ్యలో పెరిగిన గిరిజనులు... ఒక విత్తనం అలా పడేస్తే అదే వృక్షంలా పెరుగుతుంది అనుకుంటారు. కానీ వాళ్లకు వ్యవసాయంలోని మెళకువలు చెప్పి ఒక్కొక్కరికి ప్రభుత్వం నుంచి వచ్చిన పట్టాభూముల్లో వాళ్లతో పర్మాకల్చర్ విధానంలోనే వ్యవసాయం చేయించడం మొదలుపెట్టారు. 'ఆ కృషికి ఫలితం రావడానికి దాదాపు నాలుగు సంవత్సరాలు పట్టింది. ఆ పంటకోసిన రోజు వాళ్ల ముఖంలో ఉన్న ఆనందం నేను ఎన్నటికీ మరవలేను' అంటారు పద్మ.

మహిళలకూ చేయూతగా: కేవలం రైతులకే కాదు.. మహిళలకు ఆర్థిక స్వేచ్ఛ ఉంటే వారి ఆలోచనల్లో, నిర్ణయాల్లో మార్పులొస్తాయి. అందుకే వారిలో ఆర్థిక చైతన్యం తెచ్చే దిశగా మహిళా గ్రూపులు ఏర్పాటు చేశారు. ముఖ్యంగా ఒంటరి మహిళలు భూమి కొనాలన్నా, వ్యాపారం ప్రారంభించాలన్నా సరైన అవగాహన ఉండదు. అందుకే వాళ్లకి న్యాయపరమైన, ఆర్థిక సలహాలు అందించేందుకు కొన్ని మహిళా సంఘాలు ఏర్పాటు చేశారు. జహీరాబాద్, జరాసంఘం, ఉట్నూర్, నల్గొండ, మిరియాల గూడతో పాటూ మరి కొన్ని ప్రాంతాల్లో ఈ మహిళా సంఘాలు ఏర్పాటయ్యాయి. అన్ని రకాలుగా మద్దతు అందడంతో కొంతమంది మహిళలు వారికున్న భూముల్లో పంట పండిస్తే, కొంతమంది కొనుగోలు చేసుకున్నారు. వారంతా పండించిన పంటను మార్కెటింగ్ చేసేందుకు ఫార్మర్ ప్రొడ్యూస్ ఆర్గనైజేషన్‌లు ఏర్పాటు చేశారు. ఈ సంఘాల్లోనూ పూర్తిగా మహిళలే ఉంటారు. వారు తీసుకొచ్చిన ధాన్యాన్ని ప్రాసెసింగ్ చేసి మార్కెటింగ్ చేసే అవకాశం కల్పిస్తారు. ఉదాహరణకు ఏవైనా గింజలు పండిస్తే నూనె తీసి, ప్యాకింగ్ చేసి, ఒక బ్రాండ్ పేరుతో ఈ సంఘాలు మంచి ఉత్పత్తిని బయటకు తీసుకొస్తాయి. అలా వాళ్లకు ఎలాంటి మధ్యవర్తుల అవసరం లేకుండా లాభం చేకూరుతుంది. ఇలా ఒక ప్రాంతంలో మహిళలు స్వయంగా నిలదొక్కుగోగలిగాక అక్కడి నుంచి ఎన్జీవో తప్పుకుంటుంది. తర్వాత అవసరమున్న మరో ప్రాంతం ఎంచుకుంటుంది.



– **పురస్తు సురేందర్,** న్యూస్‌టుడే, నిర్మల్

లెహెంగా కొంటున్నారా?

వివాహాలకూ, కాస్త పెద్ద వేడుకలకూ ఈ మధ్య అమ్మాయిలు ఎక్కువగా లెహెంగాలూ, క్రాప్‌టాప్‌లు ఎంచుకుంటున్నారు. వాటిని ఎంపిక చేసుకునే ముందు కొన్ని విషయాల గుర్తుంచుకోవాలి.

- పెళ్లి కోసం లెహెంగా ఎంచుకుంటే ఇంకాస్త జాగ్రత్తగా చూసుకోవాలి. పెళ్లిలో ఎక్కువగా కూర్చోవడం, నిల్చోవడం చేయాల్సి ఉంటుంది. అందుకే లెహెంగా కొనుగోలు చేసే ముందు ఒకసారి వేసుకొని చూడండి. మీరు సులభంగానే నడవగలుగుతున్నారా... కూర్చోవడానికి ఏమైనా ఇబ్బందుందా... అని ఒకసారి పరిశీలించుకొని చూడండి.
- బ్యాక్‌లెస్, డీప్‌నెక్, నెట్టెడ్ తరహా క్రాప్‌టాప్ ఎంచుకుంటే లోదుస్తుల ఎంపిక విషయంలో జాగ్రత్తగా ఉండాలి. ఒకసారి వాటిని కూడా ప్రయత్నించి చూస్తే మంచిది. దాంతో పాటే లెహెంగా డోరీలు కట్టుకోడానికి అనువుగా ఉన్నాయా లేదా అనేది కూడా చూసుకోవాలి. లెహెంగా బరువు ఎక్కువగా ఉంటే కేవలం డోరీలే లెహెంగా బరువును ఆపలేవు. వాటికి ప్రత్యామ్నాయాలు వెతుక్కోవాలి.



- షాపుల్లో ఉండే అద్దాల్లో మనల్ని మనం చూసుకున్నప్పుడు కాస్త సన్నగా, వాస్తవానికి భిన్నంగా కనబడే అవకాశాలుంటాయి. అందుకే వాటిని నమ్మకుండా ఒక ఫొటో తీసుకుని చూడండి. మీకు నప్పిందో లేదో సరిగ్గా అర్థమవుతుంది.
- వాతావరణాన్ని బట్టి లెహెంగా వస్త్రాన్ని ఎంచుకోవాలి. చలికాలంలో అయితే మక్‌మల్, సిల్క్ తరహావి బాగుంటాయి. ఎండాకాలంలో కాటన్, కాస్త పలుచగా ఉండే రకాలు ఎంచుకోవచ్చు. ప్రస్తుత వాతావరణానికైతే ఇకత్ లాంటివి ఎంచుకుంటే సౌకర్యంగా ఉంటాయి. ట్రెండీగా కూడా కనిపిస్తాయి.
- లెహెంగా మీ ఎత్తుకు సరిగ్గా సరిపోయేట్టు కాకుండా కాస్త పొడవుగా ఉండేటట్లు చూసుకోవాలి. సరిగ్గా పాదాల వరకే వస్తే చూడటానికి బాగుండదు. పైగా ఎత్తుచెప్పులు వేసుకున్నా కూడా పొట్టిగా అనిపించకుండా ఉంటుంది.

ఒంటరిగా వెళ్లాలంటే కంగారుగా ఉంది!

? నాకు మూడు నెలల క్రితమే పదోన్నతి లభించింది. నా శ్రమను గుర్తించి నాకీ పదోన్నతి ఇచ్చినందుకు చాలా సంతోషంగా ఉంది. కొత్త పదవిలో భాగంగా దేశంలోని మా బ్రాంచ్‌లకు నేను ఇకపై తరచూ ప్రయాణాలు చేయాలి. విమాన టికెట్లతోపాటూ పేరొందిన హోటళ్లలో బసను కూడా సంస్థే ఏర్పాటు చేస్తుంది. సమస్య ఏమిటంటే ఇప్పటివరకూ నేను ఒంటరిగా ప్రయాణాలు చేసింది లేదు. కానీ ఇప్పుడు తప్పదు కాబట్టి.. నేను వెళ్లేచోట సురక్షితంగా, ఏ ఇబ్బందీ లేకుండా ఉండాలంటే వ్యక్తిగతంగా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో చెబుతారా. **- ఓ సోదరి**


డియర్ వసుంధర
డా॥ కవిత గూడపాటి
ఆర్గనైజేషనల్ సైకాలజిస్ట్

✔ మనం గమనిస్తే... ఈ రోజుల్లో చాలామంది మహిళలు ముఖ్యంగా మహిళా వ్యాపారవేత్తలు ఒంటరిగానే ప్రయాణిస్తున్నారు. మహిళలకు ఆతిథ్యం ఇవ్వడానికి ప్రయాణ రంగంలో కూడా చాలా మార్పులు వచ్చాయి. అయినప్పటికీ పురుషులతో పోలిస్తే ఒంటరిగా ప్రయాణించే మహిళలకు రక్షణ తక్కువే. ఈ కింది జాగ్రత్తలు తీసుకోవడం వల్ల మీరు సురక్షితంగా వెళ్లిరావచ్చు.

- మీరు ఇకపై నిత్యం ప్రయాణాలు చేయాల్సి వస్తుంది కాబట్టి మీ లగేజీ వీలైనంత తక్కువగా ఉండేలా చూసుకోవాలి. ముఖ్యంగా మీ హ్యాండ్‌బ్యాగ్‌లో కేవలం డెబిట్, క్రెడిట్ కార్డులతోపాటు కొంత నగదును మాత్రమే ఉంచుకోండి. డబ్బు, కార్డులను జాగ్రత్తగా వేర్వేరు చోట్ల భద్రపరచుకోవాలి. కేవలం కొంత డబ్బు మాత్రమే మీ దగ్గర పెట్టుకోవాలి.
- మీరొక్కరే ఒంటరిగా ప్రయాణం చేస్తున్నారనే విషయాన్ని ఇతరులకు తెలియజేయాల్సిన అవసరంలేదు. 'మీరు మొదటిసారి నాగ్‌పూర్ వెళ్తున్నారా...' అని ఎవరైనా అడిగితే అబద్ధమైనా సరే.. కాదని చెప్పండి. నేను అని కాకుండా 'మేం తరచూ వెళ్తుంటాం' అని చెప్పండి. అపరిచితుల వద్ద నిజం చెప్పాల్సిన అవసరం లేదు.
- ఇంటి నుంచి బయలుదేరే ముందే మీ ప్రయాణం గురించి ఓ ప్రణాళిక తయారుచేసుకోవాలి. అలాగే హోటల్ నుంచి కాలు బయటపెట్టేముందే మీరు వెళ్లాల్సిన ప్రాంతం ఎక్కడుందో సమీక్షించుకోవాలి.
- రక్షణ దృష్ట్యా ప్రభుత్వ గుర్తింపు పొందిన మంచి హోటల్‌లోనే బస చేయాలి. ప్రస్తుతం చాలా హోటళ్లు మహిళలకు ప్రత్యేకంగా ఒక ఫ్లోర్‌ను కేటాయిస్తున్నాయి. గ్రౌండ్‌ఫ్లోర్‌కి పైనా, లిఫ్ట్‌కి దగ్గరగా ఉండే గదిని కేటాయించమని అడగండి. గుర్తింపు పొందిన హోటల్ అయినప్పటికీ మన రక్షణ మనకు ముఖ్యం కాబట్టి ఆ రిజిస్టర్‌లో పేరు రాసే దగ్గర నుంచి గదిలోకి వెళ్లే వరకు ప్రతి విషయంలోనూ జాగ్రత్తగా ఉండాలి. హోటల్‌కు సంబంధించిన ఫోన్ నంబరు, పేరు, అడ్రస్‌ను మీ దగ్గర ఉంచుకోండి. మీ పనులను చూసేందుకు ప్రత్యేకంగా మహిళా సిబ్బందే కావాలని అడగండి. అవసరమైనప్పుడు సహాయం అందించాల్సిందిగా సిబ్బందిని అడగటానికి మొహమాటపడొద్దు. ఒక్కరే ప్రయాణం చేస్తున్నప్పుడు మన జాగ్రత్తలు మనం తీసుకోవాల్సిందే. ఆల్‌ది బెస్ట్!

– మీ సందేహాలను, సమస్యల్ని vasucareer@eenadu.net కు పంపించగలరు.

తొలి నక్షత్రం... తళుక్కుమంది అప్పుడే!


విశ్వంలో తొలి నక్షత్రకాంతిని కనుక్కుని ప్రపంచ శాస్త్రవేత్తలందరూ తిరిగి చూసేలా సంభ్రమాశ్చర్యాలకు గురిచేసిన ఖగోళశాస్త్రవేత్తల బృందంలో భారత దేశానికి చెందిన ఓ యువతి ఉండటం భారతీయులకే గర్వకారణం. ఆమే నివేదితా మహేష్. చిన్నవయసు నుంచీ పరిశోధనలంటే ఆసక్తి పెంచుకున్న ఆమె ఇప్పుడు తాజాగా మొట్టమొదటి నక్షత్రకాంతిని గుర్తించిన బృందంలో ఒకరిగా నిలిచింది. అరుదైన గుర్తింపునూ తెచ్చుకుంది.



నివేదితా మహేష్‌ది తమిళనాడులోని కోయంబత్తూరు. పరిశోధనలపై ఉన్న ఇష్టంతోనే కోవైలోని పీఎస్‌జీ కాలేజీ ఆఫ్ టెక్నాలజీలో ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజినీరింగ్ పూర్తిచేశారు. తరువాత బెంగళూరులోని రామన్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌లో ఖగోళశాస్త్ర విభాగంలోని ఆచార్యులు సుబ్రమణ్యన్‌తో కలిసి పనిచేస్తున్నప్పుడే ఆమెకు సృష్టి రహస్యాలను ఛేదించాలనే ఆసక్తి పెరిగింది. తరువాత కాలిఫోర్నియా విశ్వవిద్యాలయంలో ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్‌లో పీజీ, అరిజోనా స్టేట్ యూనివర్సిటీలో రీసెర్చ్ అసిస్టెంట్‌గా, ఆ తరువాత సీనియర్ రీసెర్చ్ అసిస్టెంట్‌గా అంచెలంచెలుగా ఎదిగింది. తొలి నక్షత్ర కాంతిని కనుక్కున్న పరిశోధనలో ఆరిజోనా విశ్వవిద్యాలయానికి చెందిన శాస్త్రవేత్తల బృందంలోనూ చేరిన నివేదిత తన వంతు కృషి చేసింది.

రహస్యమదే...

సృష్టి ఎప్పుడు, ఎలా ఆరంభమైంది? ప్రారంభంలో ఏం జరిగింది? అనే దానిపై చాలా ఏళ్లుగా పరిశోధనలు జరుగుతూనే ఉన్నాయి. ఇందులో భాగంగానే గత నాలుగేళ్ల నుంచి నివేదిత సహా అయిదుగురు శాస్త్రవేత్తల బృందం కూడా ఇదే పరిశోధనలో ఉంది. వీళ్లు కనిపెట్టిన అంశం ప్రస్తుతం ప్రపంచాన్నే ఆశ్చర్యంలో ముంచెత్తుతోంది. విశ్వం ప్రారంభమైనప్పుడు తొలి నక్షత్రాల నుంచి వెలువడిన కాంతి కిరణాలను గుర్తించిందీ బృందం. అనంత విశ్వంలో 13.8 బిలియన్ల సంవత్సరాల క్రితం ఏర్పడిన అతి పెద్ద విస్ఫోటంతో ఒక్కసారే చీకటి పదార్థంగా పిలిచే డార్క్ మేటర్‌గా విశ్వం మారిపోయిందని పరిశోధనలు చెబుతున్నాయి. ఆ సమయంలో సూర్యుడూ, నక్షత్రాలూ, కాంతి ఏదీ లేని శూన్యం, చీకటి మాత్రమే ఉంది. అయితే ఇది చల్లబడి, పరమాణువులుగా విడిపోవడమే కాకుండా, కాంతినిరోధకాలుగా మారాయి. దాదాపు 3,70,000 సంవత్సరాల వరకు అంతా చీకటే అని గత పరిశోధనలు పేర్కొన్నాయి. ఆ చీకటి నుంచి దాదాపు 180 మిలియన్ల సంవత్సరాల తరువాత వచ్చిన తొలి కిరణం వెలుతురును గుర్తించారు వీళ్లు. 'ఈ అంశంపై నాలుగేళ్లుగా పరిశోధన చేస్తున్నాం. మా పరిశోధనలో మొదట నక్షత్రాలు ఆవిర్భవించి, కాస్మిక్ డాన్‌గా పిలిచే విశ్వం ప్రారంభమై ఉండొచ్చు. తొలి నక్షత్ర వెలుగుతో ఎన్నో అంశాలను పరిశోధించడానికి మా మార్గం సుగమమైంది. నక్షత్రాలు ఆవిర్భవించడానికి కారణాలూ, అవి ఏ పరిస్థితుల్లో ఏర్పడ్డాయనే అంశాలపై పరిశోధన చేశాం. ప్రత్యేక టెలిస్కోప్ ద్వారా కనిపెట్టిన కాంతికిరణాలకు సంబంధించి మరింత పరిశోధన చేయబోతున్నాం. నా మొదటి సెమిస్టర్‌లోనే ఇంత పెద్ద పరిశోధనలో అడుగుపెట్టే అవకాశం రావడం చాలా సంతోషంగా ఉంది...' అని చెబుతుంది నివేదిత. తమ పరిశోధనాఫలితం కేవలం విశ్వం ప్రారంభం కావడానికి పట్టిన సమయం గురించి మాత్రమే కాకుండా, ఏళ్లతరబడి విశ్వమంతా చీకటిలో ఉండటానికి గల నిగూఢమైన కారణాలను వెతకడానికి ఇదొక సంకేతంగా అనిపించడం సంతోషంగా ఉందని తెలుపుతోంది నివేదితా మహేష్.



బంగారం వెండి

5న ముగింపు-క్రితం

	హైదరాబాద్		విజయవాడ	
బంగారం(24క్యా)	31,570	31,550	31,500	31,400
ఆర్నమెంట్	29,480	29,400	29,200	29,200
వెండి (కిలో)	39,630	39,800	40,000	39,700
	ప్రొద్దుటూరు		**రాజమండ్రి**	
బంగారం(24క్యా)	31,400	31,400	31,180	31,250
ఆర్నమెంట్	29,120	29,120	29,180	29,220
వెండి (కిలో)	39,800	39,800	39,200	39,000
	విశాఖపట్నం		**తమిళనాడు**	
బంగారం(24క్యా)	31,380	31,380	-------	-------
ఆర్నమెంట్	29,190	29,190	2,918	2,922 గ్రా
వెండి (కిలో)	39,900	39,900	41.70	41.60 గ్రా

పొడిబారిన చర్మానికి పాలు!

మారిన జీవనశైలి విధానాలూ, బిజీబిజీ జీవితాలు.. దానికి తోడు వాతారణంలోని మార్పులతోపాటు రోజురోజుకు పెరిగిపోతున్న కాలుష్యం.. ఇవన్నీ మన చర్మాన్ని నిర్జీవంగా మారుస్తున్నాయి. దాంతో చర్మం నిస్తేజంగా మారి, పొడారిపోతుంది. మరి తిరిగి దాన్ని ఆరోగ్యంగా, మృదువుగా తేమగా చేయడమెలా...

- **పెరుగు:** దీనిలోని పోషకాలు చర్మానికి కావాల్సిన తేమను అందించి మృదువుగా మారుస్తాయి. రెండు చెంచాల పెరుగులో కొద్దిగా తేనె వేసుకుని ముఖానికి రాసుకోవాలి. అది చర్మంలోకి చేరేలా మృదువుగా మర్దన చేయాలి. ఇలా వారంలో రెండుసార్లు చేస్తే చర్మం ఆరోగ్యంగా ఉంటుంది.



- **ఆలివ్ నూనె:** ఇందులోని యాంటీఆక్సిడెంట్లూ, ఆరోగ్యకరమైన కొవ్వు చర్మానికి మేలు చేస్తాయి. రాత్రుళ్లు నిద్రపోయే ముందు చర్మానికి మర్దన చేసుకోవాలి. ఇలా తరచూ చేస్తుంటే ప్రయోజనం ఉంటుంది.
- **తేనె:** ఇది సహజ మాయిశ్చరైజర్‌లా పనిచేస్తుంది. ఇందులోని విటమిన్లూ, ఖనిజాలు చర్మం కోల్పోయిన తేమను అందించి ఆరోగ్యంగా మెరిసేలా చేస్తాయి. స్నానానికి పదిహేను నిమిషాల ముందు తేనె రాసుకుని బాగా మర్దన చేయాలి. ఇలా రెండురోజులకోసారి చేస్తుంటే ఫలితం కనిపిస్తుంది.
- **నెయ్యి:** ఇది కూడా చర్మానికి కావాల్సిన తేమను అందిస్తుంది. ప్రతిరోజు అర చెంచా ఆవు నెయ్యి తినడమే కాదు, ముఖానికి కొద్దిగా రాసుకుని మర్దన చేసుకుని తరువాత కడిగేసినా మంచిదే.
- **పాలు:** దీనిలోని యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు చర్మానికి తేమను అందించడమే కాకుండా దురదను తగ్గించి సాంత్వన కలిగిస్తాయి. చల్లని పాలల్లో దూది ఉండను ముంచి ముఖమంతా రాసుకోవాలి. ఐదు నిమిషాలయ్యాక కడిగేస్తే చాలు. దీనివల్ల మురికి పోతుంది.
- **గుడ్డు:** ఇది చర్మానికి కావాల్సిన పోషకాలను అందించి బిగుతుగా మారుస్తుంది. గుడ్డులోని తెల్లసొనను రాసుకుని అది పూర్తిగా ఆరిపోయాక కడిగేయాలి.


లక్ష ఉద్యోగాల ప్రకటనలతో రైల్వేశాఖ సిద్ధం

భారీ భర్తీలో పోటీ రద్దీ!

దాదాపు లక్ష పోస్టుల భర్తీ. కోటి మందికిపైగా పోటీ. ప్రపంచంలోనే అతి పెద్ద నియామక ప్రక్రియగా భావిస్తున్న ఈ నోటిఫికేషన్‌లో రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు కొన్ని మార్పులను ప్రకటించింది. గ్రూప్-సిలో అన్ని ఉద్యోగాలకు పదోతరగతి చాలంది. గరిష్ఠ వయసు పరిమితిని రెండేళ్లకు పెంచింది. దరఖాస్తు గడువు తేదీలను పొడిగించింది. ప్రయాణికుల భద్రతలో కీలకమైన ఈ ఉద్యోగాలకు సమర్థ సిబ్బందిని ఎంపిక చేసుకోడానికి తగిన ఏర్పాట్లు చేస్తోంది. చిన్న విద్యార్హతలతో కేంద్ర ప్రభుత్వ కొలువుల్లో కుదురుకునే అరుదైన అవకాశం ఇది. ప్రశ్నపత్రం తీరుతెన్నులను మూలాల నుంచి అవగాహన చేసుకొని, తగిన ప్రణాళికతో సన్నద్ధమైతేనే పోటీని దాటి గమ్యం చేరుకోగలుగుతారు.

రైల్వే బడ్జెట్‌లో భద్రతకే తొలి ప్రాధాన్యం. రోజూ దేశం నలుమూలలకు ప్రయాణించే రెండున్నర కోట్లమంది ప్రయాణికుల భద్రతకు అన్ని రైళ్లలో సీసీ కెమెరాలు, రైలు భద్రత, ప్రమాద హెచ్చరిక వ్యవస్థతోపాటు 18 వేల కి.మీ. మేర రెండు, మూడు, నాలుగు లైన్లు కొత్తగా వేయడం, సిబ్బంది లేని దాదాపు నాలుగు వేల రైల్వే క్రాసింగ్ గేట్లను తొలగించడం, 12 వేల కొత్త వేగన్లు (సరకు రవాణాకు), 5 వేల కొత్త కోచ్‌లు, 700 నూతన రైలు ఇంజిన్లు రాబోవటం తదితర పరిణామాల నేపథ్యంలో రైల్వే శాఖకు పెద్దఎత్తున మానవ వనరులు అవసరమయ్యాయి. దీంతో ప్రపంచంలోనే అతి పెద్ద నియామక ప్రక్రియకు తెర తీశారు.


యస్.వి. సురేష్
ఎడిటర్, ఉద్యోగసోపానం

ఇప్పటికే ప్రకటించిన అసిస్టెంట్ లోకో పైలట్స్ (ఇంజిన్ సహాయక చోదకులు), టెక్నీషియన్స్ (సాంకేతిక సిబ్బంది); వివిధ విభాగాల్లో సహాయకులు (హెల్పర్స్) గ్రూప్-సి సిబ్బందికి వేరువేరు నోటిఫికేషన్లు విడుదలయ్యాయి. మరో 17 వేల ఖాళీల వరకు అసిస్టెంట్ సెక్షన్ ఇంజినీర్స్ నోటిఫికేషన్ కూడా త్వరలో వెలువడనుంది. ఇవన్నీ కలిపి సుమారు లక్ష పోస్టులవుతాయి.

ఉద్యోగ విధులే ప్రశ్నపత్రానికి మూలం

ఉద్యోగం వేరూ, దాని ఎంపిక పరీక్ష వేరూ కాదు. చేసే ఉద్యోగ బాధ్యతల రీత్యానే సిలబస్ రూపకల్పన ఉంటుంది. కొందరు అభ్యర్థులు పరీక్ష పాసైతేనే కదా చేసే ఉద్యోగం గురించి తెలుసుకోవాల్సింది అనుకుంటారు. చురుకైన ఇంకొందరు ఉద్యోగ బాధ్యతలను ముందే తెలుసుకుంటారు. ఆ కోణం నుంచే సిలబస్‌ను వీక్షిస్తారు. దీని వల్ల పరీక్షకు సన్నద్ధత సులభతరం అవుతుంది. విజయావకాశాలు మెరుగవుతాయి. అందుకే రైల్వే శాఖ ప్రకటించిన పోస్టుల గురించి కొంతైనా తెలుసుకోవాలి.

■ అసిస్టెంట్ లోకోపైలట్ ఉద్యోగం అంటే రైలు ఇంజిన్ చోదకుని (డ్రైవర్) కొలువు. తొలుత రైలు ఇంజిన్ డ్రైవర్‌కు సహాయకుడిగా విధులు నిర్వర్తించాలి. ఎంపికైన తరువాత వరంగల్ సమీపంలోని కాజీపేటలోనూ ఆపై హైదరాబాద్ సమీపంలోని మౌలాలిలో థియరీ, ప్రాక్టికల్ శిక్షణ ఇస్తారు. ఆపై సరకు రవాణా చేసే గూడ్స్ ఇంజిన్‌పై అసిస్టెంట్ డ్రైవర్‌గా నియమిస్తారు. ఎప్పటికప్పుడు పనితీరును పరిశీలిస్తూ ప్రయాణికులను చేరవేసే రైలు, ఆపై సూపర్‌ఫాస్ట్ రైళ్లపై అవకాశం కల్పిస్తారు. దీనికి అనుగుణంగానే అసిస్టెంట్ లోకోపైలట్ నుంచి చీఫ్ లోకో పైలట్ వరకు అంచెలంచెలుగా ఎదగవచ్చు. అసిస్టెంట్ లోకోపైలట్‌గా చేరగానే ప్రారంభవేతనం, జీతభత్యాలు కలుపుకుని చేతికి రూ. 40,000 వరకు అందుతుంది. రైలు ఇంజిన్ చోదకుడిగా సిగ్నలింగ్ వ్యవస్థను అర్థం చేసుకోవడం, దానిని అప్రమత్తంగా అనుసరిస్తుండటం, రైలు వేగ నియంత్రణ.. ఈ రెండింటినీ సమన్వయం చేసుకుంటూ రైలును సురక్షితంగా గమ్యానికి చేర్చడమే ఈ ఉద్యోగి ప్రధాన విధి.

■ గ్రూప్-సి ఉద్యోగాలన్నింటినీ సహాయకులు (హెల్పర్స్) అని పేర్కొంటూ వారు ఏయే విభాగాల్లో పనిచేయాలో నోటిఫికేషన్‌లో పొందుపరిచారు. ఉదాహరణకు- పాయింట్‌మన్ అన్న పోస్టుకి ఎంపికైతే స్టేషన్‌లో రైలు బయలుదేరడానికి ముందు చక్రాల స్థితి, రెండు కోచ్‌ల మధ్య అనుసంధానం పరీక్షించి ఆపై ప్లాట్‌ఫారంపై నిలబడి పచ్చజెండా ఊపడం వీరి విధి. బాధ్యతలు సక్రమంగా నిర్వర్తిస్తే పదోన్నతులు పొందుతూ అసిస్టెంట్ స్టేషన్ మాస్టర్ వరకు ఎదగవచ్చు. ఇందుకు శాఖాపరమైన పరీక్షలు రాయాల్సి ఉంటుంది. గ్రూప్-సిలో అన్ని పోస్టులకు మూల వేతనం రూ. 18,000.

మరో ఉద్యోగం ట్రాక్‌మన్. పేరులోనే సూచిస్తున్నట్లు ఒక్కో ఉద్యోగికి 6 కి.మీ. మేర రైలు పట్టాల పర్యవేక్షణ బాధ్యత ఇస్తారు. పాతిక కిలోల టూల్‌కిట్ బ్యాగ్‌తోసహా రైలు పట్టాల వెంట పరిశీలిస్తూ ఏదైనా అవాంతరం గుర్తిస్తే చీఫ్ పర్మనెంట్ వే ఇన్‌స్పెక్టర్‌కు తక్షణం సమాచారం ఇవ్వాలి. ఇలా ట్రాక్ మెయింటనర్ ఉద్యోగంలో చేరి పనితీరు, అంతర్గత పరీక్షలు రాసుకుంటూ జూనియర్ ఇంజినీర్ (పర్మినెంట్ వే ఇన్‌స్పెక్టర్) స్థాయి వరకూ చేరుకోవచ్చు. ప్రారంభ వేతనం రూ. 20,000. ఇలా వీటితోపాటు ప్రకటించిన పోస్టులు హెల్పర్ ఎలక్ట్రికల్, మెకానికల్, టెలికాం, సిగ్నలింగ్ విభాగాల్లో సహాయక విధులు నిర్వర్తించాలి. పోస్టులన్నింటికీ పదోన్నతులు, వేతనాలు, ఇతర ప్రోత్సాహకాలు సమానంగానే ఉంటాయి. గ్రూప్-సిలోని పోస్టులను పరిశీలిస్తే దాదాపు అన్నీ మెకానికల్, ఎలక్ట్రికల్ సంబంధితమై ఉండటం గమనార్హం. ఈ విషయాన్ని గమనంలో ఉంచుకుంటే పరీక్ష సన్నద్ధతకు ఇదే మార్గదర్శి అవుతుంది.

సిలబస్ విశ్లేషణ

ఉద్యోగ బాధ్యతల కోణం నుంచి ఎంపిక ప్రక్రియ, సిలబస్‌లను పరిశీలిస్తే ప్రశ్నపత్ర మూలాలను తెలుసుకోవచ్చు. ఉద్యోగి విధులను సమర్థంగా నిర్వహించగలిగే ప్రతిభను పరీక్షించే విధంగా ఆయా కేటగిరీ పోస్టులకు తగిన ఎంపిక ప్రక్రియను రైల్వే సిద్ధం చేసింది.

అసిస్టెంట్ లోకోపైలట్ పోస్టుకు మూడు దశల ఎంపిక ఉంటుంది. వాటిలో మొదటి రెండు దశలు రాతపరీక్షలే. సిలబస్ దాదాపుగా ఒక్కటే. రెండో దశలో కఠినత్వ స్థాయి ఎక్కువ. మూడో దశ పూర్తిగా మానసిక స్థాయిని పరీక్షించే పరీక్ష.

గ్రూప్-సి పోస్టులకు కేవలం రాతపరీక్ష ఒక దశలోనే ముగుస్తుంది. అయితే ఈ పోస్టులకు ఎంపికయ్యేవారు చేయాల్సిన విధుల రీత్యా ట్రాక్‌మన్ అయితే పది, పన్నెండు కి.మీ. 'కిట్'తోసహా నడవాలి. కాబట్టి శారీరక దార్ఢ్య పరీక్షను తుదిదశగా నిర్వహిస్తారు. రాతపరీక్షలో నెగ్గినవారే ఈ పరీక్షలో పాల్గొంటారు.

తగ్గిన విద్యార్హత- పెరిగిన గడువు

అరవై రెండు వేలకు పైగా ఖాళీలు ఉన్న గ్రూప్-సి పోస్టులకు గత నోటిఫికేషన్ వరకూ కనీస విద్యార్హత పదోతరగతే. అయితే తాజా నోటిఫికేషన్‌లో పదోతరగతితోపాటు ఐటీఐ లేదా పాలిటెక్నిక్, ఇంజినీరింగ్ సాంకేతిక విద్యార్హతను జత చేశారు. ఇంతకుముందు వరకు ఎటువంటి సూచన లేకుండా హఠాత్తుగా ఈ పోస్టులను సాంకేతిక విద్యార్థులకు మాత్రమే పరిమితం చేయడంతో దేశవ్యాప్తంగా నిరసన వ్యక్తమైంది. దీంతో ఈసారికి గ్రూప్-సి పోస్టులన్నింటికీ పదోతరగతిని అర్హతగా నిర్ణయించారు. సాంకేతిక విద్యార్హతలు లేకపోయినా అవకాశం కల్పిస్తున్నట్లు స్వయంగా రైల్వే మంత్రే ప్రకటించారు. ఇదే సమయంలో అన్ని వర్గాల వారికి గరిష్ఠ వయసు పరిమితిని మరో రెండేళ్లు పెంచారు. అలాగే రిజర్వేషన్ సౌకర్యంలేని సాధారణ అభ్యర్థులకు పరీక్ష ఫీజు రూ. 500గా ప్రకటించడంపట్ల నిరసన వ్యక్తమవటంతో పరీక్షకు హాజరైన అభ్యర్థులకు రూ. 400 తిరిగి చెల్లిస్తామని కూడా ప్రకటించారు. ఇలా ప్రధానమైన మూడు మార్పులు జరగడంతో సవరణ నోటిఫికేషన్ జారీ చేసి అసిస్టెంట్ లోకోపైలట్లు, గ్రూప్-సి పోస్టులకు దరఖాస్తు గడువులను మార్చి 31 వరకు పెంచారు.



సన్నద్ధత ఎలా?

ఆర్‌ఆర్‌బీ నిర్వహించే గ్రూప్-సి, అసిస్టెంట్ లోకోపైలట్ పరీక్షల్లో... జనరల్ ఇంటెలిజెన్స్, రీజనింగ్, మేథమేటిక్స్ విభాగాల్లో ఎక్కువ ప్రశ్నలు; జనరల్ సైన్స్, జనరల్ అవేర్‌నెస్ విభాగాల్లో కనీసం 15 శాతం ప్రశ్నలు అభ్యర్థుల ఆలోచనల వేగాన్ని, తగిన నిర్ణయం తీసుకోగలిగిన సామర్థ్యాన్ని పరీక్షించేవిగా ఉండి జయాపజయాలను నిర్దేశిస్తున్నాయి. సన్నద్ధత సమయంలోనే ఈ తరహా అంశాలకు ప్రాధాన్యమిస్తూ చదవాలి.


జనరల్ సైన్స్‌ను సాధారణంగా గతంలో ఆర్‌ఆర్‌బీ పరీక్షల్లో జనరల్ అవేర్‌నెస్‌లో భాగంగా అడిగేవారు. అయితే అసిస్టెంట్ లోకోపైలట్, గ్రూప్-సి ఉద్యోగ బాధ్యతల్లో శాస్త్ర సాంకేతిక అంశాలపై అవగాహన ఉండాల్సిన అవసరం రీత్యా ఈ విభాగాన్ని ప్రత్యేకంగా సిలబస్‌లో ఇస్తున్నారు.

రైలు ఇంజిన్‌లో డ్రైవరుగా పనిచేసే అభ్యర్థి లేదా రైలు ట్రాక్‌ను పర్యవేక్షించే అభ్యర్థికి భౌతికశాస్త్రంలోని ధ్వని, కాంతి, విద్యుత్, అయస్కాంతత్వం తదితర అంశాలు, రసాయన, జీవశాస్త్రాలపై అవగాహనతో వృత్తిలో రాణించే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ విభాగంలో ప్రశ్నలు ఉండనున్నాయి.

జనరల్ సైన్స్‌లో భౌతిక, రసాయన శాస్త్రాల్లో అనువర్తన అంశాలకు సన్నద్ధతలో ప్రాధాన్యం ఇవ్వాలి. ఉదాహరణకు- చలించే వాహనం, ప్రవహించే నీటిలో గతిశక్తి, నడిచే వాహనానికి బ్రేకులు వేస్తే ఒకవైపునకు ఎందుకు వంగుతుంది? అయస్కాంతం ఇనుప వస్తువులనే ఎందుకు ఆకర్షిస్తుంది? రబ్బరు పట్టీలో ఇమిడి ఉన్న భౌతికశాస్త్ర సూత్రం. విమానాల్లో వాడే భూమ్యాకర్షణ సాధనం, వజ్రాలు ఎందుకు మెరుస్తాయి? వంటి అనువర్తన శాస్త్ర అంశాలపై అవగాహన ఏర్పరచుకోవాలి. ప్రాథమిక అంశాలతోపాటు అనువర్తన విషయాలపై దృష్టి పెట్టడం వల్ల పోటీలో ముందుండే అవకాశముంది.

జనరల్ అవేర్‌నెస్‌ను ఈసారి సిలబస్‌లో పొందుపరిచేటపుడు చిన్న మార్పు చేశారు. 'వర్తమానాంశాలపై సాధారణ అవగాహన' (జనరల్ అవేర్‌నెస్ ఆన్ కరెంట్ అఫైర్స్) అని పేర్కొన్నారు. ఇదే సమయంలో వర్తమానాంశాల్లో రాజకీయ పరిణామాలు, ఆర్థికశాస్త్ర- సాంకేతిక రంగాలు, క్రీడారంగం, వార్తల్లో వ్యక్తులు.. అంశాలను పేర్కొన్నారు. ఈ రంగాల్లో పరీక్షకు ఆరు నెలల ముందు పరిణామాలను పరిశీలించాలి.

రెండు కేటగిరీల రాతపరీక్షలు ఏప్రిల్, మే నెలల్లో జరిగే అవకాశముందని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. ఇప్పుడు గడువు పొడిగించినందువల్ల దేశంలోని భారీ నియామక ప్రక్రియలో అత్యధికమంది పరీక్షకు హాజరయ్యే అవకాశం ఉంది. దీంతో నిర్వహణ సుదీర్ఘమై మరింత సమయం లభించవచ్చు. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకుని ప్రణాళిక ప్రకారం తగిన కృషి చేస్తే విజయం మీదే!



నాలుగు అంశాలు

అసిస్టెంట్ లోకోపైలట్ లేదా గ్రూప్-సి రాతపరీక్షల్లో ప్రధానంగా నాలుగు అంశాలు పరిశీలిస్తారు. అవి: 1) జనరల్ ఇంటెలిజెన్స్, రీజనింగ్ 2) మేథమేటిక్స్ 3) జనరల్ సైన్స్ 4) జనరల్ అవేర్‌నెస్

ఆర్‌ఆర్‌బీ పాత ప్రశ్నపత్రాల్లోని కొన్ని ప్రశ్నలను చూసి అభ్యర్థులు లోకోపైలట్ లేదా గ్రూప్-సిని తేలికగా తీసుకుంటే మాత్రం ఈసారి చిక్కుల్లో పడతారు. ఎందుకంటే ఆర్‌ఆర్‌బీ గ్రూప్-సి వంటి పాపులర్ కేటగిరీ నియామకాలు జరిపి మూడు, నాలుగేళ్లైంది. ఈ మధ్యకాలంలో నియామక సంస్థల విధానాల్లో మార్పులు వచ్చాయి. మునుపు దరఖాస్తు చేసినవారిలో ఎక్కువ ప్రతిభ చూపినవారిని ఎంపిక చేసుకోవాలన్న దృక్పథంతో ప్రశ్నపత్రాలుండేవి. అయితే ఇటీవలి కాలంలో ఉద్యోగ బాధ్యతలకు న్యాయం చేయగలిగే తెలివిగల వారికోసం అన్వేషణ జరుగుతోంది. ఇందుకోసం ప్రశ్నపత్రాలతోనే వడగట్టేస్తున్నారు. సమర్థులను ఎంచుకోడానికి దీన్ని ఒక ప్రయోగవేదికలా వినియోగించుకుంటున్నారు.

మేథమేటిక్స్, జనరల్ ఇంటెలిజెన్స్ ద్వారా అభ్యర్థిలోని ఆలోచనల వేగం, కచ్చితత్వం, వేగంగా స్పందించే స్వభావం, విషయాలను సాధారణీకరించే ఊహాశక్తి తదితర గుణాలను వివిధ సమస్యల రూపంలో పరిశీలించే అవకాశం ఉంది. ఉదాహరణకు-

■ '9 2 5 8 1 4 7 3' ఈ అంకెలను ఆరోహణ క్రమంలో రాస్తే వచ్చే అమరికలోని కుడివైపు నుంచి నాలుగో అంకె, ఎడమవైపు నుంచి మూడో అంకెల మధ్య తేడా ఎంత?

1) 1 2) 2 3) 3 4) 4 **జవాబు: 2**

ఈ ప్రశ్నకు తగిన సమయం తీసుకుని ఎవరైనా సమాధానం గుర్తించవచ్చు. కానీ అత్యంత వేగంగా ఆలోచించి జవాబును గుర్తించగలగడం సమయ నిర్వహణలో కీలకం. ఇలాగే గ్రూప్-సి గత పరీక్షలో గణిత విభాగంలో అడిగిన ప్రశ్న.

■ **10.01 100.001 ÷ 1001 = ?**

1) 1.00001 2) 10.001

3) 100.001 4) 1000.01 **జవాబు: 1**

గుణిస్తూ జవాబు రాబట్టడం ఏ అభ్యర్థి అయినా చేయగలుగుతాడు. కానీ ఇటువంటి సమస్యలకు వేగంగా జవాబు గుర్తించడం ద్వారానే ఇచ్చిన వ్యవధిలో గరిష్ఠంగా జవాబులు రాయవచ్చు. ఈ ప్రశ్నలు ఉద్యోగార్థిలో ఆలోచనల వేగాన్ని సూచిస్తాయి. లోకోపైలట్ లేదా గ్రూప్-సి ఉద్యోగ బాధ్యతల్లో వేగంగా ఆలోచించడం, తగిన నిర్ణయం త్వరితగతిన తీసుకోవడం అలవాటుగా ఉన్న అభ్యర్థులు రాణించగలుగుతారు.

నోటీస్ బోర్డు

ప్రభుత్వ ఉద్యోగాలు

పుణె కంటోన్మెంట్ బోర్డులో 77 ఖాళీలు

భారత రక్షణ మంత్రిత్వ శాఖకు చెందిన పుణె కంటోన్మెంట్ బోర్డు టీచర్, జూనియర్ క్లర్క్ తదితర పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది.

అర్హత: పదోతరగతి, ఇంటర్, డిగ్రీ, బీఈడీ, ఎంబీబీఎస్, ఇతర అర్హతలు. **వయసు:** 18-30 ఏళ్ల మధ్య ఉండాలి. **ఎంపిక:** రాతపరీక్ష, స్కిల్ టెస్ట్ ద్వారా.

దరఖాస్తు: ఆన్‌లైన్ **చివరితేది:** 07.04.2018

http://punecantonmentboard.org/jobdate.html

ఎన్ఐడబ్ల్యూఈ, చెన్నై

సంస్థ: నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ విండ్ ఎనర్జీ (ఎన్ఐడబ్ల్యూఈ), చెన్నై **పోస్టులు:** ప్రాజెక్ట్ ఇంజినీర్, ఎగ్జిక్యూటివ్ అసిస్టెంట్ తదితరాలు. **ఖాళీలు:** 16 **అర్హత, వయసు:** నిబంధనల ప్రకారం. **ఎంపిక:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా. **దరఖాస్తు:** ఆఫ్‌లైన్ **చివరితేది:** 28.03.2018 **వెబ్‌సైట్:** http://niwe.res.in/

ఈఎస్ఐసీ, సనత్‌నగర్ మెడికల్ కాలేజ్

సంస్థ: ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఈఎస్ఐసీ) వైద్య కళాశాల, ఆసుపత్రి, సనత్‌నగర్, హైదరాబాద్

పోస్టులు: జూనియర్ రెసిడెంట్, సీనియర్ రెసిడెంట్, ట్యూటర్ **ఖాళీలు:** 52. **ఇంటర్వ్యూ తేదీలు:** 2018 మార్చి 20 నుంచి ఏప్రిల్ 9 వరకు **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేది:** 16.03.2018 **వెబ్‌సైట్:** www.esic.nic.in

వాక్ ఇన్ ఇంటర్వ్యూ

ఎన్‌సీఏఓఆర్, గోవా

సంస్థ: నేషనల్ సెంటర్ ఫర్ అంటార్కిటిక్ అండ్ ఓషన్ రిసెర్చ్ (ఎన్‌సీఏఓఆర్), వాస్కోడగామా, గోవా.

పోస్టులు: ఇంజినీర్, ప్రాజెక్ట్ టెక్నికల్ అసిస్టెంట్ తదితరాలు.

ఖాళీలు: 05 **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో బీఈ/బీటెక్, బీఎస్సీ లేదా మూడేళ్ల ఇంజినీరింగ్ డిప్లొమా.

వయసు: 40 ఏళ్లకు మించకూడదు.

ఇంటర్వ్యూ తేది: 26.03.2018

వేదిక: నేషనల్ సెంటర్ ఫర్ అంటార్కిటిక్ అండ్ ఓషన్ రిసెర్చ్, వాస్కోడగామా, గోవా.

వెబ్‌సైట్: www.ncaor.gov.in

నేషనల్ రిసెర్చ్ సెంటర్ ఆన్ పామగ్రనేట్

పోస్టులు: ఎస్ఆర్ఎఫ్, యంగ్ ప్రొఫెషనల్ **ఖాళీలు:** 08

అర్హత: సంబంధిత సబ్జెక్టుల్లో డిగ్రీ, పీజీ, సర్టిఫికెట్ కోర్సుల ఉత్తీర్ణత, అనుభవం.

వయసు: 21-45 ఏళ్ల మధ్య ఉండాలి.

ఇంటర్వ్యూ తేది: 05.04.2018

వేదిక: ఐకార్-నేషనల్ రిసెర్చ్ సెంటర్ ఆన్ పామగ్రనేట్, షోలాపూర్, మహారాష్ట్ర.

http://nrcpomegranate.icar.gov.in

ఎన్ఆర్‌సీబీ, తిరుచిరాపల్లి

పోస్టులు: యంగ్ ప్రొఫెషనల్-01, టెక్నికల్ అసిస్టెంట్-01. **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో బీఎస్సీ, ఎంఎస్సీ ఉత్తీర్ణత. **వయసు:** 21-45 ఏళ్ల మధ్య ఉండాలి.

ఇంటర్వ్యూ తేది: 12.03.2018

వేదిక: నేషనల్ రిసెర్చ్ సెంటర్ ఫర్ బనానా (ఎన్ఆర్‌సీబీ), తిరుచిరాపల్లి, తమిళనాడు.

వెబ్‌సైట్: http://nrcb.res.in/

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం www.eenadupratibha.net చూడవచ్చు.

ఒకేషనల్ కోర్సు తర్వాత..?

>>> ఇంటర్ (క్రాప్ ప్రొడక్షన్ అండ్ మేనేజ్‌మెంట్ ఇన్ అగ్రికల్చర్) ఒకేషనల్ కోర్సు చేశాను. నాకున్న ఉన్నత విద్య అవకాశాలను తెలపండి. నాకున్న ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగావకాశాలేవి?

- నక్కల శ్రీనివాస్ యాదవ్

జ: క్రాప్ ప్రొడక్షన్ అండ్ మేనేజ్‌మెంట్‌లో ఇంటర్ పూర్తిచేసినవారికి స్వయం ఉపాధి, వ్యవసాయ, వ్యవసాయాధారిత పరిశ్రమల్లో ఉద్యోగావకాశాలు ఉంటాయి. ఇది స్టాండ్ అలోన్ కోర్సు కావడం వల్ల వ్యవసాయం ద్వారా వ్యవసాయాధారిత మార్గాల ద్వారా స్వయం ఉపాధి కల్పనకు విద్యార్థులను తయారు చేస్తోంది. ఈ కోర్సు పూర్తిచేసినవారికి విలేజ్ లెవల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్, విత్తన గ్రేడర్, విత్తన ప్రొడక్షన్ అసిస్టెంట్, మెటరలాజికల్ అబ్జర్వర్, గ్రామీణ బ్యాంకుల్లో అగ్రికల్చర్ అసిస్టెంట్, సీడ్ గ్రోవర్ వంటి శాఖల్లో ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగావకాశాలుంటాయి. ఇంకా పై చదువుల విషయానికొస్తే బీబీఏ, బీబీఎం వంటి డిగ్రీ కోర్సులను చేసి పీజీ స్థాయిలో ఎంబీఏ (అగ్రి బిజినెస్) కోర్సును చేసే సౌలభ్యం ఉంది. మనదేశం వ్యవసాయాధారిత దేశం కాబట్టి వ్యవసాయ సంబంధిత మేనేజ్‌మెంట్ కోర్సులు చేసినవారికి మంచి అవకాశాలున్నాయి.



బీటెక్ కాకుండా... ఏం చదవొచ్చు?

>>> ఈసీఈ డిప్లొమా చేశాను. నా సబ్ బ్రాంచ్ ఎలక్ట్రానిక్స్ అండ్ వీడియో ఇంజినీరింగ్. ఉన్నతవిద్య చదవాలనుంది. బీటెక్ కాకుండా నాకున్న అవకాశాలేంటి?

- విశాల్



జ: సాధారణంగా డిప్లొమా పూర్తి చేసినవారు ఉద్యోగం కానీ బీటెక్ ద్వారా తమ చదువును కానీ కొనసాగిస్తారు. మీకు బీటెక్ కాకుండా బీఎస్సీ (కమ్యూనికేషన్ అండ్ ఎలక్ట్రానిక్స్, మేథమేటిక్స్ అండ్ స్టాటిస్టిక్స్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఎలక్ట్రానిక్స్) చదివే అవకాశం ఉంది. అలాకాకుండా వ్యాపారం, మేనేజ్‌మెంట్ పట్ల ఆసక్తి ఉంటే బీబీఏ, బీకాం, బీబీఎం వంటి డిగ్రీ కోర్సులను ఎంచుకోవచ్చు. ఈ మధ్యకాలంలో కొన్ని కళాశాలలు డిగ్రీ స్థాయిలో డేటా అనలిటిక్స్ కోర్సులను అందిస్తున్నాయి. మీ అభిరుచి, ఆసక్తి ఆధారంగా పైన పేర్కొన్న కోర్సులను ఎంచుకోవచ్చు.

● ప్రొ. బి. రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

మావోయిస్టు మృతదేహాల అప్పగింత

- **ఫొటోల ఆధారంగా సాగిన గుర్తింపులో గందరగోళం**

భద్రాచలం – న్యూస్‌టుడే

దండకారణ్యంలో ఇటీవల జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరణించిన మావోయిస్టుల మృతదేహాల అప్పగింతను సోమవారం సాయంత్రానికి పూర్తిచేశారు. ఎన్‌కౌంటర్‌పై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో 9 మృతదేహాలను పోలీసులు ఛత్తీస్‌గఢ్‌లోని వారి స్వగ్రామాలకు తరలించారు. ఎదురుకాల్పుల ఘటన వెలుగులోకి వచ్చినప్పటి నుంచి అంతా అస్పష్టత చోటుచేసుకోగా అప్పగింతల్లోనూ అదేతంతు కొనసాగింది. వీటిని నిజంగానే బంధువులకు అప్పగించారా? లేదా? అన్నది తేలాల్సి ఉంది. ఎవరెవరో రావడం.. తికమకపడటం.. ఈ మృతదేహం తమదేనని వేలిముద్రలేయడం జరిగింది. ఏఎస్పీ సునీల్‌దత్ నేతృత్వంలో సీఐ సత్యనారాయణరెడ్డి దగ్గరుండి ఈ తతంగాన్ని కానిచ్చేశారు.



మావోయిస్టుల మృతదేహాల తరలిస్తున్న దృశ్యం

ఫొటోలతో పోల్చుకోవడం కష్టమైంది

పోలీసుల అత్యుత్సాహం వల్ల మృతదేహాల గుర్తింపు కష్టమైంది. ముందే ఫొటోలను, వీడియోలను స్పష్టంగా విడుదల చేసి ఉంటే ఈ తరహా ఇబ్బందులు ఉండేవి కాదన్న వాదనలు వినిపించాయి. కోర్టు ఉత్తర్వుల ప్రకారం భద్రాచలం ప్రభుత్వ ప్రాంతీయాసుపత్రిలోని పోస్ట్‌మార్టం గది వద్ద మృతదేహాలను శీతలీకరణలో భద్రపర్చినప్పటికీ పాడయ్యాయి. కొన్ని ఉబ్బిపోయాయి. పాలిథిన్ కవర్లు, చాపల్లో చుట్టిఉన్న మూటల నుంచి విపరీతమైన దుర్వాసన వచ్చింది. ఇలాంటి పరిస్థితుల్లో గుర్తించడం ప్రహసనంగా సాగింది. పోలీసుల ప్రమేయంతో వచ్చిన ఆదివాసీలంతా తమవారు విగత జీవులయ్యారన్న విషయం తెలిసి మౌనంగా రోదించారు. చనిపోయిన వారి ఫొటోలను, మృతదేహాన్ని పోలీసులు బంధువులకు చూపించారు. ఒకరిద్దరైతే మృతదేహాలు తమవారివి కాదని వెనుదిరిగారు. తర్వాత అన్ని మృతదేహాలను 4 అంబులెన్సులలో చర్ల వరకూ పంపారు. అక్కడి నుంచి ట్రాక్టర్‌లో గమ్యస్థానాలకు చేర్చేందుకు ప్రజాప్రతినిధులు, అధికార పార్టీ నాయకుల సహకారం తీసుకున్నారు. 8 మృతదేహాలను తీసుకెళ్లేందుకు సిద్ధంచేసి మల్లేశ్ అనే మావోయిస్టు మృతదేహాన్ని తీసుకెళ్లేందుకు ఎవ్వరూ రాలేదని కొద్దిసేపు ఆపారు. ఆ తర్వాత దీన్ని గుర్తించినట్లు పోలీసులు తెలిపి అంబులెన్సుల నిర్వాహకులతో మాట్లాడి చర్లకు పంపారు. మృతులకు సంబంధించిన ఆధార్‌కార్డులను కొందరు ప్రజాప్రతినిధులు తీసుకురావడం విశేషం. సంఘటన జరిగిన పూజారీ కాంఖేర్ ప్రాంతం నుంచి ఓ ప్రజాప్రతినిధి వచ్చారు. సుకుమా, బీజాపూర్, నారాయణపూర్ జిల్లాలకు చెందిన ఈ మృతదేహాలను తీసుకెళ్లేందుకు తొలుత ఎవ్వరూ రాకున్నా సోమవారం పోలీసులు అప్పగింతల ఆపరేషన్ పూర్తి చేయడం గమనార్హం.

నిపుణుల నివేదికపై సర్వత్రా ఆసక్తి

గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ సుశీల్‌కుమార్ మృతదేహానికి భద్రాచలం ప్రభుత్వ ప్రాంతీయాసుపత్రి వైద్యులు పోస్ట్‌మార్టం నిర్వహించగా మిగిలిన 10 మంది మావోయిస్టుల మృతదేహాలకు వరంగల్ నుంచి వచ్చిన నిపుణుల బృందం పోస్ట్‌మార్టం చేసింది. ప్రతి అవయవాన్నీ పరీక్షించారు. మృతదేహాలను కోసిన క్రమంలో కొన్ని బుల్లెట్లు లభించాయి. ఇదంతా వీడియోలో నిక్షిప్తమైంది. ఎక్కువ మందికి కాలేయం దెబ్బతిన్నట్లు తెలిసింది. ఓమహిళ దేహంలో ఎక్కువ బుల్లెట్ గాయాలున్నట్లు తెలిసింది. వీపులో నుంచి గుండెలను చీల్చుకుంటూ తుపాకీ గుళ్లవర్షం ఒకరిద్దరిపై కురిసిందని సమాచారం.

పోలీసుల బాణం గురితప్పిందా!

- **దాడికి ముందే సురక్షిత ప్రాంతాలకు మావోయిస్టు అగ్రనేతలు**
- **సమావేశాల సమయంలో రక్షణపై సరికొత్త వ్యూహాలు**
- **ఎన్‌కౌంటర్లో బలయ్యింది కింది స్థాయి కార్యకర్తలే**
- **భద్రతా బలగాలను ఆలోచనలో పడేసిన ఛత్తీస్‌గఢ్ ఘటన**

ఈనాడు, హైదరాబాద్: సూటిగానే బాణం విసిరారు. కానీ నిర్దేశించుకున్న లక్ష్యాన్ని తాకలేదు. పెద్ద నాయకులకు వల విసిరితే కింది స్థాయి కార్యకర్తలే బలయ్యారు! తమ గురి ఎందుకు తప్పిందన్నది ఇప్పుడు పోలీసులను ఆలోచనలో పడేసింది. ఇది తమ వైఫల్యమా? మావోయిస్టుల మారిన వ్యూహమా? అన్నదానిపై భద్రతాబలగాల్లో చర్చ మొదలైందని తెలుస్తోంది. వరుస ఎదురుదెబ్బలతో సతమతమవుతున్న మావోయిస్టులు తమ నాయకత్వాన్ని కాపాడుకునేందుకు అదనపు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు విశ్వసనీయంగా తెలియవచ్చింది. సమావేశాల నిర్వహణ సమయంలో అగ్రనేతల భద్రతకు మావోయిస్టులు ప్రత్యేక శ్రద్ధకనబరుస్తున్నట్లు తెలుస్తోంది. అందుకే ఇటీవల జరుగుతున్న ఎదురుకాల్పుల్లో పెద్ద నేతలు తప్పించుకోగలుగుతున్నారు. తాజాగా ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో జరిగిన ఎదురుకాల్పుల్లోనూ రాష్ట్ర కార్యదర్శితో సహా మిగతా ముఖ్యనేతలంతా సురక్షితంగా వెనుతిరగలిగారంటే మారిన వ్యూహమే కారణమని పోలీసులు భావిస్తున్నారు.

పోలీసుల గురి ముఖ్య నేతలపైనే

నక్సల్స్ ఉద్యమాన్ని నీరుగార్చాలంటే దిశానిర్దేశం చేసే నాయకత్వాన్ని దెబ్బతీయాలి. అందుకే వామపక్ష తీవ్రవాదంపై పోరాటం చేస్తున్న భద్రతా బలగాలు అగ్రనేతలనే లక్ష్యంగా చేసుకొని దాడులకు పాల్పడుతుంటాయి. ముఖ్యంగా మావోయిస్టులపై పోరాటంలో ఆరితేరిన తెలుగు రాష్ట్రాల పోలీసులు ఈ విషయంలో మరింత ముందుంటారు. మావోయిస్టుల కదలికలను అనుక్షణం తెలుసుకోగలిగే పటిష్ఠమైన నిఘా వ్యవస్థ అభివృద్ధి చేసుకున్న పోలీసులు, ముఖ్యనేతలు తమ గురిలోకి రాగానే విరుచుకుపడుతుంటారు. కొన్నేళ్లుగా పోలీసులు అనుసరిస్తున్న ఈ వ్యూహం వామపక్ష తీవ్రవాదాన్ని బలహీనపరిచింది. ఒక దశలో అయితే పోలీసుల దాడులు తట్టుకోలేక సురక్షిత ప్రాంతాల నుంచి బయటకు వెళ్లవద్దని మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ.. ముఖ్యనాయకులను ఆదేశించింది. కానీ నిరంతరం జరిగే పోరాటంలో నాయకులు సురక్షిత ప్రాంతాలకే పరిమితమైతే దాని ప్రభావం ఉద్యమంపై పడుతుంది. దాంతో నాయకులు మళ్లీ క్షేత్రస్థాయి సమావేశాలకు హాజరుకాక తప్పడంలేదు. ఈ క్రమంలో సురక్షిత విధానాలకు పదునుపెట్టారు. దీనిలో భాగంగానే మావోయిస్టు పార్టీ సమావేశాలకు హాజరయ్యే నాయకులకు అదనపు భద్రత కల్పించడం మొదలుపెట్టారు. సమావేశాలు జరుగుతున్నప్పుడు అగ్రనేతలు ఎవరు హాజరవుతారు, ఎన్నిరోజులు ఉంటారన్నది పార్టీ శ్రేణులకు తెలియకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అన్నింటి కంటే ముఖ్యంగా సమావేశాలకు హాజరయ్యే అగ్రనేతలు ఎట్టిపరిస్థితుల్లోనూ అక్కడే బస చేయకుండా, సాయంకాలానికి మరో సురక్షిత ప్రాంతానికి తరలివెళ్లేలా ఏర్పాట్లు చేసుకుంటున్నారు. వీరు ఆశ్రయం పొందే ప్రాంతాల వివరాలు ఒకరిద్దరికి మినహా ఆయా నాయకుల వ్యక్తిగత భద్రతా సిబ్బందికి కూడా తెలియకుండా చూస్తున్నారు.

అప్పుడే అలాగే...

2016 అక్టోబరులో ఆంధ్ర ఒరిస్సా సరిహద్దుల్లో జరిగిన భారీ ఎన్‌కౌంటర్లో 27 మంది మావోయిస్టులు మరణించారు. మావోయిస్టు అగ్రనేత, కేంద్ర కమిటీ సభ్యుడు రామకృష్ణ లక్ష్యంగా ఈ ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ ఘటనలో రామకృష్ణ కూడా మరణించారనే ప్రచారం జరిగింది. మూడు రోజుల తర్వాత ఆయన సురక్షితమని మావోయిస్టు పార్టీ ప్రకటించింది. ఇక్కడ జరిగిన ప్లీనరీకి హాజరైన రామకృష్ణ చీకటిపడిన తర్వాత మరో సురక్షిత ప్రాంతానికి తరలి వెళ్లారని, ఈ వ్యూహమే ఆయనను రక్షించి ఉంటుందని ఆ తర్వాత గుర్తించారు. తాజాగా ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో పది మంది మావోయిస్టులు మరణించారు. తెలంగాణ రాష్ట్ర కమిటీ కార్యదర్శి హరిభూషణ్, డివిజన్ కమిటీ కార్యదర్శులు బడే చొక్కారావు, భాస్కర్, ఆజాద్ తదితరులు మాత్రం సురక్షితంగా తప్పించుకోగలిగారు. వాస్తవానికి పోలీసులు ఈ ముగ్గురు నేతలనే లక్ష్యంగా చేసుకొని దాడి చేసినట్లు తెలుస్తోంది. ఈ సమావేశంలో 60 మంది మావోయిస్టులు పాల్గొంటున్నట్లు నిఘా వర్గాల సమాచారం. సమావేశం ముగిసిన తర్వాత ప్రతీరోజూ ముఖ్యనేతలు మరో ప్రాంతానికి తరలివెళ్లి తలదాచుకుంటున్నట్లు, అదే వారిని రక్షించినట్లు భావిస్తున్నారు.

రూ.3,200 కోట్ల టీడీఎస్ ఎగవేత

- **కుంభకోణాన్ని గుర్తించిన ఆదాయపు పన్ను విభాగం**
- **ఉద్యోగుల నుంచి పన్ను వసూలు చేసి ప్రభుత్వానికి జమ చేయని 447 సంస్థలు**
- **సొంత అవసరాలకు మళ్లించినట్లు విచారణలో వెల్లడి**

దిల్లీ: రుణాలు ఎగ్గొట్టి డబ్బును మళ్లించిన కుంభకోణాలను చూశాం. సహజ వనరుల కేటాయింపుల్లో అక్రమాలకు పాల్పడి ప్రభుత్వానికి భారీ నష్టాల్ని మిగిల్చిన కుంభకోణాల గురించీ విన్నాం. ప్రభుత్వం నుంచి అనుమతులు తెప్పించడానికో, మరో పనికో భారీగా ముడుపులు తీసుకుని డొల్లకంపెనీల ద్వారా ఆ డబ్బును చలామణిలోకి తెచ్చుకున్న కుంభకోణాల గురించీ విన్నాం. వీటికి భిన్నంగా మరో భారీ కుంభకోణమొకటి విస్మయానికి గురి చేస్తోంది. సగటు పన్ను చెల్లింపుదారుడిని నిలువునా మోసగిస్తూ రూ.వందలకోట్లను దిగమింగేస్తున్న కంపెనీల కథ ఇది. ఇది ఆదాయపు పన్నుల కుంభకోణం. దేశ వ్యాప్తంగా 447 కంపెనీలు తమ ఉద్యోగుల నుంచి ముక్కు పిండి వసూలు చేసిన రూ.3,200 కోట్ల టీడీఎస్‌ను ఆదాయపు పన్ను అధికారుల వద్ద జమ చేయకుండా సొంత అవసరాలకు వాడుకున్నట్లు అధికారులు గుర్తించారు. 2017 ఏప్రిల్ నుంచి 2018 మార్చి మధ్యలో అధికారుల చేపట్టిన దర్యాప్తులో ఈ విషయం వెల్లడయింది. ఉద్యోగుల జీతాల్లో టీడీఎస్ పేరుతో కోత పెట్టి ఆ సొమ్మును సొంత వ్యాపార ప్రయోజనాల కోసం, ముఖ్యంగా వర్కింగ్ క్యాపిటల్ కోసం మళ్లించినట్లు తేలింది.

ఉదాహరణకు రాజకీయాలతో సంబంధమున్న ఒక ప్రముఖ బిల్డర్.. రూ.100 కోట్లను మళ్లించారు. ఐటీ సేవలను అందించే బహుళజాతి సంస్థ ఒకటి రూ.11 కోట్లను జమ చేయలేదు. చలనచిత్ర నిర్మాణ సంస్థలు, మౌలిక సదుపాయాల కంపెనీలు, అంకురసంస్థలు, రాత్రికి రాత్రే బిచాణా ఎత్తివేసే వారూ ఉన్నారు.

ఈ కుంభకోణంలో ప్రమేయమున్న సంస్థలపై ఆదాయపు పన్ను శాఖలోని టీడీఎస్ విభాగం విచారణ ప్రక్రియను ప్రారంభించినట్లు సమాచారం. సంబంధిత సంస్థల బ్యాంకు ఖాతాలను, స్థిర, చరాస్తులను జప్తు చేయడం ద్వారా టీడీఎస్‌ను రాబట్టుకునే చర్యలను ప్రారంభించినట్లు తెలుస్తోంది.

టీడీఎస్ అంటే ఒకరకంగా ముందస్తుగా చెల్లించే ఆదాయపు పన్ను. ఆదాయపు పన్ను ఎంత చెల్లించాల్సి వస్తో సుమారుగా అంచనాకు వచ్చి ఉద్యోగుల జీతాలు, కమీషన్లు వగైరా నుంచి కంపెనీలు ఆ మొత్తాన్ని మినహాయించి ఆదాయపు పన్ను విభాగానికి మూడు నెలలకొకసారి జమ చేస్తాయి. ఆదాయపన్ను చట్టం ప్రకారం టీడీఎస్ చెల్లించకపోతే మూడు నెలలకు తక్కువ కాకుండాను, గరిష్ఠంగా ఏడేళ్ల వరకు కఠిన కారాగార శిక్ష విధించవచ్చు. జరిమానా కూడా విధించవచ్చు.

ఇది ప్రతి ఏటా జరిగేదేనని, ఇది కుంభకోణం కాదని, సకాలంలో టీడీఎస్‌ను జమ చేయకపోవడమేనని ఆదాయపు పన్ను విభాగంలోని వర్గాలు చెప్పినట్లు ఇండియాటుడే తెలిపింది.

పేలిన మందుపాతర... ఇద్దరు పోలీసులకు గాయాలు



పేలుడులో ధ్వంసమైన వాహనం

కాళేశ్వరం, న్యూస్‌టుడే: మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా కోర్చి అటవీ ప్రాంతంలో సోమవారం మావోయిస్టులు అమర్చిన మందుపాతరకు ఇద్దరు పోలీసులు గాయపడ్డారు. ఈ ఘటనలో పోలీసు వాహనం ధ్వంసమైంది. కోర్చి ఠాణాకు మూడు కిలోమీటర్ల దూరంలో మావోయిస్టులు బ్యానర్లు ఏర్పాటు చేయడంతో వాటిని తొలగించడానికి సీఐ అతుల్ తావాడే, ఏఎస్సై రాజేశ్ ఓ వాహనంలో వెళ్లారు. వారి రాకను పసిగట్టిన మావోలు మందుపాతరను పేల్చి వేశారు. దీంతో వాహనం ధ్వంసమవడంతో పాటు అందులో ప్రయాణిస్తున్న సీఐ, ఏఎస్ఐకి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను వెంటనే హెలికాప్టర్‌లో నాగ్‌పుర్ ఆసుపత్రికి తరలించారు.

దళితుణ్ని బలిగొన్న కులవివక్ష

- **ఇల్లు ఖాళీ చేయాలంటూ పక్కింటి వాళ్ల వేధింపులు**
- **కేసు వెనక్కి తీసుకోవాలంటూ అధికార పార్టీ నేత బెదిరింపులు**
- **యువకుడి ఆత్మహత్యా యత్నం.. ఆపై మృతి**
- **మృతదేహంతో దళిత సంఘాల ఆందోళన**

మహాముత్తారం, న్యూస్‌టుడే: కులవివక్ష ఓ దళిత యువకుడిని పొట్టనపెట్టుకోగా..తదనంతర పరిణామాలతో భూపాలపల్లిజిల్లాలోదళిత సంఘాలు ఆందోళనకు దిగాయి. పోలీసుల కథనం మేరకు.. జాడి నాగయ్య కుటుంబం పదేళ్లక్రితం మండల కేంద్రం మహాముత్తారంలోని అల్లుండ్ల వీధిలో ఇల్లునిర్మించుకుని అక్కడేనివాసం ఉంటోంది. ఆ ఇంటికిపక్కనే నివాసముంటున్న మారగోని దుర్గయ్య 'తక్కువ కులంవారు ఇక్కడ నివాసం ఉండకూడదంటూ' కొంతకాలంగా వారితో గొడవపడుతూ వస్తున్నాడు. ఇటీవలికాలంలో గొడవలు తీవ్రంకావడంతో గత జనవరి 21న నాగయ్య కుమారుడు కవిరాజు(30) పోలీసులకు ఫిర్యాదు చేశాడు. 23వరకు కేసు నమోదు కాలేదు. ఇదే విషయమై ఎస్ఐతో చర్చించేందుకు కవిరాజు 23న ఠాణాకు వెళ్లగా.. మహాముత్తారం ఎంపీటీసీ మార్కరామయ్య గౌడ్ అలియాస్ రాము గౌడ్ (మహాముత్తారం తెరాస మండలపార్టీ అధ్యక్షుడు) అతన్ని కలిశాడు. కేసు వెనక్కి తీసుకోవాలంటూ బెదిరించినట్లు సమాచారం.



కవిరాజు(పాతచిత్రం)

ఈ పరిణామాల నేపథ్యంలో కవిరాజు గతనెల 28 రాత్రి కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వరంగల్ ఎంజీఎంఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం అర్ధరాత్రి మృతి చెందాడు. 'మార్కరామయ్యగౌడ్ బల ప్రయోగంతో ఫిర్యాదు వెనక్కి తీసుకునేలాచేశాడు. అధికార బలంతో నీపైనే కేసులు నమోదు చేయిస్తామని బెదిరించాడు. తెల్లకాగితంపై సంతకాలు తీసుకున్నాడు. అందుకే మనస్తాపంతో ఆత్మహత్యకుపాల్పడుతున్నా.' అంటూ మృతుడు మరణవాఙ్మూలంలో పేర్కొన్ననేపథ్యంలో.. మార్కరామయ్యగౌడ్, కులంపేరుతో దూషించిన మారోగిని దుర్గయ్య, అతని భార్య సరోజన, కొడుకు రమేష్‌లపై కేసులు నమోదుచేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై రాజు తెలిపారు. పోలీసుల నిర్లక్ష్యం, కేసు నమోదులో జాప్యమే దళితుడిమృతికి కారణమంటూ దళితసంఘాల ఆధ్వర్యంలో మండల కేంద్రం కాటారంలో బాధితుని మృతదేహంతో సోమవారం ఆందోళన నిర్వహించడంతో ఉద్రిక్తత నెలకొంది.

బండ్లగూడ ఆర్టీవో బదిలీ

- **నలుగురు సిబ్బంది సస్పెన్షన్‌కు నిర్ణయం**
- **వాహనాల రిజిస్ట్రేషన్‌లో అక్రమాలకు బాధ్యులపై చర్యలకు తెలంగాణ రవాణా మంత్రి ఆదేశం**

ఈనాడు, హైదరాబాద్: రవాణా శాఖ అమలు చేస్తున్న ఆన్‌లైన్ వ్యవస్థను మరింత పటిష్ఠం చేయాలని తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పి.మహేందర్ రెడ్డి ఆదేశించారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే వాహనాల సమాచారాన్ని (డేటా) జాతీయ సమాచారం కేంద్రం(ఎన్ఐసీ) ద్వారా ధ్రువీకరించుకున్న తరువాతే రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపట్టాలని అధికారులకు సూచించారు. రంగారెడ్డి జిల్లా బండ్లగూడ రవాణా శాఖ కార్యాలయం పరిధిలో వాహనాల ధరను, వయసును తక్కువగా చూపించిన పలు వాహనాలను రిజిస్ట్రేషన్ చేసినట్లు, తద్వారా సుమారు రూ.1.20 కోట్ల వరకు ప్రభుత్వ ఖజానాకు గండిపడినట్లు అధికారులు గుర్తించారు. ఈ అంశంపై సోమవారం సచివాలయంలో మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా బండ్లగూడ రవాణా శాఖ కార్యాలయంలో ఆర్టీవోగా ఉన్న పురుషోత్తంను ప్రధాన కార్యాలయానికి బదిలీ చేశారు. అక్రమాలకు పాల్పడిన నలుగురు సిబ్బందిని సస్పెండ్ చేయాలని మంత్రి ఆదేశించారు. అక్రమాలను అరికట్టేందుకు రిజిస్ట్రేషన్ పత్రాల్లో ఎక్స్ షోరూం ధరను కూడా నమోదు చేయాలన్నారు. సాఫ్ట్‌వేర్‌ను దుర్వినియోగం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. రవాణా శాఖ కార్యాలయాలన్నీ దళారులరహితంగా ఉండాలన్నారు. సమావేశంలో రవాణా శాఖ కార్యదర్శి సునీల్‌శర్మ, సంయుక్త కమిషనర్ రమేష్, ఐటీ శాఖ ఓఎస్డీ రమాదేవి, డీటీసీలు ప్రవీణ్‌రావు, మమతా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నిఖా-హలాలాను రాజ్యాంగ విరుద్ధమని ప్రకటించండి


దిల్లీ: ముస్లింలలో బహుభార్యత్వం, నిఖా-హలాలా ఆచారాలను రాజ్యాంగ విరుద్ధమైనవిగా, మహిళల ప్రాథమిక హక్కులను ఉల్లంఘిస్తున్నట్లుగా ప్రకటించాలంటూ సుప్రీం కోర్టులో ఒక పిటిషన్ దాఖలైంది. ముమ్మారు తలాక్‌ను సర్వోన్నత న్యాయస్థానం రద్దు చేసిన నేపథ్యంలో ఇది దాఖలైంది. విడాకుల పోకడను కట్టడి చేయడం నిఖా-హలాలా ఉద్దేశం. దీనికింద ఒక వ్యక్తి.. తన మాజీ భార్యను పునర్వివాహం చేసుకోవాలంటే తొలుత ఆమె.. మరో వ్యక్తిని వివాహం చేసుకొని, కాపురం చేసి, ఆ తర్వాత విడాకులు పొందాల్సి ఉంటుంది. ఆ తర్వాతే మొదటి భర్తను పెళ్లి చేసుకోవడానికి వీలు కలుగుతుంది. బహుభార్యత్వం, నిఖా-హలాలాలు ముస్లిం మహిళల ప్రాథమిక హక్కులను ఉల్లంఘిస్తున్నాయని పిటిషనరైన భాజపా దిల్లీ నేత అశ్వనీకుమార్ ఉపాధ్యాయ్ ఆరోపించారు. సతీసహగమనం దురాచారాన్ని నిషేధించిన రీతిలో ఆ ఆచారాలపైనా చర్యలు చేపట్టాలని కోరారు.

క్యాన్సర్‌పై "వైరస్" బాణం



వాషింగ్టన్: వైరస్‌ను పోలిన కణాల సాయంతో ఓ కొత్త క్యాన్సర్ చికిత్సను పరిశోధకులు అభివృద్ధిచేస్తున్నారు. వ్యాధి నిరోధక శక్తిని క్రియాశీలం చేయడంలో ఇది చక్కగా తోడ్పడే వీలుంది. దీన్ని జంతువుల్లోని కణితులపై తొలుత ప్రయోగిస్తారు. అనంతరం మనుషులకు అనుగుణంగా దీనిలో మార్పులుచేస్తారు. రోగనిరోధక శక్తిని క్రియాశీలంచేసే ప్రోటీన్లను క్యాన్సర్ కణాలు అడ్డుకుంటాయి. దీంతో వ్యాధి నిరోధక శక్తి తగ్గిపోతుంది. ప్రస్తుతం దీన్ని క్రియాశీలం చేయడమే లక్ష్యంగా అమెరికాలోని మిషిగన్ స్టేట్ వర్సిటీ నిపుణులు తాజా పరిశోధన చేపడుతున్నారు. దీనిలో వైరస్‌లా కనిపించే క్యూబీటా కణాలు, క్యాన్సర్ కణాల్లోని కార్బోహైడ్రేట్ యాంటీజెన్లు (టీఏసీఏ)లను ఉపయోగిస్తున్నారు. ఈ రెండింటినీ కలిపితే.. వ్యాధి నిరోధక శక్తిని క్రియాశీలం చేసేందుకు తోడ్పడే అస్త్రం అందుబాటులోకి వచ్చేవీలుంది. ప్రస్తుతం క్యూబీటా కణాల నిర్మాణాలను లోతుగా అధ్యయనం చేస్తున్నట్లు పరిశోధకులు షుఫీ హువాంగ్ తెలిపారు. టీఏసీఏలతో క్యూబీటాలను మెరుగ్గా అనుసంధానించేందుకు ఇది తోడ్పడుతుందని ఆయన వివరించారు.

ఆస్థమా ఔషధ మోతాదు పెంచితే.. పిల్లల ఎదుగుదలకే ముప్పు!



వాషింగ్టన్: తల్లిదండ్రులూ జాగ్రత్త..! పిల్లల్లో ఆస్థమా లక్షణాలు ఎక్కువవుతున్నప్పుడు ఎట్టిపరిస్థితుల్లోనూ ఔషధ మోతాదును పెంచొద్దని తాజా అధ్యయనం హెచ్చరిస్తోంది. తాత్కాలికంగా ఇలా డోసును పెంచితే పిల్లల ఎదుగుదల మందగించే ముప్పుందని చెబుతోంది. ఆస్థమా బాధిత చిన్నారుల్లో ఒక్కోసారి దగ్గు, గురక, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు పెరుగుతుంటాయి. వీటిని నియంత్రించేందుకు ఆస్థమా ఔషధాల(స్టెరాయిడ్లు) మోతాదును స్వల్పకాలంపాటు పెంచమని కొందరు వైద్యులు సూచిస్తుంటారు. ఇలా తాత్కాలికంగా డోసు పెంచితే చుట్టుముట్టే దుష్ప్రభావాలపై అమెరికాలోని నేషనల్ హార్ట్, లంగ్, బ్లడ్ ఇన్‌స్టిట్యూట్ (ఎన్‌హెచ్ఎల్‌బీఐ) నిపుణులు తాజా పరిశోధన చేపట్టారు. 5 నుంచి 11 ఏళ్ల మధ్యవయసున్న 250 మంది చిన్నారుల సమాచారాన్ని వారు విశ్లేషించారు. 'తక్కువ మోతాదులో ఔషధాలను తీసుకుంటున్న చిన్నారుల విషయంలో అప్రమత్తంగా ఉండాలి. వీరికి డోసు పెంచినంత మాత్రన ఆస్థమా లక్షణాలు తగ్గిపోవు. పైగా మిగతావారితో పోల్చినప్పుడు వీరిలో ఎదుగుదల ఏడాదికి 0.23 సెం.మీ తక్కువగా ఉంటోంది'అని పరిశోధకులు జేమ్స్ కీలే తెలిపారు.

పోషకాహారం తీసుకుంటున్నా.. ఉప్పు తగ్గించాల్సిందే..!



లండన్: తాజా పళ్లు, కూరగాయలతో కూడిన పోషకాహారం తీసుకుంటున్నప్పటికీ ఉప్పును మాత్రం తగ్గించాల్సిందేనని తాజా అధ్యయనం నొక్కిచెబుతోంది. లేనిపక్షంలో రక్తపోటు బారిన పడతారని హెచ్చరిస్తోంది. పక్షవాతం, గుండె పోటులకూ ఇది దారితీసే ముప్పుందని వివరిస్తోంది. పళ్లు, కూరగాయలను అధికంగా తీసుకుంటే రక్తంలోని సోడియం దుష్ప్రభావాలను అడ్డుకోవచ్చని ఇదివరకటి పరిశోధనల్లో రుజువైంది. అయితే ఆహారంలో ఉప్పు స్థాయిలు పెరుగుతున్నప్పుడు పోషకాలు ఎలాంటి ప్రభావాన్నీ చూపలేకపోతున్నాయని ప్రస్తుతం బ్రిటన్‌లోని ఇంపీరియల్ కాలేజీ లండన్ నిపుణులు చెబుతున్నారు. దీన్ని రుజువుచేసేందుకు 4680 మందిపై పరిశోధన చేపట్టారు. ఆహారపు అలవాట్లు, మూత్ర నమూనాలను విశ్లేషించారు. దీంతో ఉప్పును ఎక్కువగా తీసుకునే వారి మూత్రంలో సోడియం ఎక్కువగా ఉంటున్నట్లు తేలింది. అంతేకాదు వీరు పచ్చని కూరగాయలు, విటమిన్-సీ, ఒమేగా 3 కొవ్వు ఆమ్లాలను తీసుకుంటున్నా... పొటాషియం స్థాయిలు మాత్రం పెరగడంలేదని బయటపడింది. సోడియం దుష్ప్రభావానికి అడ్డుకట్ట వేయడంలో పొటాషియం చక్కగా తోడ్పడుతుంది.

సెన్సెక్స్ ▼ 300
33747

నిఫ్టీ ▼ 100
10359

రూపాయి 65.12 ▲ (ఒక అమెరికా డాలరుకు) 5 పైసలు

బంగారం 30665 ▲ (ముంబయిలో 10 గ్రా. 99.9 స్వచ్ఛత) రూ.లలో 285

వెండి 38550 ▲ ముంబయిలో కిలో రూ.లలో 465

ముడి చమురు 65.58 ▲ (బ్రెంట్ ధర డాలర్లలో)



ప్రధాన ప్రపంచ మార్కెట్లు

సూచీ	ముగింపు	లాభం+/నష్టం-
డోజోన్స్	24,772	+234
నాస్‌డాక్	7,336	+78
నిక్కీ 225 (జపాన్)	21,042	−140
స్ట్రెయిట్స్ టైమ్స్ (సింగపూర్)	3,439	−41
షాంఘై(చైనా)	3,258	+3
ఎఫ్‌టీఎస్ఈ (బ్రిటన్)	7,116	+48
డాక్స్ (జర్మనీ)	12,091	+177

డోజోన్స్, నాస్‌డాక్ సూచీలు అమెరికా కాలమానం ప్రకారం సోమవారం మధ్యాహ్నం 1.00కు (భారత కాలమానం ప్రకారం రాత్రి 11:30 గంటలకు).


విదేశీ మారకపు రేట్లు

(థామస్ కుక్) (రూ.లలో)



కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలరు	59.20	68.65
పౌండ్ స్టెర్లింగ్	81.63	94.66
యూరో	72.95	84.60
జపనీస్ యెన్/100	56.13	65.09
ఆస్ట్రేలియా డాలరు	45.85	53.08
సింగపూర్ డాలరు	44.88	53.15
థాయ్ బాత్/100	188.43	225.29
బహ్రెయిన్ దీనార్	160.33	183.73
కువైట్ దీనార్	179.56	223.53
సౌదీ రియాల్	15.74	19.23
యూఏఈ దిర్హమ్	16.12	18.84
మలేషియా రింగిట్	14.87	18.28
చైనీస్ యువాన్	7.27	11.80

సోమవారం నిఫ్టీ కదలికలు



వాణిజ్య యుద్ధ మేఘాలతో..

- నాలుగో రోజూ సూచీలు డీలా
- 300 పాయింట్లు కోల్పోయిన సెన్సెక్స్
- కుదేలైన లోహ షేర్లు



సమీక్ష

సూచీల నష్టాలు వరుసగా నాలుగో రోజూ కొనసాగాయి. అంతర్జాతీయ వాణిజ్య యుద్ధ భయాలతో విదేశీ మదుపర్లు స్థిరంగా అమ్మకాలకు దిగడమే ఇందుకు నేపథ్యం. ఉక్కు, అల్యూమినియంలపై భారీగా దిగుమతి సుంకాన్ని విధిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించడంతో అంతర్జాతీయంగా సెంటిమెంట్ ప్రతికూలంగా మారింది. ఫలితంగా సెన్సెక్స్ కీలకమైన 34,000 పాయింట్ల దిగువకు చేరగా.. నిఫ్టీ 10,400 పాయింట్ల కింద ముగిసింది. భారత సేవల కార్యకలాపాలు ఫిబ్రవరిలో మందగించడం సైతం ఇందుకు తోడైంది. ఈశాన్య రాష్ట్రాల ఎన్నికల్లో భాజపా మంచి ఫలితాలు సాధించినప్పటికీ.. సూచీల నష్టాలు ఆగలేదు. ఆసియా మార్కెట్లు డీలాపడగా, ఐరోపా షేర్లు మెరుగ్గా ట్రేడయ్యాయి.


రోజంతా నష్టాల్లోనే: సెన్సెక్స్ 34,034.28 పాయింట్ల వద్ద బలహీనంగా ప్రారంభమైంది. ఆద్యంతం నష్టాల్లోనే కదలాడిన సూచీ.. ఇంట్రాడేలో 34,653.41 పాయింట్ల వద్ద కనిష్ఠానికి పడిపోయింది. చివరకు 300.16 పాయింట్ల నష్టంతో 33,746.78 దగ్గర స్థిరపడింది. ఫిబ్రవరి 20 తర్వాత సూచీకిదే కనిష్ఠ స్థాయి కావడం గమనార్హం. గత మూడు సెషన్లలో సెన్సెక్స్ 398.81 పాయింట్లు కోల్పోయింది. ఇక నిఫ్టీ సైతం ఒకానొకదశలో 10,323.90 పాయింట్లకు చేరింది. చివరకు 99.50 పాయింట్ల నష్టంతో 10,358.85 దగ్గర స్థిరపడింది.

- ✦ హైదరాబాద్‌లోని యూనిట్-4 ఫార్ములేషన్ తయారీ కేంద్రానికి అమెరికా ఔషధ నియంత్రణ సంస్థ యూఎస్ఎఫ్‌డీఏ 9 అభ్యంతరాలతో ఫారం 483ను జారీ చేయడంతో అరబిందో ఫార్మా షేరు కుదేలైంది. ఇంట్రాడేలో 5.46 శాతం తగ్గిన షేరు.. చివరకు 3.74 శాతం నష్టంతో రూ.600.80 వద్ద ముగిసింది.
- ✦ ఉక్కు, అల్యూమినియంపై దిగుమతి సుంకం విధించడానికి అమెరికా ప్రతిపాదించిన నేపథ్యంలో లోహ షేర్లు విలవిలలాడాయి. ఎన్ఎమ్‌డీసీ 5.85%, నాల్కో 4.98%, జేఎస్‌డబ్ల్యూ స్టీల్ 4.68%, జిందాల్ స్టీల్ 4.32%, హిందాల్కో 4.29%, సెయిల్ 3.58%, టాటా స్టీల్ 2.95%, వేదాంతా 2.51%, హిందుస్థాన్ జింక్ 0.71% మేర నష్టాలు నమోదు చేశాయి.

సెన్సెక్స్ 30 షేర్లలో 24 నష్టాలు చవిచూశాయి. టాటా మోటార్స్ 5.04%, టాటా స్టీల్ 2.95%, బజాజ్ ఆటో 2.74%, రిలయన్స్ ఇండస్ట్రీస్ 2.48%, కోల్ ఇండియా 2.33%, యెస్ బ్యాంక్ 2.31%, ఓఎన్‌జీసీ 2.14%, డాక్టర్ రెడ్డీస్ 2.05%, హిందుస్థాన్ యునిలీవర్ 1.90%, ఏషియన్ పెయింట్స్ 1.37%, భారతీ ఎయిర్‌టెల్ 1.30%, ఐటీసీ 1.27% చొప్పున డీలా పడ్డాయి. సన్‌ఫార్మా 2.50%, టీసీఎస్ 2.21%, ఎం అండ్ ఎం 0.81%లు మాత్రం రాణించాయి. రంగాల వారీ సూచీల్లో చమురు-గ్యాస్, వాహన, ఎఫ్ఎమ్‌సీజీ, పీఎస్‌యూ, యంత్ర పరికరాలు, మౌలిక, విద్యుత్, స్థిరాస్తి, ఆరోగ్య సంరక్షణ, బ్యాంకింగ్ షేర్లు 1.81 శాతం వరకు నష్టాలు నమోదు చేశాయి. ఐటీ, మన్నికైన వినిమయ వస్తువుల స్క్రిప్‌లు రాణించాయి.

మార్కెట్ కబుర్లు

- ✦ రూ.5,400.38 కోట్లు చెల్లించాలంటూ **పిపావావ్ డిఫెన్స్** ప్రమోటర్లకు రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మధ్యవర్తిత్వ నోటీసులు పంపింది. పిపావావ్ డిఫెన్స్ షేర్ల కొనుగోలు నిమిత్తం కుదుర్చుకున్న ఒప్పందాన్ని ఉల్లంఘించినందుకు తన అనుబంధ సంస్థ రిలయన్స్ డిఫెన్స్‌తో కలిసి ఈ నోటీసులు జారీ చేసింది. పిపావావ్ డిఫెన్స్‌లో మెజార్టీ వాటా కొనుగోలుకు 2015 మార్చిలో ఆ సంస్థతో రిలయన్స్ డిఫెన్స్ ఒప్పందం కుదుర్చుకుంది.
- ✦ గుడ్‌గావ్‌లో గృహ సముదాయ ప్రాజెక్టు నిర్మాణం, అభివృద్ధి నిమిత్తం **రూరల్ ఎలక్ట్రిఫికేషన్** నుంచి రూ.192 కోట్ల విలువైన ఆర్డరు వచ్చిందని ఎన్‌బీసీసీ తెలిపింది.
- ✦ తొలి పబ్లిక్ ఆఫర్ నిమిత్తం సెబీకి సంబంధిత దరఖాస్తు పత్రాలను సమర్పించినట్లు **దేవీ సీఫుడ్స్** తెలిపింది. ప్రతిపాదిత ఇష్యూ ద్వారా కంపెనీ రూ.900 కోట్లు సమీకరించాలని అనుకుంటోంది.
- ✦ జేఎస్‌డబ్ల్యూ ఎలక్ట్రిక్ వెహికల్స్‌ను కొనుగోలు చేసినట్లు **జేఎస్‌డబ్ల్యూ ఎనర్జీ** తెలిపింది. జేఎస్‌డబ్ల్యూ ఎలక్ట్రిక్‌లో ఇంతకుముందు వాటాదార్లుగా మ్యాగ్నఫీషియెంట్ మర్చండైజ్ (జేఎస్‌డబ్ల్యూ ఎనర్జీ ప్రమోటరుకు చెందిన సంస్థ), పార్థ్ జిందాల్ (జేఎస్‌డబ్ల్యూ ఎనర్జీ ప్రమోటరు బంధువు) ఉన్నారు.
- ✦ మహారాష్ట్రలో తమకు చెందిన ఒక ప్లాంటులోని డిస్టిలరీ కార్యకలాపాలకు సంబంధించిన డిఎస్-1 లైసెన్స్, ఫామ్-1 లైసెన్సులను రద్దు చేస్తూ మహారాష్ట్రకు చెందిన 'ద కమిషనర్ ఆఫ్ స్టేట్ ఎక్సైజ్' ఆదేశాలు జారీ చేశారని లైసెన్స్ **జుబిలంట్ లైఫ్ సైన్సెస్** వెల్లడించింది



కోడిగుడ్లు — 5న ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	345	వరంగల్	347
చిల్లరగా(ఒక గుడ్డు)	4.05	విశాఖపట్నం	350
బెంగళూరు	375	చెన్నై	385
6వ తేదీకి...		చిత్తూరు	378
విజయవాడ/గోదావరి	340	నమక్కల్	370

వచ్చే ఏడాది 7.5 శాతానికి

- అంతర్జాతీయం అందివస్తుంది
- దేశీయ గిరాకీ కలిసివస్తుంది
- భారత ఆర్థిక వృద్ధి రేటుపై క్రిసిల్ అంచనాలు



ముంబయి: 2018-19లో అంటే వచ్చే ఆర్థిక సంవత్సరంలో భారత్ 7.5 శాతం మేర వృద్ధి రేటును నమోదు చేస్తుందని రేటింగ్ ఏజెన్సీ క్రిసిల్ అంచనా కడుతోంది. ఇందుకు దేశీయ వినియోగం, విధానాల మద్దతు, అంతర్జాతీయ వృద్ధి కలిసివస్తాయని ఒక నివేదికలో వెల్లడించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 6.5 శాతం వృద్ధి నమోదు కావొచ్చన్న అంచనాలున్న సంగతి తెలిసిందే. ఆర్థిక సర్వే-2018 అంచనా ప్రకారం 2018-19లో 7-7.5 శాతం వృద్ధి కనబడవచ్చు. క్రిసిల్ తన నివేదికలో ఇంకా ఏమందంటే..

- ✦ పెద్ద నోట్ల రద్దు; జీఎస్‌టీ అమలు కారణంగా గత రెండేళ్లుగా తక్కువ వృద్ధి రేటు నమోదైనప్పటికీ.. వచ్చే ఏడాది పుంజుకుని.. గౌరవప్రదమైన 7.5 శాతం వృద్ధి నమోదవవచ్చు.
- ✦ దేశీయ అంశాలే ఈ వృద్ధికి దోహదం చేయనున్నాయి. ముఖ్యంగా విధానాల అమలు కారణం కానుంది. అంతర్జాతీయ వృద్ధి కొంతలో కొంత మద్దతునివ్వనుంది. అంతక్రితం ఏడాదుల్లో తక్కువ వృద్ధి నమోదు కావడమూ (లో బేస్ ఎఫెక్ట్) మరికొంత మద్దతునివ్వవచ్చు.
- ✦ బ్యాంకింగ్ రంగంలో మొండి బకాయిలు; గ్రామీణ భారత్‌లో వినియోగం పెరుగుతుండడం; కొనసాగుతున్న సంస్కరణల అమలు, పెరుగుతున్న అంతర్జాతీయ వృద్ధి తదితరాలు దేశ వృద్ధి ఎంత మేర పుంజుకోవచ్చన్న అంశాన్ని ప్రభావితం చేయొచ్చు.
- ✦ ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో స్థూల నిరర్థక ఆస్తులు 10.5 శాతానికి చేరుతున్నాయి. వీటి పరిష్కారానికి చర్యలు ప్రారంభం కాకుండా.. ఆర్థిక రికవరీ కొనసాగకపోవచ్చు. అయితే నేషనల్ కంపెనీ లా ట్రైబ్యునల్(ఎన్‌సీఎల్‌టీ) గడువు ఆధార పరిష్కారాలను మొదలుపెట్టిన నేపథ్యంలో కొంత ఆశలు చిగురిస్తున్నాయి.
- ✦ కేటాయింపులు భారీగా ఉండడంతో బ్యాంకింగ్ రంగ రికవరీకి సమయం పట్టేలా ఉంది.

చైనా వృద్ధి లక్ష్యం: 6.5%

బీజింగ్: ఈ ఏడాది జీడీపీ వృద్ధి రేటు లక్ష్యాన్ని 6.5 శాతంగా నిర్ణయించుకున్నట్లు చైనా తెలిపింది. గతేడాదితో పోలిస్తే ఈ లక్ష్యంలో మార్పేమీ లేదు. భారీగా పెరుగుతున్న అప్పుల నుంచి ఎదురయ్యే సమస్యలను తగ్గించుకోవాలనీ భావిస్తోంది. నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్(ఎన్‌పీసీ)కు సమర్పించిన వార్షిక ప్రణాళిక నివేదికలో చైనా ప్రధాని లీ కెక్వియాంగ్ ఆశావహ దృక్పథాన్ని ప్రదర్శించారు. వృద్ధి లక్ష్యాన్ని పెంచడానికి దూరంగా ఉన్నారు. 'చైనా ఆర్థిక వ్యవస్థ మూలాలు బలంగా ఉన్నాయి. అమలు చేయడానికి మా వద్ద చాలా విధానాలు ఉన్నాయి. వ్యవస్థాకృత సమస్యలను ఎదుర్కోవడానికి పూర్తి సామర్థ్యం మా వద్ద ఉంద'ని ఆ 45 పేజీల నివేదికలో లీ పేర్కొన్నారు.

కొత్త ఫండ్లు మీకోసం



దేశంలో మ్యూచువల్ ఫండ్ల హవా నడుస్తోంది. స్థిరాస్తి, పసిడి వంటి పెట్టుబడి సాధనాలు మెరుగైన ప్రతిఫలాన్ని అందించలేకపోతుండటంతో పెట్టుబడులు ఈక్విటీల వైపు మళ్లుతున్నాయి. ముఖ్యంగా చిన్న మదుపర్లు మ్యూచువల్ ఫండ్‌లకు పట్టం కడుతుండటంతో ఈ పరిశ్రమ మూడు పువ్వులు.. ఆరు కాయలుగా విరాజిల్లుతుంది. అందుకే ఎప్పటికప్పుడు విభిన్న పథకాలతో మ్యూచువల్ ఫండ్ సంస్థలు ముందుకొస్తున్నాయి. ఈ వారం కొత్తగా వచ్చిన ఫండ్‌లను ఒకసారి చూస్తే..

1 కోటక్ ఎఫ్ఎమ్‌పీ సిరీస్ 219- 1173 డేస్

ముగింపు తేదీ	: రేపు (మార్చి 7)	**ప్లాన్‌లు**	: రెగ్యులర్, డైరెక్ట్
విభాగం	: క్లోజ్-ఎండెడ్ రుణ పథకం	**ఆప్షన్‌లు**	: గ్రోత్, డివిడెండ్
కేటాయింపులు	: 80-100% రుణ పథకాల్లో, 0- 20% మనీ మార్కెట్ పథకాల్లో	**కనీస దరఖాస్తు**	: రూ.5000, ఆ తర్వాత రూ.10 చొప్పున ఎంతైనా జతచేసుకోవచ్చు
రిస్క్	: స్వల్పం	**ఎగ్జిట్ లోడ్**	: లేదు
ప్రామాణిక సూచీ	: క్రిసిల్ కాంపోజిట్ బాండ్	**ఫండ్ మేనేజర్**	: దీపక్ అగర్వాల్

2 ఐడీఎఫ్‌సీ ఫిక్స్‌డ్ టెర్మ్ ప్లాన్- సిరీస్ 140 (1145 రోజులు)

ముగింపు తేదీ	: రేపు (మార్చి 7)	**ప్లాన్‌లు**	: రెగ్యులర్, డైరెక్ట్
విభాగం	: క్లోజ్-ఎండెడ్ రుణ పథకం	**ఆప్షన్‌లు**	: గ్రోత్, డివిడెండ్
కేటాయింపులు	: 80-100% రుణ పథకాల్లో, 0-20% మనీ మార్కెట్ పథకాల్లో	**కనీస దరఖాస్తు**	: రూ.5000, ఆ తర్వాత రూ.10 చొప్పున ఎంతైనా జతచేసుకోవచ్చు
రిస్క్	: స్వల్పం	**ఎగ్జిట్ లోడ్**	: లేదు
ప్రామాణిక సూచీ	: క్రిసిల్ కాంపోజిట్ బాండ్ ఫండ్	**ఫండ్ మేనేజర్**	: హర్షల్ జోషి

3 ఆదిత్య బిర్లా సన్ లైఫ్ ఫిక్స్‌డ్ టెర్మ్ ప్లాన్ -సిరీస్ పీఐ (1140 రోజులు)

ముగింపు తేదీ	: రేపు (మార్చి 7)	**ప్లాన్‌లు**	: రెగ్యులర్, డైరెక్ట్
విభాగం	: క్లోజ్-ఎండెడ్ఇన్‌కమ్ పథకం	**ఆప్షన్‌లు**	: గ్రోత్, డివిడెండ్
కేటాయింపులు	: 80-100%రుణ పథకాల్లో, 0-20%మనీ మార్కెట్‌పథకాల్లో	**కనీస దరఖాస్తు**	: రూ.5000, ఆ తర్వాత రూ.10 చొప్పున ఎంతైనా జతచేసుకోవచ్చు
రిస్క్	: స్వల్పం	**ఎగ్జిట్ లోడ్**	: లేదు
ప్రామాణిక సూచీ	: క్రిసిల్ కాంపోజిట్ బాండ్ ఫండ్	**ఫండ్ మేనేజర్**	: మోహిత్ శర్మ

4 డీహెచ్ఎఫ్ఎల్ ప్రమెరికా ఫిక్స్‌డ్ డ్యూరేషన్ ఫండ్ - సిరీస్ ఏఆర్ (1140 రోజులు)

ముగింపు తేదీ	: మార్చి 12	**ప్లాన్‌లు**	: రెగ్యులర్, డైరెక్ట్
విభాగం	: క్లోజ్-ఎండెడ్ రుణ పథకం	**ఆప్షన్‌లు**	: గ్రోత్, డివిడెండ్
కేటాయింపులు	: 80-100% రుణ పథకాల్లో, 0- 20% మనీ మార్కెట్ పథకాల్లో	**కనీస దరఖాస్తు**	: రూ.5000, ఆ తర్వాత రూ.1 చొప్పున ఎంతైనా జతచేసుకోవచ్చు
రిస్క్	: స్వల్పం	**ఎగ్జిట్ లోడ్**	: లేదు
ప్రామాణిక సూచీ	: క్రిసిల్‌కాంపోజిట్ బాండ్	**ఫండ్ మేనేజర్**	: అభిషేక్ బహినిపతీ

5 డీహెచ్ఎఫ్ఎల్ ప్రమెరికా ఫిక్స్‌డ్ డ్యూరేషన్ ఫండ్- సిరీస్ ఏక్యూ (1139 రోజులు)

ముగింపు తేదీ	: రేపు (మార్చి 7)	**ఆప్షన్‌లు**	: గ్రోత్, డివిడెండ్
విభాగం	: క్లోజ్-ఎండెడ్ రుణ పథకం	**కనీస దరఖాస్తు**	: రూ.5000, ఆ తర్వాత రూ.1 చొప్పున ఎంతైనా జతచేసుకోవచ్చు
రిస్క్	: స్వల్పం		
ప్రామాణిక సూచీ	: క్రిసిల్‌కాంపోజిట్ బాండ్	**ఎగ్జిట్ లోడ్**	: లేదు
ప్లాన్‌లు	: రెగ్యులర్, డైరెక్ట్	**ఫండ్ మేనేజర్**	: అభిషేక్ బహినిపతీ

మరోవైపు కొన్ని మ్యూచువల్ ఫండ్ సంస్థలు ఈ వారం డివిడెండ్‌లను ప్రకటించాయి. అవేంటో చూస్తే..

పథకం	ఆప్షన్	ప్లాన్‌లు	డివిడెండు (యూనిట్‌కు)	రికార్డు తేదీ
డీఎస్‌పీ బ్లాక్‌రాక్ ఈక్విటీ	డివిడెండ్	రెగ్యులర్, డైరెక్ట్	రూ.16	మార్చి 8
యాక్సిస్ ఫోకస్డ్ 25	డివిడెండ్	రెగ్యులర్, డైరెక్ట్	రూ.2	మార్చి 8
ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ బ్యాలెన్స్‌డ్ అడ్వాంటేజ్	మంత్లీ డివిడెండ్	రెగ్యులర్	రూ.0.10	మార్చి 7
ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ బ్యాలెన్స్‌డ్	మంత్లీ డివిడెండ్	రెగ్యులర్	రూ.0.24	మార్చి 7
ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ బ్యాలెన్స్‌డ్	మంత్లీ డివిడెండ్	డైరెక్ట్	రూ.0.20	మార్చి 7
ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఈక్విటీ ఆర్బిట్రేజ్	డివిడెండ్	రెగ్యులర్	రూ.0.20	మార్చి 7
ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఈక్విటీ ఇన్‌కమ్	మంత్లీ డివిడెండ్	రెగ్యులర్	రూ.0.20	మార్చి 7

ఐవీఆర్‌సీఎల్ దివాలా ప్రక్రియ షురూ

- ఎస్‌బీఐ దరఖాస్తుపై ఎన్‌సీఎల్‌టీ ఉత్తర్వులు జారీ
- ఐఆర్‌పీగా సుతాను సిన్హా నియామకం
- ఆస్తుల క్రయవిక్రయాలపై నిషేధం
- బహిరంగ ప్రకటన ఇవ్వాలంటూ ఐఆర్‌పీకి ఆదేశం

ఈనాడు, హైదరాబాద్: స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) రుణాలను సకాలంలో చెల్లించకపోవడంతో నిర్మాణ సంస్థ ఐవీఆర్‌సీఎల్ దివాలా ప్రక్రియ (కార్పొరేషన్ ఇన్‌సాల్వెన్సీ రిజల్యూషన్ ప్రాసెస్-సీఐఆర్‌పీ) ప్రారంభించడానికి జాతీయ కంపెనీ లా ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) హైదరాబాద్ ధర్మాసనం అనుమతించింది. దీనిపై పలుమార్లు విచారించిన ట్రైబ్యునల్ జ్యుడిషియల్ సభ్యుడు విత్తనాల రాజేశ్వరరావు, సాంకేతిక సభ్యులు రవికుమార్ దురైస్వామిలతో కూడిన ధర్మాసనం దివాలా ప్రక్రియ ప్రారంభానికి అనుమతిస్తూ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. దివాలా ప్రక్రియ పరిష్కార నిపుణుడు (ఐఆర్‌పీ)గా కోల్‌కతకు చెందిన సుతాను సిన్హాను నియమించింది. ఐవీఆర్‌సీఎల్‌కు వ్యతిరేకంగా దిగువ కోర్టులు, ట్రైబ్యునళ్లు, మధ్యవర్తిత్వం, ఇతర ఏదేనీ న్యాయస్థానాల్లో పిటిషన్‌లు పెండింగ్‌లో ఉన్నా, తీర్పులు వెలువడి అమలుకు ఆదేశాలు ఇచ్చి అమలు కాకపోయినా వాటి అమలుపై నిషేధం వర్తిస్తుందని తెలిపింది. కంపెనీ ఆస్తులను అన్యాక్రాంతం లేదా హక్కులను బదిలీ చేయడం కుదరదంది. కంపెనీ ఆస్తిని ఎవరికైనా తాకట్టు పెడితే దాన్ని విక్రయించ కూడదు ఐవీఆర్‌సీఎల్ స్వాధీనంలో ఉన్న ఆస్తిని లీజుదారు, యజమాని తీసుకోవడం వంటి అన్ని చర్యలపై నిషేధం వర్తిస్తుందని పేర్కొంది. సీఐఆర్‌పీ పూర్తయ్యేదాకాగానీ, రుణగ్రహీతకు సంబంధించి లిక్విడేషన్ ఉత్తర్వులు వెలువడేదాకా ఈ నిషేధం కొనసాగుతుందని తెలిపింది. ఐవీఆర్‌సీఎల్ తన అధికారిక వెబ్‌సైట్‌లో ఈ విషయాన్ని ప్రకటించాలని ఆదేశించింది. ఐఆర్‌పీ తన చట్టబద్ధమైన విధులను నిర్వహించడానికి పిటిషనర్లు, ప్రతివాదులు సహకరించాలని సూచించింది. ఐవీఆర్‌సీఎల్ వ్యవస్థాపకుల్లోగానీ, మేనేజ్‌మెంట్‌తో సంబంధం ఉన్న వ్యక్తినిగానీ ఐఆర్‌పీకి సహకరించడానికి అందుబాటులో ఉంచాలని, పత్రాలు, రికార్డులను ఇవ్వాలని ఆదేశించింది. ఈ ప్రక్రియను 180 రోజుల్లో పూర్తి చేయాలని, తీసుకున్న చర్యలను పరిశీలించడానికి వీలుగా స్థాయీ నివేదికను ట్రైబ్యునల్‌కు సమర్పించాలంటూ ఆదేశిస్తూ విచారణను ఈనెల 19కి వాయిదా వేసింది.

రూ.604.15 కోట్ల రుణ బకాయి

ఐవీఆర్‌సీఎల్‌తో ఎస్‌బీఐ పునర్నిర్మాణ ఒప్పందం 2014 జూన్‌లో చేసుకుందని బ్యాంకు తరపున సిరిల్ అమర్‌చంద్ మంగల్‌దాస్ సంస్థకు చెందిన న్యాయవాది బిశ్వజిత్ దూబె ట్రైబ్యునల్ దృష్టికి తీసుకువచ్చారు. ఐవీఆర్‌సీఎల్‌కు మొత్తం రూ.1171.65 కోట్ల రుణాన్ని ఎస్‌బీఐ మంజూరు చేసిందన్నారు. ఇందులో 2014, 2015ల్లో 6 ఖాతాల కింద రూ.898.49 కోట్లు మంజూరు చేసిందన్నారు. గత ఏడాది అక్టోబరు 22నాటికి రూ.604.15 కోట్లు బకాయి ఉందన్నారు. తమిళనాడులో వివిధ ఆస్తులను హామీగా ఇచ్చిందని, వీటన్నింటి విలువ కార్పొరేట్, వ్యక్తిగత హామీలు కాకుండా రూ.547.96 కోట్లు ఉంటుందన్నారు. ఐఆర్‌పీగా సుతాను సిన్హాను ప్రతిపాదిస్తూ అతని ఫీజు కింద నెలకు రూ.5 లక్షలు బ్యాంకు చెల్లిస్తుందన్నారు. వాదనలను విన్న ట్రైబ్యునల్ ధర్మాసనం 'రుణం చెల్లించడంలో ఐవీఆర్‌సీఎల్ విఫలమైనట్లు ఆధారాలున్నాయ'ని తెలిపింది. ఇదే కంపెనీకి సంబంధించి రూ.3.15 కోట్ల రుణం చెల్లించకపోవడంతో దివాలా ప్రక్రియ ప్రారంభించాలంటూ ఐడీబీఐ క్యాపిటల్ మార్కెట్స్ అండ్ సెక్యూరిటీస్ చేసిన దరఖాస్తు కూడా పెండింగ్‌లో ఉందని, అయితే ఎస్‌బీఐ రుణ బకాయి ఎక్కువ కావడంతో ఈ బ్యాంకు దరఖాస్తుపై దివాలా పరిష్కార ప్రక్రియను ప్రారంభించాలంటూ ఆదేశాలు జారీ చేసింది.

'అరబిందో' పాశమైలారం యూనిట్‌లో 9 లోపాలు

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్ సమీపంలోని పాశమైలారంలో ఉన్న అరబిందో ఫార్మా యూనిట్‌లో జరిపిన తనిఖీల్లో అమెరికా ఆహార, ఔషధ నియంత్రణ ప్రాధికార సంస్థ (యూఎస్ఎఫ్‌డీఏ) 9 లోపాలను గుర్తించింది. 483 ఫారమ్‌ను జారీ చేసింది. పాశమైలారం ఫార్ములేషన్ల తయారీ యూనిట్‌లో (యూనిట్-4) ఫిబ్రవరి 12 నుంచి 20 తేదీల మధ్య యూఎస్ఎఫ్‌డీఏ తనిఖీలు చేసిందని, సాధారణ తనిఖీ నిబంధనలకు అనుగుణంగా వీటిని నిర్వహించిందని అరబిందో ఫార్మా వెల్లడించింది. యూఎస్ఎఫ్‌డీఏ కనుగొన్న లోపాలు డేటా సమగ్రతకు సంబంధించినవి కావని పేర్కొంది. పదిహేను రోజుల్లో యూఎస్ఎఫ్‌డీఏకు లోపాల సవరణపై లేఖ రాయగలమని వివరించింది. కంపెనీకి ఇది కీలకమైన తయారీ యూనిట్. కంపెనీ అమెరికా అమ్మకాల్లో దాదాపు 10 శాతం అమ్మకాలు ఈ యూనిట్‌లో తయారయ్యే ఔషధాల ద్వారానే లభిస్తున్నట్లు అంచనా.

ఎన్ఎస్ఈ

సోమవారం ముగింపు, క్రితం ముగింపు, ట్రేడింగ్ పరిమాణం (వరుసగా)

నిఫ్టీ 50

ADANI PORT & 403.95 (406.10) 3665892
AMBUJA CEMEN 246.10 (253.15) 2291003
ASIAN PAINTS 1105.95 (1118.90) 529677
AUROBIND PHA 600.75 (624.10) 8672423
AXIS BANK LT 524.55 (525.75) 6766199
BAJAJ AUTO L 2943.55 (3020.90) 287300
BAJAJ FINANC 1636.95 (1659.35) 743779
BHARTI AIRTE 421.45 (427.75) 3482148
BHARTI INFRA 339.15 (345.20) 2294182
BOSCH LTD 18348.00 (18707.50) 13019
BPCL 434.30 (441.90) 2843005
CIPLA 579.25 (581.70) 1179725
COAL INDIA L 305.80 (312.90) 3593849
DR. REDDYS 2180.80 (2231.50) 598344
EICHER MOTOR 27548.35 (27742.35) 51019
GAIL 443.60 (454.25) 2919275
HCL TECH 932.10 (942.80) 1873852
HDFC 1789.60 (1814.15) 2163209
HDFC BANK 1869.95 (1874.35) 945366
HERO MOTOCOR 3556.45 (3576.90) 242671
HINDALCO IND 229.60 (240.80) 12425050
HINDUSTAN UN 1299.75 (1324.25) 842790
HPCL 366.75 (376.75) 1744323
ICICI BANK 303.35 (304.95) 14456193
INDIABULLS H 1238.25 (1256.30) 1248449
INDIAN OIL 379.25 (381.50) 6535934
INDUSINDBANK 1689.20 (1700.35) 789108
INFOSYS LTD 1155.90 (1160.75) 4050728
ITC 260.25 (264.00) 6623613
KOTAK MAHIND 1100.00 (1095.70) 2409121
LARSEN & TOU 1300.70 (1315.20) 1302005
LUPIN 790.15 (803.90) 1944252
M&M 739.60 (732.55) 2170367
MARUTI SUZIK 8795.10 (8873.45) 388180
NTPC LTD 163.30 (163.00) 3287892
ONGC 185.55 (189.70) 5082390
POWER GRID C 196.95 (197.40) 3933311
RELIANCE IND 924.10 (948.40) 5634893
SBI 263.50 (262.15) 18484565
SUN PHARMA 548.55 (535.40) 7343286
TATA CONSULT 3105.85 (3037.70) 1429084
TATA MOTORS 352.05 (370.75) 14665325
TATA STEEL L 655.90 (675.05) 9785466
TECH MAHINDR 630.85 (611.90) 4765322
ULTRATECH 4095.40 (4153.30) 124424
UPL LIMITED 720.90 (714.25) 1093480
VEDANTA LIMI 315.90 (323.25) 9269131
WIPRO 290.95 (292.50) 3748745
YES BANK LTD 312.95 (321.05) 7973146
ZEE ENTERTAI 551.85 (555.40) 1269210

నిఫ్టీ నెక్స్ట్ 50

ABB 1490.50 (1525.15) 38820
ACC 1606.15 (1633.80) 190051
ASHOK LEYLAN 140.15 (140.95) 14686149
AVENUE SUPER 1314.30 (1314.25) 698817
BAJAJ FINSER 5037.45 (4999.40) 114133
BANK OFBAROD 138.80 (138.30) 10501381
BEL 155.55 (153.30) 3062570
BHEL 90.40 (90.70) 4722003
BRITANNIA 4902.45 (4943.85) 78734
CADILA HEALT 391.90 (404.05) 952536
COLGATE PALM 1048.30 (1056.90) 285627
CONTAINER 1280.35 (1312.35) 265779
CUMMINS INDI 797.40 (804.10) 208916
DABUR INDIA 325.00 (325.20) 5281481
DLF LIMITED 222.90 (224.30) 3539064
EMAMI LIMITE 1097.55 (1081.20) 44895
GLAXOSMI CON 6716.95 (6791.50) 7182
GLAXOSMI PHA 2386.10 (2378.90) 20725
GLENMARK PHA 551.40 (544.50) 1360938
GODREJ CONSU 1075.30 (1080.20) 336690
HAVELLS INDI 507.15 (511.25) 905063
HINDUSTAN ZI 313.65 (315.60) 3660347
ICICI PRU LI 397.80 (408.10) 475388
IDEA CELLULR 82.55 (83.05) 9089105
INTERGLOBE A 1309.10 (1332.15) 1426225
JSW STEEL LT 291.65 (305.50) 9282086
LIC HOUS.FIN 514.85 (507.05) 1665413
MARICO LIMIT 308.50 (312.15) 707255
MCDOWELL 3191.35 (3244.85) 216970
MOTHERSON 309.90 (319.90) 6556078
MRF 72324.65 (72683.65) 8937
NHPC LTD 27.75 (27.80) 7931781
NMDC LTD 122.90 (130.70) 8438407
OIL INDIA 350.30 (349.75) 327603
ORACLE FIN S 3759.20 (3855.55) 38375
P&G HYG&HEAL 9300.15 (9413.85) 4394
PETRONET LNG 235.50 (240.80) 3121829
PIDILITE IND 889.95 (894.40) 189643
PIRAMAL ENTE 2440.90 (2547.05) 235361
PNB 100.10 (101.05) 59237515
POWER FIN CO 101.75 (102.45) 6369449
RURAL ELEC C 140.20 (142.15) 2287463
SAIL 78.05 (80.90) 30548637
SHREE CEMENT 16626.10 (16595.35) 20686
SHRIRAM TRAN 1369.40 (1338.55) 596665
SIEMENS 1142.25 (1153.15) 98750
SUN TV LTD 912.25 (916.65) 624119
TATA POWER 82.15 (84.30) 5009614
TITAN IND 808.90 (810.20) 1262568
TORRENT PHAR 1366.60 (1338.10) 469594

బీఎస్ఈలో రాష్ట్ర కంపెనీలు

ALPHAGEO 797.55 (806.40) 1468
AMAR RAJA BA 804.50 (812.70) 13420
ANDHRA BANK 44.20 (45.20) 236332
ANDHRA CEMEN 10.75 (10.99) 37557
ANDHRA PAPER 301.15 (308.80) 15430
ANDHRA PETRO 57.25 (58.75) 42372
ANDHRA SUGAR 501.05 (500) 523
ASTRA MICROW 90.30 (89.65) 35406
AUROBINDO PH 600.80 (624.10) 444179
AVANTEL SOFT 575.50 (560.55) 28868
AVANTI FEEDS 2433.60 (2431.55) 20650
AVON ORG 11 (11.49) 1500
BALAJI AMIN 624.40 (633.25) 7331
BARTRONICS 13.39 (13.23) 125891
BHAGIRA CHEM 304.45 (309) 1114
BHAGYA NAG 46.25 (48.05) 22023
BN RATHI SEC 42.50 (42.55) 3094
BRILLIANT SE 10.65 (11.21) 106833
CAMBRIDGE TE 76.50 (75.20) 5553
COMBAT DRUGS 27.40 (27.40) 133
CONT COFFEE 297.50 (299.45) 7791
COROMAN FERT 554.55 (549.80) 139172
CYBERMATE 3.09 (3.10) 35735
CYIENT LIMIT 627.80 (633.50) 2498
DIVI'S LAB 1010.20 (1017.25) 42442
DR REDDY 2182.45 (2228.05) 20581
GATI CORPN 108.95 (111.80) 98975
GAYATRI PROJ 210.70 (210.70) 11454
GMR INFRASTR 18.50 (18.60) 2303502
GOLDST INFRA 216.95 (216.85) 38443
GRANULES (I) 113.80 (116) 106236
GSS AMERICA 43.95 (45.70) 820350
GVK POWER 15.70 (16.50) 881589
HBL NIFE POW 56.65 (56.95) 196997
HYD INDUS 1673.35 (1708.30) 505
ILFS ENGINEE 41.65 (42) 3725
INNAREDY COM 3.15 (3.11) 26505
IVRCL INFRAS 4.36 (4.44) 93082
KAVERI SEED 487.60 (493.50) 18464
KCP LTD 122.80 (127.75) 18057
KNR CONSTRUC 302.05 (303.20) 10765
LANCO INDUS 338 (347.35) 43512
LANCO INFRAT 1.25 (1.26) 1492986
LAURUS LABS 528.95 (532.50) 14525
MADHUCON PRO 26.75 (27.30) 17947
MIC ELECTRON 6.86 (7.09) 76846
MOLD-TEK.TEC 59.90 (60) 82907
MOLDTK PLA 329.65 (338.20) 3452
NAGARJAGRICH 42.20 (43.50) 8605
NATCO PHARMA 757.50 (781.70) 40793
NAVA BH VENT 149.85 (152.40) 15302
NCC 126.80 (130.55) 467930
NCL IND 223.25 (233.25) 8840
NEHA INTER 7.24 (6.92) 13456
NETTLINX 76.80 (77.45) 90548
NEULAND LAB 703.30 (714.50) 10431
NIHAR INFO 13.33 (14.03) 100
PANYAM CEMEN 46.85 (47.65) 7554
PENNER IND 57.50 (58.25) 39899
PITTI LAMIN 90.55 (92.85) 7861
POKARNA 206.25 (213.05) 2824
PRAJAY ENGS 11.81 (11.25) 85986
PRISM CEMENT 123.60 (126.50) 94941
PRUDENTL PHA 4.18 (4.36) 160112
RAIN INDUSTR 369.15 (362) 651186
SAGAR CEM 939.85 (966.35) 184
SAMKRG PIST 297.90 (299.90) 3472
SAMPRE NUTRI 53.95 (51.40) 4917
SATVAH. ISPA 22.35 (22.90) 17547
SMS PHARMA 86.10 (86.20) 5340
SREE RAYAL A 55.35 (56.35) 132880
STEEL EXCHAN 29.10 (29.55) 42306
SUJANA METAL 1.39 (1.39) 24317
SUJANA TOWER 3.80 (3.94) 2508
SURYALAKSH.C 77.95 (78.70) 2486
SUVEN PHARMA 187.20 (190.55) 44093
TANLA 33.45 (35.35) 111950
TRANS BIOTEK 2.69 (2.62) 42840
TRENDY KNIT 0.27 (0.26) 11000
VAMSHI RUBB 51.50 (52.25) 2850
VICEROY HOTE 14.95 (15.65) 40272
VIMTA LABS 203.05 (203.80) 2920
VISTA PHARMA 48.35 (50.85) 34354
VIVIMED LABS 75.60 (77.60) 143819
VST INDUS 3135.35 (3172) 99
YBRANT DIGIT 5.56 (5.30) 267074
ZENTECH 130.80 (138.50) 144751



అద్దె ఇంటికీ ఆన్‌లైన్



● ఇల్లు కొనాలన్నా ఇదే మార్గం ● యువత తీరుపై నో బ్రోకర్ డాట్ కామ్ అధ్యయనం

ముంబయి: ఇల్లు/ఫ్లాట్ కొనాలన్నా, అద్దెకు తీసుకోవాలనుకున్నా.. అనువైనవి ఆన్‌లైన్‌లోనే పరిశీలించేందుకు యువతరం ఇష్టపడుతోందని నోబ్రోకర్ డాట్ కామ్ అధ్యయనం వెల్లడించింది. సాంకేతికతను ఇష్టపడే వారు స్థిరాస్తి వ్యవహారాలకూ డిజిటల్ మాధ్యమాన్నే వినియోగిస్తున్నారని తేల్చింది. 'ఆన్‌లైన్ వల్ల మధ్యదళారీలు, బ్రోకర్ల పాత్ర తగ్గుతోందని, పత్రాలు-బ్రోకరేజీ ఖర్చులు కూడా అదుపులోకి వస్తున్నాయి' అని నో బ్రోకర్ సంస్థ ప్రతినిధి పేర్కొన్నారు.

త్వరగా ఎంచుకోగలుగుతున్నారు

- ఇల్లు అద్దెకు తీసుకుంటున్న కుటుంబాల్లో దేశవ్యాప్తంగా 7,063 మంది నుంచి సంస్థ అభిప్రాయాలు సమీకరించింది. తమకు అనువైన ఇల్లు/ఫ్లాట్ కోసం ఆన్‌లైన్‌లోనే వెతుకులాడినట్లు 83 శాతం మంది తెలిపారు. కుటుంబసభ్యులు, స్నేహితులను సంప్రదించడం ద్వారా ఇళ్ల అద్దెకు తీసుకుంటున్నట్లు 31 శాతం మంది పేర్కొన్నారు.
- డిజిటల్ మాధ్యమాన్ని వినియోగించుకుంటున్న వారిలో 44 శాతం మంది డెస్క్‌టాప్ కంప్యూటర్లను, 38 శాతం మంది మొబైల్ యాప్‌ను ఇందుకు వాడుతున్నారు. మొబైల్ ద్వారా ఆన్‌లైన్‌లో వెతుకులాడుతున్న వారు 29 శాతం మంది.
- ఆన్‌లైన్‌లో అద్దె చెల్లించేందుకు సుముఖంగా ఉన్నామని 59 శాతం మంది వెల్లడించారు.
- ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా వెతుకులాట సంతృప్తికరంగా ఉందని 63 శాతం మంది తెలిపారు. 30 రోజుల్లోపే కావాల్సింది సాధించగలిగామని 30 శాతం మంది పేర్కొన్నారు.
- డిజిటల్ మాధ్యమ లావాదేవీల్లో విశ్వసనీయతపై ఇంకా సందేహాలు అధికంగానే ఉన్నాయి. తప్పుడు ప్రకటనలు, సరైన సమాచారం ఇవ్వకపోవడం, ఆస్తికి సంబంధించి తప్పుడు చిత్రాలు పొందుపరచడం ఇందుకు కారణమని 52 శాతం మంది పేర్కొన్నారు.
- డిజిటల్‌లో ప్రకటనలు చూసి, తమకు అనువైనవి అనుకున్నాక, సగటున కనీసం ఆరుగురు యజమానులతో మాట్లాడాకే, కావాల్సింది ఎంచుకుంటున్నట్లు అద్దెకు దిగేవారు వెల్లడించారు.
- ఇల్లు/ఫ్లాట్‌కు వెళ్లి, స్వయంగా పరిశీలించుకున్నాకే అద్దెకు దిగుతున్నట్లు 80 శాతం మంది తెలిపారు.
- కొనుగోళ్లకు సంబంధించి 'అందుబాటు ధర ఇళ్ల'కు అత్యధిక ప్రాధాన్యమిస్తున్నారు. అద్దెకు ఉంటున్న వారిలో మూడోవంతు మంది ఇల్లు కొనుగోలు చేయాలనే ఆకాంక్షను వెలిబుచ్చారు.
- రూ.40 లక్షల కంటే తక్కువ ధరలో లభించే ఇల్లు/ఫ్లాట్ కొనుగోలు చేయగలమని 47 శాతం మంది పేర్కొన్నారు. దేశ స్థిరాస్తి రంగానికి ఈ విభాగమే కీలకమవుతుందని సంస్థ పేర్కొంది.



స్నికర్స్‌కు ధోనీ ప్రచారం

దిల్లీ: భారత క్రికెటర్ ఎంఎస్ ధోనీని స్నికర్స్ బ్రాండ్ అంబాసిడర్‌గా ఎంపిక చేసుకొన్నట్లు చాకొలేట్ తయారీ సంస్థ మార్స్ వ్రిగ్లే కాన్ఫెక్షనరీ ప్రకటించింది. ధోనీ నటించిన 30 సెకన్ల నిడివి ఉన్న వాణిజ్య ప్రకటన టీవీల్లో ప్రసారమవుతుందని కంపెనీ తెలిపింది. గతంలో స్నికర్స్ బ్రాండ్‌కు రేఖ, సోనమ్ కపూర్ అంబాసిడర్లుగా వ్యవహరించిన సంగతి తెలిసిందే. 'చల్లగా (కూల్ కోషంట్) ఉండే స్నికర్స్ బ్రాండ్‌ను ప్రపంచవ్యాప్తంగా ఇష్టపడతారు. కెప్టెన్ కూల్‌గా పేరు తెచ్చుకున్న ధోనీ ఈ బ్రాండ్‌కు అంబాసిడర్‌గా చక్కగా సరిపోతార'ని సంస్థ మార్కెటింగ్ డైరెక్టర్ యోగేశ్ తివారీ తెలిపారు.

35 లక్షల ఆల్టో కార్ల విక్రయాలు!

మారుతీ సుజుకీ ఇండియా ఘనత

దిల్లీ: మారుతీ సుజుకీ తయారు చేసే కార్లలో అత్యధికంగా అమ్ముడుపోయే ఆల్టో కార్ల విక్రయాలు 35 లక్షల మార్కును దాటాయని సంస్థ వెల్లడించింది. 2017-18 ఆర్థిక సంవత్సరంలో 6 శాతం వృద్ధి నమోదుతోపాటు విపణిలో 33 శాతం వాటా ఆల్టోకు దక్కిందని సంస్థ ప్రకటించింది. దేశీయ విపణిలో గత 14 ఏళ్లుగా అత్యధిక సంఖ్యలో అమ్ముడవుతున్న కార్లలో ఆల్టో నిలుస్తోందని తెలిపింది. '2017-18లో దాదాపు 55 శాతం మంది వినియోగదారులు తమ తొలి కారుగా ఆల్టోను కొనేందుకు ముందుకొచ్చారు. 25 శాతం మంది అదనపు కారుగా ఆల్టోను కొనేందుకు ఆసక్తి చూపించారు. 2008లో 10 లక్షల యూనిట్ల అమ్మకాల మార్కు, 2010లో 15 లక్షల యూనిట్ల అమ్మకాల మార్కును దాటింద'ని మారుతీ సుజుకీ ఇండియా సీనియర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (మార్కెటింగ్, అమ్మకాలు) ఆర్ఎస్ కల్సి తెలిపారు.

పామాయిల్ దిగుమతులపై సుంకం పెంపు

ఈనాడు, హైదరాబాద్: పామాయిల్‌పై దిగుమతి సుంకాన్ని ప్రభుత్వం పెంచింది. ముడి పామాయిల్‌పై సుంకాన్ని 30 శాతం నుంచి 44 శాతానికి, రిఫైన్డ్ పామాయిల్‌పై సుంకాన్ని 40 శాతం నుంచి 54 శాతానికి సవరించింది. గత ఆరు నెలల్లో దిగుమతి సుంకాన్ని పెంచడం ఇది మూడో సారి. దీనిపై ఆయిల్ పామ్ డెవలపర్స్ అండ్ ప్రాసెసర్స్ అసోసియేషన్ (ఓపీడీపీఏ) హర్షం వ్యక్తం చేసింది. దిగుమతి సుంకాన్ని పెంచడం వల్ల దేశీయంగా పామాయిల్ తోటలను సాగు చేస్తున్న రైతులకు ప్రయోజనం చేకూరుతుందని ఓపీడీపీఏ ప్రెసిడెంట్ సంజయ్ గోయెంకా తెలిపారు. 2017, జులైలో టన్ను పామాయిల్ గెలల ధర రూ.6,781 ఉందని.. దిగుమతి సుంకాన్ని పెంచడం వల్ల దాదాపు రూ.9,000 చేరిందన్నారు.

ఆ ఇద్దరి కటకటాల వెనుక..

పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ)లో రూ.11,000 కోట్ల కుంభకోణం వెలుగు చూడటంతో యావత్ దేశం నిర్ఘాంతపోయింది. ఆ తర్వాత మరికొన్ని ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో మోసాలకు పాల్పడినట్లు వార్తలు రావడం కలవరపాటును మరింత పెంచింది. తాజాగా జీఎస్‌టీ విధానంలో కూడా ఈ తరహా మోసం ఒకటి బయటపడింది. అయితే పీఎన్‌బీ కుంభకోణానికి 'లెటర్ ఆఫ్ అండర్ టేకింగ్' దారి చూపగా.. ఇక్కడ 'బిల్ ట్రేడింగ్' కీలక పాత్ర పోషించింది.





సతీష్ సరాఫ్
చార్టర్డ్ అకౌంటెంట్

పరోక్ష పన్నుల విధానంలో పారదర్శకతను తేవాలన్నదే వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) విధానం వెనక ప్రధాన లక్ష్యం. ఈ కొత్త పన్ను విధానం ప్రయోజనాలు ఇప్పుడిప్పుడే సామాన్యులకు చేరువవుతున్నాయి. అయితే ఈ పన్ను ప్రయోజనాలు వాళ్లకు దక్కకుండా కొంత మంది స్వార్థపూరిత వ్యాపారులు అడ్డు తగులుతూనే ఉన్నారు. మరికొందరైతే చట్టాల్లో లొసుగులను వాడుకొని కొత్త తరహా మోసాలకూ పాల్పడుతున్నారు. ఇటీవల ముంబయిలో వెలుగుచూసిన ఓ ఘటనే ఇందుకు నిదర్శనం. 'బిల్ ట్రేడింగ్' విధానాన్ని ఉపయోగించుకొని బ్యాంకుల నుంచి అక్రమ పద్ధతిలో రుణాలు తీసుకున్నారన్న ఆరోపణలపై ఇద్దరు వ్యాపారులను ముంబయి పోలీసులు అరెస్టు చేశారు. దాదాపు రూ.7.23 కోట్ల వరకు వీళ్లు ఇన్‌పుట్ క్రెడిట్ పొందారట. జీఎస్‌టీ అమల్లోకి వచ్చాక నిబంధనల అతిక్రమణ కింద అరెస్టు చేయడం ఇదే మొదటిసారి.

బిల్ ట్రేడింగ్ అంటే..

ఏవిధమైన వస్తువులను సరఫరా చేయకుండా, సరఫరా చేసినట్లు పద్దు పుస్తకాల్లో చూపించడమే 'బిల్ ట్రేడింగ్'. వివరంగా చెప్పాలంటే.. ఇద్దరు వ్యాపారులు పరస్పరం క్రయవిక్రయ ఇన్‌వాయిస్‌లు జారీ చేసుకుంటారు. కాని వాళ్ల మధ్య వస్తువుల సరఫరా జరగదు. చట్టంలో నిబంధనలు పాటిస్తున్నట్లుగా ఈ ఇన్‌వాయిస్ వివరాలను పద్దు పుస్తకాల్లో పొందుపరుస్తారు.



ఎందుకు చేస్తారంటే..

బిల్ ట్రేడింగ్ విధానాన్ని ఎంచుకోవడం వెనక ప్రధాన ఉద్దేశాలు ఇవి..

1) విక్రయాలను పెరిగాయని చూపించడం ద్వారా మదుపర్లను ఆకర్షించడం
2) బ్యాంకుల నుంచి మరిన్ని రుణాలు పొందడం
3) లాభాలను నష్టాలుగా లేదంటే నష్టాలను లాభాలుగా చూపించడం

ఉదాహరణ 1: వ్యాపార నిర్వహణ మూలధనం కోసం రూ.100 కోట్లను అప్పుగా తీసుకునేందుకు రాము ఓ బ్యాంకుకు వెళ్లాడు. సాధారణంగా బ్యాంకులు టర్నోవరు విలువను (అమ్మకాలు) పరిగణనలోకి తీసుకొని రుణాలు మంజూరు చేస్తుంటాయి. రూ.100 కోట్ల రుణాన్ని ఇవ్వాలంటే.. దానికి ఐదు రెట్లు లేదా అంతకుమించి టర్నోవరు విలువను రాము చూపించాల్సి ఉంటుంది. అయితే రాము టర్నోవరు ఆ స్థాయిలో లేదు. ఈ విషయం ముందుగానే తెలుసుకొని ఆ టర్నోవరు లోటును తప్పుడు ఇన్‌వాయిస్‌ల రూపంలో భర్తీ చేశాడు. ఇందుకు మరో వ్యాపారి సాయం తీసుకున్నాడు. వస్తువుల సరఫరా అనేదే లేకుండా ఆ వ్యాపారికి వస్తువులను అమ్మినట్లుగా ఇన్‌వాయిస్‌లను సృష్టించాడు. ఆ వివరాలను పద్దు పుస్తకంలో పొందుపరిచాడు. తద్వారా టర్నోవరును పెంచుకొని బ్యాంకు నుంచి రుణాన్ని పొందాడు.

ఉదాహరణ 2: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రాజు తన వ్యాపారం ద్వారా భారీ లాభాలను ఆర్జించాడు. అయితే ఆ లాభంపై ఆదాయపు పన్ను చెల్లించడం ఆయనకు ఇష్టం లేదు. అందుకే వస్తువులను ఎక్కువ ధరకు కొని అంతకంటే తక్కువ ధరకు అమ్మినట్లు బిల్ ట్రేడింగ్ ద్వారా ఇన్‌వాయిస్‌లు సృష్టించాడు. ఇందుకు కృష్ణ అనే మరో వ్యాపారి సాయం తీసుకున్నాడు. ఇలా రాము తన లాభాలను నష్టాలుగా మార్చేశాడు. మరోవైపు కృష్ణ తన నష్టాలను లాభాలుగా చూపించుకోవాలని అనుకోవడంతో, రాజు తనకొచ్చిన లాభాల విలువకు సర్దుబాటు చేస్తూ కృష్ణకు ఇన్‌వాయిస్‌లు జారీ చేశాడు. ఇక్కడ ఇద్దరి మధ్య ఇన్‌వాయిస్‌ల బదలాయింపు జరిగినప్పటికీ, ఎలాంటి వస్తువుల సరఫరా జరగకపోవడం గమనార్హం. అంటే అటు రాము, ఇటు కృష్ణ ఇద్దరి ఉద్దేశాలు ఇక్కడ నెరవేరాయన్నమాట.

కటకటాలు తప్పవా..

బిల్ ట్రేడింగ్ ద్వారా వస్తువులను సరఫరా చేయకుండా రశీదులు జారీ చేయడం, ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌కు క్లెయిమ్ చేసుకోవడాన్ని మోసపూరిత ఉద్దేశాలుగా పరిగణిస్తారు. ఎందుకంటే ఇలా చేయడం ఇన్‌వాయిస్, ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ నిబంధనలకు విరుద్ధం.

ఇన్‌వాయిస్ నిబంధన: జీఎస్‌టీ కింద నమోదైన ప్రతి వ్యాపారి సరఫరా చేసిన వస్తువుతో పాటు ఇన్‌వాయిస్‌ను ఇవ్వాల్సి ఉంటుంది.

ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ నిబంధన: జీఎస్‌టీ గుర్తింపు ఉన్న వ్యాపారులు తాము సరఫరా తీసుకున్న వస్తువు, స్వీకరించిన రశీదు విలువకు ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌ను క్లెయిమ్ చేసుకునేందుకు అర్హులు.

పై నిబంధనలను పరిగణనలోకి తీసుకుంటే 'బిల్ ట్రేడింగ్' ద్వారా కొందరు పాల్పడుతోన్న ఈ తరహా కార్యకలాపాలు జీఎస్‌టీ చట్ట ఉల్లంఘన కిందకు వస్తాయి. ఇలాంటివారు జరిమానాకు అర్హులు. అర్హతకు మించి ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌కు క్లెయిమ్ చేసుకుంటే విచారణను కూడా ఎదుర్కోవాల్సి వస్తుంది.

ముంబయిలో అరెస్టు అయిన ఆ ఇద్దరు వ్యాపారులు జీఎస్‌టీ చట్టాన్ని తీవ్రంగా ఉల్లంఘించినట్లు తెలుస్తోంది. అందుకే వాళ్లను ప్రభుత్వం అరెస్టు చేయాల్సి వచ్చింది.

అర్హత కోల్పోతారు..

బిల్ ట్రేడింగ్ ద్వారానే కాదు చట్టంలో లొసుగులను ఉపయోగించుకొని ఇతరత్రా మార్గాల్లోనూ కొందరు మోసాలకు పాల్పడేందుకు అవకాశం ఉంది. ఇదే జరిగితే మరికొందరు కూడా అరెస్టు కావచ్చు. ముఖ్యంగా 'యాంటీ ప్రాఫిటరింగ్' నిబంధనల అతిక్రమణ విషయంలో ఇలాంటివి చోటుచేసుకునే అవకాశం ఉంది. తప్పు చేస్తే ఎప్పుడోకప్పుడు బయటపడక తప్పదు. ఆర్థిక నేరాల కింద అరెస్టయితే ఆ వ్యాపారి భవిష్యత్‌కే ఇబ్బంది. వ్యాపార లైసెన్సు రద్దు అవుతుంది. వ్యాపారం చేయకుండా మార్గాలు మూసుకుంటాయి. బ్యాంకులూ రుణాలు ఇవ్వవు. అందుకే నిబంధనలు పాటిస్తేనే ప్రతి ఒక్కరికీ మంచిది.

గమనిక: బిల్ ట్రేడింగ్ ద్వారా ఎలా మోసాలకు పాల్పడుతున్నారో, దాని పర్యవసానాలేమిటో ప్రజలకు తెలియజేసే ఉద్దేశంలో భాగంగా పై వివరాలు వెల్లడించాం. అంతేగానీ ఏ వ్యక్తి లేదా వ్యక్తుల ప్రతిష్ఠకు భంగం కలిగించాలనే ఉద్దేశం రచయితకు, ఈనాడు పత్రికకు లేదు.



యార్సెలర్ మిత్తల్ అధ్యక్షునిగా ఆదిత్య

దిల్లీ: అంతర్జాతీయ ఉక్కు దిగ్గజం యార్సెలర్ మిత్తల్ తమ కంపెనీ అధ్యక్షుడి(ప్రెసిడెంట్)గా ఆదిత్య మిత్తల్‌ను నియమించింది. 'ప్రస్తుతం యార్సెలర్ మిత్తల్ యూరప్ గ్రూప్ సీఎఫ్ఓ, సీఈఓగా పనిచేస్తున్న ఆదిత్య మిత్తల్‌కు అదనంగా ప్రెసిడెంట్ బాధ్యతలను సైతం అప్పజెప్పామ'ని కంపెనీ ఒక ప్రకటనలో పేర్కొంది. 'మా ఐరోపా కార్యకలాపాల విషయంలో ఆదిత్య తన సామర్థ్యాన్ని నిరూపించుకున్నారు. కంపెనీకి విలువైన ఫలితాలను కట్టబెట్టారు. భవిష్యత్ వ్యూహాత్మక దిశకు బాటలు వేయడంలో నాతో కలిసి పని చేయడం కొనసాగిస్తార'ని యార్సెలర్ మిత్తల్ ఛైర్మన్ లక్ష్మీ మిత్తల్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

మీ ఆధార్‌కు ఎన్ని సిమ్‌లు?

● అనుసంధానత తెలుసుకోవచ్చు
● 15 లోగా ప్రత్యేక వ్యవస్థ
● టెలికాం సంస్థలకు యూఐడీఏఐ ఆదేశం

దిల్లీ: మీ ఆధార్ నెంబరుకు ఎన్ని మొబైల్ సిమ్‌లు (నెంబర్లు) అనుసంధానం అయ్యాయో తెలుసుకునే సదుపాయం అతి త్వరలో అందుబాటులోకి రానుంది. ఇందుకోసం ప్రత్యేక వ్యవస్థను ఈనెల 15లోగా ఏర్పాటు చేయాలని టెలికాం నెట్‌వర్క్ సంస్థలను యూఐడీఏఐ (యునీక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా) ఆదేశించింది. ఎవరికి వారు తమ ఆధార్ నెంబరును నమోదు చేసుకుని, దానికి ఏయే మొబైల్ నెంబర్లు అనుసంధానం అయ్యాయో తెలుసుకోవచ్చు. ఇందువల్ల తాము జతపరచినవే కాక, అనధికారికంగా ఇతరుల సిమ్‌లు ఏవైనా తమ ఆధార్‌కు అనుసంధానం అయ్యాయేమో పరిశీలించుకోవచ్చు. కొందరు రిటైలర్లు, టెలికాం సంస్థల ఏజెంట్లు, ఆధార్ ధ్రువీకరణకు వచ్చిన మొబైల్ చందాదారుల ఆధార్‌ను, ఇతరుల సిమ్‌లకూ జతపరచారని ఫిర్యాదులు అందడంతో, యూఐడీఏఐ ఈ నిర్ణయం తీసుకుంది. ఇలాంటి అక్రమాలు చోటుచేసుకోకుండా తగిన పర్యవేక్షణ జరపాలని కూడా టెలికాం సంస్థలను ఆదేశించింది. 'తమ ఆధార్‌కు ఏయే సిమ్ నెంబర్లు అనుసంధానం అయ్యాయో తెలుసుకునే వ్యవస్థను ఈనెల 15 కల్లా అందుబాటులోకి తేవాలని టెలికాం సంస్థలను ఆదేశించాం' అని యూఐడీఏఐ ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈఓ) అజయ్ భూషణ్ పాండే తెలిపారు. సంక్షిప్త సందేశం (ఎస్ఎంఎస్), వినియోగదారుల సేవాకేంద్రం నెంబర్, ఇమెయిల్, వెబ్‌పోర్టల్, యాప్ ద్వారా కూడా తమ మొబైల్ నెంబర్ ఆధార్‌కు అనుసంధానం అయ్యిందో, లేదో నిర్ధారించుకోవడంతో పాటు, తమకు సంబంధం లేని నెంబర్లు ఏమైనా అనుసంధానం అయ్యాయేమో పరీక్షించుకునే సౌలభ్యం కల్పించాలి.



విపణిలోకి టాటా జెస్ట్ ప్రీమియో

ధర రూ.7.53 లక్షలు (ఎక్స్ షోరూం ధర, దిల్లీ)

ముంబయి: టాటా మోటార్స్ సంస్థ తమ జెస్ట్ కార్ల సిరీస్‌లో కాంపాక్ట్ సెడాన్ స్పెషల్ ఎడిషన్ 'జెస్ట్ ప్రీమియో'ను తాజాగా విపణిలోకి విడుదల చేసినట్లు తెలిపింది. దీని ధర రూ.7.53 లక్షలుగా (ఎక్స్ షోరూం ధర, దిల్లీ) నిర్ణయించారు. 1.3 లీటర్ డీజిల్ ఇంజిన్ సామర్థ్యంతోపాటు మరో 13 ప్రత్యేకతలు దీని సొంతం. మార్చి 1న ఆవిష్కరించిన జెస్ట్ ప్రీమియో దేశంలోని అన్ని టాటా మోటార్స్ విక్రయ కేంద్రాల్లో సోమవారం నుంచి అందుబాటులో ఉంటుందని కంపెనీ తెలిపింది. '2014 ఆగస్టు నుంచి జెస్ట్ సిరీస్‌లో 85,000 కార్లను ఇప్పటి వరకూ విక్రయించాం, తాజా మోడల్‌తో మరింత మంది ఖాతాదార్లను ఆకట్టుకుంటామన్న నమ్మకం ఉంద'ని టాటా మోటార్స్ అధ్యక్షుడు (ప్రయాణికుల వాహన వ్యాపార విభాగం) మయాంక్ పరీక్ ఓ ప్రకటనలో తెలిపారు.

మహీంద్రా మోజో కొత్త బైకు ఆవిష్కరణ

ధర రూ.1.49 లక్షలు

ముంబయి: మహీంద్రా టూ వీలర్స్ సంస్థ ప్రీమియం స్పోర్ట్స్ బైకుల్లో భాగంగా 300 సీసీ 'మోజో యూటీ 300'ను ఆవిష్కరించింది. దీని ధరను రూ.1.49 లక్షలుగా నిర్ణయించారు. కొత్తగా విపణిలోకి పరిచయం చేస్తుండటంతో ఈ నెలలో బైకు బుక్ చేసుకున్నవారికి రూ.10,000 తగ్గింపు ఉంటుందని కంపెనీ తెలిపింది. 'మోజో యూటీ 300 విడుదలతో కొత్త తరం బైకులపై ఆసక్తి చూపించే యువతను ఆకట్టుకుంటాం. దేశంలోని 60కిపైగా నగరాల్లో వినియోగదారులకు ఈ మోడల్ అందుబాటులో ఉంటుంద'ని మహీంద్రా అండ్ మహీంద్రా (ద్విచక్రవాహనాల వ్యాపారం) సీఈఓ ప్రకాష్ వాకంకర్ తెలిపారు.



మోజో యూటీ 300 ప్రత్యేకతలు

- 300 సీసీ లిక్విడ్ కూల్డ్ ఇంజిన్ సామర్థ్యం
- కాంపాక్ట్ డిజిటల్ ప్యానెల్
- కార్బురేటర్ ఇంధన వ్యవస్థ
- 17 అంగుళాల ట్యూబ్‌లెస్ టైర్లు
- 21 లీటర్ల సామర్థ్యం ఉన్న ఇంధన ట్యాంకు

బ్యాంకులకు రూ.లక్ష కోట్లు

ఈ నెలాఖరులోపు ఇస్తాం: ఆర్‌బీఐ

ముంబయి: ఈ నెలాఖరులోపు రూ.లక్ష కోట్ల అదనపు నిధులను బ్యాంకులకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) ఇవ్వనుంది. ఆర్థిక సంవత్సరం చివర్లో బ్యాంకులు తమ అవసరాలను తీర్చుకునేందు కోసం ఇచ్చే ఈ నిధులను దీర్ఘకాల సెక్యూరిటీల రూపంలో ఇవ్వనుంది. ద్రవ్యలభ్యత సర్దుబాటు సదుపాయం(ఎల్ఏఎఫ్) కార్యకలాపాలకు ఇచ్చే నిధులకు ఇది అదనం కావడం గమనార్హం. 'బ్యాంకింగ్ వ్యవస్థలో ప్రస్తుత, కొనసాగుతున్న ద్రవ్యలభ్యత పరిస్థితులను సమీక్షించిన అనంతరం అదనపు నిధులను ఇవ్వాలని నిర్ణయించుకున్నామ'ని ఆర్‌బీఐ తెలిపింది.

మిర్క్ ఇన్వర్టర్ ఏసీల విడుదల

దిల్లీ: మిర్క్ ఎలక్ట్రానిక్స్ సంస్థ 84 రకాల కొత్త ఇన్వర్టర్ ఏసీలను విపణిలోకి విడుదల చేసింది. ఇవి కంప్రెషర్ మోటార్ వేగాన్ని నియంత్రిస్తూ ఉష్ణోగ్రతల్ని అదుపులో ఉంచుతాయి. గతంలో ఎయిర్ కండీషనర్స్ (ఏసీ) విభాగంలో అమ్మకాల ద్వారా రూ.346 కోట్లు ఆర్జించగా, ఇప్పుడు రూ.720 కోట్లు లక్ష్యం నిర్దేశించుకున్నట్లు సమాచారం. కొత్త రకం ఇన్వర్టర్ ఏసీలు 170 శాతం వేగంగా పని చేసి చల్లదనాన్ని అందిస్తాయని, 65 శాతం విద్యుత్ కూడా ఆదా అవుతుందని కంపెనీ వెల్లడించింది. ఈ ఇన్వర్టర్ ఏసీల్ని ప్రపంచంలో ఎక్కడి నుంచైనా స్మార్ట్ ఫోన్ సాయంతో నియంత్రించవచ్చని తెలిపింది. '2022కల్లా భారత్‌లో ఏసీల విపణి పరిమాణం ప్రస్తుతం ఉన్న 56 లక్షల నుంచి 2 కోట్ల స్థాయికి చేరుతుందని, రాబోయే అయిదేళ్లలో ఏసీల విభాగంలో మా వ్యాపారం రూ.1500-1600 కోట్లకు చేరుతుందని ఆశిస్తున్నామ'ని కంపెనీ వెల్లడించింది. 'స్ప్లిట్ ఏసీల విభాగంలో ప్రస్తుతం విపణిలో మా వాటా 8 శాతం ఉంది. దేశంలో ఏసీలకు డిమాండు పెరుగుతుండటం, వినియోగదారులు ఏసీలు కొనగలిగే స్థితిలో ఉండటం, భూతాపం రోజురోజుకూ పెరుగుతుండటంతో రాబోయే కాలంలో మా వాటా రెండంకెలకు చేరుతుంద'ని మిర్క్ ఎలక్ట్రానిక్స్ సీఈఓ జి.సుందర్ తెలిపారు.



పార్లమెంటులో మోదీ, అమిత్ షాలకు భాజపా ఘన స్వాగతం

దిల్లీ: బడ్జెట్ మలివిడత సమావేశాల ప్రారంభం రోజున పార్లమెంటులోకి అడుగుపెట్టగానే ప్రధాని మోదీకి భాజపా ఘన స్వాగతం పలికింది. త్రిపుర తదితర రాష్ట్రాల్లో కమల వికాసం నేపథ్యంలో భాజపా అధ్యక్షుడు అమిత్ షా ప్రధానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈశాన్య రాష్ట్రాల నుంచి తెప్పించిన ప్రత్యేక సంప్రదాయ దుస్తులను పార్టీ నేతలందరికీ అందజేశారు. అమిత్ షా రాజ్యసభలోకి రాగానే పార్టీ ఎంపీలు, మంత్రులు ఆయనకు విజయోత్సాహంతో స్వాగతం పలికారు. ఆయన స్థానంలోకి వెళుతుండగా.. బల్లలు చరిచి హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు.

ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయండి

విద్యార్థులకు ప్రధాని శుభాకాంక్షలు

కేంద్ర మాధ్యమిక విద్యా మండలి(సీబీఎస్ఈ) బోర్డు పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు ప్రధాని మోదీ సోమవారం శుభాకాంక్షలు తెలిపారు. చిరునవ్వు, ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలని వారికి సూచించారు. "సీబీఎస్ఈ 12వ తరగతి, 10వ తరగతి పరీక్షలకు హాజరవుతున్న నా యువ స్నేహితులకు శుభాకాంక్షలు! చిరునవ్వు, అంతులేని ఆత్మవిశ్వాసంతో ఈ పరీక్షలు రాయండి" అని ట్విటర్‌లో ప్రధాని వ్యాఖ్యానించారు. సీబీఎస్ఈ 12వ తరగతి, 10వ తరగతి బోర్డు పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి.

ఎవరెవరికి ఎంత ముట్టింది?

- లోక్‌సభ ఎన్నికల ఫలితాల నాడే ఆ ఆదేశాలేంటి?
- గీతాంజలి జెమ్స్ సహా ఏడు సంస్థలకు ఆ రోజే ఎందుకు లబ్ధి చేకూర్చారు?
- అందుకు ఒత్తిడి తెచ్చిందెవరు?
- కాంగ్రెస్ పార్టీ, చిదంబరంపై కేంద్ర మంత్రి రవిశంకర్ ప్రసాద్ విమర్శలు

దిల్లీ

కాంగ్రెస్‌నూ, ఆ పార్టీకి చెందిన కేంద్ర మాజీ మంత్రి పి. చిదంబరాన్ని భాజపా ప్రశ్నలు, విమర్శలతో ఉక్కిరిబిక్కిరి చేసింది. సరిగ్గా గత లోక్‌సభ ఎన్నికల ఫలితాల రోజే.. గీతాంజలి జెమ్స్ సహా ఏడు ప్రైవేటు సంస్థలకు లబ్ధి చేకూర్చేలా నాటి మంత్రి చిదంబరం ఎలా ఆదేశాలు ఇచ్చారని కడిగేసింది. ఈ నిర్ణయం తీసుకోడానికి ఒత్తిడి తెచ్చిన దళారులెవరో, ఎవరెవరికి ఎంతెంత ముట్టిందో చెప్పాలని నిలదీసింది.



భాజపా సీనియర్ నాయకుడు, న్యాయశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ సోమవారమిక్కడ "ప్రతిపక్ష పార్టీ అసత్య, మోసపూరిత రాజకీయాల వెల్లడి" పేరుతో విలేకరుల సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ సర్కారు 'రాని బాకీలు'ను బ్యాంకు పుస్తకాల్లో కనిపించకుండా చేసిందని ఆయన దుయ్యబట్టారు. ప్రముఖ ఆర్థికవేత్త మన్మోహన్‌సింగ్ ప్రధానిగా, చిదంబరం ఆర్థికమంత్రిగా ఉన్నప్పుడు... మితిమీరిన జోక్యం, ప్రాపకం, ఒత్తిళ్ల కారణంగా ఆర్థిక వ్యవస్థ పూర్తిగా గాడి తప్పిందని ఆయన విమర్శించారు.

అవినీతా? గాలి మాటలా?

"నాటి మంత్రి చిదంబరం ఏడు ప్రైవేటు సంస్థలకు బంగారు దిగుమతి పథకం కింద లబ్ధి చేకూర్చారు. సరిగ్గా లోక్‌సభ ఫలితాల నాడే ఆదేశాలు ఇవ్వాల్సిన అవసరం ఏమొచ్చింది? ఇది అవినీతా? గాలిమాటా (జుమ్లా)? ఆశ్రిత పక్షపాతమా? భారీ కుంభకోణంలో ప్రమేయమున్న గీతాంజలి జెమ్స్ తదితర సంస్థలకు లాభం చేకూర్చడానికి ఒత్తిడి తెచ్చిన దళారులెవరు? అని రవిశంకర్ ప్రసాద్ నిలదీశారు. పదవీభ్రష్టులైన రోజున ఇలాంటి ఆదేశాలివ్వడం కంటే సిగ్గుమాలిన పని మరొకటి ఉండదన్నారు.

కాంగ్రెస్ అవినీతి బాంబులు పేలుతున్నాయ్...

"కాంగ్రెస్ నాటిన అవినీతి బాంబులు ఇప్పుడు ఒక్కొక్కటిగా పేలుతున్నాయి. పంజాబ్ ముఖ్యమంత్రి అమరీందర్‌సింగ్ అల్లుడిపై సీబీఐ కేసే ఇందుకు తార్కాణం. పెద్ద మొత్తంలో టోకరా వేసి... 2012లో దేశం విడిచి వెళ్లిపోయిన వ్యాపారవేత్త జతిన్ మెహతా సంగతేంటో కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ చెప్పాలి. రాఫెల్ విమాన ఒప్పందం, నోట్ల రద్దు, జీఎస్టీ తదితర అంశాలపై కట్టుకథలు, అసత్యాలు చెబుతూ కాంగ్రెస్ పార్టీ గందరగోళం సృష్టించేందుకు ప్రయత్నిస్తోంది. అయినా కాంగ్రెస్‌ను సామాన్యులు ఛీకొడుతున్నారు" అని రవిశంకర్ ప్రసాద్ అన్నారు.

పీఎన్‌బీ కుంభకోణం బీజాలు కాంగ్రెస్ హయాంలోనే

కాంగ్రెస్ హయాంలోనే పంజాబ్ నేషనల్ బ్యాంకు కుంభకోణానికి బీజాలు పడ్డాయని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ అన్నారు. భాజపా ప్రభుత్వం అవినీతిని శుద్ధిచేస్తున్న క్రమంలోనే నీరవ్‌మోదీ-పీఎన్‌బీ అక్రమాలు వెలుగుచూశాయన్నారు.

నా కోసం ప్రార్థించండి!

- వీడియో సందేశంలో ప్రజలను కోరిన పారికర్
- మళ్లీ ముంబయి ఆసుపత్రిలో చేరిన గోవా సీఎం

పనాజీ, ముంబయి: గోవా ముఖ్యమంత్రి మనోహర్ పారికర్ మలిదశ వైద్యం కోసం సోమవారం ముంబయిలోని లీలావతి ఆసుపత్రిలో చేరారు. వైద్యుల సూచనల మేరకు అవసరమైతే చికిత్స నిమిత్తం అమెరికాకు బయల్దేరి వెళ్తారు. మహారాష్ట్ర రెవెన్యూ మంత్రి, సీనియర్ భాజపా నేత చంద్రకాంత్ పాటిల్ ఈ విషయాన్ని వెల్లడించారు. ముంబయి వెళ్లడానికి ముందు పారికర్ తన నివాసంలో సీనియర్ మంత్రులతో భేటీ అయ్యారు.

తాను తిరిగి వచ్చేవరకూ పాలనాపరమైన నిర్ణయాలు తీసుకునేందుకు... మంత్రులు ఫ్రాన్సిస్ డిసౌజా (భాజపా); విజయ్ సర్దేశాయ్ (గోవా ఫార్వార్డ్ పార్టీ); సుదీన్ ధావలీకర్ (మహారాష్ట్రవాదీ గోమాంతక్ పార్టీ)లతో సలహా సంఘాన్ని ఏర్పాటు చేశారు.

క్లోమ సంబంధ సమస్యతో బాధపడుతున్న పారికర్ గతనెల 15న ముంబయిలోని లీలావతి ఆసుపత్రిలో చేరారు. చికిత్స అనంతరం 22న గోవాకు తిరిగి వచ్చిన ఆయన.. అదే రోజు శాసనసభలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టి, క్లుప్తంగా మాట్లాడారు. మళ్లీ 25న గోవా వైద్య కళాశాలలో చేరి, మార్చి 1న ఇంటికి వచ్చారు. అప్పట్నుంచి ఆయన తన ప్రైవేటు నివాసం నుంచే పాలనా వ్యవహారాలను చూస్తున్నారు. ఈ క్రమంలో వైద్యుల సూచనల మేరకు ఆయన ముంబయి వెళ్తున్నారని ముఖ్యమంత్రి కార్యాలయం సోమవారం ఓ ప్రకటనలో తెలిపింది.



కాగా, పారికర్ ముఖ్యమంత్రిగా కొనసాగుతారనీ, ఆయన తిరిగి వచ్చేవరకూ పాలన వ్యవహారాలను మంత్రుల కమిటీ చూస్తుందని సర్దేశాయ్ స్పష్టం చేశారు.

ముంబయికి వెళ్లే ముందు- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, వ్యక్తిగత కార్యదర్శితో పాటు డీజీపీ ఇతర ఉన్నతాధికారులతో మనోహర్ పారికర్ సమావేశమయ్యారు. వ్యర్థాల నిర్వహణ సంస్థ, కాలుష్య నియంత్రణ మండలి ఉన్నతాధికారులతోనూ ఆయన పలు అంశాలపై సమీక్షించారు.

> "మీ అందరికీ ధన్యవాదాలు. గత 15 రోజులుగా మీరు నా కోసం ప్రార్థిస్తున్నారు. అందుకే నా ఆరోగ్యం కొంత కుదుటపడింది. పూర్తిగా నయం కావడానికి విదేశాలకు వెళ్లాల్సి రావచ్చు. నా ఆరోగ్యంకోసం మీరు ప్రార్థనలు కొనసాగిస్తారని ఆశిస్తున్నా."
>
> \- వీడియో సందేశంలో ప్రజలకు పారికర్ విజ్ఞప్తి

పీఏసీ చేతికి '80:20 పథకం' దస్త్రాలు

కేంద్ర ఆర్థికశాఖ అధికారుల వెల్లడి

దిల్లీ: యూపీఏ ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన '80:20 బంగారం దిగుమతి పథకం' దస్త్రాలను పార్లమెంటు ప్రజా పద్దుల కమిటీ (పీఏసీ) ముందు పెడతామని కేంద్ర ఆర్థిక శాఖ అధికారులు తెలిపారు. పదిరోజుల్లోగా వీటిని అందిస్తామని చెప్పారు.

2013 ఆగస్టులో పి.చిదంబరం ఆర్థిక మంత్రిగా ఉన్నప్పుడు ఈ పథకాన్ని యూపీఏ ప్రభుత్వం ప్రవేశపెట్టింది. దీనికింద వ్యాపారులు.. లోగడ దిగుమతి చేసుకున్న బంగారంలో 20 శాతాన్ని ఎగుమతి చేశాకే వారికి మళ్లీ సువర్ణాన్ని దిగుమతి చేసుకోవడానికి అనుమతి లభిస్తుంది. ఎన్‌డీఏ అధికారంలోకి వచ్చాక 2014 నవంబర్‌లో ఈ పథకాన్ని రద్దు చేసింది. అయితే మెహుల్ చోక్సీ వంటి ఆభరణాల వ్యాపారులు ఈ పథకాన్ని దుర్వినియోగం చేసి, మనీ లాండరింగ్‌కు పాల్పడ్డారని పీఏసీలోని భాజపా సభ్యులు ఆరోపించారు. ఈ పథకం అమల్లో చిదంబరం పాత్రను వారు ప్రశ్నించారు. 2016 నాటి కాగ్ నివేదికను వారు ప్రస్తావించారు. ఈ పథకం వల్ల ప్రభుత్వానికి రూ.లక్ష కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు చెప్పారు. నాడు ఆభరణాల వ్యాపారులకు ఒక డాలర్ (దాదాపు రూ.60) మేర ఆర్జన ఉండేలా చూడటానికి ప్రభుత్వం.. రూ.221.75 మేర సుంకాల మినహాయింపు ఇచ్చిందని ఆరోపించారు. ఈ మేరకు నష్టాన్ని సర్కారు భరించాల్సి వచ్చిందన్నారు. ఈ నేపథ్యంలో సంబంధిత దస్త్రాలు, వాటిపై రాసిన వ్యాఖ్యానాలను కమిటీ ముందు పెట్టాలని ఆర్థిక శాఖ నిర్ణయించింది.

ఈశాన్య ప్రజల తీర్పును శిరసావహిస్తున్నాం: రాహుల్

దిల్లీ: కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ఎట్టకేలకు మూడు ఈశాన్య రాష్ట్రాల ఎన్నికల ఫలితాలపై స్పందించారు. ప్రజల తీర్పును గౌరవిస్తున్నామన్నారు. వారి విశ్వాసాన్ని తిరిగి పొందటానికి కృషిచేస్తామని వెల్లడించారు. అధికారంలో ఉన్న మేఘాలయలో మళ్లీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయటానికి అవసరమైన ఆధిక్యాన్ని కాంగ్రెస్ సాధించలేకపోయింది. ప్రాంతీయ పార్టీల మద్దతును కూడగట్టటంలోనూ విఫలమయ్యింది. నాగాలాండ్, త్రిపురలలో ఒక్క స్థానాన్ని కూడా గెలుచుకోలేకపోయింది. ఫలితాలు శనివారం వెలువడగా రెండు రోజుల తర్వాత సోమవారం వీటిపై రాహుల్ స్పందించారు. ఈశాన్య రాష్ట్రాలన్నిటిలో పార్టీని తిరిగి బలోపేతం చేస్తామన్నారు.

త్రిపురలో కొలువుదీరనున్న భాజపా కూటమి

- భారీ వేడుకగా 8న ప్రమాణస్వీకార కార్యక్రమం
- హాజరు కానున్న ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు

అగర్తల

త్రిపురలో భాజపా-ఐపీఎఫ్‌టీ తొలి ప్రభుత్వం ఈ నెల 8న కొలువుదీరే అవకాశం ఉంది. నగరంలోని స్వామి వివేకానంద మైదాన్‌లో ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని భారీ వేడుకగా నిర్వహించనున్నారు. భాజపా అధ్యక్షుడు అమిత్‌షా, ప్రధాని నరేంద్రమోదీ, రాజ్‌నాథ్ సింగ్, నితిన్ గడ్కరీ తదితర కేంద్ర మంత్రులు, భాజపా పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరవుతారు. త్రిపుర తదుపరి ముఖ్యమంత్రిని ఎన్నుకోవడానికి భాజపా-ఐపీఎఫ్‌టీ శాసనసభ్యులు మంగళవారం భేటీ కానున్నారు. భాజపా రాష్ట్ర అధ్యక్షుడు విప్లవ్ కుమార్ దేవ్ పేరు దాదాపు ఖాయమయినా తమకు గౌరవ ప్రద స్థానాలు కావాలని ఐపీఎఫ్‌టీ భాజపాపై ఒత్తిడి పెంచుతున్న నేపథ్యంలో ఈ భేటీకి ప్రాధాన్యం ఏర్పడింది. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని గవర్నర్‌కు మంగళవారం లాంఛన పూర్వక విజ్ఞప్తి చేయనున్నట్లు భాజపా వర్గాలు వెల్లడించాయి.

గౌరవప్రద స్థానాలివ్వకుంటే బయట నుంచి మద్దతు: ఐపీఎఫ్‌టీ

మరోవైపు మంత్రివర్గంలో తమకు గౌరవప్రదమైన స్థానాలు ఇవ్వకుంటే ప్రభుత్వానికి బయట నుంచి మద్దతు ఇస్తామని ఇండిజెనస్ పీపుల్స్ ఫ్రంట్ ఆఫ్ త్రిపుర (ఐపీఎఫ్‌టీ) సోమవారం స్పష్టం చేసింది. త్రిపురలో ఐపీఎఫ్‌టీ-భాజపా కూటమిగా పోటీ చేసి భారీ విజయాన్ని సాధించిన సంగతి తెలిసిందే. 59 స్థానాలున్న శాసనసభలో భాజపా 35, ఐపీఎఫ్‌టీ 8 స్థానాలను గెల్చుకున్నాయి. మంత్రివర్గంలో గౌరవప్రద స్థానాలు ఇవ్వకుంటే తమ సభ్యులకు శాసనసభలో ప్రత్యేక బ్లాక్‌ను కూడా కోరతామని ఐపీఎఫ్‌టీ అధ్యక్షుడు ఎన్.సి.డెబ్బార్మ చెప్పారు. గౌరవప్రద స్థానాలు అంటే ఏమిటని అడగగా ప్రధాన శాఖల కేటాయింపు, తగినంత సంఖ్యలో మంత్రి పదవులు అని బదులిచ్చారు. ముఖ్యమంత్రి పదవిని కూడా స్థానికులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

కాన్రాడ్ సంగ్మా ప్రమాణస్వీకారం నేడు

షిల్లాంగ్: నేషనల్ పీపుల్స్ పార్టీ (ఎన్‌పీపీ) అధ్యక్షుడు కాన్రాడ్ సంగ్మాను ప్రభుత్వం ఏర్పాటు చేయాల్సిందిగా మేఘాలయ గవర్నర్ గంగా ప్రసాద్ ఆహ్వానించారు. ఈ విషయాన్ని సంగ్మా వెల్లడించారు. మంత్రుల ప్రమాణస్వీకారం ఉదయం 10.30కు ఉంటుందన్నారు. సంగ్మా చెప్పిన విషయాన్ని రాజ్‌భవన్ అధికారి ధ్రువీకరించారు. 60 మంది సభ్యులున్న శాసనసభలో తనకు 34 మంది మద్దతుందని సంగ్మా చెప్పారు. వారందరి మద్దతు లేఖలను ఆదివారం గవర్నర్‌కు సమర్పించారు. మేఘాలయలో ఎవరికీ స్పష్టమైన ఆధిక్యం రాలేదు. 21 స్థానాలతో కాంగ్రెస్ ఏకైక పెద్ద పార్టీగా అవతరించింది. ప్రభుత్వ ఏర్పాటుకు తమను ఆహ్వానించాలని కాంగ్రెస్ నేతలు శనివారం గవర్నర్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. ఎన్‌పీపీకి భాజపా భాగస్వామ్య పక్షంగా ఉంది. ఎన్‌పీపీ 19 స్థానాలను, భాజపా రెండు స్థానాలను గెల్చుకుంది. యూడీపీ నుంచి ఆరుగురు, పీడీఎఫ్ నుంచి నలుగురు, హెచ్ఎస్‌పీడీపీ నుంచి ఇద్దరు, మరో స్వతంత్ర అభ్యర్థి కూడా మద్దతు ఇస్తున్నట్లు సంగ్మా లేఖలు సమర్పించారు.

నిబంధనలను సడలించే అధికారం కేంద్రానిదే

ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ అధికారులపై క్రమశిక్షణ కేసుల విషయంలో స్పష్టం చేసిన కేంద్రం

దిల్లీ: ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ అధికారులపై రాష్ట్రాలు నమోదుచేసే క్రమశిక్షణ కేసుల్లో జోక్యం చేసుకునే అధికారం తమకుందని కేంద్రం స్పష్టం చేసింది. ఆ అధికారులకు హాని కలిగించే నియమ నిబంధనలను నిష్పక్షపాతంగా, యోగ్యమైన రీతిలో సడలించే అధికారం కేంద్రానికి ఉంటుందని పేర్కొంది. "అఖిల భారత సేవలు కేంద్ర జాబితా కిందకు వస్తాయి. దేశవ్యాప్తంగా ఈ అధికారులను నియమించే అధికారం రాష్ట్రపతి పరిధిలోనిది. వారి తొలగింపు, తప్పనిసరి పదవీ విరమణ వంటి అంశాలు రాష్ట్రపతి లేదా కేంద్ర ప్రభుత్వ పరిధిలోకి మాత్రమే వస్తాయి" అని సిబ్బందిశాఖ అఫిడవిట్‌లో పేర్కొంది. ఐఎఫ్ఎస్ అధికారి సంజీవ్ చతుర్వేదిపై హరియాణా ప్రభుత్వం 2007లో శాఖాపరమైన ఆరోపణలతో ఛార్జిషీటును దాఖలు చేసింది. సుప్రీంకోర్టు ఆదేశాలను అమలుచేస్తున్న అధికారిపై ఈ చర్య తగదంటూ ఛార్జిషీటును కొట్టివేస్తూ 2011లో రాష్ట్రపతి ఉత్తర్వులిచ్చారు. దీనిని సవాలుచేస్తూ హరియాణా ప్రభుత్వం హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలుచేసింది. ఈ నేపథ్యంలో... తమ అభిప్రాయం వెల్లడించాలని కేంద్ర సిబ్బంది; పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పులశాఖలను హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు రెండు శాఖలు హరియాణా ప్రభుత్వ తీరును తప్పుపడుతూ న్యాయస్థానానికి అఫిడవిట్లు దాఖలుచేశాయి.

'2019 జూన్‌కల్లా జలమార్గం తొలిదశ పనులు పూర్తి'

ఈనాడు, దిల్లీ: విజయవాడ-ముక్త్యాల మధ్య నాల్గో జాతీయ జలమార్గం పథకం కింద చేపట్టిన 82 కిలోమీటర్ల జలమార్గం పనులు 2019 జూన్‌కల్లా పూర్తవుతాయని కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరీ తెలిపారు. సోమవారం రాజ్యసభలో తెదేపా ఎంపీ సీఎంరమేష్ అడిగిన లిఖితపూర్వక ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు.

ఎన్‌డీపీపీతోనే మా పయనం

- నాగాలాండ్‌లో ప్రభుత్వ ఏర్పాటుపై భాజపా స్పష్టీకరణ

కోహిమా: ఎన్నికల ముందు జట్టు కట్టిన ఎన్‌డీపీపీతో కలిసే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని భాజపా సోమవారం స్పష్టం చేసింది. 15 ఏళ్లపాటు భాగస్వామిగా ఉన్న నాగా పీపుల్స్ ఫ్రంట్ (ఎన్‌పీఎఫ్)కు మద్దతిచ్చే ప్రసక్తే లేదని స్పష్టం చేసింది. ఎన్‌డీపీపీ నేత, మాజీ ముఖ్యమంత్రి నెయిఫియు రియోతో భేటీ అనంతరం భాజపా నేత, అసోం ఆర్థికశాఖ మంత్రి హిమంత బిశ్వ శర్మ విలేకర్లతో మాట్లాడుతూ ఎన్‌పీఎఫ్‌తో తమ పార్టీకి ఇంకేమాత్రం భాగస్వామ్యం లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఏర్పాటుకు ఎన్‌పీఎఫ్‌తో కలిసి వెళ్లే ప్రసక్తే లేదని, ఎన్‌డీపీపీతో పయనిస్తామని చెప్పారు. సంబంధాలు తెంచుకోవడంపై ఎన్‌పీఎఫ్ నేత జిలియాంగ్‌కు అధికారికంగా లేఖ ఏమైనా ఇచ్చారా అని ప్రశ్నించగా రాజకీయాల్లో ఎక్కువ లేఖలతో పని జరగదని, రాజకీయాలు సంకేతాల ఆధారంగా నడుస్తాయని, జిలియాంగ్‌కు తగినన్ని సంకేతాలు పంపించామని చెప్పారు. 60 స్థానాలున్న నాగాలాండ్ శాసనసభలో భాజపాకు 12 స్థానాలు, ఎన్‌డీపీపీకి 17 స్థానాలు దక్కాయి. జేడీయూ తరఫున గెలిచిన ఏకైక శాసనసభ్యుడు, మరో స్వతంత్ర అభ్యర్థి కూడా ఈ కూటమికి మద్దతు తెలిపారు. మరోవైపు ఎన్‌పీఎఫ్‌కు 27 స్థానాలు దక్కాయి. భాజపా తెగదెంపులు చేసుకోవడంపై ఎన్‌పీఎఫ్ స్పందిస్తూ అది ఏకపక్ష నిర్ణయమని విమర్శించింది.

హామీల అమలు ప్రభుత్వ బాధ్యతే కదా!

'విభజన చట్టం' పిటిషనర్‌ను ప్రశ్నించిన సుప్రీంకోర్టు

ఈనాడు, దిల్లీ: ఇచ్చిన హామీలను అమలు చేసే బాధ్యత ప్రభుత్వాలదే కదా అని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. ఆంధ్రప్రదేశ్ పునర్‌వ్యవస్థీకరణ చట్టంలోని షెడ్యూలు 10, 11, 12, 13లో పొందుపరిచిన వాటితో పాటు పలు అంశాలు అమలుకావడంలేదని తెలంగాణ శాసనమండలిలో కాంగ్రెస్ పక్ష ఉపనేత పొంగులేటి సుధాకర్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ సిక్రీ, జస్టిస్ అశోక్‌భూషణ్‌లతో కూడిన ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫు న్యాయవాది శ్రావణ్‌కుమార్ వాదనలు వినిపిస్తూ విభజన చట్టంలోని హామీలు అమలు చేయడంలేదని ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. విభజన చట్టంపై ఇప్పటికే 20కి పైగా కేసులు అపరిష్కృతంగా ఉన్నాయికదా అని ధర్మాసనం ప్రశ్నించింది. అవన్నీ చట్టాన్ని సవాల్‌చేస్తూ దాఖలు అయినవని, తాము అమలుచేయడం లేదని కోర్టుకి వచ్చామని న్యాయవాది శ్రావణ్ తెలిపారు. ఈ సమయంలో 'చట్టాలు అమలు చేసే బాధ్యత ప్రభుత్వాలది కదా' అని జస్టిస్ అశోక్‌భూషణ్ ప్రశ్నించారు. అనంతరం, ప్రతివాదులైన కేంద్ర హోం, ఆర్థిక, జలవనరులు, మానవ వనరుల అభివృద్ధి శాఖలతోపాటు ఏపీ తెలంగాణ ప్రభుత్వాలకు పిటిషన్ ప్రతులను పంపించాలని ధర్మాసనం ఆదేశించింది. విచారణ రెండు వారాల పాటు వాయిదా వేసింది.

ఎంజీఆర్ పాలనను తలపిస్తా

- రజనీకాంత్ వెల్లడి

ఈనాడు డిజిటల్, చెన్నై: 'జయలలిత మంచి నేత. కరుణానిధి నా స్నేహితుడు. వారిద్దరూ రాష్ట్రానికి చాలా చేశారు. రాష్ట్రంలో మంచి నేత అవసరం ఉంది. అందుకే రాజకీయాల్లోకి వచ్చా. వ్యవస్థను మార్చడానికి ఇదే సరైన సమయం. దివంగత ముఖ్యమంత్రి ఎంజీ రామచంద్రన్‌కు నేను వీరాభిమానిని. శివాజీ గణేషన్ తదితర ఎంతోమంది నటులతో కలిసి నటించా. రాష్ట్ర ప్రజలు తనను ఎన్నుకుంటే సరైన పాలనతో ఎంజీఆర్‌ను తలపిస్తా. పేదల సంక్షేమానికి, రాష్ట్రాభివృద్ధికి చేయాల్సిన అన్ని పనులు చేస్తా. నూతన రాజకీయాలను చూపిస్తా. ఎంతమంది నన్ను విమర్శిస్తున్నా...నా పని నేను చేసుకుపోతున్నా..' అని అన్నారు సూపర్ స్టార్ రజనీకాంత్. సోమవరం చెన్నై శివారులోని డాక్టర్ ఎంజీఆర్ విశ్వవిద్యాలయం 30వ వార్షికోత్సవం సందర్భంగా వర్సిటీ అనుబంధ ఏసీఎస్ వైద్య కళాశాల ప్రాంగణంలో ఎంజీఆర్ కాంస్య విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. కళాశాల ప్రాంగణంలోని ఆడిటోరియంలో ఏర్పాటుచేసిన ఛాయాచిత్ర ప్రదర్శనను ప్రారంభించారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉందని, ఈ పరిస్థితుల్లో తాను రాజకీయాల్లోకి రాకుంటే జీవితాంతం మదనపడాల్సి వచ్చేదని అన్నారు. ఈ సందర్భంగా పలువురు సినీ ప్రముఖులకు అవార్డులు అందజేశారు. డిసెంబరు 31 రాజకీయ ప్రకటన తర్వాత అతిపెద్ద కార్యక్రమం ఇదే కావడంతో సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ నేపథ్యంలో తన రాకకు కారణాన్ని మరోసారి రజనీకాంత్ వివరించారు.



ఎంజీఆర్ విగ్రహావిష్కరణలో పాల్గొన్న రజనీకాంత్ తదితరులు

భాజపా-ఆరెస్సెస్‌లను ఓడించేందుకు విస్తృత వేదిక అవసరం: ఏచూరి

కోల్‌కతా: మనదేశంలో ప్రస్తుతం పెనుసవాళ్లతో కూడిన కాలం నడుస్తోందని సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అన్నారు. దేశాన్ని కులమతాల ప్రాతిపదికన విభజించేందుకు భాజపా-ఆరెస్సెస్ జోడీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఆ జోడీని ఓడించేందుకు లౌకిక, ప్రజాస్వామ్య శక్తులతో కూడిన విస్తృత వేదిక అవసరమని అభిప్రాయపడ్డారు. పశ్చిమ బెంగాల్ రాష్ట్ర సీపీఎం 25వ సదస్సును ఉద్దేశించి సోమవారం ఏచూరి ప్రసంగించారు.

ప్రధాని ఆధార్, ఓటరు ఐడీ వివరాలను వెల్లడించాల్సిన అవసరం లేదు

కేంద్ర సమాచార కమిషన్

దిల్లీ: ప్రధాని నరేంద్రమోదీ ఆధార్, ఓటరు ఐడీ వివరాలను వెల్లడించలేమన్న ప్రధాని కార్యాలయం నిర్ణయాన్ని కేంద్ర సమాచార కమిషన్ సమర్థించింది. ప్రధానితో రాష్ట్రపతి 'నరేంద్రమోదీ' పేరుతోనే ప్రమాణం చేయించారో లేదో తెలియజేయాలని సోని ఎస్ ఎరమత్ అనే వ్యక్తి సమాచార హక్కు చట్టం కింద ప్రధాని కార్యాలయాన్ని కోరారు. మోదీ ఆధార్ కార్డు, ఓటరు ఐడీకి సంబంధించిన సమాచారం ఇవ్వాలని కూడా కోరారు. రాజ్యాంగంలోని నిబంధనల మేరకే ప్రమాణస్వీకారం జరిగిందని ప్రధాని కార్యాలయం తెలియజేసింది. ఆధార్ కార్డు, ఓటరు ఐడీ వివరాలు ఇవ్వకుండా సమాచార హక్కు-చట్టంలోని సెక్షన్ 8(1)(జే) ప్రకారం మినహాయింపు ఉందని ప్రధాని కార్యాలయంలోని కేంద్ర ప్రజా సమాచార అధికారి దరఖాస్తుదారుకు స్పష్టం చేశారు. కోరిన సమాచారం వ్యక్తిగతమయినదై ఉండి, ప్రజాప్రయోజనాలతో నిమిత్తం లేనిదై ఉంటే ఈ సెక్షన్ కింద సమాచార వెల్లడికి మినహాయింపు ఉంటుంది. ప్రధాని కార్యాలయం స్పందన సంతృప్తికరంగా ఉందని ప్రధాన సమాచార కమిషనర్ ఆర్.కె.మాథుర్ చెప్పారు.

కొత్త భవనం ప్రారంభం నేడు

కేంద్ర సమాచార కమిషన్ కొత్త భవనాన్ని ప్రధాని మోదీ మంగళవారం ప్రారంభించనున్నారు. ఇప్పటి వరకు ఈ కమిషన్ రెండు వేర్వేరు భవనాల నుంచి కార్యకలాపాలు నిర్వహిస్తోంది. జాగా సమస్యను ఎదుర్కొంటోంది. దీంతో మునిర్క ప్రాంతంలో ఇంకా విశాలమయిన భవనాన్ని కేటాయించారు.

తెలంగాణ ప్రభుత్వ సమాధానంపైనే కాళేశ్వరం అనుమతులు: కేంద్రం

ఈనాడు, దిల్లీ: కేంద్ర జలసంఘం అడిగిన వివరాలకు తెలంగాణ ప్రభుత్వం ఇచ్చే సంతృప్తికర సమాధానంపైనే కాళేశ్వరం ప్రాజెక్టు అనుమతులు ఆధారపడి ఉంటాయని కేంద్ర జలవనరులశాఖ సహాయమంత్రి అర్జున్ రామ్‌మేఘ్‌వాల్ తెలిపారు. కాళేశ్వరం అనుమతులపై తెరాస సభ్యుడు డి.శ్రీనివాస్ సోమవారం రాజ్యసభలో అడిగిన ప్రశ్నకు ఆయన ఈ సమాధానమిచ్చారు. తెలంగాణ ప్రభుత్వం 2017 ఫిబ్రవరి 27న రూ.80,499.71 కోట్లతో కాళేశ్వరం ప్రాజెక్టు డీపీఆర్‌ను సీడబ్ల్యూసీకి సమర్పించినట్లు తెలిపారు. సీడబ్ల్యూసీ దాన్ని పరిశీలించి, తెలంగాణ ప్రభుత్వాన్ని కొన్ని వివరాలు కోరిందన్నారు. సాగునీటి ప్రణాళికకు సంబంధించిన వివరాలను తెలంగాణ ప్రభుత్వం సమర్పించలేదని వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వమిచ్చే వివరాలమీదే ఈ ప్రాజెక్టు అనుమతి ఆధారపడి ఉంటుందని మేఘ్‌వాల్ వెల్లడించారు. పర్యావరణ ప్రభావ మదింపు నోటిఫికేషన్ 2006, 2009లో చేసిన సవరణల ప్రకారం కొన్ని షరతులకు లోబడి కేంద్ర, పర్యావరణ అటవీశాఖ కాళేశ్వరం ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతులు మంజూరుచేసిందని స్పష్టంచేశారు. డీపీఆర్ ప్రకారం ప్రాజెక్టు ద్వారా యేటా ఖరీఫ్‌లో 9,29,358 హెక్టార్లు (స్థిరీకరణతో కలిపి), రబీలో 2,22,647 హెక్టార్లకు (ఇందులో కొత్తప్రాంతం సాగునీటి కోసం 134.5 టీఎంసీలు, స్థిరీకరణ కోసం 34.5 టీఎంసీలు) నీరందిస్తారని చెప్పారు. సికింద్రాబాద్, హైదరాబాద్ నగరాల తాగునీటి అవసరాలకు 30 టీఎంసీలు, పారిశ్రామిక అవసరాలకు 16 టీఎంసీల నీరు ఉపయోగిస్తారని పేర్కొన్నారు. 2016-17 నాటి ధరల ప్రకారం ప్రస్తుతానికి రూ.80,499.71 కోట్ల విలువైన ఈ ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వమే నిధులు సమకూర్చుకుంటున్నట్లు తెలిపారు.

రిజర్వేషన్లపై ఆందోళన కొనసాగిస్తాం: తెరాస

తెలంగాణలో ఎస్టీ, మైనార్టీ రిజర్వేషన్లు పెంచుకోవడానికి అనుమతిచ్చేంత వరకూ పార్లమెంటులో తమ ఆందోళన కొనసాగిస్తామని తెరాస సీనియర్ నేత, కరీంనగర్ ఎంపీ బి.వినోద్‌కుమార్ చెప్పారు. "రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణలో ఎస్టీ జనాభా 9%, మైనార్టీల జనాభా 12%కి పెరిగింది. జనాభా నిష్పత్తిలో తేడాలు వచ్చినందున దాని ప్రకారం రిజర్వేషన్లు పెంచుతూ తెలంగాణ అసెంబ్లీ ఒక బిల్లు పాస్‌చేసింది. 1994లో ఇందిరాసాహ్నీ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం రిజర్వేషన్లు 50%కి పెంచడానికి వీల్లేదు. దాన్ని అధిగమించాలంటే తెలంగాణ రిజర్వేషన్లను రాజ్యాంగంలోని 9వ అధికరణంలో చేర్చాలి. లేదంటే అధికరణం 16(4)ను సవరించాలి. ఆ అధికరణం కింద ఉద్యోగాలు, చదువుల్లో రిజర్వేషన్లు ఇచ్చుకొనే స్వేచ్ఛను రాష్ట్రాలకిచ్చారు. అయితే, రిజర్వేషన్లు తగినంతగా (అడిక్వేట్లీ) ఉండాలని ఆ నిబంధన కింద పెట్టారు. దాని స్థానంలో జనాభా నిష్పత్తిప్రకారం (ప్రపోర్షనేట్లీ) అన్న పదాన్ని చేరుస్తూ సవరించాలని మేం డిమాండ్ చేస్తున్నాం. ఈ రెండు అంశాల్లో కేంద్రం స్పందించేంత వరకూ ఆందోళన కొనసాగిస్తాం" అని వినోద్‌కుమార్ స్పష్టం చేశారు.

తెలుగురాష్ట్రాల్లో 31 వంతెనలకు మరమ్మతులు అవసరం

తెలుగురాష్ట్రాల్లో 31 వంతెనలకు మరమ్మతులు చేయాల్సిన అవసరం ఉందని కేంద్ర రవాణాశాఖ సహాయమంత్రి మన్‌సుఖ్ ఎల్.మాండవీయ తెలిపారు. రాజ్యసభలో తెదేపా సభ్యుడు దేవేందర్‌గౌడ్ అడిగిన లిఖితపూర్వక ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు.

తెలంగాణలో 22 లక్షల మరుగుదొడ్లు..

ఏపీలో 29 లక్షల నిర్మాణం

స్వచ్ఛభారత్ మిషన్ కింద నాలుగేళ్లలో ఆంధ్రప్రదేశ్‌లో 29,47,240; తెలంగాణలో 22,30,093 మరుగుదొడ్లు నిర్మించినట్లు కేంద్ర మంత్రి ఉమాభారతి తెలిపారు. సోమవారం రాజ్యసభలో వైకాపా సభ్యుడు విజయసాయిరెడ్డి అడిగిన ప్రశ్నకు ఈ సమాధానమిచ్చారు. ఇప్పటివరకూ ఏపీలో 11.56%, తెలంగాణలో 17.62% కుటుంబాలకు మరుగుదొడ్డి సౌకర్యం లేదన్నారు.

డోక్లామ్‌లో చైనా హెలిపాడ్లు: నిర్మలా సీతారామన్

దిల్లీ: డోక్లామ్‌లో గత ఏడాది సైనిక ప్రతిష్టంభన ఏర్పడ్డ ప్రాంతానికి దూరంగా ఇరు దేశాల సైన్యాలు మోహరించాయని రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. ఇప్పుడు అక్కడ హెలిపాడ్లు, కాపలా శిబిరాలు, సైనిక కదలికల కోసం నేలమాళిగల్లో మార్గాలను చైనా సిద్ధం చేసుకుంటోందన్నారు. శీతాకాలంలోనూ తమ బలగాల మోహరింపును కొనసాగించడానికి ఇలా చేస్తోందని సోమవారం రాజ్యసభకు తెలిపారు. చైనా.. డోక్లామ్‌లో హెలిపాడ్లు వంటివి నిర్మించడంతోపాటు ట్యాంకులు, క్షిపణులను మోహరిస్తున్నట్లు ఉపగ్రహ చిత్రాలు ధ్రువీకరించాయా అన్న ప్రశ్నకు ఆమె ఈ మేరకు బదులిచ్చారు. ఈ అంశాన్ని చైనా వద్ద ప్రస్తావించారా అన్న ప్రశ్నకు.. దౌత్యమార్గాలు, సరిహద్దు సిబ్బంది సమావేశాలు, కార్యాచరణ యంత్రాంగాల ద్వారా ఇలాంటి అంశాలను ఎప్పటికప్పుడు ఆ దేశం దృష్టికి తీసుకెళతామని చెప్పారు.

ఎస్సెస్సీ ప్రశ్నపత్రం బహిర్గతంపై సీబీఐ విచారణ

కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ వెల్లడి

దిల్లీ: సిబ్బంది ఎంపిక సంఘం (ఎస్సెస్సీ) గతనెల నిర్వహించిన 'కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవెల్ (టైర్-2) పరీక్ష-2017' ప్రశ్నపత్రం ముందే బహిర్గతం కావడంపై కేంద్రం సీబీఐ విచారణకు ఆదేశించింది. సోమవారమిక్కడ కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ఈ విషయాన్ని వెల్లడించారు. ఫిబ్రవరి 17-22 తేదీల మధ్య ఎస్సెస్సీ ఈ పరీక్షలను నిర్వహించింది. అయితే, ప్రశ్నపత్రం-1 ముందే బహిర్గతమైందని ఆరోపిస్తూ ఉద్యోగార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దిల్లీ భాజపా అధ్యక్షుడు, ఎంపీ మనోజ్ తివారీతో కలిసి ఎస్సెస్సీ ఛైర్మన్ అషీమ్ ఖురానాను ఆదివారం కలిశారు. ప్రశ్నపత్రం లీకేజీపై సీబీఐ విచారణ చేపట్టాలని ఛైర్మన్‌ను కోరారు.

చైనా రక్షణ బడ్జెట్ రూ.11లక్షల కోట్లు

భారత రక్షణ వ్యయం కన్నా మూడున్నర రెట్లు అధికం

బీజింగ్: వచ్చే ఆర్థిక సంవత్సరానికి సంబంధించి చైనా తన రక్షణ బడ్జెట్‌ను 8.1 శాతం మేర పెంచింది. దీంతో అది భారీగా 175 బిలియన్ డాలర్ల (రూ.11లక్షల కోట్లు)కు చేరింది. భారత్‌తో పోలిస్తే ఇది మూడున్నర రెట్లు ఎక్కువ కావడం గమనార్హం. గత ఏడాది 7 శాతం మేర కేటాయింపులను పెంచిన చైనా ఈసారి తన సైనిక ఆధునికీకరణకు మరింత ఊతమిచ్చేందుకు 8.1 శాతం మేర కేటాయింపులు పెంచింది. ఈ మేరకు నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్ (ఎన్‌పీసీ)కి సోమవారం సమర్పించిన బడ్జెట్ నివేదిక పేర్కొంది. రక్షణ వ్యయం విషయంలో అమెరికా తర్వాత ప్రపంచంలోనే రెండోస్థానంలో చైనా ఉంది. 2019 కోసం 686 బిలియన్ డాలర్ల బడ్జెట్‌ను అమెరికా రక్షణ శాఖ కోరింది. భారత తాజా రక్షణ వ్యయం 46 బిలియన్ డాలర్లుగా ఉంది. చైనా గత ఏడాది తన రక్షణ వ్యయాన్ని 150.5 బిలియన్ డాలర్లుగా పేర్కొన్నప్పటికీ.. వాస్తవ ఖర్చు ఇంకా ఎక్కువగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. గోప్యంగా ఇతర పద్దుల నుంచి కూడా రక్షణ శాఖకు నిధులను మళ్లిస్తుంటుందని పేర్కొన్నారు.

ఛాంపియన్

"ర్యాంకుల ప్రకారం చూస్తే టోర్నీలో భారతే ఫేవరెట్. టీమ్‌ఇండియా మిగతా జట్ల కంటే ఎప్పుడూ ముందే ఉంటుంది. భారత్‌కు ఎవరు ఆడినా సరే.. ఆ జట్టు బలంగానే ఉంటుంది. మేం కొంత కాలంగా సొంతగడ్డపై బాగా ఆడట్లేదు. కాబట్టి ఈ సిరీస్‌లో మా ఆరంభం బాగుండాలి"

– హతురుసింఘ, శ్రీలంక కోచ్

బంగారు మను



- షూటింగ్ ప్రపంచకప్‌లో పసిడి సొంతం
- రవికుమార్‌కు కాంస్యం

దిల్లీ: యువ షూటర్ మను బాకర్ మెక్సికోలో జరుగుతున్న షూటింగ్ ప్రపంచకప్‌లో సత్తా చాటింది. మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్‌లో అద్భుత ప్రదర్శన చేసిన ఈ 16 ఏళ్ల హరియాణా అమ్మాయి స్వర్ణం కైవసం చేసుకుని సంచలనం సృష్టించింది. సీనియర్ విభాగంలో తొలి ప్రపంచకప్ ఆడుతున్న మను.. టైటిల్ ఫేవరెట్లను వెనక్కి నెట్టి పసిడి గెలిచింది. ఫైనల్లో ఆమె రెండుసార్లు ప్రపంచకప్ స్వర్ణ విజేత అలెగ్జాండ్రా జవాలా (మెక్సికో)కు షాకిస్తూ అగ్రస్థానంలో నిలిచింది. మను 237.5 పాయింట్లు సాధించగా.. అలెగ్జాండ్రా 237.1 పాయింట్లతో రజతం గెలిచింది. ప్రస్తుతం ఇంటర్మీడియట్ చదువుతున్న మను.. బ్యూనస్ఎయిర్స్‌లో జరిగే యూత్ ఒలింపిక్స్‌కు కూడా అర్హత సాధించింది. పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఈవెంట్లో రవికుమార్ కాంస్యం గెలుచుకున్నాడు. మూడో స్థానం కోసం జరిగిన షూట్ ఆఫ్‌లో అతను భారత్‌కే చెందిన దీపక్ కుమార్‌పై పైచేయి సాధించాడు. దీంతో రెండోరోజు పోటీల ఆఖరికి భారత్ రెండు స్వర్ణాలు, మూడు కాంస్యాలతో ఐదో స్థానంలో నిలిచింది. ఆదివారం పురుషుల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ పోటీల్లో షాజర్ రిజ్వి స్వర్ణం గెలిచిన సంగతి తెలిసిందే.



కోహ్లి.. ఇమ్రాన్‌లా!

కోల్‌కతా: భారత క్రికెట్ జట్టు కెప్టెన్ విరాట్ కోహ్లి పాకిస్థాన్ మాజీ కెప్టెన్ ఇమ్రాన్‌ఖాన్‌ను గుర్తుకు తెస్తున్నాడని టీమ్‌ఇండియా కోచ్ రవిశాస్త్రి అన్నాడు. "కెప్టెన్‌గా కోహ్లి ఇంకా ఆరంభ దశలోనే ఉన్నాడు. కానీ అతను ఇప్పటికే అత్యుత్తమ కెప్టెన్లలో ఒకడయ్యాడు. తాను ముందుండి ఆడి అందరికి ఆదర్శంగా నిలుస్తాడతను. ఈ విషయంలో విరాట్.. ఇమ్రాన్‌ఖాన్‌ను గుర్తుకు తెస్తున్నాడు. సారథిగా ఇమ్రాన్ లక్షణాల్లో చాలా కోహ్లిలో ఉన్నాయి. దక్షిణాఫ్రికా సిరీసే దీనికి ఉదాహరణ. అతను ఒక వైపు ఆటగాడిగా రాణిస్తూనే కెప్టెన్‌గా తన ముద్ర వేశాడు. ఒక సిరీస్‌లో 870 పరుగులు చేయడం నమ్మశక్యం కాని విషయం. కోహ్లి శారీరకంగానే కాదు మానసికంగా ఎంతో బలవంతుడు. కోహ్లిని దూకుడు తగ్గించుకోవాలని సలహాలిస్తున్న మాజీ క్రికెటర్లకు నేను చెప్పేది ఒక్కటే. మీ పని మీరు చూసుకోండని! నిజంగా ఏదైనా ఇబ్బంది తలెత్తితే పరిష్కరించడానికి అంపైర్లు ఉన్నారు.. మ్యాచ్ రిఫరీ ఉన్నాడు. కెరీర్‌లో అతణ్ని రిఫరీ పిలిచి మందలించిన సందర్భాలు ఎన్ని ఉన్నాయి? మరి ఇంకేంటి సమస్య?" అని శాస్త్రి పేర్కొన్నాడు.

బీసీసీఐకి సీఓఏ పంచ్!

ఐపీఎల్ ఆరంభోత్సవ బడ్జెట్లో కోత



దిల్లీ: బీసీసీఐ ఆఫీస్ బేరర్లకు, పాలకుల కమిటీ (సీఓఏ)కు మధ్య అంతరం కొనసాగుతోంది. ఆఫీస్ బేరర్ల నిర్ణయాలకు తరచుగా అడ్డు పడుతున్న సీఓఏ.. తాజాగా మరోసారి తన ఆధిపత్యాన్ని చాటింది. ఐపీఎల్ 11వ సీజన్ ఆరంభ వేడుకల బడ్జెట్, వేదిక, తేదీల్ని సీఓఏ మార్చేసింది. ఏప్రిల్ 7న ఐపీఎల్-11 మొదలవబోతుండగా.. ముందు రోజు ముంబయిలోని సీసీఐ మైదానంలో ప్రత్యేకంగా ఆరంభ వేడుకలు నిర్వహించాలని బోర్డు ఆఫీస్ బేరర్లు నిర్ణయించారు. ఇందు కోసం రూ.50 కోట్ల బడ్జెట్ కేటాయించారు. ఐతే వినోద్ రాయ్ నేతృత్వంలోని సీఓఏ.. ముందు రోజు ప్రత్యేకంగా వేడుకలు అవసరం లేదని తేల్చింది. తర్వాతి రోజు తొలి పోరుకు వేదికైన వాంఖడె స్టేడియంలోనే మ్యాచ్ ఆరంభానికి ముందు వేడుకలు నిర్వహించాలని స్పష్టం చేసింది. బడ్జెట్లో రూ.20 కోట్లు కోత వేసి రూ.30 కోట్లకు పరిమితం చేసింది.

భారత క్రికెట్ జట్టు చాన్నాళ్ల తర్వాత సగానికి సగం రెగ్యులర్ ఆటగాళ్లు లేకుండా ఓ సిరీస్ ఆడబోతోంది. శ్రీలంకలో ముక్కోణపు టీ20 పోరాటాన్ని మంగళవారమే ఆరంభించబోతోంది. కోహ్లి సహా అరడజను మంది కీలక ఆటగాళ్లు ఈ సిరీస్‌కు అందుబాటులో లేరు. వీరి స్థానంలో చాలామంది కొత్త కుర్రాళ్లకు అవకాశం దక్కింది. వీరి సత్తాకు ఈ సిరీస్ పరీక్షే. టోర్నీ తొలి మ్యాచ్‌లో ఆతిథ్య శ్రీలంకను భారత్ ఢీకొనబోతోంది.

కుర్రాళ్ల పోరు

రాత్రి 7 నుంచి డి-స్పోర్ట్‌లో



- నేటి నుంచి ముక్కోణపు టీ20 సిరీస్
- తొలి మ్యాచ్‌లో శ్రీలంకతో భారత్ ఢీ

"మమ్మల్ని మేం ఫేవరెట్లుగా చెప్పుకోం. టీ20 ఫార్మాట్ అంటేనే అంచనాలకు అందనిది. ఎప్పుడూ అప్రమత్తంగా ఉండాలి. మా ప్రత్యర్థి జట్లు రెండూ బలంగా ఉన్నాయి. టోర్నీ హోరాహోరీగా సాగుతుందని ఆశిస్తున్నా"

- రోహిత్ శర్మ, భారత కెప్టెన్

కొలంబో

వన్డేల్లో ముక్కోణపు పోరాటాలు మామూలే. ఐతే ఇప్పుడు కొత్తగా టీ20ల్లోనూ ముక్కోణపు సిరీస్‌లు మొదలయ్యాయి. ఇటీవలే ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, ఇంగ్లాండ్ పొట్టి క్రికెట్లో తలపడ్డాయి. ఇప్పుడు భారత్, శ్రీలంక, బంగ్లాదేశ్ టీ20ల్లో ముక్కోణానికి సిద్ధమయ్యాయి. లీగ్ దశలో ప్రతి జట్టూ మిగతా రెండు జట్లతో రెండేసి సార్లు తలపడుతుంది. లీగ్ దశలో తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు ఈ నెల 18న ఫైనల్లో తలపడతాయి. భారత్ ముందుగా మిగతా రెండు జట్లతో వరుసగా రెండు మ్యాచ్‌లు ఆడనుంది. కీలక ఆటగాళ్లు దూరమై కుర్రాళ్లతో నిండిన ప్పటికీ సిరీస్‌లో భారతే ఫేవరెట్ అనడంలో సందేహం లేదు. కోహ్లి లేని నేపథ్యంలో భారత్ రోహిత్ శర్మ నాయకత్వంలో ఈ సిరీస్ ఆడనుంది.

తుది జట్టులో ఎవరు?: తొలి మ్యాచ్‌లో భారత్ ఎలా ఆడుతుందనే కంటే ఈ మ్యాచ్‌కు తుది జట్టులో ఎవరెవరు ఆడతారనే విషయంలోనే అభిమానుల్లో ఎక్కువ ఆసక్తి ఉంది. కోహ్లి, ధోని, పాండ్య, భువనేశ్వర్, బుమ్రా, కుల్‌దీప్ యాదవ్.. ఈ అరడజను మంది స్థానాన్ని వేరే ఆటగాళ్లు భర్తీ చేయాల్సి ఉంది. రోహిత్, ధావన్ యథావిధిగా ఓపెనర్లుగా కొనసాగబోతుండగా.. తర్వాత చాలా స్థానాల్లో మార్పులుంటాయి. స్వతహాగా ఓపెనర్ అయినప్పటికీ.. ప్రస్తుత పరిస్థితుల్లో కేఎల్ రాహుల్ నాలుగో స్థానంలో అవకాశం దక్కించుకోవచ్చు. దక్షిణాఫ్రికాతో సిరీస్‌లో మాదిరే సీనియర్ ఆటగాడు రైనా మూడో స్థానంలో ఆడే అవకాశముంది. పాండే ఐదో స్థానంలో కొనసాగవచ్చు. వికెట్ కీపర్ స్థానానికి రిషబ్ పంత్, దినేశ్ కార్తీక్ పోటీలో ఉన్నారు. పరిమిత ఓవర్ల క్రికెట్లో ధోని వారసుడు కాగలడని అంచనాలున్న పంత్‌ను పరీక్షించడానికి ఇదే సరైన తరుణం. అతడి విషయంలో వేచి చూడాలనుకుంటే ముందు కార్తీక్‌ను ఆడించి.. తర్వాత ఒకట్రెండు మ్యాచ్‌ల్లో పంత్‌కు అవకాశం కల్పించొచ్చు. ఆల్‌రౌండర్ కోటాలో వాషింగ్టన్ సుందర్, దీపక్ హుడా మధ్య పోటీ ఉంది. వీళ్లిద్దరూ స్పిన్ ఆల్‌రౌండర్లే. పిచ్ స్పిన్‌కు అనుకూలించే అవకాశముండటంతో స్పెషలిస్టు స్పిన్నర్లు చాహల్, అక్షర్ పటేల్ ఇద్దరికీ అవకాశం దక్కొచ్చు. పేస్ బాధ్యతల్ని ఉనద్కత్, శార్దూల్ ఠాకూర్ పంచుకుంటారు. హైదరాబాదీ పేసర్ మహ్మద్ సిరాజ్‌కు తొలి మ్యాచ్‌లో అవకాశం సందేహమే. దక్షిణాఫ్రికా పర్యటనలో ఘోర వైఫల్యంతో తీవ్ర విమర్శలెదుర్కొన్న రోహిత్ శర్మ.. పుంజుకోవడానికి ఈ సిరీస్ మంచి అవకాశం. అతను, ధావన్, రైనా లాంటి అనుభవజ్ఞులు ఇన్నింగ్స్‌కు ఎలాంటి ఆరంభాన్నిస్తారో చూడాలి. మిడిలార్డర్లో మనీష్ పాండే కీలకం. బ్యాటింగ్ బాగానే ఉంది కానీ.. భువనేశ్వర్, బుమ్రా లేని నేపథ్యంలో బౌలింగ్‌లో భారత్ బలహీనంగానే కనిపిస్తోంది.

ఉత్సాహంతో లంక: గత ఏడాది చివర్లో స్వదేశంలో, భారత గడ్డపై టీమ్‌ఇండియా చేతిలో వరుస పరాభవాలు చవిచూసిన శ్రీలంక.. ఇప్పుడు కొంచెం మెరుగ్గానే కనిపిస్తోంది. భారత పర్యటన అనంతరం ఆ జట్టు బంగ్లాదేశ్ పర్యటనలో సత్తా చాటింది. మూడు ఫార్మాట్లలోనూ సిరీస్‌లు సాధించింది. కుశాల్ మెండిస్, కుశాల్ పెరీరా లాంటి ఆటగాళ్లు మంచి ఫామ్‌లో ఉండటం కలిసొచ్చే అంశం. చండిమాల్ తిరిగి జట్టులోకి రావడమే కాక పగ్గాలు కూడా అందుకున్నాడు. బ్యాటింగ్‌లో ఈ ముగ్గురు.. బౌలింగ్‌లో లక్మల్, తిసార పెరీరా, ధనంజయ లాంటి ఆటగాళ్లపై లంక ఆశలు పెట్టుకుంది. సీనియర్ ఆల్‌రౌండర్ మాథ్యూస్ ఈ సిరీస్‌కు దూరం కావడం లంకకు ప్రతికూలతే.

తుది జట్లు (అంచనా)

భారత్: రోహిత్ (కెప్టెన్), ధావన్, రైనా, కేఎల్ రాహుల్, మనీష్ పాండే, రిషబ్ పంత్, దినేశ్ కార్తీక్, సుందర్/హుడా, చాహల్, అక్షర్ పటేల్, శార్దూల్ ఠాకూర్, ఉనద్కత్

శ్రీలంక: కుశాల్ మెండిస్, గుణతిలక, కుశాల్ పెరీరా, తరంగ, శనక, తిసార పెరీరా, చండిమాల్ (కెప్టెన్), ధనంజయ, అపోన్సో, లక్మల్, చమీర

వాళ్లు లేకపోవడం లంకకు దెబ్బే

మహేల జయవర్ధనే

శ్రీలంక యువ జట్టుకు కొత్త ఏడాది మంచి ఆరంభమే లభించింది. గతేడాది చేదు జ్ఞాపకాలను మరిచిపోయి ముందుకు సాగాల్సిన తరుణమిది. బంగ్లాదేశ్ పర్యటనలో లంకలో ఆ సానుకూల దృక్పథం కనిపించింది. ఈ సిరీస్‌లో లంక క్లీన్ స్వీప్ చేయడం ఊహించని విషయం. ఈ ముక్కోణపు టీ20 టోర్నీకి ముందు లంక జట్టులో ఆత్మవిశ్వాసాన్ని పెంచే పర్యటన ఇది. ఈ టోర్నీలో సత్తా చాటాలనే ఒకవైపు కుర్రాళ్లతో నిండిన భారత్ తహతహలాడుతుంటే.. ఇటీవల ఓటములు మరిచిపోయి రాణించాలని బంగ్లా భావిస్తోంది. టీమ్‌ఇండియా ద్వితీయశ్రేణి జట్టును దించడం, బంగ్లా పర్యటన ఇచ్చిన విశ్వాసం, కోచ్ హతురసింఘ వ్యూహాలు.. ఈ నేపథ్యంలో ముక్కోణపు టోర్నీలో లంక ఫేవరెట్‌గా మారింది. మాథ్యూస్, గుణరత్నె, మలింగ లాంటి ఆటగాళ్లు లేకపోవడం లంకకు దెబ్బే. లక్మల్, ప్రదీప్, చమీరలకు టీ20ల్లో పెద్దగా అనుభవం లేదు. అయితే ఈ ముగ్గురి నైపుణ్యానికి ఇదో పెద్ద పరీక్ష. యువ ఆటగాళ్లు కూడా రాణించాల్సిన సమయం వచ్చింది. ఐపీఎల్ దగ్గర్లోనే ఉన్న నేపథ్యంలో ఈ టోర్నీలో పాల్గొంటున్న అన్ని జట్లు తమ ప్రధాన ఆటగాళ్లకు విశ్రాంతినిచ్చాయి. సాధారణంగా లంకలో మంచి బ్యాటింగ్ పిచ్‌లు ఉంటాయి. కానీ కొలంబోలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడం, ప్రేమదాస స్టేడియంలో మ్యాచ్‌లు ఉండడంతో కచ్చితంగా బ్యాట్స్‌మెన్‌కు ఊహించని సవాల్ ఎదురు కానుంది.



టీమ్‌ఇండియా చేతిలో వన్డే, టీ20 సిరీస్‌ల్లో చిత్తుగా ఓడిన దక్షిణాఫ్రికాను ఇప్పుడు 'కంగారు' పట్టుకుంది! సఫారీ గడ్డపై అడుగుపెట్టిన ఆస్ట్రేలియా.. దక్షిణాఫ్రికాను ఇబ్బంది పెడుతోంది. 4 మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లో తొలి పోరులో సులువుగా ఓడించింది. అంతకుముందు బ్యాట్స్‌మెన్ వైఫల్యంతో టీమ్‌ఇండియా టెస్టు సిరీస్‌ను చేజార్చుకుందే తప్ప.. దక్షిణాఫ్రికా గొప్పగా ఆడిందేమీ లేదు! నైపుణ్యంలో.. పోరాటంలో అత్యుత్తమ ఆటగాళ్లను అందించిన దక్షిణాఫ్రికా.. ఇప్పుడు ప్రతిభావంతుల కొరతతో ఇబ్బంది పడుతోంది. నాణ్యమైన ఆటగాళ్లను అందించలేక క్రమంగా వెస్టిండీస్, పాకిస్థాన్, శ్రీలంకల బాటలో పయనిస్తుందేమో అన్న అభిప్రాయం కలిగిస్తోంది.

ఎక్కడ ఆ పోరాట స్ఫూర్తి?

ఫోర్త్ అంపైర్

ప్రస్తుతం ప్రపంచ క్రికెట్లో భారత్, ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్‌ల పరిస్థితే మెరుగ్గా ఉంది. న్యూజిలాండ్ కూడా ఫర్వాలేదు. మిగతా జట్లది మాత్రం తడ'బాటే'! ఒకప్పుడు క్రికెట్ ప్రపంచాన్ని ఏలిన వెస్టిండీస్ ఇప్పుడు అస్థిత్వమే కోల్పోయింది! ప్రపంచకప్ కోసం క్వాలిఫయర్స్ మ్యాచ్‌లు ఆడాల్సిన దుస్థితికి దిగజారింది. క్లైవ్ లాయిడ్, వివియన్ రిచర్డ్స్, గ్రీనిడ్జ్, ఆల్విన్ కాలిచరణ్‌ల నిష్క్రమణలతో విండీస్‌కు గడ్డు రోజులు మొదలయ్యాయి. బ్రయాన్ లారా, హూపర్, ఆంబ్రోస్, వాల్ష్‌లు సంధికాలంలో అండగా నిలిచినా విండీస్ క్రికెట్ పతనాన్ని ఆపలేకపోయారు. క్రిస్ గేల్ రిటైర్మెంట్‌కు దగ్గర్లో ఉండగా.. మిగతా ఆటగాళ్లందరూ అంతంతమాత్రమే. కాబట్టి విండీస్ క్రికెట్ ఇప్పట్లో కోలుకోవడం కష్టమే! జయసూర్య, మురళీధరన్, సంగక్కర, జయవర్దనెల తర్వాత శ్రీలంక పరిస్థితీ అలాగే తయారైంది. అంతో ఇంతో సత్తా ఉన్న మాథ్యూస్ స్థాయికి తగ్గ ప్రదర్శన చేయట్లేదు. పైగా రిటైర్మెంట్‌కు దగ్గర పడుతున్నాడు. తరంగ, చండిమాల్, తిరుమానెల ఆట పోటీ క్రికెట్‌కు సరితూగట్లేదు! ఫలితమే శ్రీలంక వెనుకబాటు. ప్రతిభావంతులకు కొదవలేని పాకిస్థాన్‌ది వింత పరిస్థితి. మ్యాచ్ ఫిక్సింగ్, బెట్టింగ్‌లతో సొంత క్రికెటర్లే ఎప్పటికప్పుడు ఆటను బలిపీఠం ఎక్కిస్తున్నారు. ఐసీసీ టోర్నీలు లేదా మరే సిరీస్‌లోనైనా పాక్ బాగా ఆడితే చాలు.. ఫిక్సర్లు ఆటగాళ్ల చుట్టూ చేరిపోవడం సాధారణమైపోయింది. సరైన వ్యవస్థ లేకే పాక్ క్రికెట్ దారి తప్పుతోంది. క్రికెట్ పరిపాలకులు సైతం సరిగా లేకపోవడం పాక్ క్రికెట్‌కు శాపమే. ఉగ్రవాదం, హింసాత్మక సంఘటనలతో పాక్‌లో క్రికెట్ పూర్తిగా దెబ్బతింది. ఇటు ఆటగాళ్లు.. అటు బోర్డుకు ఆదాయమే లేకుండా పోయింది. దీంతో డబ్బు కోసం క్రికెటర్లు పక్కదారి పడుతున్నారు. ఆటగాళ్లను ఉచ్చులో బిగించడం ఫిక్సర్లకు కూడా సులువు కావడంతో పాక్ క్రికెట్ అనిశ్చితికి కేంద్రంగా మారింది.

ఇక దక్షిణాఫ్రికా విషయానికొస్తే ఆ జట్టును ఇప్పుడు ప్రతిభావంతుల లోటు వెంటాడుతోంది. పొలాక్ సోదరులు, కెప్లర్ వెసెల్స్, హాన్సీ క్రానె, కిర్‌స్టన్, కలినన్, క్లుజ్‌నర్, గిబ్స్, డొనాల్డ్, కలిస్ లాంటి నాణ్యమైన ఆటగాళ్లతో దక్షిణాఫ్రికా పటిష్టంగా ఉండేది. జట్టు నిండా పోరాటస్ఫూర్తి కనిపించేది. ఎలాంటి జట్టునైనా మట్టికరిపించగలదన్న పేరుండేది. సఫారీలను ఓడించాలంటే చెమటోడ్చాల్సి వచ్చేది. ఇప్పుడున్న జట్టులో డివిలియర్స్, డుప్లెసిస్, ఆమ్లా తప్పితే నాణ్యమైన బౌలింగ్‌ను సమర్థంగా ఎదుర్కొనే ఆటగాళ్లు కరవయ్యారు. ఎల్గర్, డికాక్ విఫలమవుతున్నారు. ఆమ్లా సైతం ఇంతకుముందులా ప్రభావవంతంగా ఆడలేకపోతున్నాడు. మంచి ఓపెనర్లు లేరు. మార్క్రమ్‌లో ఇంకా పరిణతి రావాలి. నాణ్యమైన ఆల్‌రౌండర్లూ కరవే. కలిస్ తర్వాత అలాంటి ఆటగాడు లేకపోవడంతో జట్టు సమతూకం దెబ్బ తింది. కొన్నేళ్ల పాటు బౌలింగ్‌కు పెద్ద దిక్కుగా ఉన్న స్టెయిన్.. గాయాలతో కెరీర్ ముగింపు దశకు చేరుకున్నాడు. అతడి సరిజోడీ మోర్నీ మోర్కెల్ ఇప్పటికే రిటైర్మెంట్ ప్రకటించాడు. ఫిలాండర్ టెస్టులకే తప్ప పరిమిత ఓవర్ల క్రికెట్‌కు అంతగా నప్పడు! ఇలా రోజు రోజుకూ సఫారీ జట్టు సత్తా తగ్గుతోంది. కొత్తగా వచ్చే కుర్రాళ్ల నైపుణ్యం కొరవడుతోంది.

బీసీసీఐకి ఆదాయం పెరగడంతో పాటు దేశంలో క్రికెట్ ప్రమాణాలు మెరుగవడానికి ఐపీఎలే దోహదం చేసింది. పోటీ పెరగడంతో నాణ్యమైన క్రికెటర్లు వస్తున్నారు. టీమ్‌ఇండియాలో ఒక్కో స్థానానికి కనీసం ముగ్గురు పోటీలో ఉంటుండటం పెరిగిన బెంచ్ బలానికి నిదర్శనం. అందుకే టీమ్‌ఇండియా మెరుగైన ఫలితాలతో సత్తా చాటుతోంది.

మన దేశంలో క్రికెట్ నంబర్‌వన్ అయినా.. ప్రపంచవ్యాప్తంగా ఈ ఆట ఆడే దేశాలు తక్కువే. టెస్టులాడే దేశాలు పట్టుమని పదే. శ్రీలంక, పాకిస్థాన్, విండీస్, బంగ్లాదేశ్, జింబాబ్వేలను మినహాయిస్తే మిగిలినవి ఐదే. ఆ ఐదులో టీమ్‌ఇండియా, ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, న్యూజిలాండ్‌ల సంగతి అటుంచితే.. దక్షిణాఫ్రికా పరిస్థితే కాస్త ఆందోళనకరంగా ఉంది. యువతలో క్రికెట్ పట్ల ఆసక్తి తగ్గుతుండటం.. సరైన ఆదాయం లేకపోవడం కూడా ఆయా దేశాల్లో ఆట బలహీనపడుతుండటానికి కారణాలే. ఇప్పటికైనా ఆయా దేశాల క్రికెట్ పరిపాలకులు ఆట అభివృద్ధిపై దృష్టిసారించడం తక్షణావసరం. ప్రతిభావంతుల్ని గుర్తించి.. వారిని సానబెట్టడం తప్పనిసరి. కొన్ని పనులతో లలిత్ మోదీకి చెడ్డపేరు వచ్చినా.. ఐపీఎల్‌తో అతను భారత క్రికెట్‌నే మార్చాడు. బీసీసీఐకి ఆదాయం పెరగడంతో పాటు దేశంలో క్రికెట్ ప్రమాణాలు మెరుగవడానికి ఐపీఎలే దోహదం చేసింది. పోటీ పెరగడంతో నాణ్యమైన క్రికెటర్లు వస్తున్నారు. టీమ్‌ఇండియాలో ఒక్కో స్థానానికి కనీసం ముగ్గురు పోటీలో ఉంటుండటం పెరిగిన బెంచ్ బలానికి నిదర్శనం. అందుకే టీమ్‌ఇండియా మెరుగైన ఫలితాలతో సత్తా చాటుతోంది. ఇక విదేశీ క్రికెటర్లకు సైతం ఐపీఎల్ బంగారు బాతే. దేశానికి ఆడటం కంటే ఐపీఎల్‌లో బరిలో దిగితేనే విదేశీ క్రికెటర్లకు ఎక్కువ డబ్బులొస్తున్నాయి. ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, న్యూజిలాండ్, వెస్టిండీస్, శ్రీలంక, బంగ్లాదేశ్ ఆటగాళ్లు ఐపీఎల్‌లో బాగానే ఆర్జిస్తున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో విదేశీ క్రికెటర్లలో అత్యధికుల దృష్టి జాతీయ జట్టు కంటే ఐపీఎల్ ఫ్రాంఛైజీపైనే అంటే అతిశయోక్తి లేదేమో. దీనికి తోడు అంతర్జాతీయ క్రికెట్లో పోటీ కూడా తగ్గిపోతుండటంతో ఐపీఎల్ బలం మరింత పెరుగుతోంది.

ఇంకో 22 బంతుల్లో..

ముగిసిన లాంఛనం • తొలి టెస్టు ఆస్ట్రేలియాదే • 118 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికా ఓటమి

డర్బన్: ఇంకో 22 బంతులు.. 5 పరుగులు.. పావుగంట సమయం.. ఆస్ట్రేలియా లాంఛనాన్ని ముగించడానికి పెద్ద కష్టపడాల్సిన అవసరం రాలేదు. దక్షిణాఫ్రికాతో తొలి టెస్టులో ఆ జట్టు 118 పరుగుల తేడాతో విజయం సాధించింది. 417 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన దక్షిణాఫ్రికా 298 పరుగుల వద్ద ఇన్నింగ్స్ ముగించింది. ఓవర్‌నైట్ స్కోరు 293/9తో బ్యాటింగ్ కొనసాగించిన సఫారీ జట్టు.. ఆట మొదలైన నాలుగో ఓవర్లో ఆలౌటైంది. ముందు రోజు మార్క్రమ్‌తో కలిసి గొప్పగా పోరాడిన వికెట్ కీపర్ బ్యాట్స్‌మన్ క్వింటన్ డికాక్ 83 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద హేజిల్‌వుడ్ బౌలింగ్‌లో ఎల్బీగా వెనుదిరిగాడు. నాలుగో రోజు ఒక దశలో 283/5తో ఉన్న దక్షిణాఫ్రికా.. ఆట చివర్లో అనూహ్యంగా 7 పరుగుల తేడాలో 4 వికెట్లు కోల్పోయిన సంగతి తెలిసిందే. రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి 9 వికెట్లతో దక్షిణాఫ్రికా పతనాన్ని శాసించిన పడగొట్టిన మిచెల్ స్టార్క్ 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు. తొలి ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా 351 పరుగులు చేయగా.. దక్షిణాఫ్రికా 162 పరుగులకే కుప్పకూలింది. రెండో ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా 227 పరుగులు సాధించింది. ఈ విజయంతో నాలుగు టెస్టుల సిరీస్‌లో ఆసీస్ 1-0 ఆధిక్యం సాధించింది. రెండో టెస్టు ఈ నెల 9న పోర్ట్ ఎలిజిబెత్‌లో ఆరంభమవుతుంది.





వార్నర్ X డికాక్

తొలి టెస్టు నాలుగో రోజు ఆట టీ విరామం సందర్భంగా ఆస్ట్రేలియా ఓపెనర్ డేవిడ్ వార్నర్, దక్షిణాఫ్రికా వికెట్ కీపర్ బ్యాట్స్‌మన్ క్వింటన్ డికాక్ మధ్య గొడవ చోటు చేసుకోవడంపై ఐసీసీ దృష్టిసారించింది. ఇరు జట్ల ఆటగాళ్లు డ్రెస్సింగ్ రూంల వైపు నడుస్తుండగా డికాక్‌తో తీవ్ర వాగ్వాదానికి దిగిన వార్నర్.. అతడి మీదికి దూసుకెళ్లే ప్రయత్నం కూడా చేశాడు. డికాక్ కొంచెం సంయమనంతోనే కనిపించాడు కానీ.. వార్నర్ మాత్రం సహచరులు ఆపే ప్రయత్నం చేస్తున్నా వాళ్లను తోసుకుంటూ డికాక్ వైపు ఉరికాడు. ఈ ఘటన రిఫరీ దృష్టికి వెళ్లింది. ఇరు జట్ల యాజమాన్యాలు దీనిపై విచారణ చేపడుతున్నట్లు కూడా వెల్లడించాయి. ఐసీసీ సైతం దీనిపై దృష్టిసారించింది. రిఫరీ విచారణ అనంతరం వార్నర్, డికాక్‌లపై చర్యలు చేపట్టే అవకాశముంది. అసలీ గొడవ ఎలా మొదలైందనే విషయంలో స్పష్టత లేదు. నాలుగో రోజు ఆటలో డివిలియర్స్ రనౌట్ సందర్భంగా అతడి సహచర బ్యాట్స్‌మన్ మార్క్రమ్‌ను ఉద్దేశించి వార్నర్ ఎగతాళిగా సంజ్ఞ చేశాడు. తర్వాత మార్క్రమ్.. డికాక్‌తో కీలక భాగస్వామ్యంతో దక్షిణాఫ్రికాను మంచి స్థితికి తీసుకెళ్లాడు. ఈ జోడీ ఒక సెషన్ అంతా ఆస్ట్రేలియాకు వికెట్టే ఇవ్వలేదు. ఆ నేపథ్యంలోనే వార్నర్.. డికాక్‌ను కవ్వించే ప్రయత్నం చేయడం, అతను దీటుగా బదులివ్వడం.. విరామ సమయంలో ఇద్దరికీ గొడవ తలెత్తి ఉంటుందని భావిస్తున్నారు. వార్నర్‌పై వ్యక్తిగత వ్యాఖ్యలు చేయడం వల్లే అతను అలా స్పందించాడని ఆస్ట్రేలియా కెప్టెన్ స్టీవ్ స్మిత్ అంటుండగా.. ముందు డికాక్‌ను రెచ్చగొట్టింది వార్నరే అని దక్షిణాఫ్రికా జట్టు వర్గాలు వాదిస్తున్నాయి.

భారత్ 'బి'పై కర్ణాటక గెలుపు

ధర్మశాల: సామ్రాట్ (117; 115 బంతుల్లో 13×4, 1×6) సెంచరీ సాధించడంతో దేవధర్ ట్రోఫీలో కర్ణాటక 6 పరుగుల తేడాతో భారత్-బిపై విజయం సాధించింది. సోమవారం మొదట బ్యాటింగ్ చేసిన కర్ణాటక సామ్రాట్ శతకం సాయంతో 50 ఓవర్లలో 8 వికెట్లకు 296 పరుగులు చేసింది. మయాంక్ అగర్వాల్ (44), దేశ్‌పాండే (46) కూడా రాణించారు. ఛేదనలో శ్రేయస్ గోపాల్ (3/29), కృష్ణ (2/45) ధాటికి భారత్-బి.. నిర్ణీత ఓవర్లలో 9 వికెట్లకు 290 పరుగులకు పరిమితమైంది. మనోజ్ తివారి (120; 110 బంతుల్లో 10×4, 4×6) శతకం జట్టును గెలిపించలేకపోయింది. గెలవాలంటే భారత్-బి ఆఖరి ఓవర్లో 11 పరుగులు చేయాల్సి ఉండగా.. గౌతమ్ నాలుగు పరుగులే ఇచ్చి కర్ణాటకకు విజయాన్ని అందించాడు. 'బి' జట్టులో తివారితో పాటు సిద్దేశ్ లాడ్ (70) రాణించాడు.

అజ్లాన్‌షా హాకీ టోర్నీలో ఈనాడు

భారత్ × ఆస్ట్రేలియా

మధ్యాహ్నం 3.30 నుంచి స్టార్‌స్పోర్ట్స్1లో

అరుదైన చికిత్స

తెగిపడిన చేతిని అతికించిన బెంగళూరు వైద్యులు




తెగిపడిన చేయి ★ అతికించిన తరువాత చేయి

ఎలక్ట్రానిక్ సిటీ, న్యూస్‌టుడే: కర్మాగారంలో ప్రమాదవశాత్తు మోచేయి వరకూ తెగిపోయిన ఓ యువతికి ఆ చేతిని తిరిగి అతికించి భళా అనిపించుకున్నారు బెంగళూరు వైద్యులు. చేతిని విజయవంతంగా అతికించడం ద్వారా ఆ యువతికి అంగవైకల్యం తప్పించి శెభాష్ అనిపించుకున్నారు. బెంగళూరులోని మల్లిగె ఆసుపత్రిలో ఇటీవల ఈ అరుదైన శస్త్రచికిత్స చోటుచేసుకుంది. స్థానికంగా వస్త్ర పరిశ్రమలో పనిచేసే 21 సంవత్సరాల కార్మికురాలికి ప్రమాదవశాత్తు మోచేయి వరకూ తెగింది. వెంటనే ఆమెను మల్లిగె వైద్యాలయానికి తరలించారు. అక్కడి వైద్యులు మహేష్‌జీ, తదితరులు ఐదు గంటల పాటు శ్రమించి చేతిని అతికించే శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తిచేశారు. ఇలాంటి శస్త్రచికిత్సలు అరుదుగా చోటుచేసుకుంటాయని మహేష్‌జీ తెలిపారు. ప్రస్తుతం బాధితురాలు కోలుకుంటోందని వెల్లడించారు. వివాహానంతరం కేవలం మూడు నెలల్లోనే ఈ దుర్ఘటన చోటుచేసుకోవడంతో ఇక జీవితమంతా అంగవైకల్యంతో వెళ్లదీయాలనే బాధతో ఉన్న బాధితురాలికి కొత్త జీవితాన్ని ప్రసాదించినట్లు పేర్కొన్నారు.

సూర్యోదయానికి 45 నిమిషాల ముందు నుంచే..

తాజ్ సందర్శకులకు ప్రవేశ టికెట్ల విక్రయం ప్రారంభం

దిల్లీ: ప్రపంచ ప్రఖ్యాత కట్టడం తాజ్‌మహల్ సందర్శనకు వెళ్లేవారు ఇకపై ప్రవేశ టికెట్ల కోసం బారులుతీరి పడిగాపులు కాయాల్సిన అవసరం లేదని కేంద్ర సాంస్కృతికశాఖ సహాయమంత్రి మహేశ్ శర్మ అన్నారు. సూర్యోదయానికి 45 నిమిషాల ముందే టికెట్లు కొనుగోలు చేయవచ్చునని తెలిపారు. ఈ మేరకు టికెట్ల విక్రయాన్ని త్వరగా ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. దీంతో తాజ్ అందాలను వీక్షించేందుకు వీలుగా గేట్లు తెరవడానికి ముందే సందర్శకుల చేతికి టికెట్లు వచ్చే అవకాశముందని పేర్కొన్నారు. సూర్యాస్తమయానికి 30 నిమిషాల ముందు టికెట్ల విక్రయాన్ని నిలిపివేస్తామని వెల్లడించారు. లోక్‌సభలో ఆయన సోమవారం ఈ వివరాలు వెల్లడించారు. గతంలో సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకు మాత్రమే తాజ్ ప్రవేశ టికెట్లను విక్రయించేవారు.

బీసీ రిజర్వేషన్లు 52 శాతానికి పెంచాలి: ఆర్.కృష్ణయ్య

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: రాష్ట్రంలోని బీసీలకు విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లను 25 నుంచి 52 శాతానికి పెంచాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయాధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు బీసీ కమిషన్ ఛైర్మన్‌కు సోమవారం ఆయన వినతిపత్రం సమర్పించారు. తమిళనాడు తరహా రిజర్వేషన్లు అమలుచేస్తామని సీఎం కేసీఆర్ గతంలో ప్రకటించారని పేర్కొన్నారు. ప్రస్తుతం అక్కడ 49, కర్ణాటకలో 50, మహారాష్ట్రలో 34 శాతం చొప్పున రిజర్వేషన్లు అమల్లో ఉన్నాయని గుర్తుచేశారు . ప్రస్తుతం సమగ్ర కుటుంబ సర్వే లెక్కలు అందుబాటులో ఉన్నాయని, అలాంటప్పుడు రిజర్వేషన్ల పెంచడంలో ఎందుకు ఆలస్యం చేస్తున్నారని ప్రశ్నించారు. పంచాయతీ, పురపాలక ఎన్నికల్లో బీసీలకు కేటాయించే స్థానాలను 34 నుంచి 50 శాతానికి పెంచాలని కోరారు.

షోపియాన్ కాల్పుల ఘటనపై దర్యాప్తు నిలిపివేత

- ఇదేమీ సాధారణ నేరస్తుడి కేసు కాదన్న సుప్రీంకోర్టు
- మేజర్ ఆదిత్యను నిందితుడిగా పేర్కొనలేదన్న జమ్మూకశ్మీర్

దిల్లీ: షోపియాన్ కాల్పుల కేసు దర్యాప్తును సుప్రీంకోర్టు తాత్కాలికంగా నిలిపివేసింది. ఈ కేసుకు సంబంధించిన ప్రథమ సమాచార నివేదిక(ఎఫ్ఐఆర్)లో మేజర్ ఆదిత్య కుమార్ పేరును నిందితుడిగా చేర్చలేదని జమ్మూకశ్మీర్ ప్రభుత్వం వెల్లడించడంతో.. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్ర నేతృత్వంలోని ధర్మాసనం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. వచ్చే ఏప్రిల్ 24న తాము తీర్పు వెలువరిస్తామని.. అప్పటివరకు దర్యాప్తును నిలిపివేయాలని ఆదేశించింది. షోపియాన్‌లోని గనోవ్‌పొరా గ్రామంలో ఈ ఏడాది జనవరి 27న సైన్యం జరిపిన కాల్పుల్లో ముగ్గురు పౌరులు మృత్యువాతపడ్డారు. ఈ ఘటనపై పోలీసులు నమోదుచేసిన ఎఫ్ఐఆర్‌లో మేజర్ ఆదిత్య పేరుందని వార్తలు రావడంతో ఆయన తండ్రి లెఫ్టినెంట్ కల్నల్ కరమ్‌వీర్ సింగ్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. కరమ్‌వీర్ పిటిషన్‌పై సర్వోన్నత న్యాయస్థానం సోమవారం విచారణ చేపట్టగా.. ఎఫ్ఐఆర్‌లో ఆదిత్య పేరును నిందితుడిగా చేర్చలేదని జమ్మూకశ్మీర్ ప్రభుత్వం నివేదించింది. పోలీసు వాహనశ్రేణికి నేతృత్వం వహిస్తున్న సైన్యాధికారిగా మాత్రమే ఆయన్ను పేర్కొన్నట్లు తెలిపింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్ర స్పందిస్తూ.. 'ఇది ఓ సైన్యాధికారికి సంబంధించిన కేసు. సాధారణ నేరస్తుడికి సంబంధించిందేమీ కాదు' అని వ్యాఖ్యానించారు.

షోపియాన్ కాల్పుల్లో 6కు పెరిగిన మృతుల సంఖ్య

శ్రీనగర్: దక్షిణ కశ్మీర్‌లోని షోపియాన్ జిల్లాలో భద్రతాదళాలు, ముష్కరుల మధ్య ఆదివారం రాత్రి చోటుచేసుకున్న కాల్పుల్లో మృతిచెందినవారి సంఖ్య ఆరుకు పెరిగింది. ఈ కాల్పుల్లో హతమైన లష్కరే తొయిబా ఉగ్రవాది ఆషిఖ్ హుస్సేన్ భట్‌తోపాటు మరో పౌరుడు గౌహర్ అహ్మద్ లోన్ మృతదేహాలను పోలీసులు సోమవారం గుర్తించారు. షోపియాన్‌లోని పాహన్ సమీపంలో భద్రతా బలగాలపై ఉగ్రవాదులు ఆదివారం రాత్రి కాల్పులకు తెగబడ్డారు. దీటుగా స్పందించిన బలగాలు.. ఎదురుకాల్పులు జరిపాయి. ఈ ఘటనలో మృతిచెందిన ఉగ్రవాదితోపాటు ముగ్గురు పౌరుల మృతదేహాలను ఆదివారమే గుర్తించారు. తాజా కాల్పుల్లో మరణించిన నలుగురు పౌరులు.. ఉగ్రవాదులకు సహకరిస్తున్నవారేనని పోలీసులు స్పష్టం చేశారు.

భూమిని పోలిన మూడు భారీ గ్రహాలు

బోస్టన్: భూమిని పోలిన మూడు భారీ గ్రహాలను ఖగోళశాస్త్రవేత్తలు గుర్తించారు. మన సౌరకుటుంబానికి దాదాపు 100 కాంతి సంవత్సరాల దూరంలో ఇవి ఉన్నాయి. ఇవి భూమి కన్నా 1.6, 1.3, 2.1 రెట్లు పెద్దగా ఉన్నాయి. ఈ గ్రహాల ద్రవ్యరాశి భూమి కన్నా చాలా ఎక్కువగా ఉండటం వల్ల వాటిని 'సూపర్ ఎర్త్'లుగా పేర్కొంటున్నారు. ఈ మూడు గ్రహాలు జీజే9827 అనే ఒక నక్షత్రం చుట్టూ తిరుగుతున్నాయి. ఇవి తమ మాతృతారకు చాలా దగ్గరగా ఉన్న కక్ష్యల్లో పరిభ్రమిస్తున్నాయి. వీటి కక్ష్య కాలం 1.2, 3.6, 6.2 రోజుల మేర ఉంది. ఫలితంగా వీటిపై తీవ్రస్థాయి ఉష్ణోగ్రతలు ఉంటాయని శాస్త్రవేత్తలు తెలిపారు. భవిష్యత్‌లో జరిగే ఆధునిక పరిశీలనల్లో.. ఈ గ్రహాల వాతావరణాల గురించి మరిన్ని వివరాలు తెలుస్తాయని చెప్పారు. ఇప్పటివరకూ సౌర కుటుంబం వెలుపల 3500కుపైగా గ్రహాలను కనుగొన్నారు.



కారుకు గొడుగొచ్చిందోచ్!

ఎండాకాలం ఒక్క క్షణం కారును ఎండలో నిలిపితే పెనంలా వేడెక్కిపోతుంది. అయినప్పటికీ చాలా సందర్భాల్లో తప్పనిసరై యజమానులు తమ వాహనాలను ఎండలో ఉంచుతుంటారు. ఇందుకు పరిష్కారంగా కారుకు గొడుగులు అందుబాటులోకి వచ్చాయి. కాకినాడ రామారావుపేటలోని ఓ వ్యక్తి తన కారుకు ఎండ నుంచి రక్షణ కోసం ఇలా గొడుగు అమర్చుకున్నారు. దీంతో అటుగా వచ్చిపోయేవారు కారును ఆసక్తిగా తిలకిస్తున్నారు.

– ఈనాడు, కాకినాడ

చెరకు రైతుకు సహకారం కరవు

- 20.41 లక్షల క్వింటాళ్లు దాటిన ఉత్పత్తి
- గతేడాదికన్నా 9 లక్షల క్వింటాళ్లు అదనం
- అన్నదాతకు అందని ప్రోత్సాహకం
- కొనుగోలు పన్ను చెల్లింపు నిలిపేసిన ప్రభుత్వం
- నెలరోజులదాకా బకాయి సొమ్ము చెల్లించని మిల్లులు



ఈనాడు, హైదరాబాద్: చెరకు రైతులకు ఇటు ప్రభుత్వం నుంచి, అటు చక్కెర మిల్లుల నుంచి సహకారం లేక ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్రంలో చక్కెర ఉత్పత్తి గణనీయంగా 20.41 లక్షల క్వింటాళ్లకు పెరిగినా చెరకు అమ్మిన రైతులకు మాత్రం ప్రోత్సాహకాలు లేవు. గతేడాది 11.37 లక్షల క్వింటాళ్ల ఉత్పత్తితో పోలిస్తే ఈసారి ఏకంగా 9 లక్షల క్వింటాళ్లు పెరిగింది. మిల్లుల్లో మరో నెలకు పైగా గానుగాడటం కొనసాగనున్నందున ఉత్పత్తి మరింత ఎక్కువ కానుంది. గతేడాది వరకూ టన్ను చెరకుపై ప్రభుత్వం చెల్లించిన రూ.60ని ఈ సీజన్ నుంచి నిలిపివేసింది. గతంలో చెరకు కొన్నందుకు మిల్లులు కొనుగోలు పన్ను పేరుతో టన్నుకు రూ.60 వరకూ ప్రభుత్వానికి చెల్లించేవి. కానీ రైతులకు గిట్టుబాటు ధర రావడం లేదని ఈ సొమ్మును తిరిగి రైతులకు చక్కెర శాఖ ఇచ్చేయడం కొన్నేళ్లుగా ఆనవాయితీ. ఈ ఆర్థిక సంవత్సరం నుంచి జీఎస్టీ అమల్లోకి వచ్చినందున కొనుగోలు పన్ను రద్దయిందని, ఇప్పుడిక రూ.60 చెల్లించేది లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. మిల్లులు సైతం ధర పెంచలేదని, దీనివల్ల మొత్తమ్మీద గతేడాదికన్నా రూ.60కూడా తగ్గడంతోబ నష్టపోతున్నామని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బకాయిల కోసం ఎదురుచూపులు

సాధారణంగా 100 కిలోల చెరకు పంటను గానుగాడితే 9.5(రికవరీ శాతం) కిలోల చక్కెర ఉత్పత్తి అవుతుందని, ఈ ప్రాతిపదికన రైతుకు చెల్లించాల్సిన ధరను క్వింటాకు రూ.255 చొప్పున చెల్లించాలని కేంద్రం మిల్లులను ఆదేశించింది. కానీ తెలంగాణలో క్వింటా చెరకు పండించడానికి రూ.300 దాకా ఖర్చవుతోందని అంచనా. ఈ ఖర్చు మేరకైనా ధర ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. కానీ కొన్ని మిల్లులు రూ.278కి మించి ఇవ్వడం లేదు. మహారాష్ట్ర, ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రాల్లో రూ.320 దాకా చెల్లిస్తున్నారు. తెలంగాణలో ఇప్పటివరకూ 19 లక్షల టన్నులకు పైగా చెరకు మిల్లులకు రైతులు ఇచ్చారు. ఈ పంట తీసుకున్న 15 రోజుల్లోగా రైతు ఖాతాలో మిల్లులు సొమ్ము జమ చేయాలి. కానీ నెలరోజులైనా కొన్ని వేయడం లేదు. ఇప్పటికే రూ.100 కోట్లకు పైగా రైతులకు మిల్లులు బకాయి పడ్డాయి. రైతులకు మిల్లులు రూ.100 కోట్ల వరకూ బకాయిలు మిల్లులు చెల్లించాల్సిన మాట వాస్తవమేనని, దీనిపై మిల్లులను గట్టిగా అడుగుతున్నట్లు చక్కెర కమిషనర్ భద్రు మాళోత్ 'ఈనాడు'కు చెప్పారు.



డీజీపీ మహేందర్‌రెడ్డితో డ్యూటీ మీట్ విజేతలు

డ్యూటీమీట్ విజేతలకు డీజీపీ అభినందనలు

ఈనాడు, హైదరాబాద్: జాతీయ పోలీసు డ్యూటీ మీట్‌లో ప్రతిభ కనబరచి పతకాలు గెలుపొందిన పోలీసులు సోమవారం డీజీపీ మహేందర్‌రెడ్డిని కలిశారు. తాము సాధించిన పతకాలను చూపించారు. గత నెల 24 నుంచి 28 వరకు చెన్నైలో జరిగిన అఖిల భారత పోలీసు డ్యూటీ మీట్‌లో తెలంగాణ పోలీసులు రెండు వెండి, ఏడు కాంస్య పతకాలు సాధించిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా విజేతలను డీజీపీ అభినందించారు.

సవ్యసాచి పండాను వదలకుంటే..

- ఎయిమ్స్ వైద్య విద్యార్థిని హతమారుస్తాం
- మావోయిస్టుల పేరిట పోస్టరు

భువనేశ్వర్ అర్బన్, న్యూస్‌టుడే: ఎయిమ్స్-భువనేశ్వర్ వైద్య విద్యార్థి అదృశ్యం వెనుక మావోయిస్టుల హస్తం ఉన్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనికి సంబంధించి భువనేశ్వర్‌లోని బర్మూండా బస్టాండులో మావోయిస్టు కమిటీ పేరుతో సోమవారం ఓ పోస్టరు వెలిసింది. "ఎయిమ్స్ వైద్య విద్యార్థి సోహెల్ అజీజ్‌ను మేమే అపహరించాం. కారాగారంలో ఉన్న మావోయిస్టు నేత సవ్యసాచి పండాను 7 రోజుల్లో విడుదల చేయకపోతే విద్యార్థిని హతమారుస్తాం. ఈ నెల 11న భువనేశ్వర్ రైల్వే స్టేషన్, బస్టాండ్లలో బాంబులు పేలుస్తాం" అని అందులో రాసి ఉంది. ఎయిమ్స్‌లో ఎంబీబీఎస్ రెండో సంవత్సరం చదువుతున్న సోహెల్ అజీజ్ 15 రోజుల క్రితం అదృశ్యమయ్యాడు. ఆయన ఆచూకీ కోసం పోలీసులు ముమ్మరంగా దర్యాప్తు చేస్తుండగా సోమవారం ఈ పోస్టరు వెలుగు చూసింది. ఈ పోస్టరు మావోయిస్టులు రాసిందా? కాదా? అనే విషయమై ఇప్పుడే నిర్ధారణకు రాలేమని పోలీసు కమిషనర్ వై.బి.ఖురానియా చెప్పారు.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Private Limited, and printed at Eenadu Press, Alugunoor, Karimnagar - 505 527, Telangana. Cell: 99590 21802, 99590 21803 RNI No. 52793/92, Regd. No. G/RN/KAR/48/2018-20 Eenadu, Karimnagar. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10.00